ఎమ్బీయస్ - గ్రేట్ ఆంధ్ర ఆర్కయివ్స్ ప్రాజెక్టు

# 2012 Q 2 ఏప్రిల్ - జూన్ ఆర్టికల్స్
## (పిడిఎఫ్ రూపంలో)
## విషయసూచిక


ఇదో కేసా..!?
ద్రవం–ఉపద్రవం
పాలమూరుతో పొలమారిన తెరాస
వైయస్‌పై ఎస్సీ అస్త్రం
కాయకల్ప చికిత్స ఖాయమే !
కిరణూ - కులపక్షపాతమూ
జోరుమీదున్న సైకిలు
దీనిలోనూ వైయస్ వారసత్వమా?
ఎట్టకేలకు ప్రైవేటు బిల్లు
యాడ్స్‌కీ, కేసులకీ లింకుండాలా?
అవుతాదా? అవదా?
కళ్లెం వున్నది చేతిలో.. గుళ్లెం పడె గోతిలో..
హమ్మయ్యా.. అయిపోయింది
ఎలక్షన్ హాస్యం
ఆర్థిక నేరస్తుడిపై సానుభూతి వుంటుందా?
'పా'నుండి'ప' వరకు–పయనం దీర్ఘం, దృష్టి హ్రస్వం
సుద్దులు చెప్పేస్తున్నారు...
మరణం వివాదం: బోస్–వైయస్
ఇమేజి మాటేమిటి?
మధ్యలో యీ ఫిల్టరింగ్ ఎందుకు?
ఎందుకొచ్చిన ఖర్చు
సమయం సందర్భం వుందా?
జూదమూ - రాజకీయమూ
సిబిఐవారు చదివించినది రెండు సీట్లు...
సానుభూతా? వ్యతిరేకతా?
మధ్యలో టిడిపికి అక్షింతలు
నో మోర్ ఏ హీరో
ఇది వైకాపా సెల్ఫ్ గోల్ !
అదంత వీజీయా, టీజీ ?
మార్పంటూ వుంటే... ఎవరు మారాలి?
రాయల్ తెలంగాణ - ఓ వైరిసమాసం


**2012 ఏప్రిల్ 01** ఎమ్బీయస్ : ఇదో కేసా..!?

ఎట్టకేలకు జగన్‌పై సిబిఐ చార్జి షీటు దాఖలైంది. చార్జి షీటును తమిళంలో కుట్ర పత్రమ్ అంటారు. జగన్ అభిమానులైన తెలుగువాళ్లు కూడా దీన్ని కుట్ర పత్రం అంటున్నారు. కాంగ్రెస్, టిడిపి కలిసి తమపై చేస్తున్న కుట్ర అని వారి ఉద్దేశం. కుట్రే అయి వుంటే చాలా బలహీనమైన కుట్రలా తోస్తోంది. అంతిమంగా కోర్టులో ఏం జరుగుతుందో నేను చెప్పలేను కానీ, కామన్ సెన్స్‌తో చూస్తే మాత్రం యీ కేసు నిలబడేట్టు లేదు.

వైయస్ ఫలాపేక్షతో భూములు కేటాయిస్తే, అందుకు ప్రతిఫలంగా జగన్ లాభపడ్డారని సిబిఐ అభియోగం. ఇది అవినీతి నిరోధక చట్టం కింద రావాల్సి వున్నా వైయస్ పోయాడు కాబట్టి యీ సెక్షన్‌ను పరిగణనలోకి తీసుకోకూడదని సిబిఐ కోర్టుని కోరింది. అదేం లాజిక్? మనిషి చచ్చిపోయినంత మాత్రాన అవినీతి అవినీతి కాకుండా పోతుందా? ఆ అవినీతి కారణంగా సంపాదించిన ఆస్తులు జప్తు చేసుకోవద్దా? నేను గవర్నమెంటు ఉద్యోగి ననుకోండి, చిత్తం వచ్చినట్టు మేసేసి, అదంతా పిల్లల పేర బదిలీ చేసేసి, ఆ తర్వాత చచ్చిపోయినట్టు ఓ డెత్ సర్టిఫికెట్టు పుట్టించి పోలీసులకు యిచ్చేస్తే వదిలేస్తారా? కేసు పెట్టరా?

హర్షద్ మెహతా కేసులో అతను ప్రధాన నిందితుడు. అతనికి సహకరించారంటూ కొందరు బ్యాంకు ఆఫీసర్లపై కేసులు పెట్టారు. హర్షద్ మెహతా పోయాడు కదాని కేసు మూసేయలేదు. ఆ ఆఫీసర్లపై విచారణ సాగుతూనే వుంది – అవినీతి జరగడానికి ఎందుకు ఆస్కారం యిచ్చారు? అంటూ. అలాగే కొడుకు ఒత్తిడికి లొంగి వైయస్ అవినీతికి పాల్పడితే అతనిపై, అతని కాబినెట్ సహచరులపై అవినీతి నిరోధక చట్టం కింద కేసు పెట్టి తీరాలి. చచ్చిపోయాడు కాబట్టి అతనికి వ్యక్తిగతంగా శిక్ష వేయరనుకోండి, కానీ బతికి వుంటే శిక్ష వేసి అక్రమాస్తులు స్వాధీనం చేసుకోరా? ఇన్‌కమ్ టాక్స్ కట్టకుండా చచ్చిపోతే, వారసులనుండి టాక్స్ – పెనాల్టీతో సహా – వసూలు చేయరా?

ఇప్పుడు ఎసిబి దాడుల్లో దొరుకుతున్న ఎక్సయిజ్ ఆఫీసర్లందరికీ శిక్ష పడుతుందా లేదా? ఎవరైనా "అబ్బే, మా ఆవిడ చెప్తేనే నేను లంచం పుచ్చుకున్నానండీ. నా పేరు కొట్టేసి, ఆవిడ పేరు పెట్టండి" అంటే "సరే" అంటారా ఎసిబి వారు? భార్య చెప్పినా, తత్సమానురాలు చెప్పినా, కొడుకు చెప్పినా, గురువుగారు చెప్పినా, పొరుగువాడు చెప్పినా, పై అధికారి చెప్పినా, కింది ఉద్యోగులు బతిమాలినా – యివేమీ కారణాలు కానే కావు. నా ప్రియురాలు చెప్పింది కదాని దాని మొగుణ్ని చంపేశానంటే కోర్టువారు హంతకుణ్ని వదిలేసి ప్రియురాలికి శిక్ష వేస్తారా? ఎవణ్నో చంపేసి, కల్లో దేవత వచ్చి చెప్పడం బట్టి చంపానంటే వదిలేస్తారా? చంపావా లేదా? అన్నదే యిస్యూ. పద జైలుకి. అంతేగాని దేవత మీద కేసు పెట్టరు.

కానీ యీ కేసులో తమాషా ఏమిటంటే – అవినీతి చేసినవాడిపై కేసు లేదు, దానికి సహకరించిన వారిపై లేదు, చేయమని చెప్పినవాడిపై పెట్టారు. నేను యింకోలా అడుగుతాను. ఏదైనా ట్రస్టుకి దానం యివ్వవయ్యా అని నేను మీకు చెప్తాను. మీరు యిస్తారు. దాతగా మీ పేరు వేస్తారా? నా పేరు వేస్తారా? దాని వలన వచ్చే యిన్‌కమ్ టాక్స్ బెనిఫిట్ మీకిస్తారా? నాకిస్తారా? ఇక్కడో సినిమా గుర్తుకు వస్తోంది – "దేవాంతకుడు" సినిమాలో హీరో యమలోకంలో వాదిస్తూ వుంటాడు. వాళ్ల బామ్మ ఏకాదశినాడు ఉపవాసం వుంటూ మధ్యలో ఏదో తినాలని ఆశపడి మనసులో అనుకుందట. తినకపోయినా మనసులో అలా తలచడమే పాపమంటూ చిత్రగుప్తుడు పాపాల చిట్టాలో రాసేశాడు.

"మనసులో అనుకున్నా పాపమే అంటున్నారు కదా, నేను భూలోకం నుండి యమలోకానికి వచ్చే దారిలో 'ఇక్కడ ఆసుపత్రి కట్టిస్తే బాగుండును', 'ఇక్కడ బడి కట్టిస్తే బాగుండును', 'ఇక్కడ గుడి కట్టిస్తే బాగుండును' అని మనసులో అనుకుని పైకి కూడా అన్నాను. దానికి మీ యమభటులే సాక్ష్యం. మరి అవన్నీ కట్టించినట్టుగా నా పుణ్యాల జాబితాలో రాశారా?' అని అడుగుతాడు. చిత్రగుప్తుడు నీళ్లు నమిలి "కట్టించలేదుగా?" అంటాడు. "పాపం చేయడానికి మనసులో అనుకోవడమే చాలన్నపుడు యిదీ అలాగే చూడాలి. నీదంతా తప్పుల తడక" అంటూ ఏకేస్తాడు. ఇది కూడా అలాగే వుంది.

'ఆరోగ్యశ్రీ పథకాన్ని ప్రారంభించడానికి నా భార్య విజయలక్ష్మి యిచ్చిన సలహాయే కారణం' అన్నారు వైయస్. అందువలన 108 వాహనాల మీద రాజీవ్ ఫోటో తీసేసి ఆవిడ ఫోటో పెడతారా? వైయస్ చేసిన మంచికి క్రెడిట్ ఆయన ఫ్యామిలీ మెంబర్స్‌కు యివ్వరు గానీ చెడుకి డిస్‌క్రెడిట్ యిస్తారా? ఇవ్వగలరా? ఈ కేసులో వైయస్‌ను యిరికించకుండా జగన్‌ను యిరికించడం అసాధ్యం. మామూలుగా చూస్తే జగన్ కంపెనీలో పెట్టుబడులు వచ్చాయి. పెట్టుబడులు స్వీకరించడం నేరం కాదు. అయితే అలా రావడానికి అతను వాళ్ల తండ్రిపై ఒత్తిడి చేసి వాళ్లకు ప్రభుత్వం ద్వారా లబ్ధి చేయించాడు అన్నది సిబిఐ ఆరోపణ. ఒత్తిడి చేసినట్టు ఋజువు ఎక్కడుంది? వాళ్లిద్దరి మధ్య జరిగిన సంభాషణలను రికార్డు చేశారా?

ఒకవేళ కొడుకు అడిగాడు కదాని వైయస్ అతని మాట విని అవినీతికి పాల్పడితే తప్పు ఎవరిది? వైయస్ దే! కొడుకుది కాదు. వైయస్ బతికుండి, 'మా అబ్బాయి చెప్పాడు కదాని భూములు కట్టబెట్టానండి' అంటే "చెప్పేవాడికి బుద్ధి లేకపోతే వినేవాడికి వివేకం వుండద్దా?" అని కోర్టువారు అడుగుతారు. కొడుకు చెప్పినంత మాత్రాన యిచ్చేస్తావా? మైనారిటీ వెళ్లని కొడుకు లైసెన్స్ లేకుండా కారు డ్రైవ్ చేస్తానంటే కారు యిచ్చేస్తావా? వెళ్లి ఎవరినైనా గుద్దేస్తే..? నీకు సమాజం పట్ల బాధ్యత లేదా?

ఈ అవినీతి జరిగినపుడు జగన్ పదవిలో లేదు. ప్రజల సొమ్ము కాపాడతానని అతను ప్రమాణం చేయలేదు. అలా చేసినవాళ్లు మంత్రులు. ప్రభుత్వంనుండి జీతం తీసుకుంటే వారి విధివిధానాల ప్రకారం నడుచుకోవలసినవారు అధికారులు. ఆ 26 జీవోల ద్వారానే కదా జగన్‌కు లబ్ధి చేకూరింది! మరి ఆ 26 జీవోల విడుదలలో పాలుపంచుకున్న మంత్రులను, అధికారులను యిరికించకుండా

జగన్‌ను ఎలా యిరికించగలరు? ఆ జీవోలు అక్రమమైతేనే, రూల్సు అధిగమించి యిచ్చినవని మొదట తేలాలి. ఆ తర్వాత ఆ అక్రమ జీవోలు జగన్ ఒత్తిడి మేరకు విడుదలయ్యాయని నిరూపించాలి.

కానీ అలా జీవోలు విడుదల చేసినవారిని ముట్టుకోకూడదు, జగన్‌ను మాత్రం పట్టుకోవాలి – యివీ సిబిఐకు పెట్టిన అడ్డంకులు. జీవోలు రూల్సుకు విరుద్ధంగా వున్నాయని చెప్పకపోతే జగన్‌కు అన్యాయమైన పెట్టుబడులు వచ్చాయని చెప్పడం సాధ్యం కాదు. అన్నీ రూలు ప్రకారమే జరిగితే లంచాలు యివ్వడానికి అవతలివాడేమైనా వెర్రివాడా? రూలు అధిగమించి యిస్తేనే మీరు చెప్పిన చోట పెట్టుబడులు పెడతా అని బేరమాడతాడు. అందువలన జగన్‌కు అక్రమ పెట్టుబడులు వచ్చాయనాలంటే జీవోలు రూల్సుకి వ్యతిరేకం అని అనాలి. రూల్సుకి వ్యతిరేకంగా జీవోలు యిచ్చినందుకు సంబంధిత మంత్రులను, అధికారులను శిక్షించాలి. వాళ్లపై విచారణ జరిగినపుడు వాళ్లు కావాలంటే 'మేం నిర్దోషులమండీ, వైయస్ మా చేయి పట్టుకుని సంతకం పెట్టించేశాడు' అని చెప్పుకుంటే చెప్పుకోవచ్చు. దానికి కోర్టు వాళ్లు సాక్ష్యాలడగవచ్చు, లేదా బెనిఫిట్ ఆఫ్ డౌట్ యిచ్చి అడక్కపోవచ్చు. వాళ్లిష్టం.

కానీ ఆ క్రమంలో వైయస్‌పైన ఓ బండరాయి వేయక తప్పదు. అలా బండరాయి వేసే ధైర్యం కాంగ్రెస్‌కు లేదు. వైయస్ పేర ఓట్లు అడగాలంటే అతని యిమేజికి మట్టి అంటించకూడదు. వైయస్ కట్ ఔట్ పక్కన పడేసి, సోనియా బొమ్మతోనే ఎన్నికలు గెలిచేద్దామంటే ధైర్యం చాలదు. జగన్ వైయస్ ఆస్తులకు వారసుడు కానీ రాజకీయాలకు వారసులం మేమే అని చెప్పుకోవాలి. అందువలన వైయస్ అమాయకుడు, జగనే ఆయనను మాయమార్గంలోకి లాగాడు అని చెప్పుకోవాలి. దానికి సాక్ష్యం వుండాలి. ఇది ఒక కాచ్–22 సిచ్యువేషన్. దీన్నే జగన్ ఉపయోగించుకుంటున్నాడు.

కన్యాశుల్కంలో గిరీశం అంటాడు – "నేను పైకి వెళ్లి దేవుణ్ని అడుగుతాను – నువ్వు నన్ను డిపెండెంటుగా పుట్టించావా? ఇండిపెండెంటుగా ఉపయోగించావా? అని. డిపెండెంటుగా అంటే – అయితే నా పనులన్నిటికీ నీదే బాధ్యత అని చెప్పేస్తా. ఇండిపెండెంటుగా పుట్టించా అంటే 'నా యిష్టం వచ్చినట్టు నేను చేశా, నువ్వెవరివి అడగడానికి..' అంటా" అని. అలాగ జగన్ 'నేను ఓ యిండిపెండెంట్ పారిశ్రామిక వేత్తను. నాకు పెట్టుబడి పెట్టినవాళ్లు ప్రభుత్వం నుండి మేలు పొందారో లేదో నాకు తెలియదు' అంటాడు. 'కాదు, నువ్వు యిండిపెండెంటువి కావు, మీ నాన్న మీద డిపెండెంటువే. ఆయన బట్టే నువ్వు ఎదిగావ్" అన్నారనుకోండి, 'అయితే ఆ బాధ్యతంతా ఆయనదే. నాకేమీ తెలియదు. నేను అధికారంలో లేను. సెక్రటేరియట్ రూటు కూడా తెలియదు. టాంక్ బండ్‌కి కూడా ఎప్పుడూ వెళ్లలేదు' అనవచ్చు.

ఇప్పుడు సిబిఐ పెట్టిన కేసులో జీవోలు జారీ చేసిన మంత్రులను, అధికారులను వదిలేయడంతోనే కేసులో పస పోయింది. ఈ కేసును జగన్ వర్గీయులు ఎదుర్కోవడం చాలా సులభం. ఇప్పటికే వాళ్లు అనేక వాదనలు ముందుకు తెచ్చారు. నేరం జరిగినపుడు జగన్ ప్రభుత్వోద్యోగి గాని, ప్రజాప్రతినిధి కాని కాదు కదా, అతనిపై అవినీతి నిరోధక చట్టం కింద కేసు ఎలా పెడతారంటున్నారు. ఎపిఐఐసి ద్వారా 16 కోట్ల రూ.లు లబ్ధి పొంది వాళ్లు 29.5 కోట్లు పెట్టుబడి పెట్టారని చెప్పడాన్ని వేళాకోళం చేస్తోంది. ఎవరైనా లబ్ధి పొందిన దానిలో కొంత భాగం తిరిగి లంచం యిస్తారు కానీ ముప్పావలా కోడికి మూడున్నర పెట్టి పందిపిల్లను దిష్టి తీస్తారా? అంతకంటె 16 కోట్లు వదిలేసుకుని 13.5 కోట్లే పెట్టవచ్చుగా! సెజ్‌లలో అరబిందో, హెటిరోలకు తక్కువ రేటులో భూమి యివ్వడానికి కారణం – వాళ్లకు డెవలప్ చేయకుండా భూమి యిచ్చారని చెప్తోంది. పైగా పునరావాసం కల్పించే పని కూడా వాళ్లకే అప్పగించారంది. దీనికి కౌంటర్ 'ఈనాడు' ఏమిస్తోందో చూడాలి.

ఈ గొడవల్లో పారిశ్రామికవేత్తలను అడలగొడుతున్నారు. ఎవరైనా యిండస్ట్రీ పెడతానంటే వాళ్లకు తక్కువ రేటులో భూమి, యితర రాయితీలు యిచ్చి రప్పించే ఆనవాయితీ ఎప్పణ్నుంచో వుంది. ఇలాటి వాటిల్లో తమిళనాడు చాలా ముందుండేదనీ, అందుకే తెలుగువాళ్లు కూడా అక్కడే పరిశ్రమలు పెట్టేవారనీ అంటారు. ఈ మధ్యే మనవాళ్లూ మేలుకున్నారు. రాయితీలు ఆఫర్ చేస్తున్నారు. విదేశాల్లో తెలుగువారు ఎగరేస్తున్న విజయపతాకల కారణంగా మన రాష్ట్రం పేరు విదేశాల్లో కూడా తెలిసివచ్చి వాళ్లూ వస్తున్నారు. వచ్చినవాళ్లందరూ మంచివాళ్లని అనలేం. ప్రభుత్వం తరఫున వసతులు కల్పించిన నాయకులూ, అధికారులూ ఎట్టి ఏగానీ ఆశించకుండా చేశారనీ అనలేం. ఏదో ఓ లిమిట్‌లో నడిచినంతకాలం పరిశ్రమలు వస్తాయి, ఉద్యోగాలూ వస్తాయి. దాన్ని అల్లుకుని పరోక్షంగా ఆర్థికాభివృద్ధి జరుగుతుంది.

అయితే యిటీవల ఓ ప్రభుత్వం చేసిన ఎలాట్‌మెంట్లను తరువాతి ప్రభుత్వం తిరగతోడుతోంది. సరిదిద్దాలనా? లేక మళ్లీ దండుకోవాలనా? కాంగ్రెస్ ప్రతిపక్షంలో వున్నంతకాలం ఐ మాక్స్ గురించి తెగ అల్లరి చేసింది. తాము అధికారంలోకి వచ్చాక పడగొట్టేస్తామని పి.జనార్దనరెడ్డి హుంకరించేవారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి ఎనిమిదేళ్లవుతోంది. ఐ మాక్స్ మూతపడలేదు. అంటే వీళ్లకు వడ్డించాల్సింది వడ్డించారనా? ఓ పారిశ్రామికవేత్తకు యిది అదనపు భారమే కదా! ఏ వృత్తిలోను అందరూ మంచి వాళ్లుండరు. కాపీ కొట్టి పరీక్ష రాసేవాళ్లు కొందరున్నారు కదాని విద్యార్థులందరూ దొంగలనడం తప్పు కదా! చౌకగా భూమి తీసుకున్నవాళ్లు చెప్పిన టైముకి పరిశ్రమ పెట్టకపోతే భూమి వెనక్కి తీసుకుంటే పోయె. కథ ముగిసిపోతుంది. ఆ మాత్రానికి ఎలాట్ చేసిన అధికారులను, నాయకులను, వాళ్లతో పాటు పారిశ్రామిక వేత్తలనూ బద్‌నామ్ చేయడం దేనికి?

ఎలాట్ చేసే సమయానికి అందరూ పెద్దల్లాగే అనిపించి వుండవచ్చు. సదుద్దేశంతోనే ఎలాట్ చేసి వుండవచ్చు. తర్వాత బుద్ధులు మారి వుండవచ్చు, పరిస్థితులు మారి వుండవచ్చు, ముడిసరుకు దొరక్క పోయి వుండవచ్చు, ప్రభుత్వ పన్నుల విధానం మారి, ఉ

త్పాదన కిట్టుబాటు కాకపోయి వుండవచ్చు. పరిశ్రమ ప్రారంభించ లేదు కదాని ఎలాట్‌మెంట్ దురుద్దేశంతో జరిగిందని యిప్పుడు కేసులు పెడితే ఏ అధికారీ, ఏ నాయకుడూ నిర్ణయాలు తీసుకోడు. ఏ పారిశ్రామిక వేత్తా యిటు తొంగి చూడడు. అంతెందుకు, ఎపిఐఐసి చైర్మన్‌గా అంబటి రాంబాబు ఏదో గోల్‌మాల్ చేశారని శివసుబ్రహ్మణ్యం అంత గలభా చేశారు కదా, యిప్పుడు ఆయన మీదే కేసు నమోదైంది – ఎమ్మార్ వాళ్లను లంచం అడిగారని! ఇవ్వనందునే రిజిస్ట్రేషన్ ఆపేసేరని. అంటే సరే అన్నా కేసు, వద్దు అన్నా కేసు అన్నమాట.

మనవాళ్లు యిరుగుపొరుగు రాష్ట్రాలన్నిటిలో పరిశ్రమలు పెట్టారు. అంతేకాదు, ఎక్కడో హిమాచల ప్రదేశ్‌లో కూడా పెట్టారు. ఎక్కడా ఎదురుకాని సమస్యలు యిక్కడ వస్తున్నాయి. అన్నీ రాజకీయ కారణాలే! తెలంగాణ ఉద్యమం వచ్చాక ఆంధ్ర పెట్టుబడిదారులు అనే పదం తిట్టుకి పర్యాయపదం అయిపోయింది. 'మా దగ్గర పెట్టుబడి పెట్టి, మాకు ఉద్యోగాలు యిస్తావా? మా ప్రాంతాన్ని ఆర్థికంగా అభివృద్ధి చేస్తావా?' అని తిడుతున్నట్టు అయింది. తిట్టాలంటే ఆ పెట్టుబడిదారుల సొంత జిల్లాల వాళ్లు తిట్టాలి – 'ఆ పరిశ్రమేదో మన దగ్గర కాకుండా వేరే చోట పెట్టేవేం? మాకు ఉద్యోగాలు రావడం నీ కిష్టం లేదా?' అని. కానీ తెలంగాణ వారే తిడుతున్నారు – భూమి చౌకగా తీసుకున్నారు, భూజలాన్ని ఖర్చు పెట్టేస్తున్నారు, వాతావరణాన్ని పాడు చేసేస్తున్నారు, యిక్కడి రేట్లు పెంచేసి సామాన్యుడికి అందుబాటులో లేకుండా చేస్తున్నారు.. అంటూ ! పరిశ్రమ వస్తే యిలాటి తప్పవని తెలిసికూడా అన్ని రాష్ట్రాల వాళ్లూ వాళ్లను ఆహ్వానిస్తున్నారు. ఇక్కడ మాత్రం యిదీ పరిస్థితి.

తెలంగాణ అంశం చాలనట్టు యిప్పుడు జగన్ అంశం ఒకటి నడుస్తోంది. జగన్‌పై కోపంతో కాంగ్రెస్ పారిశ్రామికవేత్తలందరినీ రచ్చ కీడ్చింది. వాళ్లు ఖాతా పుస్తకాలు పట్టుకుని సిబిఐ ఆఫీసు చుట్టూ తిరుగుతున్నారు. ఇప్పుడు మల్టీ నేషనల్ ఫార్మా కంపెనీలు అరబిందో, హెటిరో 4కోట్లకు, 5 కోట్లకు కక్కుర్తి పడ్డారని, సాక్షిలో పెట్టుబడి పెట్టారనీ కేసులు పెట్టారు. వాళ్ల టర్నోవర్‌లో యిది ఎంత శాతమో చూస్తే యిదెంత చిన్న కేసో తెలుస్తుంది. కానీ ఎండీల దగ్గర్నుంచి కుటుంబ సభ్యుల దాకా అందరికీ వేదనే. అంతిమంగా ఏమవుతుందో తెలియదు కానీ తక్కిన యిండస్ట్రియలిస్టులు బెదరడం ఖాయం.

వీళ్ల పేర్లు ఎత్తగానే జగన్ వర్గీయులు బాబు హయాంలో కేటాయింపుల గురించి రచ్చ మొదలు పెట్టారు. వాళ్లందరినీ బజారు కీడుస్తున్నారు. ఏ వ్యాపారవేత్తయినా యివ్వాల్సిన వాళ్లందరికీ యిచ్చేసి, గుట్టుగా వ్యాపారం చేసుకుందామని చూస్తాడు కానీ యిలా వివాదాలతో పేపర్ల కెక్కాలని చూడడు. ఇలాటి గొడవలు లేకుండా కేవలం డబ్బుతో పని జరిగిపోయే చోటకు తరలి వెళతాడు. ఈ ప్రభుత్వాలు ఉద్యోగాలు యివ్వలేవు. ప్రయివేటు రంగం యిచ్చే వుద్యోగాలను కూడా తమ ఖాతాలో వేసుకుని తాము ఏదో చేశామని చెప్పుకుంటాయి.

ఇప్పుడు మన రాష్ట్రంలో పరిస్థితి ఎలా వచ్చిందంటే – యిక్కడ పెట్టుబడి పెట్టినవాడు పాపి. నిజంగా పుణ్యాత్ముడు వచ్చి నిజాయితీగా వుంటాను, ఎవ్వరికీ ఒక్క పైసా యివ్వను, పరిశ్రమ పెట్టనా? అని ఎవరైనా వస్తే వాళ్లను పాలకులు ఆదరిస్తారా? మాకేంటి అంటారు. అందుకని ఏదైనా యిస్తే అవతలివాళ్లు రచ్చ చేస్తారేమో తెలియదు. అవతలివాళ్లు అంటూ వేరే లేరు. రాజకీయం కాస్త అటూ యిటూ అయిందంటే, ఇవతలివాళ్లే అవతలివాళ్లు కావచ్చు. విజయనగరంలో బొత్స మనుష్యులంతా 'మన కాంగ్రెస్ ప్రభుత్వమే కదా' అని హాయిగా మందు వ్యాపారం చేసుకుంటున్నారు. రోశయ్య పోయి, కిరణ్ వచ్చారు. బొత్స పోటీ పడ్డారు. కిరణ్‌కు చిక్కులు కల్పించారు. అంతే, వీళ్లకు మూడింది.

సరే, యింతకీ యివన్నీ చూసి ప్రజలు – అనగా ఓటర్లు – ఏమనుకుంటారు? జగన్‌పై సిబిఐ కేసు పెట్టింది కాబట్టి జగన్ ఖచ్చితంగా అవినీతిపరుడని ఫిక్సయిపోయి, కాంగ్రెస్, టిడిపిలకు ఓటేసేస్తారా? భూ కేటాయింపుల గురించి కాగ్ నివేదిక కావచ్చు, సిబిఐ దర్యాప్తు కావచ్చు – అన్నీ వైయస్ పాలించిన ఆ ఐదేళ్లకే  పరిమితం చేయడం సామాన్యుడికీ ఆశ్చర్యం కలిగిస్తుంది. అంతకుముందువీ, తర్వాతవీ దాచడంతో, విచారణ అక్కర్లేదనడంతో అనుమానాలు మరీ పెరుగుతాయి. నిత్యజీవితంలో అడుగడుగునా అవినీతి ఎదురవుతున్నపుడు అతను బొత్తిగా సత్తెకాలపు వాడిలా వుండిపోవడం అసంభవం. అతనికి తెలుసు – డిగ్రీల్లో తేడా తప్ప అందరూ అవినీతి పరులే అని. ఇక్కడో బెర్నార్డ్ షా జోక్ గుర్తుకు వస్తోంది.

ఓ పార్టీలో ఒకావిడ విపరీతంగా అలంకరించుకుని వచ్చి, హొయలు తెగ వలకబోస్తోందట. షా ఆమె వద్దకు వెళ్లి "నాతో ఓ రాత్రి గడుపుతావా? కోటి రూపాయలిస్తాను." అన్నాట్ట. ఆమె మరింత వగలుపోతూ "ఏం నేనంత అందంగా వున్నానా!?" అని అడిగింది. అదేమీ పట్టించుకోకుండా షా "కోటి కాదులే గానీ.. ఐదు రూపాయలిస్తాను" అన్నాడు. ఆవిడ రగిలిపోయింది. "ఏం నీ కంటికి నేనెలా కనబడుతున్నాను?" అని విరుచుకుపడింది. "నా మొదటి ప్రశ్న వినగానే నా చెంప పగలకొట్టలేదంటేనే నువ్వెలాటిదానివో తెలిసిపోయింది. ప్రస్తుతం మన చర్చ రేటు గురించే..!" అన్నాడు.

"మేమూ భూములవీ కేటాయించాం కానీ మరీ యింత బొత్తిగా బరితెగించి యివ్వలేదు. ఎన్నికల్లో ఖర్చు పెట్టేవాళ్లం కానీ, మరీ యింతింత కాదు.  వైయస్ బొత్తిగా హద్దు మీరారు." అని వాదించినప్పుడల్లా నాకీ జోక్ గుర్తుకు వస్తుంది. ఇసుక మాఫియా, మద్యం మాఫియా అన్ని పార్టీలలోకీ, జనజీవితంలోని అనేక వర్గాల్లోకి చొచ్చుకుపోయాయని ఇప్పుడు జరుగుతున్న ఎసిబి దాడులు చాటి చెపుతున్నాయి. వీళ్లమధ్య నిజాయితీపరుణ్ని వెతకాలంటే ఓటరు –అదేదో యాడ్‌లో చెప్పినట్టు – 'ఢూంఢ్‌తే రహ్ జాయేగా'! – **ఎమ్బీయస్ ప్రసాద్ (ఏప్రిల్ 2012)**

మద్యం అన్నదమ్ములనూ, భార్యాభర్తలనూ కూడా విడగొడుతుందంటారు. కుటుంబాలను కూలుస్తుందంటారు. ప్రస్తుతం ప్రభుత్వానికే ఎసరు పెట్టింది. సిఎం, డిప్యూటీ సిఎం, కాబినెట్ సహచరుల మధ్య పంచాయితీ ఢిల్లీలో జరుగుతోంది. ఈ మూడు ముక్కలాటలో యిద్దరు ఏకం కావడంతో కిరణ్ చాప కిందకు నీళ్లొచ్చాయి.. కాదు, కాదు.. సారా వచ్చిందనాలి. రాజకీయ సంక్షోభాలు కాంగ్రెస్‌కే కాదు, ఏ పార్టీకీ కొత్త కాదు. సిఎంకు, కాబినెట్‌లో బలమైన నాయకుడికీ లేదా పిసిసి అధ్యక్షుడికి పడకపోవడం, రెండు అధికార కేంద్రాలు తయారవడం, ఒకరి కొంప మరొకరు పీకబోవడం – దశాబ్దాలుగా అన్ని పార్టీలలోనూ చూస్తూనే వున్నాం. కానీ వీటిల్లో ఒక సాధారణ సూత్రం ఏమిటంటే – ఎవరూ అధికారం కోసం పోట్లాడుతున్నామని అనరు. బిసిల సంక్షేమానికి ఎక్కువ నిధులిమ్మంటే సిఎం గారు పట్టించుకోవడం లేదు, అందుకని నేను గొంతెత్తవలసి వచ్చింది, లేదా మన జిల్లాలో ప్రాజెక్టులు రావడానికి సిఎం అడ్డుపడుతున్నారు, అందుకే నేను విభేదించవలసి వస్తోంది – అంటూ యిలాటి పూతలు పూస్తారు.

బొత్స గారి పేరులోనే 'సత్యం' వుంది కాబట్టి ఆయన యిలాటి అబద్ధాల జోలికి వెళ్లలేదు. మద్యం మాఫియాపై ఎసిబి దాడుల వలననే తనకు మనస్తాపం కలుగుతోందని బాహాటంగా చెప్పేశారు. ఇసుక మాఫియా గురించి ఎసిబి దాడులు ముమ్మరంగా చేస్తోంది. అవేమీ ఆయనకు కలత కలిగించలేదు. వాటి గురించి ఆయన ఏమీ చెప్పలేదు. ఎసిబి విజయనగరం జిల్లాలో మద్యం మాఫియా పని పట్టడం, తనను యిరికించడానికే ఆయన నమ్మి అందరికీ అదే చెప్తున్నారు. ఎసిబి సిఎం అజమాయిషీలో వుంది కాబట్టి ఆయనే చేయించి వుంటారని యీయన నమ్మి, దానిపై హై కమాండ్‌కు ఫిర్యాదు చేస్తున్నారు.

అక్కడ విషయాలు స్పష్టంగా తెలుస్తున్నాయి. అక్కడ వేలం పాడినవారిలో సగం కంటె ఎక్కువ మందికి తెల్ల రేషన్ కార్డులున్నాయి. అందువలన వారు వేరే ఎవరికో బినామీలై వుంటారు. ఈ విషయం పేపర్లో రాగానే బొత్స వెంటనే స్పందించారు – వారికి రద్దు చేయాలని ! ఏమిటి? వేలం పాడుకున్న షాపులు రద్దు చేయాలని కాదట, రేషన్ కార్డులు రద్దు చేయాలట ! వాటే జోక్! అసలు మొదటి ప్రశ్న తెల్ల రేషన్ కార్డుకై అప్లయి చేసేవాడికి 50 లక్షలు పెట్టి మద్యం షాపు వేలం పాడే స్తోమత ఎలా వచ్చింది అనేది. దాని గురించి పరిశోధన అక్కరలేకుండా బొత్స అతి సులభమైన మార్గం చెప్పేశారు. రేషన్ కార్డులు రద్దు చేసేసి కేసు మూసేయండి, తిక్క కుదురుతుంది సన్నాసులకి అని.

ఆయన ప్రకారం డబ్బున్న ఆసామీలే ఓ పక్క వేలం పాడుతూ మరో పక్క రేషన్ కార్డుకై అప్లయి చేశారు, అందువలన వాళ్లకు కార్డులు తీసేస్తే చాలు. వాళ్ల స్థితిగతులు కూడా పేపర్లలో వచ్చాయి. బొత్స బంధువుల షాపుల్లో వాళ్లు నౌకర్లుట. మరి వేలం ఎలా పాడగలిగారు అంటే వాళ్లే ఆ ధర్మసూక్ష్మం చెప్పమని అడగాలి. అడిగితే బొత్సగారికి కోపం, మనస్తాపం. సిబిఐ విచారణ చేయించండి తప్ప స్థానికమైన ఎసిబి వద్దంటాడాయన. సిబిఐ గోల్‌మాల్ చేస్తోంది, హై కమాండ్ చెప్పినట్టు ఆడుతోంది అని జగన్ యిత్యాదుల గోల. జగన్‌కి సిబిఐ వద్దు, బొత్సకు కావాలి. బొత్సకు స్థానిక కాంగ్రెస్ నాయకులపై నమ్మకం లేదు, ఆయన దంతా ఢిల్లీ చూపు. పిసిసి అధ్యక్షుడిగా బొత్సను వేయవద్దని కిరణ్ కోరారనేది బహిరంగసత్యం. అయినా ఢిల్లీ వారు బొత్సనే వేశారు. బొత్స ట్రాక్ రికార్డు వెలిగిపోతోందన్న సీనూ లేదు. ఫోక్స్ వ్యాగన్ కేసు తలచుకుంటే చాలు, అతని ఉబలాటానికి, చేతకాని తనానికి నవ్వు వస్తుంది.

కిరణ్ చిత్తూరు జిల్లా ఎమ్మెల్యే కాబట్టి, అప్పుడు పిసిసి అధ్యక్ష పదవిని తెలంగాణ వ్యక్తికి యిస్తారనే అనుకున్నారు. కానీ వాళ్లెవరికీ యివ్వకుండా బొత్సకు యిచ్చారు. ఏం చూసి యిచ్చారు? కిరణ్‌లో ఏ ప్రతిభ చూసి సిఎం పోస్టు యిచ్చారో, బొత్సకు కూడా అలాగే యిచ్చినట్టున్నారు. మనకు కనబడనివేవో వాళ్లకు కనబడతాయి, చేరతాయి. సరే, కిరణ్ ఏదో ఒంటి చేత్తో బండి లాక్కుని వస్తూ 'ఒంటి పిల్లి రాకాసి' అనే పేరు తెచ్చుకున్నారు. బొత్స ఏ మంచి పేరూ తెచ్చుకోలేదు. ఆయన ఆధ్వర్యంలో కాంగ్రెస్ ఏ ఉపయెన్నికా గెలవలేదు. అసెంబ్లీలో అవిశ్వాసతీర్మానం వీగిపోయేట్లా చేసిన స్ట్రాటజీ ఘనత కిరణ్‌కు వెళ్లింది తప్ప బొత్సకు వెళ్లలేదు. అటూయిటూగా వున్నవారందరినీ బొత్స రెచ్చగొట్టి జగన్ క్యాంపులో పంపుదామని చూస్తే, నచ్చచెప్పి బుజ్జగించి, ప్రస్తుతానికి పార్టీలో వుండేట్లు చేసినది కిరణే! అందువలన బొత్స ఖాతాలో ఏ క్రెడిటూ వేయడానికి లేదు.

బొత్స ఏం చేస్తున్నాడని అతనికి రెండు పదవులు కట్టబెట్టారో తెలియదు. ఏ పదవీ వదలనని ముందే చెప్పాడు. పిసిసి అధ్యక్షుడిగా జిల్లా స్థాయిలో డిసిసి అధ్యక్షులను నియమించడం లాటి పనులు సైతం చేయలేదు. ఆ లిస్టును సిఎం ఎప్రూవ్ చేయకపోవడం చేతనే ఆగిపోయాయంటున్నారు. ఎన్నాళ్లు ఆపుతారు? ఆ విషయంపై బొత్స కొట్లాడవచ్చుగా! అది చేయకపోగా ప్రభుత్వ పరమైన నిర్ణయాల గురించి కిరణ్ కంటె ముందుగా యీయనే ప్రకటిస్తున్నాడు. పరాధికారం పైన వేసుకోవడ మంటె యిదే ! బొత్స రాష్ట్రవిభజనకు అనుకూలుడు కాబట్టి అతని నియామకం పట్ల తెలంగాణ కాంగ్రెస్ ఎంపీలందరూ సంతోషించేశారని రాసేశారు. సంతోషించి ఏం చేశారు? అతని నాయకత్వంలో మొన్న ఉపయెన్నికలలో పని చేశారా? ప్రచారానికి వచ్చారా? డిపాజిట్లు దక్కడానికి వారి కృషి ఏమైనా వుందా? ఏమీ చేయలేదు. వాళ్లలా వుంటే బొత్స ఏం చేసినట్టు? వాళ్లని అదిలించాడా? కదిలించాడా? ఏమీ చేయనిదానికి పిసిసి అధ్యక్ష పదవెందుకు? దానికో బోనస్‌గా కాబినెట్ పదవెందుకు?

అయినా హై కమాండ్‌కి బొత్సయే ప్రీతిపాత్రుడు. కిరణ్‌కు, బొత్సకు 'సీజ్ ఫయర్' చేయడానికి హై కమాండ్ నిశ్చయించుకోగానే

వాళ్లను ఢిల్లీ రప్పించడానికి ముందే హై కమాండ్ కిరణ్ మెడలు వంచి ఆ శ్రీనివాసరెడ్డిని బదిలీ చేయించింది. ఆ చేయడం కూడా ఎంత ఎబ్బెట్టుగా జరిగిందో చూడండి. దేనికైనా లౌక్యం కావాలి. ప్రమోషన్ యిచ్చాం కాబట్టి అక్కడ వుంచలేం అన్నారు. ప్రమోషన్ యిచ్చిన 8 మందిలో నలుగురిని అక్కడే వుంచారు. వాళ్లల్లో ఒకాయన్ని యీయన స్థానంలో వేశారు. ప్రమోషన్ యిచ్చాక చిన్న పోస్టులో వేయడం ఏమిటి? పైగా అర్ధరాత్రి బదిలీ లేమిటి? ఇంత హంగామాగా జరిగితేనే బొత్సకు ఢిల్లీపై వున్న 'క్లౌట్' – పట్టు – మనందరికీ తెలుస్తుంది. అలా తెలియాలనే బొత్స కోరిక. లేకపోతే ఆయన పనైపోయిందని వాళ్ల జిల్లాలో ప్రచారం జరిగిందంటే చాలా అనర్థాలు జరుగుతాయి. ఆయన సామ్రాజ్యం బీటలు వారుతుంది. 'చూశావా, నా జోలికి వస్తే ఏం చేశానో..!' అని చాటుకోవాలంటే యింత అసహ్యంగా జరిగి తీరాలి.

నిజానికి బొత్సదంతా మోటు వ్యవహారమే. ఫోక్స్ వ్యాగన్ కేసులో 'సొమ్ములు పోయాయి, ఏం చేస్తాం?' అని కొట్టి పారేశాడు తప్ప పశ్చాత్తాపం వ్యక్తపరచలేదు. అసెంబ్లీలో వైయస్ భార్య తొలి ప్రసంగం యిచ్చినపుడు అందరూ హుందాగా వూరుకున్నారు, అది గతించిన సహచరుడికి యిచ్చే మర్యాద తప్ప ఆవిడ అభిప్రాయాలతో ఏకీభవించినట్టు కాదు. కానీ బొత్స ఆ మర్యాదలు పట్టించుకోదలచలేదు. 'మీ అబ్బాయిని హంతకుడన్న బాబు పెట్టిన అవిశ్వాస తీర్మానానికి మద్దతు యిస్తున్నారు, అతన్ని వెనకేసుకుని వచ్చిన కిరణ్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఓటేస్తున్నారు' అంటూ పెద్ద పాయింటు లాగినట్టు మాట్లాడారు.

లోపల ఏమున్నా, ఆవిడ తన ఉపన్యాసంలోనే చెప్పారు – 'బాబు విధానాలతో ఏకీభవించిక పోయినా రైతుల కోసం అన్నారు కాబట్టి తీర్మానానికి మద్దతు యిస్తున్నాం' అని. ఇంకా నయం, ఆవిడ మళ్లీ నిలబడి 'నా వ్యక్తిగత అంశాల కోసం యిక్కడికి రాలేదు. రైతుల కోసం ఎటువంటి దుర్మార్గుడినైనా సమర్థిస్తాను' అంటూ మెలోడ్రమటిక్‌గా మాట్లాడలేదు. మాట్లాడి వుంటే యీయన తెల్లమొహం వేయాల్సి వచ్చేది. అదే సభలో ధర్మాన చాలా హుందాగా ప్రసంగించారు. అలాటివి బొత్సకు పరిచయం లేని విషయాలు.

రాజకీయాల్లో అవినీతి వుంటుందని అందరికీ తెలుసు. అయినా ప్రతివాళ్లూ తాము అవినీతిని బాపేందుకే పుట్టామని చెప్తారు. చంద్రబాబు తను అన్నా హజారేకు ఆంధ్రా వెర్షన్ అని చెప్పుకున్నా, జగన్ తులసి మొక్కనని చెప్పుకున్నా యీ కోవకు చెందినవే. అవి విని మనం జోక్సూ, కార్టూన్లూ వేసుకుంటామని వాళ్లకూ తెలుసు. కానీ అది ఓ రాజకీయ మర్యాదగా భావిస్తారు వాళ్లు. బొత్స దృష్టిలో యివన్నీ అనవసరం. మా వాళ్లకు 31 షాపులున్నాయి. ఏం వ్యాపారాలు చేసుకోకూడదా? అని ఎదురు ప్రశ్నిస్తారు. ఎవరు చేసుకోవద్దన్నారు? కానీ సక్రమంగా చేసుకోమను. సక్రమంగా చేస్తున్నారో, అక్రమంగా చేస్తున్నారో కనిపెట్టడానికి దాడులు జరిగితే మీకు మనస్తాపం దేనికి? ఇది నన్ను ఉద్దేశించి చేస్తున్నవి అని ఎందుకనాలి? జగన్‌లా మిమ్మల్ని ఎక్యూజ్‌డ్ నెంబరు 1గా పెడితే అప్పుడు 'ఇది నాపై ఎక్కుపెట్టిన బాణం' అనవచ్చు.

మీ పేరు డైరక్టుగా రానంతకాలం మీరు గోల చేయడం అనవసరం. మా బంధువుల షాపులపై దాడి జరిగితే నా పై దాడి చేసినట్టే అని ఎలా అనగలరు? ప్రస్తుతం ఆర్నెల్లగా రాష్ట్రంలో ఏవో ఒక దాడులు, ఎసిబియో, సిబిఐయో.. మద్యం మాఫియా, యిసుక మాఫియా, విల్లాల మాఫియా, భూ కేటాయింపుల మాఫియా... ఒకటా రెండా? అన్ని పార్టీల నాయకులూ, బడా బడా పారిశ్రామికవేత్తలూ, ఐయేయస్ అధికారులూ, ఆఖరికి పాత్రికేయులూ – అందరూ యిరుక్కున్నారు. వాళ్లెవరూ యిలా రచ్చకెక్కి సిఎం నాపై కక్ష కట్టాడని అనటం లేదే! ఈయన మాత్రం తన గొడవను ఢిల్లీ దాకా తీసుకుని పోయాడు. బొత్సగారు తన బంధువులందరూ సచ్చీలురని సర్టిఫికెట్టు యివ్వగలరా? వాళ్లు చేసిన దానికి వాళ్లు అనుభవిస్తారు. మధ్యలో ఈయనకేమిటి కడుపునొప్పి? గాలి జనార్దనరెడ్డిని అరెస్టు చేసినపుడు జగన్ ఏమన్నాడు? 'అతన్ని అరెస్టు చేస్తే నాకేంటి?' అన్నాడు. ఈయనా అలా అనవచ్చుగా.

అబ్బే, యీయనదంతా ఓపెన్ వ్యవహారం. దేవీ లాల్ హరియాణా ముఖ్యమంత్రిగా వుండగా ఎవరో విలేకరి అడిగారు – "ఏమండీ, ప్రభుత్వ కాంట్రాక్టులన్నీ మీ బంధువులకే కట్టబెడుతున్నారట కదా.." అని. ప్రశ్న విని ఆయన ఆశ్చర్యపడ్డాడు – "మా బంధువులకు కాకపోతే బన్సీ లాల్ (ఆయన రాజకీయ ప్రత్యర్థి) బంధువులకు కట్టబెడతానా?" అని. ఇది పేపర్లో వచ్చింది. బొత్స అటువంటి బాపతు నాయకుడు. సిఎం గారు నన్ను యిబ్బంది పెట్టడానికే అవినీతి నిరోధక శాఖను పురికొల్పాడు అంటాడు. బొత్స యింటి మీద దాడి జరిగితే అనుకోవచ్చు. బినామీ వ్యాపారస్తులపై విచారణలు జరుగుతూంటే మధ్యలో యిలా మాట్లాడితే వాళ్లకూ యీయనకూ లింకు వున్నట్టు ఒప్పుకున్నట్టే కదా. జగన్ విషయంలో కూడా యిలాటి ప్రశ్నలు ఎన్నో వున్నాయి. దానికి అతను తన పేపరు ద్వారా, టీవీ ద్వారా ఏవేవో వివరణలు యిస్తూనే వుంటాడు. అవి మనం నమ్ముతామో లేదో తెలియకపోయినా కనీసం ప్రయత్నం చేస్తున్నందుకు సంతోషించాలి. సంతోషం ఎందుకంటే – ప్రజలకు జవాబు చెప్పాలన్న బాధ్యత ఫీలయినందుకు !

బొత్సకు అలాటి ఫీలింగే లేదని నా బాధ. ఆయనకు పత్రిక, టీవీ లేకపోవచ్చు. కానీ కావాలంటే ఓ యాడ్ యివ్వగల స్తోమత వున్నవాడు. నాకూ ఆ బినామీ గాళ్లకు సంబంధం లేదు, కావాలంటే వాళ్లను కొయ్యండి, కొట్లో తోయండి అని యాడ్ యిచ్చేసి చేతులు దులుపుకుంటే ఎంత బాగుండేది. అబ్బే, విచారణాధికారిని తప్పించేశారు. అలా తప్పించేయడంపై ఎసిబి డైరక్టర్ జనరల్ అభ్యంతరం తెలిపారు. ఇదంతా ఎటువంటి సందేశాన్ని పంపుతోంది? ఓ పక్క కాంగ్రెస్ అవినీతిపరుడనే పేర జగన్‌ను ఉరేయడానికి సకల ప్రయత్నాలు చేస్తోంది. రాజకీయ లక్ష్యం ఏమైనా ఆ ప్రయత్నంలో అనేక మంది దొంగలు , దుర్మార్గపు చేష్టలు బయటపడుతున్నందుకు మనం సంతోషిస్తున్న సమయంలో ఎసిబి కాళ్లకు పగ్గాలు వేసే యిటువంటి బాహాటపు ప్రయత్నాల వలన కాంగ్రెస్ చిత్తశుద్ధిని ఎవరైనా విశ్వసిస్తారా? రేపు ఉపయెన్నికలలో జగన్‌ను ఎదుర్కోవడానికి అవినీతి అస్త్రం పనికి రాకుండా పోతుంది కదా!

హై కమాండ్‌కి యిదేమీ పట్టటం లేదు. రాష్ట్రంలో కిరణ్‌కు, బొత్సకు రాజీ కుదర్చాలి. దానికోసం వాళ్లు కోరిన వరాలన్నీ యివ్వాలి. అదే వాళ్లకు కావలసినది. అసలు కిరణ్‌ను నియమించినపుడే హితబోధ చేయాల్సింది – అందర్నీ కలుపుకు పోవాలి బాబూ అని. ఏడాది దాటిన తర్వాత యిప్పుడు పాఠాలు చెపితే ఏం లాభం? జరగాల్సిన నష్టం జరిగిపోయింది కదా. కిరణ్ సిఎంగా నియమితుడై నప్పుడు నేను స్వాగతిస్తూ ఆర్టికల్ రాస్తే ఒక మిత్రుడు అన్నాడు – 'మీకు అతని సంగతి తెలియదు. చాలా అహంభావి. ఎవరి మాటా వినడు.' అని. క్రికెటర్ కదా, టీమ్ స్పిరిట్ అవసరం తెలియకుండా వుంటుందా? తను యింపోర్టెడ్ నాయకుణ్నని ఆయనకు తెలియదా !? అని అనుకుని ఆయన మాటలు నమ్మలేదు. ఇప్పుడు అందరూ అదే విషయంపై ఫిర్యాదు చేస్తున్నారు. ఏం చూసుకుని ఆయన ధైర్యంగా వున్నాడో తెలియటం లేదు నాకు.

పైగా అతను ఏం చేసినా రెడ్డి పక్షపాతి అనే ముద్ర ఒకటి మీడియా తెగ కొట్టేస్తోంది. అది ఎంత ప్రమాదకరమో కిరణ్ గుర్తించి, దాన్ని ఎదుర్కునే ప్రయత్నాలు చేయాలి. మెదలకుండా కూర్చుంటే సమస్యలు వాటంతట అవే పరిష్కారమై పోవు. నిజానికి మొన్న ఉపయెన్నికలలో కాంగ్రెస్ అపజయానికి కారణాలు చాలా వున్నాయి. టి-కాంగ్రెస్ నాయకులు శల్యసారథ్యం చేశారు. పోటీ చేయడం అనవసరం, చేస్తే ఓడిపోతాం అంటూ కార్యకర్తల స్థయిర్యాన్ని దిగజార్చారు. వెళ్లి ప్రచారం చేయలేదు. కోవూరులో మాత్రం అందరూ శ్రమించారు. చివరకు ఎక్కడా నెగ్గకపోతే ఆ పాపం కిరణ్ నెత్తిన చుట్టేస్తున్నారు. కిరణ్‌ను మార్చాలట. ఏం చేశాడని మార్చాలి? అతనికి ఫుల్ పవర్స్ యిచ్చారా? ప్రచారం రానివాళ్లను పార్టీలోంచి బయటకు పంపే అధికారం అతని చేతిలో వుందా? తనను తీవ్రంగా తిట్టిపోస్తున్న డియల్‌ను కూడా ఏమీ చేయలేని నిస్సహాయ పరిస్థితి అతనిది. అధికారాలు యివ్వలేదు కానీ పరాజయాలకు బాధ్యుణ్ని చేస్తున్నారు. అయినా అక్కడ ఓడిపోయినది పార్టీ, ప్రభుత్వం కాదు. కిరణ్ ప్రభుత్వాధినేత, బొత్స పార్టీ అధినేత. అందువలన మారిస్తే బొత్సను మార్చాలి. కానీ చిత్రంగా అందరూ కిరణ్‌నే మార్చాలని పట్టుబడుతున్నారు. ఇదీ అతని గుడ్‌విల్.

డియస్‌ను ఢిల్లీకి పిలిచి సోనియా యధార్థ పరిస్థితి ఏమిటని అడిగితే అదిగో కిరణ్ స్థానంలో అతన్ని వేస్తారని ప్రచారం జరిగింది. రెడ్లు జగన్‌వైపు వెళ్లిపోతున్నారు కాబట్టి కాపులను కాంగ్రెస్ చేరదీస్తోందని మీడియా ప్రచారం సాగిస్తోంది. నాకు యీ థియరీపై మొదటినుండీ నమ్మకం లేదు. జగన్ పార్టీకి స్పోక్స్ పెర్సన్స్‌గా వున్నవాళ్లల్లో అన్ని కులాల వాళ్లూ కనబడుతున్నారు. అంబటి, సబ్బం, గోనె, గట్టు, విజయ్ చందర్, జనక్ ప్రసాద్ – వీళ్లెవరూ రెడ్లు కాదనుకుంటాను. నిజానికి మొదట్లో జగన్ పక్షాన నిలిచి తర్వాత కాంగ్రెస్ వైపుకి వెళ్లిపోయినవాళ్లల్లో చాలామంది రెడ్లు వున్నారు.

డియస్‌ను సిఎం చేసేస్తారని ఓ పత్రిక రాస్తే కిరణ్‌ను తీసేస్తే రెడ్లందరూ నొచ్చుకుంటారనీ, ఇప్పటికే జగన్ పార్టీలోకి క్యూ కడుతున్న రెడ్లందరూ మరింత వేగంగా వెళ్లిపోతారనీ, అందువలన జానారెడ్డిని సిఎంగా చేస్తారనీ రాసింది. ఏమిటో యీ లెక్కలు ! కిరణ్‌ను సిఎం చేయగానే రెడ్లందరూ పండగ చేసేసుకున్నారా? మరి కిరణ్‌ను దింపమని ఉద్యమిస్తున్న వారిలో ముందువరసలోనే రెడ్లున్నారేం? (డియల్, రామచంద్రారెడ్డి). జగన్ వెనక రెడ్లందరూ వెళుతున్నారని ఆంధ్రజ్యోతి రెండు రోజుల కోసారైనా రాస్తుంది. రేపు ఉపయెన్నికల్లో జగన్ ఆశించిన ఫలితాలను తెచ్చుకోకపోతే రెడ్లే కాదు, అనేక కులాల వారు ఎబౌట్ టర్న్ కొడతారు. రాజకీయాల్లో ప్రాధాన్యం –గెలుపుకే, కులానికి కాదు. ఏ పార్టీయైనా సరే, ఒకే కులాన్ని సేవిస్తూ కూర్చుంటే మూతేసుకోవాలి. అన్ని పార్టీల్లోనూ అన్ని కులాల వాళ్లూ వుంటారు. ఇది తెలియనట్టు నటించడం ఆత్మ ప్లస్ పరవంచనే!

ఇక కాపులు – బొత్సను, చిరును వాటేసుకున్నందుకు వీళ్లంతా కాంగ్రెస్‌ను ఆదరిస్తారనుకోవడం కంటె మూర?త్వం లేదు. ఇవాళే ఓ పేపర్లో చదివాను. జగన్ టూరు చేస్తున్న జిల్లాలలో కాపు నాయకులు అతని వైపు చేరుతున్నారని. ఎవరో చేగొండి ఒకరు చేరినంత మాత్రాన (ఆయన ఓ దొర్లు పుచ్చకాయ) కాపులంతా అటు వెళ్లినట్లు కాదు. కాపులైనా, రెడ్లయినా, మరొకరైనా తమకు టిక్కెట్టు ఎక్కడ యిస్తే అక్కడికి, ఎక్కడ గెలుపు అవకాశాలున్నాయని వాళ్లకు తోస్తే అక్కడికి వలస వెళతారు. చిరు అయితే కాపు అనవచ్చు కానీ యీ బొత్స, డియస్ లను కాస్సేపు కాపులంటారు, కాస్సేపు బిసి లంటారు.

చిన్నప్పుడో పిట్టకథ విన్నాను. ఓ పూటకూళ్ల అవ్వ పావలాకి విందు భోజన పెడతానని చెప్పి, విస్తరి ముందు కూర్చోబెట్టిందట. ఓ గరిటతో పప్పు వేసి – ఇదే పప్పనుకో, యిదే కూరనుకో, యిదే పచ్చడనుకో, యిదే పులుసనుకో, యిదే పెరుగునుకో అందట. అలాగ కాంగ్రెస్‌వారు డియస్ వంటి ఓ నాయకుణ్ని ముందుకు తీసుకుని వచ్చి – ఇతన్నే కాపనుకుని కాపులంతా ఓటేయాలి, ఇతన్నే బిసి అనుకుని బిసిలంతా ఓటేయాలి, ఇతన్నే తెలంగాణావాది అనుకుని తెలంగాణా ప్రజలంతా ఓటేయాలి అంటోందన్నమాట. పిట్టకథలో రెండో భాగం ఏమిటంటే – ఓ గడుగ్గాయి అవ్వకు తగిలాడు. ఓ అర్ధణా చేతిలో పెట్టి – ఇదే అర్ధణా అనుకో, యిదే అణా అనుకో, యిదే బేడ అనుకో, ఇదే పావలా అనుకో, నేనే నీ అల్లుణ్ననుకో ! అన్నాట్ట. అలాగ ఓటరు కూడా ఏదో ఒక నియోజకవర్గంలో ఓటేసి – ఇదే కరీంనగర్‌లో ఓటనుకో, ఇదే కర్నూల్లో ఓటనుకో, ఇదే పాలమూరులో ఓటనుకో, ఇదే ప్రకాశంలో ఓటనుకో అనగలడు.

ఏది ఏమైనా హై కమాండ్ చాలా తప్పులు చేస్తోంది. మనందరికీ తెలిసేట్టు వీళ్లందరినీ ఢిల్లీ పిలిచి మందలించింది. అలా చేయడం వలన ఢిల్లీ వాళ్ల అథారిటీ తెలియవచ్చింది కానీ సిఎంది, పిసిసి అధ్యక్షుడిది అథారిటీ అండర్‌మైన్ అయిపోయింది. వీళ్లను రేపటినుండి ఎవడు లెక్క చేస్తాడు? డిప్యూటీ సిఎం వెళ్లి మొత్తుకున్నాట్ట – సిఎం నన్ను సంప్రదించడం లేదని. సంజీవరెడ్డిగారు స్వానుభవంతో ఎప్పుడో చెప్పారు – డిప్యూటీ సిఎం పోస్టు ఆరో వేలు లాటిదని. విన్నారా? ఇంతోటి పోస్టు తెలంగాణకు యివ్వలేదు,

అన్యాయం జరిగిపోయిందని గగ్గోలు పెట్టేశారు. గీతా రెడ్డిగారికి రావలసినది, ఉపకులాల కోటాలో యీయన తన్నుకుపోయాడు. పదవి చేతికి వచ్చాక అధికారం లేదంటూ వేదన పడుతున్నాడు. రేపు యీయన్ని సిఎం చేసి, మరొకణ్ని డిప్యూటీ సిఎం చేస్తే ఈయనా అతన్ని ఖాతరు చేయడు. మరొక అధికార కేంద్రం వుండడం ఏ అధినేత ఎన్నడూ సహించడు.

బొత్సకు, కిరణ్‌కు యిద్దరికీ వార్నింగ్ యిచ్చారట – ఉపయెన్నికలలో సగమైనా గెలిచి రమ్మనమని. పార్టీ యిమేజి చేతులారా ధ్వంసం చేసి, ఎన్నికలలో గెలవమంటే ఎవరు మాత్రం గెలవగలరు? గెలవకపోతే శిక్ష ఎవరికి పడుతుందో చెప్పండి. కిరణ్‌కే ! బొత్సకు కాదు. ఎందుకంటే బొత్సను హై కమాండ్ సాకుతోందని స్పష్టంగా కనబడుతోంది. గతంలో వైయస్ పోషించిన పాత్రను యిప్పుడు బొత్స పోషిస్తున్నారు కాబోలు. బొత్స కాంగ్రెస్‌ను కోస్తా జిల్లాలలో గెలిపించి, రాయలసీమలో ఓడిస్తే – కిరణ్ స్థానంలో బొత్స గద్దె కెక్కినా ఆశ్చర్యపడనక్కరలేదు. అవినీతి నిరోధక శాఖ చేత విపరీతంగా దాడులు చేయించి రాష్ట్రంలో మురికంతా బయటపడేసినందుకు కిరణ్‌కు ఆ పాటి శిక్ష పడాల్సిందే లెండి! (సమాప్తం) **– ఎమ్బీయస్ ప్రసాద్ (ఏప్రిల్ 2012)**

## ఏప్రిల్ 08 ఎమ్బీయస్ : పాలమూరుతో పొలమారిన తెరాస

అవసరానికి మించి ఏదైనా తినబోయినా, తాగబోయినా పొలమారి ఉక్కిరిబిక్కిరవుతాం. పాలమూరు ఎన్నికతో తెరాస యిప్పుడు ఉక్కిరిబిక్కిరవుతోంది. అక్కడ తెరాస బిజెపితో తలపడడం అర్థరహితం అని అందరికీ తోచింది. అయినా అత్యాశతో దాన్ని కూడా ఆరగించబోయారు కెసియార్. తెలంగాణకోసం బొంతపురుగునైనా ముద్దాడతానంటూ కెసియార్ సోనియాను ఎన్నోసార్లు కీర్తించారు. తెలంగాణ ప్రకటిస్తే తన పార్టీని కాంగ్రెస్‌లో కలిపేస్తానని ఆఫర్ కూడా యిచ్చారు (ఇటీవల మళ్లీ యిచ్చారని పుకార్లు వచ్చాయి). ఇంత చెప్పినా కాంగ్రెస్ ఉలుకూపలుకూ లేదు. అలాటప్పుడు తెలంగాణ యిచ్చి తీరతామని ఢంకా బజాయించి చెప్తున్న బిజెపిని కెసియార్ ఎందుకు దరి చేరనీయటం లేదు? వాళ్లపై పోటీ పెట్టి ఎందుకు ఓడించాలని చూశారు?

తన పార్టీ బలం పెంచుకోవడం తప్ప ఆయనకు వేరే ఏ ధ్యాసా లేదా? మొదటినుండీ అది తమ సీటైతే అది వేరే విషయం. అది ఎవరిదీ కాదు. ఆరింటిలో మీకు మద్దతు యిస్తాం, యిది ఒక్కదానిలో మాకు మద్దతు యివ్వండి అని బిజెపి అడిగినా ఆయన ఖాతరు చేయకపోవడం బాగాలేదని తెలంగాణావాదులు సైతం అనుకున్నారు. ఎన్నిక అయిపోయింది, ఫలితం వచ్చేసింది. సాటి తెలంగాణావాదియైన బిజెపి గెలిచి ప్రత్యేకవాదులను సంతోషపెట్టింది. తెరాస, బిజెపి కొట్లాటలో మధ్యలో కాంగ్రెస్ ఆ సీటు తన్నుకుపోయి వుంటే వీళ్లంతా వుసూరుమనేవారు. 2014లో తెలంగాణ అంతా యిలాటి కథలే పునరావృతమవుతాయి అని బెంగపడేవారు.

అయితే కెసియార్ పోయింది పోనీలే అని వూరుకోలేదు. అక్కడ మతతత్వశక్తులు గెలిచాయి అని ప్రకటన చేసి అనవసరంగా బిజెపిని రెచ్చగొట్టారు. దాంతో వాళ్లు యీయన్ని జోకర్, బ్రోకర్ అంటూ తిట్టిపోశారు. రేపు పరకాలలో పోటీ చేసి మా తడాఖా చూపిస్తాం అని ఛాలెంజ్ చేశారు. ఇదంతా ఊహించినట్టే జరిగింది. కానీ కథ వూహించని ఓ మలుపు తిరిగింది. ఇప్పుడు ముస్లిములందరూ కెసియార్‌ను తిట్టిపోస్తున్నారు, కావాలని అక్కడ ముస్లిం కాండిడేటును నిలబెట్టి ఓడించారని. అవివేకం వలనో, తన బలం ఎక్కువగా వూహించుకునో యీ పని చేశాడని అంటే అదో దారి. బిజెపితో చేతులు కలిపాడని ఆరోపణ ఒకటి.

మొదట ఒకటి రెండు చిన్న చిన్న సంస్థలు యిలాటి ప్రకటనలు యిస్తే 'ఇవి వాళ్ల ప్రచారం కోసమేలే' అనుకుని నవ్వేశాను. కానీ పోనుపోను గొంతు పెరుగుతోంది. కొత్త కొత్త గొంతులు కలుస్తున్నాయి. ముస్లింలకు డిప్యూటీ సిఎం పోస్టు యిస్తానని ప్రకటించి, ముస్లిం రిజర్వేషన్లు పెంచుతానని ప్రకటించి ముస్లిమేతరులందరినీ కావాలని రెచ్చగొట్టి, వాళ్లందరినీ ఐక్యం చేశాడని వాళ్లు కోపగించుకుంటున్నారు. ఇది చాలా దురదృష్టకరం. తన పార్టీ బలం పెంచుకోవాలన్న స్వార్థం కొద్దీ కెసియార్ పోటీ చేయించారంటే నమ్ముతాను తప్ప కావాలని ముస్లింను నిలబెట్టి ఓడించారంటే నమ్మలేను. ఎందుకంటే ఆ ఓటమి కెసియార్‌కే దెబ్బ. అది ఆయన పార్లమెంటరీ నియోజకవర్గంలో భాగం. పైగా యీ చేష్ట వలన తెలంగాణవాదులంతా ఆయన్ను తప్పుబట్టారు.

ముస్లింల ఓట్లకోసం కెసియార్ అర్థంపర్థం లేకుండా నిజాంను కీర్తించి మన బోటివాళ్లకు చికాకు తెప్పించారు. ముస్లింలందరూ నిజాం పాలనలో సుఖపడిపోలేదు. ఆ మాట కొస్తే ఏ మతం వారైనా సరే – మధ్యతరగతివాళ్లు, పేదలూ ఎవరూ సుఖపడలేదు. జమీందారీ వ్యవస్థలో బాగుపడేది జమీందార్లే – వాళ్లు హిందువులైనా, ముస్లిములైనా ! వాళ్లూ, నిజాం ఒకరికి మరొకరు కొమ్ము కాసుకున్నారు. భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చాక వాళ్ల పదవులు వూడతాయని భయం పుట్టాక రజాకార్లను తయారు చేశారు. వాళ్లకు హిందూ జమీందార్లు కూడా సాయపడ్డారు. నిజాంను, నిజాం వ్యవస్థను ఎదిరించేవాళ్ల పనిబట్టడమే వాళ్ల పని. వాళ్లకు ప్రభుత్వ మద్దతు వుంది. ఇదేమీ తెలియనట్టు బిజెపివాళ్లు ఓ ముస్లిం ఎమ్మెల్యే గెలిచినంత మాత్రాన రజాకారు రాజ్యం తిరిగి వచ్చేస్తుందని ప్రచారం చేయడం ఘోరం. ఇప్పుడున్నది రాజరికం కాదు. ఓ ఎమ్మెల్యే తలుచుకున్నా ప్రయివేటు సేన తయారుచేయలేడు.

పాలమూరు గెలిచాక బిజెపి సమరోత్సాహంతో వుంది. పరకాలలో కూడా పోటీ చేస్తానంటోంది. మంచిదే, చేయనీయండి. కానీ అప్పుడే దీనికి కులం రంగు పులిమేస్తున్నారు. పాలమూరులో బిజెపి అభ్యర్థి రెడ్డి కావడం చేతనే అక్కడి రెడ్లు ఓటేశారనీ, టి–జాక్ చైర్మన్, స్థానిక జాక్ అధ్యక్షుడు యిద్దరూ రెడ్లు కావడం చేతనే బిజెపికి లాభం చేకూరేట్లు తటస్థంగా వున్నారని వ్యాసాలు రాస్తున్నారు. బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డి కూడా రెడ్డియేనని గుర్తు చేస్తున్నారు. పరకాలలో కూడా రెడ్డి అభ్యర్థిని నిలబెడతారని ఊహాగానాలు

చేస్తున్నారు. ఈ విధంగా తెలంగాణ ఉద్యమాన్ని వెలమ–రెడ్డిల మధ్య విడగొడుతున్నారు. తెరాసలో వెలమల ప్రాబల్యం యిప్పటికే వుంది కాబట్టి రెడ్లు అందరూ బిజెపి ద్వారా నాయకత్వంలోకి వద్దామని చూస్తున్నారని బిసి, ఎస్సీ నాయకులు వ్యాసాలు రాస్తున్నారు.

తెరాస–బిజెపిల మధ్య నున్న ఒక మామూలు రాజకీయవైరానికి యింత కులం రంగు పులమడం చాలా అసహ్యంగా వుంది. దీనికి మైనారిటీ కోణం ఒకటి వచ్చి చేరింది. తెలంగాణ వస్తే యిక్కడ టిడిపి ప్రాబల్యం తగ్గి బిజెపి ఆ స్థానాన్ని భర్తీ చేస్తుందని, అది ముస్లింలలో అభద్రతా భావాన్ని పెంచుతుందని మజ్లిస్ ఎప్పణ్నుంచో వాదిస్తోంది. అందుకే అది రాష్ట్రం విడిపోకూడదంటోంది. అంతగా విడగొడితే బిజెపికి బలం అస్సలు లేని రాయలసీమ కూడా కలిపి యిమ్మంటోంది.

వారి భయాలు నిరాధారం కాదేమో ననిపించింది పాలమూరు ఫలితం! రాబోయే తెలంగాణ యిలాటి మతఘర్షణలకు, కులఘర్షణలకు కురుక్షేత్రం అవుతుందాని భయం వేస్తోంది. హైదరాబాదులో నిజాం కాలంలో మతఘర్షణలు లేవని, ఆంధ్రప్రాంతం వారు వచ్చి కలిశాకనే ఘర్షణలు వచ్చాయనీ వేర్పాటువాదులు వాదిస్తారు. అలా అయితే ఆంధ్రప్రాంతంలో మతకల్లోలాలు ఎప్పటినుండో జరగాలి కదా. ఎక్కడ జరిగాయి చెప్పండి. శతాబ్దాలుగా కలిసివున్నా అక్కడ ఎన్నడూ లేవు. అక్కడ హిందూ, ముస్లిం జీవనవిధానంలో, వేషభాషల్లో కూడా పెద్దగా తేడాలు కనబడవు.

తెలంగాణలో నిజాం నిరంకుశ ప్రభుత్వం వుండగా హిందువులు నోరెత్తలేకపోయారు. క్రమేపీ మతశక్తులు బలపడడంతో ఘర్షణ వాతావరణం ఏర్పడింది. అది కూడా పాతబస్తీలో, అందునా రాజకీయ కారణాల వలన మాత్రమే. మజ్లిస్ బలం పుంజుకోవడంతో వారిని ఎదిరించడానికి ఆరెస్సెస్, జనసంఘం (బిజెపి పూర్వరూపం) హిందువులను చేరదీశాయి. మతం పేరుతో ఊరేగింపులు లేవదీసి, గొడవలు చేశాయి. 30 ఏళ్ల లోపున వయసున్న వాళ్లు చెపితే నమ్మరేమో కానీ – హైదరాబాదులో గతంలో గణేశ నిమజ్జనోత్సవాలు వుండేవి కావు. అసలు మహారాష్ట్రలో కూడా నూరేళ్ల క్రితం వుండేవి కావు. లోకమాన్య టిళక్ (తిలక్) ప్రజలను సమీకరించడానికి మతాన్ని వాడుకుంటూ నిమజ్జనోత్సవాలను భారీ ఎత్తున నిర్వహించడం మొదలుపెట్టారు. అది సంప్రదాయం అయిపోయింది.

పాత బస్తీలో మజ్లిస్‌ను వంచడానికి ఆరెస్సెస్ శక్తులు యిక్కడా మొదలుపెట్టారు. నిమజ్జనం రోజున కావాలని అల్లర్లు చేయడం, ముస్లిములను అడలగొట్టడం ప్రారంభమైంది. ఫలానా రోజున నిమజ్జనం చేయండి అంటే కాదు శుక్రవారమే చేస్తాం అంటారు. పొద్దన్నే ఊరేగింపు బయలు దేరదీసి మధ్యాహ్నం నమాజు వేళకి పాతబస్తీ దాటించేయండి అంటే కాదూ కూడదంటూ కావాలని ఆలస్యం చేసి అదే టైముకి మసీదు దగ్గరకి చేరతారు. ప్రతీసారి నిమజ్జనం పూర్తయేవరకూ పోలీసులకు మనశ్శాంతి వుండదు. ఇది నిజానికి భక్తితో చేస్తున్నదా? మైనారిటీలను అడలగొట్టడానికి చేస్తున్నదా? ఈ వూళ్లో తప్ప రాష్ట్రం మొత్తంలో గణేశభక్తులుండరా? అక్కడ నిమజ్జనాలకై యింత హంగామా వుండదేం? స్కూళ్లకు, ఆఫీసులకూ సెలవు లివ్వరేం? ఇవ్వరు – ఎందుకంటే అక్కడ మజ్లిస్ లేదు. ముస్లిం ఓట్లకు వ్యతిరేకంగా హిందూ ఓట్లు సమీకరించవలసిన అవసరం లేదు.

మజ్లిస్ వాళ్లు ఊరుకోలేదు. వాళ్లూ తమ తడాఖా చూపించడానికి అప్పట్లో పంఖా ఊరేగింపు అని ఒకటి పెట్టేవారు. హిందువులను అడలగొట్టేవారు. కొంతకాలానికి ఓపిక చాలలేదో ఏమో మానేశారు. అలా మానేసినందుకు వాళ్ల దేముడు వాళ్లని శిక్షించలేదు సరికదా, వాళ్లకు మరిన్ని సీట్లు తెచ్చిపెట్టి, హిందూవుల ఓట్లు కూడా తెచ్చిపెట్టాడు. నిమజ్జనం పేర ప్రజలందరికీ టెన్షన్ తెచ్చి పెట్టకుండా వుంటే మన వినాయకుడు కూడా యీ ఆరెస్సెస్ వర్గాలను చల్లగానే చూస్తాడు. కానీ వీళ్లు అలా అనుకోవడం లేదు.

లంబోదరుడు చాలనట్టు యిప్పుడు ఆంజనేయుడిపై కూడా పడ్డారు. పాలమూరు గెలుపు తర్వాత బిజెపి సమరోత్సాహంతో వుందని చెప్పానుగా. దాని సోదరసంస్థలు మొన్న హనుమజ్జయంతి నాడు విశ్వహిందూ పరిషత్ తొగాడియాను లాక్కుని వచ్చారు. హనుమంతుడు హైదరాబాదులో తప్ప ఎక్కడా పుట్టనట్టు యిక్కడ పెద్ద ఊరేగింపు పెట్టి హంగామా చేశారు. వీళ్లకు యీ సారి మంచి ముహూర్తం దొరికింది. శుక్రవారం ముస్లిములకు మంచిరోజు. పైగా ఆ రోజు క్రైస్తవుల గుడ్ ఫ్రైడే పండుగ. మైనారిటీలకు హిందువుల శక్తి ఏమిటో ప్రదర్శించాలనుకున్నారు. అంతే !

అసలు హనుమంతుడి ఊరేగింపులేమిటో నాకు తెలియదు. ఆయనేమీ ఉత్సవమూర్తి, కళ్యాణమూర్తి కాదు. గుడి ప్రాంగణంలో కూడా ఆయన్ని ఊరేగించగా ఎప్పుడూ చూడలేదు. అయినా హనుమజ్జయంతినాడు హనుమద్భక్తి పెంపొందించే కార్యక్రమం చేపడదామనుకుంటే ఏదైనా గుళ్లో హనుమాన్ చాలీసా సామూహిక పఠనం కార్యక్రమం ఏర్పాటు చేయవచ్చు. అబ్బే, వీళ్లు ఊరేగింపు పెట్టారు – గౌలిగూడా నుండి తాడ్‌బన్ద్ వరకూ! దానిలో డాన్సులు చేశారని ఫోటోలు పత్రికల్లో వచ్చాయి. ఆ ఊరేగింపు అయ్యేవరకు పోలీసులు బిక్కుబిక్కుమంటూనే వుంటారు.

హిందూమతంలో ముక్కోటి దేవతలున్నారు. ఇంకా ఎన్ని వూరేగింపులు చూడాలో! ఇదంతా భక్తితో చేస్తున్నారంటే నేను నమ్మను. రాజకీయంగా, సాంఘికంగా మేం బలపడుతున్నాం, చూసుకోండి అని ప్రత్యర్థులకు చాటడానికే యివి యిక్కడే తెలంగాణలో జరుగుతున్నాయి. కోస్తా, సీమల జోలికి వెళ్లటం లేదు. దీని ఫలితం కూడా నిన్న మనం చూశాం. మాదాపూర్‌లో మతఘర్షణలు. వీళ్ల బలప్రదర్శన కాగానే వాళ్ల ప్రదర్శన. ఫలితం కర్ఫ్యూలు. మధ్యలో టెన్త్ క్లాసు కుర్రాళ్లకు, ఐఐటీ కుర్రాళ్లకు టెన్షన్. రోజుకూలీ వాళ్లకు పొట్ట మీద దెబ్బ. అరెస్టులు.. వాళ్లల్లో కొంతమంది అమాయకులు.. వాళ్లకు నుదుటిపై ఓ రౌడీ ముద్ర..

అవసరమా? దైవభక్తికి యిదంతా అవసరమా? మేం యిదివరకు అంటే 35, 40 ఏళ్ల క్రితం సైదాబాదు ప్రాంతాల్లోనే వుండేవాళ్లం.

ఈ అల్లర్లు, కర్ఫ్యూలు, పోలీసులు లాఠీ ఝుళిపించడాలు, స్కూళ్లు, కాలేజీలు, ఆఫీసులకు వెళ్లలేక పేకాడుతూ యింట్లో కూర్చోవడాలు – అన్నీ రుచి చూశాం. మజ్లిస్, ఆరెస్సెస్ గొడవల మధ్య మేం చచ్చేవాళ్లం. ఎన్టీయార్ వచ్చాకనే పోలీసులకు పూర్తి స్వేచ్ఛ నిచ్చి మొత్తం అణిచేయమన్నారు. అప్పటినుండి ప్రశాంతి. కర్ఫ్యూ అంటే ఏమిటి అనే స్థితికి వచ్చాం. మళ్లీ పాతరోజులకు తీసుకుని వెళుతున్నారు. అప్పట్లో చెన్నారెడ్డి ప్రభుత్వం లాగానే యిప్పటిదీ కాంగ్రెస్ ప్రభుత్వమే. అప్పట్లో ఆయన ధృత కలవాడు. నిరంకుశంగా వుండేవాడు. ఇప్పుడు కిరణ్ తుమ్మితే ఊడే ముక్కులా వున్నాడు. ఈయన మాట ఎవడు లక్ష్యపెడతాడు?

పైగా అధికారగణమంతా డీ–మోరలైజ్ అయివుంది. ఎవణ్ని అరెస్టు చేస్తే బదిలీ వస్తుందో అని ఐపియస్ అధికారే వణుకుతూంటే ఆయనేం కంట్రోలు చేయగలడు? చూసీ చూడనట్టు ఊరుకోండి అంటారు. ఆవు కాళ్లు నరికి ఓ మతానికి చెందిన ప్రార్థనాలయంలో పడేశారు అని పత్రికలో రాస్తే అది ఏ మతమో మనకు తెలియదా? ఓ 30, 40 మంది ముస్లిము యువకులను అరెస్టు చేసి లోపల కూర్చోబెడతారు. వెంటనే వాళ్లు అమాయకులంటూ మజ్లిస్ వాళ్లు గోల చేసి, అరెస్టు చేసిన పోలీసు వాళ్లని కొట్టడమో, కొట్టబోయినంత పని చేయడమో చేస్తారు. కాబినెట్‌లో ముస్లిం మినిస్టర్‌గారు వెళ్లి కలగజేసుకుంటారు. చివరకి ఎలాగోలా కథ ముగుస్తుంది. ముస్లిం రక్షకులుగా మజ్లిస్‌కు పేరు వస్తుంది. ముస్లింలకు పాఠం చెప్పినవారిగా ఆరెస్సెస్ శక్తులకు పేరు వస్తుంది. మధ్యలో కాళ్లూ, చేతులూ విరిగినవారికి మాత్రం అవి మళ్లీ రావు.

ఓ పక్క భారతదేశానికి ఉజ్జ్వల భవిష్యత్తు బ్రిక్స్ దేశాలకు ఉమ్మడి కరెన్సీ, డాలరును తోసి రాజంటాం అని చెప్పుకుంటున్నాం. మరో పక్క యిదిగో యిలాటి చిల్లర గొడవలతో సతమతమవుతున్నాం. ఏం, యింట్లో దణ్నం పెట్టుకుంటే దేవుడు కరుణించడా? దేవుణ్ని రోడ్డున పడేయాలా? మొన్న మహావీర్ జయంతి సందర్భంగా కోలాహలం అంటూ రోడ్ల మీద అందమైన జైన్ యువతుల సినిమాడాన్సుల ఫోటోలు వేశారు. ఇలా డాన్సు చేయమని మహావీరుడు చెప్పాడా? హనుమజ్జయంతి నాడు గెంతమని హనుమంతుడు చెప్పాడా? ఇదంతా మతం పేరుతో ఓట్లు రాబట్టుకునే మంత్రాంగం. బిజెపికి యిందుకే చెడ్డపేరు వచ్చింది. వాళ్లతో చేతులు కలపాలన్నా అందరూ అడిలి చస్తున్నారు.

ఇలాటి పరిస్థితుల్లో బిజెపికి చాటుగా సాయపడుతూ ముస్లింలను కావాలని దెబ్బ తీస్తున్నారని కెసియార్‌పై ఆరోపణ రావడం ఆయనకు రాజకీయంగా చాలా పెద్ద దెబ్బ. కెసియార్‌ను దెబ్బ తీయాలని కాంగ్రెస్, టిడిపిలు వెనకనుండి యీ ప్రచారానికి ఆజ్యం పోయవచ్చు. తెరాసకు పట్టు వున్న వరంగల్, కరీంనగర్‌లలో చాలామంది ముస్లిము ఓటర్లు వున్నారు. వారికి కూడా యిలాటి అనుమానం వస్తే చాలా ప్రమాదమే. దీన్ని గుర్తించి కెసియార్ ఎలా ఎదుర్కుంటారో వేచి చూడాలి. **– ఎమ్బీయస్ ప్రసాద్ (ఏప్రిల్ 2012)**

## ఏప్రిల్ 11 ఎమ్బీయస్ : వైయస్‌పై ఎస్సీ అస్త్రం

కాంగ్రెస్ అవస్థ చూస్తూంటే నవ్వొస్తోంది. వైయస్‌ను ఏం చేయాలో వాళ్లకు తెలియటం లేదు పాపం. మెచ్చుకుంటే జగన్‌కి లాభం. తిడితే తమ కాబినెట్ మంత్రులకు కష్టం. ఆ కాబినెట్ మంత్రుల్లో కూడా తేడాలున్నాయి. వైయస్ హయాంలో పని చేయనివారు వైయస్ తిడదాం, తిడదాం అంటారు. అప్పట్లో పనిచేసినవారు అలా ఎలా తిట్టగలం? ఆయన మన కాంగ్రెస్ ముఖ్యమంత్రి కదా అంటారు. కిరణ్ కాబినెట్ రెండుగా చీలింది. 'అవినీతిపరుడే అని చెపితే మరి ఎందుకు భరించారు? భరించడమే కాదు, 2009లో మళ్లీ ఎందుకు సిఎంను చేశారు? అంత అవినీతి జరుగుతూంటే పై వాళ్ల కళ్లు మూసుకుపోయాయా? ఈ దోపిడీలో వాళ్ల వాటా ఎంత? అని జనం అడుగుతారు, అందుకని మంచివాడని చెప్దాం' అంటారు కొందరు. 'అబ్బే మంచివాడే అంటే జగన్‌ను తిట్టడం ఎలా?' అని వాదిస్తారు కొందరు. వైయస్ ఆస్తులకు జగన్ వారసుడు కావచ్చు కానీ, ఆయన విధానాలకు వారసులం మేం అని చెప్పుకుంటూ వచ్చిన కాంగ్రెస్‌వారు ఇప్పుడు వైయస్ అవినీతి జగన్ ఖాతాకు, అభివృద్ధి మా ఖాతాకు అంటున్నారు. ఒప్పుతుందా?

ఒప్పినా ఒప్పకపోయినా యిప్పుడు ఏదో ఒకటి అని తీరాలి. ఎందుకంటే ఉపయెన్నికలు దాపురించాయి. అవి నెత్తిమీదకు తెచ్చుకున్నది కాంగ్రెసే! అవిశ్వాస తీర్మానం పెట్టించి, జగన్ వెనకున్న ఎమ్మెల్యేల నిగ్గు తేల్చి అతని వెనకాల ఎవరూ లేరని నిరూపిద్దామనుకున్నారు. కొంతమందిని వెనక్కి లాక్కున్నారు కూడా. అయినా అనుకున్నదాని కంటె ఎక్కువ మంది అతని వెంట మిగిలారు. మొండికేసి వేటు వేయించుకున్నారు. ఇప్పుడు ఉపయెన్నికలు రావడంతో కాంగ్రెస్ నాయకుల గొంతులో వెలక్కాయ పడింది. ముగ్గురు నాయకుల్నీ (ఉపముఖ్యమంత్రి కూడా ఓ నాయకుడని నాకు యీ మధ్యే తెలిసింది లెండి) ఢిల్లీ పిలిచి తలంటి పంపారు. ఎన్నికల ఫలితాల తర్వాత రెండో భాగం వుంటుందని చెప్పి మరీ పంపారు. కళ్లల్లో పడిన కుంకుడురసం తుడుచుకుంటూ ముగ్గురూ వెనక్కి వచ్చి అబ్బే ఏమీ లేదు అనేశారు. ఎన్నికల ఫలితాలమీదనే వాళ్ల భవిష్యత్తు వుందని మీడియా కోడై కూస్తోంది.

ఎన్నికల్లో కాంగ్రెస్ ఓడిపోతే కిరణ్ దిగిపోతాడని ఆశపెట్టుకుని కాబోలు బొత్స 'జగన్ వెనక్కాల పూరికే తిరగడం కాదు, దమ్ముంటే రాజీనామా చేయండి' అంటూ జగన్ ఎమ్మెల్యేలను రెచ్చగొట్టి ఎలక్షన్ రప్పించారు. 'అదే జరిగితే కిరణ్‌తో బాటు నువ్వూ ఔట్' అని ఢిల్లీలో చెప్పడంతో కాబోలు, 'డబ్బుకు అమ్ముడుపోయి రాజీనామా చేశారు' అని నిందిస్తున్నారు. ఈ ఎన్నికలు ముగ్గురు పెద్దల పదవులకు ఎసరు పెట్టేందుకే వచ్చినట్టున్నాయి. ఎందుకంటే అవన్నీ ఒరిజినల్‌గా కాంగ్రెస్ సీట్లు. టిడిపి, వైయస్సార్పీకి చెరో

నాలుగు వచ్చినా ఆ మేరకు కాంగ్రెస్ పోగొట్టుకున్నట్టేగా! ఇంకా ఎక్కువ వస్తే యింకా అప్రదిష్ట. కార్యకర్తల్లో మరింత అధైర్యం. అందువలన కనీసం సగమైనా గెలవాలి. కమిటీలు, గిమిటీలు ఎన్ని వేసినా ప్రచారానికి ఓ అస్త్రం కావాలి. 'విశ్వసనీయత లేదు' అనే అస్త్రంతో టిడిపిని కొట్టేయ వచ్చనుకుంటున్నారు, కోవూరులో కాంగ్రెస్ కంటె టిడిపికే ఎక్కువ విశ్వసనీయత వుందని రుజువైనా!

ఇక జగన్‌ను కొట్టాలంటే ఏం చేయాలి? అవినీతి అస్త్రం బ్రహ్మాస్త్రం. దాన్ని ముందే వాడేశారు. కడప రోజుల్లోనే అది పని చేయలేదని తేలింది. అయినా ఆశ వీడక ఎప్పటికప్పుడు వాడుతున్నారు. సిబిఐ చేత అరెస్టు చేయిస్తే మంచిదా? కాదా? అన్న పెద్ద మీమాంస. జగన్ అరెస్టు అయినా సింపతీతో ఓట్లు కురిసిపోతాయని నేను అనుకోను. జైలుకెళ్లినా కనిమొళిలా బయటకు వచ్చేస్తాడని జనాలకు ఎలాగూ తెలుసు. పైగా జైల్లో జగన్ రాజభోగాలు అనుభవిస్తున్నాడు, జైలర్‌ను బెదిరించి అనుచరులను రప్పించుకుంటున్నాడు అనే కథనాలు అప్పుడే మీడియా వండి పెట్టి వుంటుంది. వార్చడమే తరువాయి. జగన్‌కు వచ్చే ఓట్లు అతని కొత్తదనానికి వస్తాయి. గతంలో చిరంజీవికి వేసినట్టు, యీసారి యువత జగన్‌కు వేయవచ్చు. పెద్ద మెజారిటీలతో కాకపోయినా సగానికి పైగా సీట్లు గెలవవచ్చు అన్న భయం కాంగ్రెస్‌వారికి వుంది. దాన్ని అడ్డుకోవాలంటే ఏం చేయాలి అని ప్రతీ చీపురుపుల్లనూ అస్త్రంగా వాడదామని చూస్తున్నారు.

వీర సమైక్యవాది టిజి వెంకటేశ్ 'జగన్‌కు ఓటేస్తే రాష్ట్రవిభజనకు ఓటేసినట్టే' అన్నారు. తెలంగాణలో ఉపయెన్నికలు అయిపోయాయి కాబట్టి గతంలో వైయస్, అంతకుముందు ఎలక్షన్‌లలో చంద్రబాబు వేసిన ట్రిక్కే యిప్పుడు కాంగ్రెస్ వేయబోతోంది. 'ఆంధ్రప్రాంతంలో ఓడిపోతే కాంగ్రెస్ రాష్ట్రవిభజనకు సై అంటుంది జాగ్రత్త' అని వెంకటేశ్ బెదరగొడుతున్నారు. ఏ పార్టీలో లేని నా బోటి సమైక్యవాదులకు జగన్‌ను విమర్శించే హక్కు వుంటుంది తప్ప, ఏదీ తేల్చని కాంగ్రెస్, టిడిపిలకు విమర్శించే హక్కు లేనే లేదు. ఓటర్లలో వెళ్లి చెప్పగానే 'అయితే మీ సంగతేమిటి? తెలంగాణ యివ్వం అని ఢిల్లీచేత ప్రకటింపచేస్తారా?' అని అడుగుతారు. అందువలన యీ అస్త్రం పనికి రాదు.

ఇక రెండోది – ఎస్సీలకు వైయస్ అన్యాయం చేశాడనేది. జెడి శీలం, కొండ్రు మురళి యిద్దరూ వైయస్ ఎస్సీల నిధులను మళ్లించాడని ఆరోపిస్తున్నారు. నిజమే కావచ్చు. ఈ మళ్లింపు బాబు హయాం నుండి, కిరణ్ హయాం దాకా సాగుతూనే వుంది. వైయస్ హయాంలో శాతం పెరిగి, యిప్పటికీ అదే నడుస్తోంది. ఈ మళ్లింపును అప్పుడు ఎందుకు అడ్డుకోలేదో, యిప్పుడు ఎందుకు ప్రస్తావిస్తున్నారో, ప్రస్తావించడమే తప్ప కిరణ్‌పై ఎందుకు ఒత్తిడి తీసుకుని రావడం లేదో ఎస్సీ నాయకులు చెప్పలేకపోతున్నారు. ఎన్‌టీవీ ఛానెల్‌లో కొండ్రు వైయస్‌ను తిట్టడంలో చెలరేగి పోయాడు. ఎన్నిసార్లు తను అడిగినా ఆ దళిత వ్యతిరేకి భుజం తట్టి పంపించేశాడు తప్ప ఏమీ చేయలేదు అన్నాడు. చేయకపోవడమేం, వైజాగ్‌లో పదెకరాల ప్రభుత్వ భూమి మీ కాలేజీకి యిచ్చాడుగా అన్నారు జర్నలిస్టులు. దానికి సమాధానం చెప్పలేక 'ఏం ఎస్సీలు కాలేజీలు పెట్టుకోకూడదా?' అంటూ అడ్డగోలు వాదనకు దిగాడు. ఎంత హాస్యాస్పదంగా వుందంటే అంత హాస్యాస్పదంగా వుంది. కోవూరు సర్వేలో ఎస్సీలు జగన్‌కు వేశారని తేలిందో ఏమో, వీళ్లు యిప్పుడు ఈ అంశం లేవనెత్తారు. రేపు రెడ్లు కూడా పెద్ద సంఖ్యలో జగన్ పార్టీకి ఓట్లేశారని తేలిందనుకోండి, వైయస్ రెడ్లకు కూడా ఏమీ చేయలేదని ప్రచారం మొదలుపెడతారేమో! ఎన్నికలు దగ్గర పడుతున్న కొద్దీ మనకు వినోదానికి లోటుండదనిపిస్తోంది. – **ఎమ్బీయస్ ప్రసాద్ (ఏప్రిల్ 2012)**

## ఏప్రిల్ 16 ఎమ్బీయస్ : కాయకల్ప చికిత్స ఖాయమే !

వాయలార్ రవి వచ్చినదగ్గర్నుంచి మన మీడియాకు అదావుడి ఎక్కువైంది. కేరళవైద్యం ఫలించేనా? అది పని చేస్తుందా? సిఎం ని మారుస్తారా? పిసిసి అధ్యక్షుణ్ని మారుస్తారా? ఇద్దర్నీ మారుస్తారా? ఉపయెన్నికలు వాయిదా వేస్తారా? కాంగ్రెస్‌లో అంతర్గత కలహాలు నివారించబడతాయా? అని ప్రశ్నలూ, అభిప్రాయ సేకరణలూ. ఆయన ఎవరింటికి టిఫెన్ కెళ్లినా దానిపై వివాదం. ఏం వ్యాఖ్యానించినా అదీ వార్తే. ఏం చేసినా కాంగ్రెస్ బాగుపడదు. ఆయన వచ్చినది తులసితీర్థం పోయడానికే అని టిడిపి వాళ్లంటున్నారు.

శ్రీశ్రీ ఎప్పుడో అన్నాడు – ''కాంగ్రెస్ కింకా ఎందుకు కాయకల్ప చికిత్స? దాని పేరు చెపితేనే మేరలేని జుగుప్స" అని. భలే భలే అనుకున్నాం అప్పుడు. ఏ చికిత్సా దానికి పనికిరాదు, చచ్చిపోయింది అనుకుని. కానీ ఆ పార్టీ చావలేదు. వేరే పేరుతో బతికి వచ్చింది. అధికారం పోగొట్టుకుంది, మళ్లీ తెచ్చుకుంది. ఈ పద్యాన్ని మళ్లీ గుర్తుకు తెచ్చుకుని మనం చంకలు గుద్దుకుంటున్నాం. శ్రీశ్రీకేం పోయింది, మనకేం పోయింది – కాంగ్రెస్‌కి చికిత్స అనవసరం, దాని చావు దాన్ని చావనీ అని తీర్మానించేస్తాం. కానీ పాపం కాంగ్రెస్ వాళ్లు అలా అనుకోరు కదా!

కాంగ్రెస్ హై కమాండ్ మిమ్మల్ని కన్సల్టెంట్‌గా నియమించింది అనుకుని కాస్సేపు చూడండి. యుపిలో ఫలితాలు చూసి కంగుతిన్న కాంగ్రెస్ అధిష్టానం తక్కిన రాష్ట్రాలనైనా నిలబెట్టుకోవాలి అనుకుంది. ఆంధ్రప్రదేశ్ చాలా ముఖ్యమైన రాష్ట్రం. 2009లో 33 మంది ఎంపీల నిచ్చిన రాష్ట్రం. 2014కి దానిలో సగమైనా వచ్చేట్టు కనబడటం లేదు. ఇంకొక్క రెండేళ్లు మాత్రమే టైముంది. ఏం చేయాలో చెప్పండి అని మిమ్మల్ని పిలిచిందనుకోండి. మీరు పరిస్థితిని సమీక్షించి చూస్తే ఏం కనబడుతోంది? –

రాష్ట్రానికి ఓ సిఎం వున్నాడు. పరిపాలనలో అనుభవం లేకపోయినా ఏదోలా లాక్కుని వస్తున్నాడు. ఇప్పటిదాకా ఏ స్కాండల్‌లోనూ

యిరుక్కోలేదు. వైయస్ జమానాలో ప్రతిపక్షాలకు అవినీతి అస్త్రం ఎప్పుడూ రెడీగా వుండేది. రోశయ్య జమానాలో కూడా చివరి రోజుల్లో అవినీతి ఆరోపణలు వచ్చేశాయి. కిరణ్ పాలనలో అది ఒక అంశంగా లేదు. రాష్ట్రంలో వున్న నాయకుల్లో క్లీన్ యిమేజి అతనికి ఒక్కడికే కనబడుతోంది. ఆ విషయంలో జగన్‌కున్నది చాలా ఘోరమైన యిమేజి. చంద్రబాబుకి అంత డామేజి లేదు కానీ ఎన్నికల్లో పెట్టే ఖర్చు చూసి, అవినీతి జరిగే వుంటుంది అని అనుకుంటారు. ఉపాయాలతో కోర్టులో విచారణ జరగకుండా జాగ్రత్త పడుతున్నారు కానీ విచారణ జరిపించి క్లీన్ చిట్ తెచ్చుకోలేదు. తెలంగాణలో బలంగా ఎదుగుతున్న తెరాస నాయకుడి చిత్తశుద్ధిపై ప్రజలకు అనుమానాలున్నాయి. ఎన్నికల బరిలో అందరూ నిలబడితే క్లీన్ యిమేజి విషయంలో కిరణ్‌వైపే మొగ్గు వుంది. జగన్‌వైపు వెళ్లిన ఎమ్మెల్యేలలో కొంతమందిని కాంగ్రెస్‌వైపు లాక్కురాగలిగాడు.

ఇక నెగటివ్ సైడ్ చూస్తే – కిరణ్ ప్రజల్లోంచి వచ్చినవాడు కాడు. జనాలతోనే కాదు, నాయకులతో కూడా ఎలా మెలగాలో తెలియదు. వినాయకుడి స్టయిల్లో పై వాళ్ల చుట్టూ ప్రదక్షిణాలు చేసి హఠాత్తుగా పై నుండి వూడిపడ్డవాడు. ఆ కారణంగా స్థానిక నాయకుల అసూయకు గురైనవాడు. అహంభావి. ఎవరినీ సంప్రదించడు. ఆయన్ని ఎవరూ లక్ష్యపెట్టరు. లక్ష్యపెట్టనివారిని ఏమీ చేయలేని అసమర్థ స్థితిలో వున్నాడు. రెడ్డికుల పక్షపాతిగా ముద్రపడింది. జగన్‌ను అరికట్టడానికి చంద్రబాబుతో చేతులు కలుపుతున్నాడన్న ఆరోపణలు కూడా వున్నాయి. వాగ్ధాటి లేదు. ఇప్పటిదాకా ఉపయెన్నికలు గెలవలేకపోయాడు. కొన్ని స్థానాల్లో అభ్యర్థుల ఎంపికలో పొరబాట్లు చేశాడు. అసమ్మతివాదులను బుజ్జగించడం రాదు. అలా అని వాళ్లను అణచ లేడు కూడా.

ఇక పిసిసి అధ్యక్షుడు బొత్స వున్నాడు. అంతకుముందు వున్న డి శ్రీనివాస్ కంటె చురుకైన వాడని పేరు తెచ్చుకున్నాడు. కోస్తా ప్రాంతానికి చెందినవాడైనా రాష్ట్ర విభజనకు అనుకూలంగా మాట్లాడడం చేత తెలంగాణవారి అభిమానాన్ని చూరగొన్నాడన్న ప్రచారం జరిగింది. నోరు పెద్దది. డబ్బు బాగా వుంది. తన జిల్లాలలో  నయాన్నో, భయాన్నో కాంగ్రెస్‌ను గెలిపించగల సత్తా వుంది. ఇక నెగటివ్ సైడ్ చూస్తే – అవినీతి ఆరోపణలు పుష్కలంగా వున్నాయి. ముఖ్యంగా లిక్కర్ డాన్‌గా! చట్టాలను, నియమాలను లక్ష్యపెట్టనట్టు కనబడతాడు.  చేసినదానికి విచారం వ్యక్తపరచకపోగా తప్పేముంది? అని వాదించే రకం. సిఎం కుర్చీపై కన్నేసి వున్నాడని, సిఎంను లక్ష్యపెట్టటం లేదని బాహాటంగా అందరూ గుర్తించే విధంగా ప్రవర్తిస్తాడు. ప్రభుత్వపరమైన నిర్ణయాలు తనే ప్రకటించేసి, కిరణ్‌ను చులకన చేస్తుంటాడు. జగన్‌ను రెచ్చగొట్టి దాని ఫలితాలు కిరణ్ అనుభవించేట్లా చూడాలని ప్రయత్నిస్తూంటాడు. మంత్రిత్వశాఖను సమర్థవంతంగా నిర్వహిస్తున్న దాఖలాలు లేవు. తెలంగాణలో ఉపయెన్నికలు జరిగినప్పుడు తెలంగాణ కాంగ్రెస్ నాయకులు ఒళ్లు వంచి పనిచేసేట్లా ఏమీ చేయలేదు. అక్కడ ఓటమికి సిఎంను బాధ్యుణ్ని చేద్దామని అనుకున్నట్టే కనబడింది. ఇప్పుడు కోస్తా, సీమల్లో కూడా అదే జరగాలని ఆశపడుతున్నట్టుంది. పార్టీ తరపున ఉధృతంగా కార్యక్రమాలు చేపట్టినట్టు ఏమీ లేదు.

మూడో వ్యక్తి డిప్యూటీ సిఎం దామోదర రాజనరసింహ – మొన్నటిదాకా గుంపులో గోవింద. కులసమీకరణంలో గీతా రెడ్డిని పక్కకు పెట్టడంతో ముందుకు వచ్చినవాడు. పరిపాలనా దక్షత కానీ, నాయకత్వ దక్షత కానీ వున్నట్టుగా ఎక్కడా నిరూపించబడలేదు. వెనక్కాల అరడజను మంది ఎమ్మెల్యేలు వున్న దాఖలా కూడా లేదు. తెలంగాణ నాయకులందరినీ అదుపు చేయగల సత్తా కూడా లేదు. తెలంగాణ ఉపయెన్నికలలో కాంగ్రెస్‌ను గెలిపిస్తా అని బాధ్యత తీసుకుని ఒక్క స్థానమైనా గెలిచి చూపించలేదు. రేపు పరకాలలో కూడా అలాటి ఛాలెంజ్ తీసుకోవడానికి రెడీగా లేడు. కిరణ్‌ను మారుస్తారేమో, ప్రాంత ప్లస్ కులసమీకరణలలో డిప్యూటీ సిఎంగా రాగా లేనిది, సిఎం పదవి కూడా రాకపోతుందా అనే ఆశతో కిరణ్‌కు వ్యతిరేకంగా గ్రూపు కడుతున్నాడు తప్ప వేరే అర్హతలు కనబడటం లేదు. బొత్స చేతులు కలపడం కిరణ్‌కు గోతులు తీయడానికే తప్ప, అతను గోతిలో పడ్డాక వీళ్లిద్దరూ ఒకరినొకరు తోసుకోవచ్చు. రాష్ట్రం మొత్తం తెలిసున్న వ్యక్తి కాదు. జగన్‌తో తలపడదగ్గ వ్యక్తీ కాదు.

ఇక యితర నాయకుల్ని చూడబోతే – తెలంగాణ ఎంపీలు ఎవరి మాటా వినేట్టు లేరు. ముఖ్యంగా అయిదారుగురు పార్టీని వదిలేట్టు వున్నారు. వాళ్లు తెలంగాణ  ఉపఎన్నికలలో శల్యసారథ్యం చేస్తున్నారు. మేం ఓడిపోతాం, పోటీ చేయడం వేస్టు అని ప్రకటించి కార్యకర్తల స్థయిర్యాన్ని నీరు కారుస్తారు. తాము ప్రచారానికి వెళ్లరు. తమ వాళ్లను పంపరు. ఓడిపోగానే మాత్రం ఢిల్లీకి వచ్చి కూర్చుని – 'ఈ సిఎం వేస్టు. ఉపయెన్నికలలో గెలిపించలేకపోయాడు' అంటారు. తెలంగాణ యిస్తే 90% సీట్లు మనవే అంటారు. 'కోస్తా, సీమల్లో ఏమయినా ఫర్వాలేదని రిస్కు తీసుకుని మనం యిచ్చినా ఆ క్రెడిట్ తెరాసకు పోతే ఎలా?' అని హై కమాండ్ అడిగితే 'అబ్బే, తెలంగాణ యివ్వగానే తెరాస కాంగ్రెస్‌లో విలీనం ఖాయం' అంటారు. కెసియార్ అలా రాసి యిస్తారా? అంటే తెలంగాణ యిస్తామని మీరు రాసివ్వండి అంటారు.

కెసియార్ లాటి వాణ్ని ఎలా నమ్మగలం? అంటే వీళ్ల దగ్గర సమాధానం లేదు. (వాయలార్ దగ్గర కూడా వాళ్లు యివే వాదనలు వినిపించారు. 'కెసియార్‌తో టచ్‌లో వున్నాం. 90% మన పార్టీలో చేరిపోయినట్టే అన్నారు'ట. విపక్షనేత, కాంగ్రెస్‌ను ఎన్నికల్లో చెడామడా ఓడించేస్తూ వున్నవాడితో టచ్‌లో వుండడమేమిటి? ఆయన కాంగ్రెస్ వాళ్లను దద్దమ్మలు, చవటలు అంటున్నాడు, కాంగ్రెస్‌కో ఖత్మ్ కరో, తెలంగాణ హాసిల్ కరో అనే నినాదం యిచ్చాడు. అలాటివాడితో మంతనాలేమిటి? కోవర్టులంటే వీళ్లు కాదా? కెసియార్ ఎవరితోనూ పొత్తు నిలుపుకోలేకపోయాడు. కాంగ్రెస్, టిడిపి, బిజెపి.. ఎవరితోనూ నిలవలేదు. కేంద్రంలో ఎన్‌డిఏ సర్కారుకి సపోర్టు యిచ్చి తీరతా అని బాజాప్తా చెపుతూ వుంటే అలాటివాడు వచ్చి కాంగ్రెస్‌లో చేరతాడంటే హై కమాండ్ నమ్ముతుందా? అయినా వీళు
్లు అవే వల్లె వేస్తారు)

తెలంగాణ వాళ్లని సిఎం చేసి చూడండి అని కొందరు కాన్వాస్ చేస్తారు. తెలంగాణ అంతా పాప్యులర్ అయిన కాంగ్రెస్ నాయకుడు ఎవరూ లేరు కదా. జానారెడ్డి పేరు ఎప్పటికప్పుడు ముందుకు వచ్చి వెనక్కి వెళ్లిపోతూ వుంటుంది. ఆయనను హై కమాండూ నమ్మటం లేదు, తెలంగాణ ఉద్యమకారులూ నమ్మటం లేదు. డి శ్రీనివాస్‌ను చూడబోతే పిసిసి అధ్యక్షుడిగా వుండి కూడా రెండు సార్లు ఓడిపోయి సొంత జిల్లాలోనే పేరు పోగొట్టుకున్నారు. కెసియార్‌ను ఢీకొనగల వాగ్ధాటి వున్నవారెవరు? తెలంగాణ వ్యక్తిని సిఎంను చేసినా తెలంగాణ డిమాండ్ ఆగిపోతుందా అంటే దానికీ గ్యారంటీ లేదు. తెలంగాణ వ్యక్తిని పిసిసి అధ్యక్షుణ్ని చేస్తే కాస్త బ్యాలన్స్ అవుతుంది కానీ డి శ్రీనివాస్ అప్పుడు ఆనలేదు. ఇప్పుడు ఆనితే ఆనవచ్చు. కానీ బొత్సను ఊరడించడం ఎలా?

ఇక చిరంజీవి – విగ్రహపుష్టి, నైవేద్యనష్టి అన్నట్టు తయారైంది. మెగా స్టార్ యిమేజితో ఎమ్మెల్యేలను సంపాదించి కాంగ్రెస్‌లో కలిపేయడంతో ఆయన పని అయిపోయింది. ఇకపై ఆయన చేయగల సాహసాలు ఏమీ కనబడటం లేదు. చూడడానికి వచ్చే జనాలు ఓట్లేయరని తేలిపోయింది. కోవూరులో కూడా మ్యాజిక్ ఏమీ పనిచేయలేదు. ఆయన సిఎం కారని తేలిపోవడంతో కనీసం కాపు ఓట్లు సంపాదిస్తారన్న నమ్మకం కూడా లేదు. ఇక్కడే కాదు, యితర రాష్ట్రాలలో కూడా ఆయన తెలుగువాళ్ల ఓట్లు పట్టుకురాలేక పోతున్నాడు.

ఇలా అయితే ఢిల్లీ కాంగ్రెస్‌వాళ్లు ఏం మర్యాద యిస్తారు? క్షేత్రస్థాయిలో చూస్తే కాంగ్రెస్ వాళ్లు వీళ్లను దగ్గరకి రానివ్వటం లేదు. వాళ్లల్లో వాళ్లకే వాటాలు తెగక ఛస్తూ వుంటే మధ్యలో వీళ్లొకళ్లా అని వాళ్ల బాధ. చిరంజీవి తన సంగతే చూసుకున్నారు తప్ప మా గురించి పట్టించుకోలేదని యితర నాయకుల, కార్యకర్తల సణుగుడు. శ్లాబ్ వేసేటప్పుడు సపోర్టు కోసం వాడే గుంజలకు ప్రాముఖ్యత వుంటుంది కానీ శ్లాబ్ నిలిచాక వాటిని తీసి అవతల పారేయమా? అది తెలుసు కాబట్టే చిరంజీవి ఏమీ చేయలేక కూర్చున్నారు. ఢిల్లీనుండి వచ్చినవాళ్లకు తిండి పెట్టి పంపించడం తప్ప ఆయనా నేనూ చేయగలిగేది ఏమీ లేదు.

ఇక లగడపాటి, జెసి, వెంకటేష్ లాటి యితర నాయకుల వలన ఒనగూడేది ఏమీ లేదు. వాళ్లు వాళ్ల జిల్లాలకే పరిమితం. ఎన్నికలలో నాలుగు చోట్లా తిరిగి ఓట్లు సాధించుకుని వచ్చే సత్తా ఎవరికీ లేదు. కేకే, హనుమంతరావు, శంకరరావు లాటి వాళ్ల వలన జరిగే మేలు కంటె కీడే ఎక్కువ. ఇక జిల్లాలలో నాయకుల మధ్య తగాదాలు ఎలాగూ వున్నాయి. నామినేటెడ్ పోస్టులు భర్తీ చేసి వుంటే కొంతమందికైనా ఉత్సాహం వుండేది. అది జరగలేదు. జిల్లా స్థాయిలో కొందరిని తయారు చేసి వుంటే బాగుండేది కానీ ఆ జిల్లా కమిటీ నియామకాలూ చేయలేదు. ఎవరైనా నిలబడి గెలిస్తే అది వారి సత్తా. సోనియా ప్రతిభ కాదు, కిరణ్, బొత్సల గొప్ప కాదు. అలాగే ఓడిపోతే అది వాళ్ల తప్పు తప్ప సోనియా, కిరణ్, బొత్సలకు ప్రమేయం లేదు.

రాష్ట్ర నాయకులందరూ కొట్టుకు ఛస్తున్నారు. ఓ వైపు జగన్ భయం, మరో వైపు తెరాస భయం. పార్టీలో వుంటే లాభమో, బయటకు వెళితే లాభమో తెలియదు. బయటకు వెళ్లినవాళ్లు బావుకుంటారో లేదో తెలియదు. ఇప్పుడు జగన్ వెంట వెళ్లిన అందరూ మళ్లీ ఎన్నికవుతారని ఎవరూ గట్టిగా చెప్పలేరు కదా. ఇద్దరో ముగ్గురో అయినా ఓడిపోవచ్చు. ఎందుకంటే – జగన్‌పై అభిమానం వున్నా తాజా మాజీ ఎమ్మెల్యేల పనితీరు బాగా లేదు అనే ఆన్సర్ వస్తుంది. అధికారానికి దూరంగా వుంటే పనులు ఏం చేయించుకోగలరు?

అందువలన కాంగ్రెస్‌లోనే వుంటూ రోజులు వెళ్లబుచ్చి ఎలక్షన్ల ముందు అప్పటి మూడ్ బట్టి ఏదో ఒక నిర్ణయం తీసుకోవచ్చు. ఈలోగా ఏదో ఒక పదవి సంపాదించుకుంటే బాగుంటుంది. అది యిస్తారా వెళ్లిపోమంటారా అని బెదిరిస్తూంటేనే ఏదైనా లాభం ఒనగూడుతుంది అనుకుని చీటికీ మాటికీ గొడవ చేస్తున్నారు. మధ్యలో పార్టీ యిమేజి సర్వనాశనం అవుతోంది. మీడియా దాన్ని దూది ఏకినట్టు ఏకేస్తోంది. కాంగ్రెస్ పక్షాన వాదనలు సమర్థవంతంగా చేయగలిగేవాళ్లు కూడా వేళ్ల మీద లెక్కించవచ్చు – తులసీరెడ్డి, జంధ్యాల రవిశంకర్.. యిలా ముగ్గురు, నలుగురు మాత్రమే. తక్కినవారందరూ 'సోనియాకు అన్నీ తెలుసు' అనే భజనపరులే.

ఇదీ రాష్ట్ర నాయకుల పరిస్థితి. ఇక రాష్ట్ర పార్టీ వ్యవహారాల ఇన్‌చార్జి విషయం చూడబోతే – వీరప్ప మొయిలీని తీసేసి ఆజాద్‌ను పెట్టినా పనేమీ జరగలేదు. అందర్నీ ఢిల్లీకి రమ్మనడం తప్ప ఆయన సాధించింది లేదు. తెలంగాణ గురించి సమాలోచనలు విడివిడిగా జరపగలిగాడు తప్ప యిరుప్రాంతాల నాయకుల్నీ ఒక చోట సమావేశపరచి ఉభయులకూ అంగీకారయోగ్యమైన ఫార్ములాను రూపొందించ లేకపోయాడు. పరిస్థితిని బేరీజు వేసి కోర్ కమిటీకి రిపోర్టు యిచ్చేశాడు. వాళ్లు ఓ నిర్ణయం తీసుకున్నారు కానీ దాన్ని బయటకు వెల్లడించే ధైర్యం చేయడం లేదు. వెల్లడించకపోతే కొంప మునుగుతుంది అని అధిష్టానాన్ని బెదరగొట్టగల సత్తా అతనికి లేదు.

ఇక్కడ సిఎం, పిసిసి అధ్యక్షుడు, డిప్యూటీ సిఎం, యితర నాయకులు అందరూ కొట్టుకుంటూ వుంటే సమన్వయకమిటీ అని ఒకటి వేయించాడు కానీ అది పని చేయటం లేదు. ఎవరూ వాళ్ల ధోరణి మార్చుకోవడం లేదు. ఈ రాష్ట్ర వ్యవహారాలే చూస్తూ కూచుంటే పని కావటం లేదు. ఈయన వలన ఏమీ కావడం లేదు అని యిక్కడి నాయకులలో అభిప్రాయం ప్రబలింది కాబట్టి అతని విశ్వసనీయత పోయింది. అతను వుండినా వూడినా ఒకటే.

ఇక హై కమాండ్ – ఎన్నో తప్పులు చేసింది. తెలంగాణపై తొందరపాటు నిర్ణయం తీసుకుని, కాలు వెనక్కి తీసుకోవడానికి యిరుప్రాంతాల నాయకులనూ రెచ్చగొట్టి, సమస్యను జటిలం చేసి, దాన్ని చల్లార్చడానికి శ్రీకృష్ణ కమిటీ వేసి, మళ్లీ ఆ రిపోర్టును అమలు చేయకుండా చర్చలు చర్చలు అంటూ వాయిదాలు వేసి వేసి విశ్వసనీయత పోగొట్టుకుంది. ఈ జనవరిలోనే తెలంగాణ యివ్వకూడదని నిర్ణయం తీసుకుందని అంటారు. కానీ అది పైకి చెప్పే ధైర్యం లేదు. తన పార్టీ వాళ్లే పార్లమెంటులో అల్లరి చేసినా అదుపు చేసే శక్తి లేదు.

ఇక జగన్ విషయంలో చెప్పుడు మాటలు విని జగన్ శక్తిని తక్కువగా అంచనా వేసింది. అతను ఓదార్పు యాత్రకు వెళతానంటే అది ఒక పెద్ద అంశంగా పరిగణించి నాయకుడిగా ఎదగకుండా చూడాలని చూసింది. చివరకు బయటకు వెళ్లాక అతన్ని ఎలా అదుపు చేయాలో తెలియక బుర్ర బద్దలు కొట్టుకుంటోంది. అతన్ని ఎదుర్కోగల నాయకుడి కోసం అన్వేషిస్తోంది. వైయస్ పోయాక కిరణ్ వంటి యువకుణ్ని సిఎంను చేసి రోశయ్యను ఆర్థికమంత్రిగా కంటిన్యూ చేసినా బాగుండేది. ఆసక్తి లేని రోశయ్యను చేసి, ఆ తర్వాత తీసేసి, ఏ మాత్రం అనుభవం లేని కిరణ్‌ను పెట్టి, జగన్‌ను రెచ్చగొట్టి, కిరణ్‌ను యిప్పుడు ఎలా తీయాలో తెలియక అవస్థ పడుతోంది.

ఇక వైయస్ విషయంలోనైతే హై కమాండ్ తప్పులు ఒకటి కాదు, రెండు కాదు. వైయస్ పార్టీకి ఎస్సెటో, లయబిలిటీయో తేల్చుకోలేకపోయింది. వైయస్ వల్లనే 2009 ఎన్నికల్లో విజయం సిద్ధించింది అంటే సోనియాకు అహం పొడుచుకు వచ్చింది. వైయస్ పోగానే హై కమాండ్ అతని జ్ఞాపకాలను తుడిచి వేద్దాం అనుకుంది. వైయస్ మరణం తర్వాత వేలాది మంది పోయారంటే నమ్మను పొమ్మంది. జగన్ ఓదార్పు అంటూ డబ్బులు పంచిపెట్ట నారంభించగానే, అతనికి ఆ క్రెడిట్ పోకూడదు అనుకుంటూ, వైయస్ హతుల లిస్టు అంటూ జిల్లాల వారీగా తయారుచేసి మేమే డబ్బు యిస్తాం అంది. అంది కానీ యివ్వలేదు.

ఆ విధంగా విశ్వసనీయత పోగొట్టుకుంది. వైయస్ పథకాలు కాంగ్రెస్ పథకాలే అంది. వైయస్ ఒక సైనికుడే తప్ప అతనికి గైడెన్సు యిచ్చింది మేమే అంది. ఏం చెప్పినా జనాల నుండి వైయస్ యిమేజి చెరగకపోవడంతో వైయస్ అవినీతిపరుడన్న ప్రచారాన్ని టిడిపినుండి అరువు తీసుకుంది. వైయస్‌ను తిట్టిన వారికి మంత్రి పదవులిచ్చింది. ప్రజల్లో వైయస్‌ను అవినీతిపరుడుగా ముద్ర కొట్టేస్తే అటు జగన్‌కి నిలువనీడ లేకుండా జరుగుతుంది. తాము ప్రతిష్ఠాపించిన డమ్మీని వైయస్ స్థానంలో పెట్టేయవచ్చనుకుంది. శంకర్రావు చేత ఉత్తరమ్ముక్క రాయించి న్యాయవ్యవస్థలో, సిబిఐలో కొందరి సహకారంతో జగన్‌పై కేసులు పెట్టించి విచారణ మొదలు పెట్టించింది.

అయితే ఆ విచారణ అలా తిరిగి యిలా తిరిగి ప్రస్తుత మంత్రులను, అధికారులను చుట్టుముట్టింది. శంకర్రావు వైయస్‌తో ఆగలేదు. హనుమంతుల వారిలా లంకంతా అంటించాడు. ఇక అతన్నే వదిలించుకోవాల్సి వచ్చింది. అలాగే డియల్‌కి తోక కత్తిరించాల్సి వచ్చింది. కాబినెట్ వైయస్ కాలం నాటి మంత్రులు, కిరణ్ కాలం నాటి మంత్రులుగా విడిపోయింది. వైయస్‌ను తిడదామని వీళ్లు, వద్దని వాళ్లు. ఎగదీస్తే గోహత్య, దిగదీస్తే బ్రహ్మహత్య అన్నట్టు వైయస్‌ను తిడితే ఆత్మహత్య, తిట్టకపోతే జగన్ చేత హత్య అన్నట్టు తయారైంది వ్యవహారం.

జగన్‌ను ఎదుర్కోవాలంటే సిఎం గట్టిగా వుండాలి. అతను గట్టి పడకుండా బొత్స తెగ ప్రయత్నిస్తున్నారు. అతనిపై కిరణ్ ఫిర్యాదు చేసి చేసి చివరకు తన ఎత్తులు తనే మొదలు పెట్టాడు. పిసిసి అధ్యక్షుణ్ని టార్గెట్ చేయడానికి ఎసిబిని ఉసికొల్పాడు. ఎసిబి స్వైరవిహారం చేసేసింది. ఆ పార్టీ, యీ పార్టీ అని లేకుండా అన్ని పార్టీల విషయాలూ బయటపెట్టేసింది. ఇసుక మాఫియా, లిక్కర్ మాఫియా అంటూ సమాజంలో అన్ని వర్గాల వారూ, అన్ని శాఖలవారూ, అన్ని పార్టీలవారూ యిరుక్కున్నారు. అందరికీ కిరణ్‌పై అర్జంటుగా కోపం వచ్చేసింది. దాన్ని బొత్స తనకు అనువుగా వాడుకుందామని చూస్తున్నాడు.

మీడియా సహాయంతో సిఎంపై ధ్వజం ఎత్తాడు. అధిష్టానం మేల్కొంది. బొత్స కోరిక మేరకు ఎసిబికి కళ్లెం వేసి, చల్లార్చి పంపింది. కిరణ్ వెనక్కి తగ్గినట్టే తగ్గి మళ్లీ ఎసిబిని గిల్లాడు. తన సంగతి ఎలా వున్నా బొత్సను పూర్తిగా అప్రతిష్టపాలు చేసి అతను సిఎంగా రాకూడదన్న పట్టుదలతో వున్నాడు. బొత్సను సిఎం చేసిందంటే కాంగ్రెస్ అవినీతిని ప్రోత్సహిస్తోందన్న ప్రచారం ప్రజల మెదళ్లల్లో ఘాటుగా నాటుకుపోతుందని అతని ప్లాను.

ఇలాటి యిమేజితో జగన్‌ను వాళ్లు ఎదిరించగలరా? ముఖ్యంగా 18 ఉపయెన్నికలు ఎదురుగా వుండగా! నెల్లూరు పార్లమెంటు స్థానంలో వున్న 6 ఎసెంబ్లీ సెగ్మెంట్లు కూడా కలుపుకుంటే మొత్తం 24 అసెంబ్లీ స్థానాలలోని ప్రజలు యిచ్చే తీర్పు బట్టి భవిష్యత్తు ప్రభావితం అవుతుంది. కాంగ్రెస్ పని అయిపోయింది అని ప్రజలు అనుకుంటే ముప్పు. దాన్ని నివారించాలి. నిజానికి అన్ని సీట్లూ పోగొట్టుకున్నా ప్రభుత్వానికి ముప్పు లేదు. కానీ అది పంపే సంకేతం ప్రమాదకరమైంది. అందువలన ఏదో ఒక వుపాయం చేయాలి.

– ఇదండీ కాంగ్రెసు మీ ముందు పెట్టిన కేసు షీటు. లోకల్ ఆర్ఎంపీ నుండి ఢిల్లీ ఎయిమ్స్ వైద్యుల దాకా అందరూ తలో చేయి వేసి రోగి శరీరాన్ని కుళ్ల బెట్టేశారు. దీనికి కాయకల్ప చికిత్స చేయాలి. ఏం లాభం లేదు, మార్చురీకి తరలించేయండి అని పెదవి చప్పరించేస్తే మీకు యింకో కేసు రాదు. ఏదో ఒకటి ప్రయత్నం చేసి తీరాలి. అది ఎంతవరకు పనిచేస్తుందో ఎప్పటికప్పుడు చూసుకోవాలి. అంతే కదా. ఇప్పుడు మీరు ఏం చేస్తారు?

అన్నిటికంటె ముందుగా నాకు పెథాలజీ రిపోర్టు కావాలంటారు. లాబ్‌లో అన్ని టెస్టులూ చేయించి పట్టుకు రండి, అప్పుడు డయాగ్నయిజ్ చేస్తాను అంటారు. ఆ తర్వాతే వైద్యం అంటారు. ఆజాద్ గారి పాత రిపోర్టులు సిద్ధంగా వున్నాయని హై కమాండ్ అంటుంది. ఆ ల్యాబ్‌పై నాకు నమ్మకం లేదు. కొత్త ల్యాబ్ టెక్నీషియన్ కావాలి. అతని పంపించి రక్తం శాంపుల్స్ పట్టుకు రమ్మనమండి అంటారు. ఆజాద్ చాలాకాలంగా ఆంధ్రప్రదేశ్ నాయకులతో పూరేగాడు కాబట్టి లింకులు ఏర్పడి, తప్పుడు రిపోర్టులు యిచ్చి వుంటాడు. నాకు ఫ్రెష్ టెక్నీషియన్ కావాలి. అలా అని అక్కడి పరిస్థితులు బొత్తిగా తెలియనివాడు కాదు, పాతపరిచయాలు వుండాలి కానీ మరీ ఎక్కువ వుండకూడదు అంటారు మీరు. వాయిలార్ రవిని పంపండి అంటారు.

ఇంత హంగామా అవసరమా అని హై కమాండ్‌కు అనుమానం వచ్చింది. ఓ సారి కెబి కృష్ణమూర్తిని పంపించి చూసి రమ్మనమంది. ఆయన వచ్చి రోగి కోలుకోలేని పరిస్థితిలో వున్నాడు. ఖర్చుకి ఆలోచించకండి. మళ్లీ పరీక్షలు పెట్టండి అని సలహా యిచ్చాడు. చూశారా మరి అంటారు మీరు. హై కమాండ్‌కి మీ సలహా పాటించక తప్పలేదు. ఆ విధంగా వాయిలార్ రవి మన రాష్ట్రానికి వచ్చారు. పైన వూహించినట్టు మీరో నేనో సలహా యివ్వకపోయినా కాంగ్రెస్ పక్షాన్నుండి ఆలోచిస్తే – వాళ్లు చేసినది అత్యంత తెలివైన పని. వాయలార్ రవి తనే వెళ్లి అందర్నీ కలిసి మాట్లాడాడు. పాత పొరబాట్లతో తనకు సంబంధం లేదు కాబట్టి, జరిగినవన్నీ ఏకరువు పెట్టాడు. సోనియాకు తను చేసినవాటి పర్యవసానాలన్నీ అర్థమై వుంటాయి.

వాయలార్ రిపోర్టు యిచ్చిన మర్నాడే పేపర్లలో 'నాయకత్వం మార్చమన్నాడ'ని వార్తలు వచ్చాయి. అవి నేను నమ్మను. అంత త్వరగా లీకులు వస్తాయా? సోనియా ఆ రిపోర్టు చదవాలి. ఆత్మీయులతో కూచుని చర్చించాలి. వారిలో ఒకరు పేపర్లకు లీక్ చేయాలి. సిఎం, పిసిసి ప్రెసిడెంట్లను వెంటనే మార్చాలని రవి రిపోర్టు యిచ్చి వుండకపోవచ్చు. సిఎంను మారిస్తే నాలుగో కృష్ణుణ్ని వెతకడం ఓ సమస్య. నేనంటే నేనంటూ కులాలు, ప్రాంతాలు ముందుకు తెస్తారు. దక్కనివారు అసమ్మతివాదులవుతారు. ఎందుకొచ్చిన తలకాయనొప్పి ! ఉపయెన్నికల తర్వాత చూసుకోవచ్చు అని వాయిదా వేస్తారు.

ఇక పిసిసి అధ్యక్షుడు – సిఎంను బలోపేతం చేయాలంటే తీసేయాలి. కానీ యిప్పుడు తీసేస్తే అతనికి లిక్కర్ మాఫియాతో సంబంధం వుందని హై కమాండ్ బాహాటంగా ఒప్పుకున్నట్టు అవుతుంది. ఎసిబి రిపోర్టు పెరిగి పెద్దదై సిబిఐ దాకా వెళ్లి అతన్ని అరెస్టు చేసే పరిస్థితి వస్తే అప్పుడు హై కమాండ్ ఆ కారణంగా తీసేయవచ్చు కానీ అప్పటిదాకా అతని జోలికి పోదు. ఉపయెన్నికలలో గెలిచి చూపిస్తే మార్చం లెండి అని చెప్పి వెళ్లి వుంటారు. నిజానికి ఉపయెన్నికలలో గెలిపించవలసినవారు కార్యకర్తలు. వారిని హుషారు చేయడమే ప్రధాన కర్తవ్యం అని వాయలార్ రిపోర్టు రాసి వుంటారు. వారిలో చైతన్యం తేవాలంటే స్థానిక ఎన్నికలు జరగాలి. చిన్నచిన్న ఎన్నికలు జరిగితే కాస్త హుషారు వస్తుంది. క్రింది స్థాయిదాకా పనిచేస్తారు. ఉపయెన్నికలైతే ఆ 18 నియోజకవర్గాలలో వాళ్లకే ఉత్సాహం. స్థానిక ఎన్నికలైతే రాష్ట్రమంతా ద్రవం, ద్రవ్యం పారతాయి. ఆ తర్వాత ఉపయెన్నికలు వస్తే సిద్ధపడతారు.

నిజానికి ఉపయెన్నికలకు వెళ్లడానికి కాంగ్రెస్‌కు ఏ మాత్రం ఉబలాటం లేదు. ఎందుకంటే యీ స్థానాల్లో జగన్‌కి బలం బాగా వుందన్న లెక్క మీదే కదా అక్కడి లెజిస్లేటర్లు రాజీనామా చేసినది! అందువలన కాంగ్రెస్‌కు అవి కష్టపడాల్సిన స్థానాలే. అందరూ కలిసి బాగా శ్రమిస్తే వాటిల్లో ఫైనల్‌గా ఏ 15%, లేదా 20% సీట్లు మాత్రం దక్కవచ్చు. అదే స్థానిక ఎన్నికలైతే 30% సీట్లవరకు గెలవవచ్చు. ఎందుకంటే జగన్ ప్రభావం వున్న ప్రాంతాలతో బాటు లేని ప్రాంతాలు కూడా వుంటాయి. ఎన్నికల ఫలితాలు కాస్త మర్యాదగా వుంటాయి. 'ఇక యీ ప్రభుత్వం పని అయిపోయింది' అనే సంకేతం వెళ్లదు.

పైగా ఉపయెన్నికలు జూన్‌లో వస్తాయి. అంటే మే చివరివారాల్లో, మంచి ఎండల్లో ప్రచారం జరుగుతుంది. అసలే వేసవి తీవ్రంగా వుంది, నీటి కొరత, విద్యుత్ కొరత. చెమటలతో చికాకుచికాకుగా వున్నపుడు ప్రభుత్వానికి ఎవరైనా అనుకూలంగా ఓటేస్తారా? 2004లో చంద్రబాబుకి యిదే జరిగింది. టిడిపికి వడదెబ్బ కొట్టింది. అందువలన 2001 జనాభా లెక్కలతోనే స్థానిక ఎన్నికలు జరుపుతామని కోర్టును వేడుకుంటోంది. అయినా ఉపయెన్నికలను త్వరగా జరిపితే కాంగ్రెస్‌కు ఏం లాభం? రాష్ట్రపతి ఎన్నికలలో వీళ్లు ఓటేయగలరు అంటే – గెలిచేవారిలో చాలామంది ప్రతిపక్షం వాళ్లయినప్పుడు వీళ్లు ఓటు వేయకపోతేనే కాంగ్రెస్‌కు మంచిది. ఇప్పుడు అడావుడిగా ఎన్నికలు జరిపేసి వాళ్లు బావుకునేది ఏముంది?

పైగా ఆలస్యం చేసిన కొద్దీ సెంటిమెంట్లు తగ్గుతాయి. తెలంగాణ సెంటిమెంటులో 2010కి, 2012కి తేడా చూశాం. తెరాస మార్జిన్లు తగ్గిపోయాయి. అలాగే జగన్ కెరటం కూడా యిదివరకంత ఉధృతంగా లేదు. పులివెందుల తరహా మార్జిన్ వస్తుందని ఎవరూ అనుకోలేదు కానీ కోవూరులో హీనపక్షం 35 వేలైనా వస్తాయని వైయస్సార్పీలో అత్యంత నిరాశావాదులు కూడా భావించారు. దానిలో మూడింట రెండువంతులు వచ్చింది. సమయం గడుస్తున్నకొద్దీ మార్పులు వస్తాయి. కొత్తకొత్త అంశాలు ముందుకు వస్తాయి. ఈ కారణాల వలన ఉపయెన్నికలు యిప్పట్లో జరగకుండా చూద్దామని కాంగ్రెస్ ప్రయత్నించింది కానీ ఎన్నికల కమిషనర్ ససేమిరా అన్నాడు. దాంతో ఉపయెన్నికలు ప్రకటించబడ్డాయి.

ఇలాటి పరిస్థితుల్లో ఉపయెన్నికలలో నెగ్గడం అత్యవసరం అయిపోయింది. స్థానిక ఎన్నికలు జరిగినా పార్టీ చైతన్యవంతం అయేది. తనిచ్చిన రోడ్ మ్యాప్ ఎక్కడో పారేశారని ఆజాద్‌గారు కోప్పడ్డారు. కార్యాచరణ ప్రకటించడమే తప్ప చేసేవాడు ఎవడూ లేడు. మీడియాలో రెచ్చిపోయే నాయకులు ఎక్కువై పోయారు తప్ప యింటింటికి తిరిగే కార్యకర్తలు కరువయ్యారు. ఇంటింటికి తిరిగి ప్రచారం చేస్తే తప్ప గెలవలేం అని చెపుతూండే కాంగ్రెస్ నాయకులెవరూ స్వయంగా యిళ్లిల్లూ తిరగరు. ఢిల్లీ చుట్టూ తిరుగుతారు. అదీ అందరూ కలిసి వెళ్లరు విడివిడిగా వెళ్లి యితరుల మీద ఫిర్యాదు చేసి వస్తారు. ఎవరికి వారే యమునాతీరే అని కృష్ణుడి చుట్టూ వున్న గోపికలను ఉద్దేశించి అన్నారో, ఢిల్లీలో అపాయింట్‌మెంట్లు అడిగేవారిని చూసి అన్నారో తెలియదు.

ఏది ఏమైనా ఏదో ఒకటి చేసి, కోస్తా, సీమల్లో గెలవాలి, మర్యాద దక్కదన్న భయం పట్టుకుంది. సెంటిమెంటు మీదనే రాజకీయాలు నడుస్తున్నాయని వాళ్లు అనుకుని మనల్నీ అనుకోమంటారు. తెరాస గెలిస్తే తెలంగాణ సెంటిమెంటు అంటారు. మరి పాలమూరులో తెరాస ఓడితే..? అదీ సెంటిమెంటే! జగన్ గెలిస్తే వైయస్ సెంటిమెంటుట...! అనుకున్నంత మెజారిటీ రాకపోతే అప్పుడేం సెంటిమెంటుట? పరిపాలన సవ్యంగా అఘోరిస్తే ఏ సెంటిమెంటూ అక్కరలేదు. దాన్ని పక్కన పెట్టి ఆలోచిస్తేనే యీ తంటాలు. ఇంతకీ కోస్తా, సీమల్లో

సమైక్యాంధ్ర సెంటిమెంటుతో గెలిచేద్దామని అనుకుంటున్నట్టు కనబడుతోంది.

అందుకే జగన్ గెలిస్తే రాష్ట్రం విడిపోతుంది అని గోల మొదలుపెట్టారు. వాళ్ల లాజిక్ ఏమిటంటే – తెలంగాణలో గెలుపు ఎలాగూ లేదు కదా, కనీసం కోస్తా, సీమల్లో గెలవాలనే కోరికతోనే కాంగ్రెస్ తెలంగాణ యివ్వకుండా ఆపిందట. అక్కడి ప్రజలు కూడా కాంగ్రెస్‌ను గెలిపించకుండా జగన్‌ను గెలిపిస్తే కాంగ్రెస్‌కు వైరాగ్యం వస్తుందట. ఇక్కడ ఎలాగూ గెలవలేం, కనీసం తెలంగాణ యిస్తే పదో, పరకో సీట్లు అక్కడైనా వస్తాయని అనుకుంటుందట. అందువలన రాష్ట్రాన్ని పరపరా, సరసరా చీల్చేస్తుందట. దాన్ని నివారించాలంటే, సమైక్యవాదులందరూ కాంగ్రెస్‌ను గెలిపించి తీరాలట. లేకపోతే వాళ్ల గొయ్యి వాళ్లే తీసుకున్నట్టట.

మరి నాకు తెలియక అడుగుతాను – 2009 ఎన్నికల్లో కూడా కోస్తా, సీమల్లో కాంగ్రెస్‌ను గెలిపించారు కదా, అసెంబ్లీ సీట్ల కంటె పార్లమెంటు సీట్లలో మరింత ఉధృతంగా ఓట్లేసి 21 మందిని పార్లమెంటుకి పంపి యుపిఏ 2 ఏర్పడడానికి దోహదపడ్డారు కదా. అయినా వీళ్లెవరినీ సంప్రదించకుండా డిసెంబరు 9 ప్రకటన వెలువడిందేం? అప్పుడు కాంగ్రెస్‌కు యిక్కడ మళ్లీ గెలుద్దామనే ఊహ పోలేదా? కోస్తా, సీమలకు తిలోదకాలు యిచ్చేసుకునే తెలంగాణ ప్రకటన చేసిందా? అంటే వాళ్లకు యిష్టం వచ్చినట్టు, యిష్టం వచ్చినపుడు ఏదో ఒకటి చేస్తారు. రాష్ట్రాన్ని సమైక్యంగా వుంచుకోవలసిన భారం మనదన్నమాట. దానికోసం చచ్చినట్టు కాంగ్రెస్‌ను గెలిపించాలన్నమాట. వారెవ్వా !

పార్లమెంటులో తెలంగాణ కాంగ్రెస్ ఎంపీలు 8 మందిని సస్పెండ్ చేశారు. వాళ్లు గతంలోకూడా యిలాగే పార్లమెంటును అడ్డుకున్నారు. అప్పుడు సస్పెండ్ చేయకుండా అధిష్టానం ఆగింది. వీళ్లకు నచ్చచెప్పి కొన్నాళ్లు ఆపారు. ఇప్పుడు మళ్లీ మొదలుపెట్టారు. ఈసారి సస్పెండ్ చేశారు. ఎన్నాళ్లు చేస్తారు? చేసినంతమాత్రాన వీళ్లు మానతారా? తెలంగాణ యివ్వకపోతే 2014లో కాంగ్రెస్ తరఫున పోటీ చేయనని గుత్తా అంటున్నారు. వీళ్ల సస్పెన్షన్‌ను తొలిరోజు తెరాస ఖండించింది. మర్నాటికల్లా డ్రామా అంది, మధ్యలో ఏం సమాచారం అందిందో ఏమో! బిజెపి యిత్యాదులు మౌనంగా ఆమోదించాయి. తెలంగాణ గురించి మరీ అతిగా చేస్తున్నారని అనుకున్నాయో ఏమో, లేకపోతే యిది కాంగ్రెసు డ్రామా అని వాళ్లు అనుకున్నారేమో!

ఈ టీకాంగ్రెస్ ఎంపీలు యిలా ఎన్నాళ్లు చేసినా ఏం లాభమో నాకు తెలియదు. వీళ్లు పార్టీలోంచి బయటకు రారు, వాళ్లు పంపరు. తెలంగాణపై వాళ్లు తేల్చరు, వీళ్లు విడవరు. విడవకుండా పోరాడుతున్నారు కదాని జనాలు జాలి చూపరు, వీళ్లను నమ్మరు. వీళ్లకు కాంగ్రెస్ గొడుగు నీడా కావాలి, తెలంగాణ వీరులుగా పేరూ కావాలి. అదెలా కుదురుతుంది? ధైర్యం వుంటే తెరాసలోకి వెళ్లాలి. లేదా తెలంగాణ పేర వేరే పార్టీ పెట్టుకుని బిజెపితో పాటు వీళ్లూ తెరాసతో పోటీ పడాలి. అప్పుడు ఓటరుకు ఎటు చూసినా తెరాస, బిజెపి, సిపిఐ, తెలంగాణ కాంగ్రెస్ యిలా.. తెలంగాణ వాదమే కనబడుతుంది. ఎవరో ఒకరికి వేస్తాడు. జగన్ మాటేమిటి అంటారా? సాలార్‌జంగ్ మ్యూజియంలో బొమ్మలా ఆయనకు రెండు వైపులా ముఖాలున్నాయి. కొందరికి సమైక్యవాదిగా తోస్తాడు, మరి కొందరికి ప్రత్యేకవాదాన్ని గౌరవించే వ్యక్తిగా తోస్తాడు. ఇంతకీ ఎవరు స్వామీ తమరు? అని అడిగితే ఢిల్లీ వైపు చూపుతాడు. తక్కిన విషయాలన్నిటిలో స్వాతంత్ర్యం చూపుతాడు కానీ యీ విషయంలో మాత్రం ఆలోచనను ఢిల్లీకి అప్పగించేసి కూర్చున్నాడు.

ఇంతకీ యీ సస్పెన్షన్ అంతా కోస్తా, సీమల్లో గెలుపు కోసమే హై కమాండ్ ఆడిస్తున్న నాటకం అంటున్నారు. అబ్బే అదేం కాదు, పాలమూరులో బిజెపి గెలుపు తర్వాత మజ్లిస్ ఉలిక్కిపడింది, సంగారెడ్డిలో, పాతబస్తీలో జరిగిన మతకల్లోలాలకు బిజెపి గెలుపుకి ముడి పెట్టి యుపిఏను హెచ్చరిస్తోంది. అందుకే యుపిఏ నిజంగానే ప్రత్యేకవాదాన్ని నియంత్రిస్తోంది అంటున్నారు కొందరు. వీళ్లను సస్పెండ్ చేయడంతో బాటు హై కమాండ్ వారు తెలంగాణపై తేల్చాల్సింది దేశంలోని మొత్తం అన్ని పార్టీలూ తప్ప కాంగ్రెస్ ఒక్కటే కాదు, తెలంగాణయే కాదు దేశంలో చాలా సమస్యలున్నాయి అనే పాత పాట మళ్లీ మొదలుపెట్టారు. మళ్లీ నాలుగురోజుల్లో నెలాఖర్లో చిదంబరం ప్రెస్‌మీట్‌లో దీన్ని గురించి ఎవరో అడక్క మానరు, ఆయన చికాకు పడక మానడు.

నా మట్టుకు నాకు 8 మంది సస్పెన్షన్ వాళ్లంతా కలిసి ఆడుతున్న డ్రామా అనిపించడం లేదు. నిజంగానే వీళ్లు ఏదో చేయబోయారని, అది బెడిసి కొట్టిందనీ అనుకుంటున్నాను. హై కమాండ్‌ను యిరకాటంలో పెట్టినట్టు చూపితే తమ నియోజకవర్గంలోని ప్రజలు మెచ్చుకుంటారని అనుకుంటున్నారు పాపం. వీళ్లను మిస్‌గైడ్ చేయడానికి అక్కడ కేకే ఎలాగూ ఖాళీగా వున్నారు. ఆయన దుందుడుకుగా వెళ్లి, ఛాలెంజ్‌లు చేసి రాజ్యసభ సభ్యత్వాన్ని పోగొట్టుకున్నాడు. వీళ్లు ఆయన పంచన చేరారు. పెళ్లి చేసుకుని ఓ చుప్పనాతి వితంతువును ఆశీర్వదించమంటే 'నాలాగే కలకాలం జీవించమంద'ట. కేకేగారు వీళ్ల సభ్యత్వాలు కూడా వూడగొట్టేదాకా వూరుకునేట్టు లేరు. వీళ్లు సస్పెండ్ అయి జాతీయస్థాయిలో గుర్తింపు తెచ్చుకున్నారు, బాగానే వుంది. కానీ వీళ్ల నియోజకవర్గాలలో వీరికి మద్దతుగా ఊరేగింపులు, జనాలు వీధుల్లోకి వచ్చి మద్దతు పలకడాలు జరిగాయా? లేదే ! ఇప్పటికిప్పుడు వీళ్లు రిజైన్ చేసి యిండిపెండెంటుగా నిలబడితే నెగ్గుతారని ఎవరైనా పందెం కాయగలరా? అబ్బే !

ఒక్కసారి యీ వ్యాసపరంపర శీర్షిక కేసి చూడండి. కాయకల్ప చికిత్స అనగానే అందరూ కిరణ్, బొత్స, రాజనరసింహ, కోస్తా , సీమ నాయకుల గురించే ఆలోచిస్తున్నారు. కాస్త చూపు యిటు తిప్పితే యీ 8 మంది తెలంగాణ ఎంపీలకు కూడా అదే చికిత్స జరుగుతోందనీ, దానిలో భాగమే యీ సస్పెన్షన్ అనీ అర్థమవుతుంది! (సమాప్తం) **– ఎమ్బీయస్ ప్రసాద్ (ఏప్రిల్ 2012)**

**ఏప్రిల్ 21** **ఎమ్బీయస్ : కిరణూ – కులపక్షపాతమూ**

ఎందుకోగాని ఆంధ్రజ్యోతి యీ విషయంలో ఓ ఉద్యమం నడుపుతోంది. రాధాకృష్ణగారు ఆర్కే పేరుతో రాసే వ్యాసాల్లో కానీ, వారు వండి వార్చే కథనాల్లో కానీ కిరణ్ రెడ్ల పట్ల వలపక్షంతో వ్యవహరిస్తున్నారని, దాని పట్ల హై కమాండ్ అసంతృప్తితో వుందనీ, రాస్తూ వచ్చారు. రాష్ట్రపరిస్థితిపై గవర్నరు యిచ్చిన నివేదికలో కిరణ్‌కు కులపక్షపాతమనీ, బిసిలు, ముస్లింలు అధిక సంఖ్యలో వున్న చోట కూడా రెడ్డి అభ్యర్థులనే సూచించడం వెనుక అదే కారణమని దానిలో రాశారనీ.. యిలా ఏదేదో రాశారు. కిరణ్ వట్టి అసమర్థుడని సోనియాకు తెలిసిపోయిందని, చిదంబరం తనను తప్పుదారి పట్టించారని వాపోయారని కూడా యివాళ రాశారు. కిరణ్ నియామకం వెనుక చిదంబరం వున్నారని వాయలార్ రవి చెప్పారని రాశారు. ఈ మాత్రానికి 'రవి కాంచాలా'? మన మీడియా కవులు యిది ఎప్పుడో 'కాంచారు'.

ఇవాళ యీయన చెప్పినదేమిట్రా అంటే చిదంబరం కుమారుడు కార్తీకి, కిరణ్ సోదరుడు సంతోష్‌కు సన్నిహిత సంబంధాలు వున్నాయని, కార్తీ వచ్చినప్పుడల్లా గ్రాండ్ కాకతీయాలో బస చేస్తారనీ! ఇదో పెద్ద రహస్యమని నేను అనుకోవటం లేదు. రాష్ట్రంలో ప్రతి నాయకుడికి ఢిల్లీలో వుండే నాయకులతో ఏదో ఒక ఆర్థికపరమైన లింకు వుండడంలో ఆశ్చర్యమేముంది? వీరప్ప మొయిలీకి, ఆజాద్‌కు, దిగ్విజయ్ సింగ్‌కు – అందరికీ వైయస్‌తో యిలాటి లింకులున్నాయని పేపర్లలో వచ్చాయి. అయితే వాళ్లెవరైనా యీ రోజు వైయస్ కుటుంబానికి అండగా నిలిచారా? అప్పటి బేరం అప్పటిది, యిప్పటి బేరం యిప్పటిది.

ఢిల్లీలో గాడ్ ఫాదర్‌లు లేకుండా రాష్ట్ర కాంగ్రెసులో నాయకులు కాలేరని అందరికీ తెలిసున్నదే. అది చిదంబరం ఐనా, ఆజాద్ అయినా, రేపు వాయలార్ అయినా – కోయీ ఫరక్ నహీ అల్‌బత్తా ! రేపు కిరణ్‌ని మారుద్దామనుకున్నారనుకోండి, ఏం చేస్తారు? ఏనుగు తొండానికి దండ తగిలించి ఊళ్లోకి తోలతారా? ఢిల్లీలో ఎవరో ఒకరు సోనియా దగ్గరకు వెళ్లి – ఫలానావాడైతే బాబుని, జగన్‌ను, కెసియార్‌ను ఒంటి చేత్తో కొట్టి పడేయగలడు అని నమ్మించి ఆ పేరును కాగితం మీద రాయించి, కవర్లో పెట్టి హైదరాబాదులో సమావేశంలో యిప్పుతారు. ఈ మాత్రం దానికి కిరణ్ పై నుండి వచ్చాడని తప్పుపట్టడం దేనికి?

ఆ మాటకొస్తే రోశయ్య మాత్రం సిఎం అవుతారని ప్రజలు కలగన్నారా? ఆయన కన్నాడా? ఆయనను సిఎం కాండిడేటుగా ముందు పెట్టి 2009 ఎన్నికల్లో పోరాడారా? కాంగ్రెస్ వాళ్లు ఎవరైనా సరే, ఢిల్లీలో ఎవరో ఒక నాయకుడి ప్రాపకం వలన సిఎం కావలసినదే. సిఎం ఏమిటి, ఎమ్మెల్సీ ఏమిటి, రాజ్యసభ మెంబరేమిటి – ఎవరైనా సరే అక్కడి నుండి దిగుమతి కావలసినదే ! అందువలన అదో పెద్ద నేరం కాదు, ఇక తప్పుపట్టవలసిన దేమిట్రా అంటే పార్టీని, ప్రభుత్వాన్ని సమర్థవంతంగా నిర్వహిస్తున్నాడా లేదా అన్నదే ! కిరణ్ రెడ్లకు మాత్రమే మేలు చేస్తున్నారని జ్యోతి ఆరోపణ. ఏ విధంగా అంటే – వాళ్లకే అధికంగా మంత్రిపదవులు యిచ్చారనీ, యితర కులాలు అధిక సంఖ్యలో వున్నచోట కూడా రెడ్లకే టిక్కెట్లు యిప్పిస్తున్నారనీ ! నామినేటెడ్ పదవులు, జిల్లా అధ్యక్ష పదవులు యివేమీ భర్తీ చేయలేదు కానీ లేకపోతే వాళ్లల్లో రెడ్ల సంఖ్యను లెక్కవేసి చూసేవారేమో !

జగన్‌ను కిరణ్ సమర్థవంతంగా ఎదుర్కోవటం లేదని, అందువలననే తక్కినవారు కూడా 'మా కెందుకులే' అన్న ధోరణిలో వ్యవహరిస్తున్నారనీ రవి తన నివేదికలో రాశారని రాధాకృష్ణ అంటున్నారు. వి హనుమంతరావు యీ పాట ఎప్పుడో పాడారు. దీని వెనక్కాల కూడా 'రెడ్డి పక్షపాతం' జ్యోతికి కనబడుతుంది, యిప్పటికే కనబడకపోతే ! నిజానికి జగన్ వెంట తిరుగుతున్న ఎమ్మెల్యేలను రెచ్చగొట్టేట్లా మాట్లాడి వ్యవహారం చెడగొట్టింది బొత్స అయితే అవిశ్వాసతీర్మానం వేళ జగన్ ఎమ్మెల్యేలను పార్టీవైపు తిప్పుకుని అతని బలాన్ని బాగా తగ్గించినది కిరణే ! జగన్ బలపడితే మొట్టమొదట నష్టపోయేది కిరణే. రేపు ఉపయెన్నికలలో అన్నిట్లోనూ కాంగ్రెస్ గెలిచినా 'అనుకున్నంత విన్నింగ్ మార్జిన్ రాకపోవడానికి కారకుడు కిరణే, అతను జగన్‌ను కట్టడి చేయడంలో విఫలమయ్యాడు, లేకపోతే సోనియా, రాహుల్ పేర్ల మ్యాజిక్‌తో మన వాళ్లు ఒక్కోళ్లూ కనీసం 50 వేల మెజారిటీతో గెలిచేవారు' అని హనుమంతరావు వంటి వాళ్లు ప్రచారం చేస్తారు.

ఇది తెలిసిన కిరణ్ స్వప్రయోజనానికైనా జగన్‌ను నిరోధిస్తాడు. నిజానికి కాంగ్రెస్ హై కమాండ్‌కి యీ రోజు చంద్రబాబు కంటె జగన్‌మీదే ఎక్కువ కసి. దాయాదుల పోరు యిలాగే వుంటుంది. చంద్రబాబు నాగం జనార్దనరెడ్డి విషయంలో తను చేసిన పాత ఉపకారాలన్నీ ఏకరువు పెట్టి ఆయన్ని ఓడించాలని శతథా ప్రయత్నించారు, రేపు పరకాలలో యింత కసి చూపరు. ఎందుకంటే నాగం, బాబునుండి అనేక లాభాలు పొంది, ఆ తర్వాత ధిక్కరించి, ఛాలెంజ్ చేసి మరీ వెళ్లారు. జగన్ విషయంలో సోనియా కూడా అంతే పగతో వుంటారు. అతనికి బుద్ధి చెప్పాలని తహతహ లాడుతూంటారు. ఈ మధ్యలో రెండు మూడు టిడిపికి వెళ్లినా ఫర్వాలేదు, వాళ్లతో ఖాతా తర్వాత తేల్చుకోవచ్చు. ముందు జగన్ ఎదగకుండా చేయాలి అనుకుంటారు. సోనియా మానసికస్థితి యిలా వున్నపుడు అతనితో కుమ్మక్కయి, అతని పట్ల మెతకగా వ్యవహరించే ధైర్యం కిరణ్ ఎలా చేస్తారు? అలా చేసిన మర్నాడు కుర్చీ విడిచిపెట్టాలని అతనికీ తెలుసు. కుర్చీ కంటె కులం ముఖ్యం అనుకుంటూ తనకు మంత్రి పదవి యివ్వకుండా కేవలం 'స్పీకర్' పదవి యిచ్చి 'నోరు మూయించి'న వైయస్ కొడుకు జగన్ వెంట ఊరేగడానికి కిరణ్‌కేమైనా పిచ్చా?

మొదటగా మనం గుర్తించవలసినది – రాజకీయనాయకుడికి ఎవరికైనా కులాభిమానం వుంటే తనవారికి కాంట్రాక్టులు యిప్పిస్తారు. లేదా డబ్బు సమకూరే ఏర్పాటు చేస్తారు. రాజకీయేతర పదవుల్లో వాళ్లను నింపుతారు. అంతేగాని, రాజకీయాల్లో వారిని పైకి రానివ్వరు. జగజీవన్ రామ్ విషయం చెప్తాను. ఆయన చిన్న వయసులోనే మంత్రి అయ్యారు. సమర్థుడు కాబట్టి అన్నీ మంచి శాఖలే

దొరికాయి. ఉపప్రధాని వరకు ఎన్నో పదవులు అధిరోహించారు. ఎప్పుడూ అధికారంలోనే వున్నారు. షెడ్యూల్డ్ కులాల వారికి పెద్ద దిక్కుగా పేరు తెచ్చుకున్నారు. ఎవరైనా షెడ్యూల్డ్ కులపు ఉద్యోగిని పై అధికారులు వేధిస్తే ఆయనకు ఫిర్యాదు చేస్తే చాలు, పై వాడి పని అయిపోయిందే అని చెప్పుకునేవారు. ఆయన బ్రహ్మాండంగా ఆస్తులు కూడబెట్టారు.

ఆయనకు మరణానంతర భారతరత్న యివ్వాలని డిమాండ్ చేసేవారు ఓ విషయం గుర్తు పెట్టుకోవాలి – భారతరత్నే కాదు, పద్మ అవార్డులు యిచ్చేటప్పుడు వారి ప్రతిభతో బాటు వారి ట్రాక్ రికార్డు కూడా చెక్ చేస్తారు. చిన్న చిన్న ఆరోపణలు కూడా లెక్కలోకి తీసుకుంటారు. జగజీవన్ రామ్ వరుసగా పన్నెండేళ్లపాటు ఇన్‌కమ్ టాక్స్ కట్టలేదు. అదేమిటని అడిగితే మర్చిపోయాను అని సింపుల్‌గా చెప్పేశారు. డిపార్టుమెంటు వాళ్లు మర్చిపోలేదు. గోళ్లూడగొట్టి వసూలు చేశారు. అలాటి ఆర్థికనేరం రికార్డులకు ఎక్కాక భారతరత్న లాటిది యివ్వలేరు. అవినీతి ఆరోపణలున్న ఎమ్జీయార్‌కి యివ్వలేదా అని అడక్కండి. అందుకే 'రికార్డులకు ఎక్కాక' అని క్వాలిఫై చేశాను. ఆరోపణలు నిరూపణ కావాలిగా. ఆ మాటకొస్తే జగజీవన్ రామ్ పైనా అలాటి ఆరోపణలకు లోటు లేదు. వాటి బట్టి భారతరత్న ఆపలేరు కానీ ఇన్‌కమ్ టాక్స్ గొడవల కారణంగా ఆపవచ్చు. కారణం తెలియదు కానీ జగ్‌జీవన్ రామ్ బతికున్నప్పుడే మీడియా ఆయన పట్ల చాలా అనుకూలంగా వుండేది. చనిపోయి విగ్రహాలు వెలుస్తూన్న తర్వాత మరీనూ..! అందువలన యివన్నీ రాయటం లేదు.

ఇంతకీ నేను చెప్పేదేమిటంటే – బతికున్నంతకాలం యింత పెద్ద హోదాలో వుండి, అనేక పదవులు అనుభవించి, హరిజనోద్ధారకుడిగా పేరు తెచ్చుకున్న జగజీవన్ రామ్ పైకి తీసుకుని వచ్చిన హరిజన రాజకీయ నాయకులు ఎందరు చెప్పండి చూదాం. బాగా ఆలోచించండి, టైము తీసుకోండి, ఎంత టైము తీసుకున్నా ఎవ్వరూ తట్టరు. ఆయన కొడుకు సురేష్ కుమార్ అని వుండేవాడు. అతన్ని కాస్త తీసుకువద్దామని అనుకున్నారు. అయితే అతను ఓ స్కాండల్‌లో యిరుక్కున్నాడు. అదీ ఓ తమాషా స్కాండల్. జగజీవన్ రామ్ ఇందిరా గాంధీతోనే వుండి కాబినెట్ మంత్రిగా సకల భోగాలు అనుభవించారు. ఇందిర ఎమర్జన్సీ విధించి నిరంకుశంగా పాలించిన టైములో కూడా ఆమెను ఎదిరించలేదు. అయితే 1977లో ఎమర్జన్సీ ఎత్తేసి ఎన్నికలు ప్రకటించినపుడు అతనికి అర్థమైంది – ప్రజలు ఇందిరపాలనకు వ్యతిరేకంగా వున్నారని. అప్పటికే నాలుగు పార్టీలు కలిసి జనతా పార్టీగా ఏర్పడి ప్రజలను ఆకర్షిస్తున్నాయి. ఇది చూసి అప్పటిదాకా ఇందిరతో అంటకాగిన జగజీవన్ రామ్, బహుగుణ వంటివారు అప్పుడు అర్జంటుగా బయటకు వచ్చేసి 'కాంగ్రెస్ ఫర్ డెమోక్రసీ' అని పేరు పెట్టి జనతా పార్టీతో పొత్తు పెట్టుకుని మళ్లీ గెలిచేశారు.

జగ్‌జీవన్ ఉపప్రధాని కూడా అయిపోయారు. మొదటినుండీ తనను వ్యతిరేకిస్తున్న మొరార్జీ దేశాయ్ వంటి వారిపై కంటె కూడా అసలైన టైములో అటు దూకేసిన జగ్‌జీవన్ రామ్‌పై ఇందిరా గాంధీ కుటుంబం మండిపడింది. ఇప్పుడు సోనియా జగన్‌పై పగబట్టినట్టే అప్పుడు ఆమె అతనిపై పగబట్టింది. జనతా పార్టీ పాలన చేసేటప్పుడు సంజయ్ భార్య మేనకా గాంధీ "సూర్య" అనే ఆంగ్లపత్రిక నడిపేది. మీడియా అంతా జనతాకు వత్తాసు పలుకుతూంటే వీళ్లొకళ్లే వాళ్లను తిట్టేవారు. జనతా నాయకుల లొసుగులు బయటపెట్టేవారు. జగ్‌జీవన్ రామ్ కొడుకు సురేష్ అప్పటికే వివాహితుడు. అతనికో గర్ల్ ఫ్రెండ్ సుష్మ అని వుండేది. ఆమె యితను కలిసి ఓ ప్రభుత్వ గెస్ట్‌హౌస్‌లో కామక్రీడలు జరిపారు. అంతటితో ఆగలేదు, తమ క్రీడలను తామే పోలరాయిడ్ కెమెరాతో ఫోటోలు తీసుకున్నారు. ఆ తర్వాత ఆ ఫోటోలను తామే చూసుకుని మురిశారు. ఆ మురవడాన్ని కూడా ఫోటో తీసుకున్నారు.

ఈ దిగంబర చిత్రాలన్నీ "సూర్య" చేతికి చిక్కాయి. అంతే యీనాడు పర్యావరణ, జంతు ప్రేమిగా వినుతి కెక్కుతున్న మేనకా గాంధీ ఆనాడు పాత్రికేయ విలువలను ఏ మాత్రం పట్టించుకోకుండా యీ ఫోటోలను తన పత్రికలో నాలుగైదు పేజీలలో ప్రచురించేసింది. అక్కడక్కడ బ్లర్ చేసినా, ఆ ఫోటోలు నగ్నసత్యాలను చాటి చెప్పాయి. అప్పట్లో ఏ పత్రికా యింత దుస్సాహసం చేసేది కాదు. సురేష్ ఏమీ చేయలేక ఆ అమ్మాయిని పెళ్లి చేసుకోవాల్సి వచ్చింది. రాజకీయంగా అతని భవిష్యత్తుకు అప్పుడే తాళం పడిపోయింది. అతను జగ్‌జీవన్ కంటె ముందే చనిపోయినట్టున్నాడు. ఆ తర్వాత చాలాకాలానికి జగ్‌జీవన్ రామ్ కూతురు మీరా కుమారి రాజకీయాల్లోకి రావడం, యీనాడు స్పీకరు పదవి వరకు ఎదగడం జరిగాయి. జగ్‌జీవన్‌ను స్మరిస్తూ ఏదైనా ఫంక్షన్ చేయాలంటే ఆవిణ్నే పిలుస్తున్నారు, తప్ప యితరత్రా రాజకీయంగా ఆయన శిష్యులు గాని, వారసులు గాని ఎవరూ లేరు. చెప్పవచ్చేదేమిటంటే – ఏ నాయకుడైనా తన కులంవాణ్ని తన భుజాల దాకా ఎదగనివ్వడు, కులసమీకరణాల్లో తనకు ప్రత్యామ్నాయంగా ఎదుగుతాడని !

ఓ నియోజకవర్గంలో 'ఫలానా' అనే కులానికి చెందిన ఓ ఎమ్మెల్యే అభ్యర్థి నిలబడుతున్నాడనుకోండి. అతనేమనుకుంటాడంటే – రాష్ట్రస్థాయిలో నా పార్టీ అధికారంలో రావాలి, కానీ నా జిల్లాలో మా పార్టీ తరఫున నేను తప్ప మరొక బలమైన అభ్యర్థి ఎవరూ గెలవకూడదు అనుకుంటాడు. వేరే ఎవరైనా గెలిచినా మానినా, మా ఫలానా కులానికి చెందినవాడు మాత్రం ఎట్టి పరిస్థితుల్లో ఎవడూ నెగ్గకూడదు అనుకుంటాడు. ఎందుకు? ఎందుకంటే రేపు కాబినెట్ ఏర్పడినపుడు నా జిల్లానుండి నన్నే మంత్రిగా తీసుకోవాలి. ఫలానా కులానికి చెందిన యిద్దరు కాండిడేట్లు వుంటే అప్పుడు ఛాన్సులు సగానికి సగం తగ్గిపోతాయి అనుకుంటాడు. అందువలన తన జిల్లాలో, తన పార్టీలో అభ్యర్థికే ద్రోహం తలపెడతాడు. ఓట్లు చీలడానికి ఎవరో యిండిపెండెంటుని నిలబెడతాడు. చాటుగా డబ్బిస్తాడు. 1994 అసెంబ్లీ ఎన్నికలలో కాంగ్రెస్‌నాయకులు ఎవరికి వారు సిఎం అయిపోదామని అనుకుని యిలాగే పక్కవారికి ఎసరు పెట్టారు. వారు వీరికి పెడితే, వీరు వారికి పెట్టారు. మొత్తానికి అందరూ కలిసి హోల్‌సేల్‌గా ఘోరంగా ఓడిపోయారు. తనూ అలా చేసి దెబ్బతిన్నానని వైయస్సే ఒప్పుకున్నారు.

రాజకీయాలంటే యివి అని అందరికీ తెలుసు. కిరణ్‌కు తెలియదా? కావాలని తనకు ప్రత్యామ్నాయాన్ని తెచ్చి పెట్టుకుంటాడా? రేపు కిరణ్‌ను తీసేసి వేరే రెడ్డి ఎవర్నైనా పెట్టాలి అనుకుంటే అతన్ని తనే తయారు చేసి హై కమాండ్‌కి అందిస్తాడా?

కిరణ్ కాబినెట్ అంతా రెడ్లతో నింపేశాడంటున్నారు. హై కమాండ్ ఆమోదించకుండానే ఆ పని చేశాడా? అసలాయన సొంత శక్తి ఏ మేరకు వుంది? బొత్సను పిసిసి అధ్యక్షుడు కాకుండా ఆపగలిగాడా? శంకర్రావును తీసేయాలనుకుంటే ఎన్నాళ్లు పట్టింది? డియల్‌ను తీసేయాలంటే తీయగలిగాడా? శ్రీనివాసరెడ్డి బదిలీని ఆపగలిగాడా? హై కమాండ్ స్ట్రాటజీ ప్రకారమే అతను నడవాలి. వాళ్లు 'కిరణ్ వైపు రెడ్లు వెళ్లకుండా రెడ్లకు ఎక్కువమందికి ముఖ్యమైన శాఖలు యియ్యి' అని చెపితేనే యిచ్చి వుంటాడు తప్ప, వాళు బిసిలకు యిమ్మంటే రెడ్లకు యిస్తాను, మీ దిక్కున్న చోట చెప్పుకోండి అనేంత సీను లేదిక్కడ. పైగా టిక్కెట్ల పంపిణీ ! ఇక్కడవాళ్లు కేవలం ప్రపోజల్సే చేయగలరు, డిస్పోజలంతా పైనే.

జనాభా పరంగా బిసిలు, మైనారిటీలు ఎక్కువున్న చోట కూడా రెడ్లకే టిక్కెట్లు యిచ్చారని జ్యోతి ఆరోపణ. అసలు జనాభాలో నిష్పత్తి ప్రకారం రాజకీయనాయకత్వం వుందా? అన్ని పార్టీల ఎమ్మెల్యేలలో రెడ్లు, కమ్మల సంఖ్య తీయండి. జనాభాలో తమ నిష్పత్తి కంటె ఎంత ఎక్కువ శాతంలో వున్నారో మీకే తెలుస్తుంది. సినిమా కళాకారులలో కూడా అలాటి లెక్కలు తీస్తే ఏం తేలుతుంది? సెన్సస్‌బట్టి నాయకత్వం వుండదు, కళాభినివేశం వుండదు. సంఖ్యాపరంగా బిసిలు చాలామంది వున్నారని పీఆర్పీ బిసిలకు టిక్కెట్లు యిచ్చి చూసింది. ఏమయింది? గెలవగలిగారా? ఎస్సీ, ఎస్టీకి కొన్ని రిజర్వ్ చేసారు కాబట్టి కానీ, ఎవరైనా పోటీ చేయవచ్చంటే పూర్తి ఎస్టీ ప్రాంతంలో కూడా గిరిజనుడు ఓడిపోవచ్చు, మైదానప్రాంతం వాడు వచ్చి గెలవవచ్చు. అంతెందుకు, కులాలు వదిలేయండి. జనాభాలో 50% మంది మహిళలున్నారుకదా, ఎమ్మెల్యేలలో, ఎంపీల్లో 50% మంది మహిళలున్నారా? ప్రభుత్వోద్యోగాలయితే రిజర్వేషన్ కోటా నింపాలి కాబట్టి జనాభా లెక్క ప్రకారం తీసుకుంటున్నారు కానీ తక్కినచోట్ల ఎవడి సత్తా వాడిది.

రాబోయే ఉపయెన్నికలలో ఏ నియోజకవర్గంలో ఏ కులం వారు ఎక్కువ వున్నారో చూసి అన్ని పార్టీలు టిక్కెట్లు యిస్తాయా? అలా అయితే అక్కడి అభ్యర్థులందరూ ఒకే కులానికి చెంది వుండాలి. ఉంటున్నారా? నాయకత్వ లక్షణాలు వున్నవాడినే ఎంచుకుంటారు తప్ప కేవలం కులం బట్టే టిక్కెట్టు యివ్వరు. కులం అనేది వాళ్లు పరిగణించే అనేక అంశాల్లో ఒకటి మాత్రమే. ఇది పేపరు చదివే మనందరికీ తెలుసు. అలాటప్పుడు కేవలం కాంగ్రెస్ పార్టీ మాత్రమే మెజారిటీ కులం ఎవరుంటే వారికి యిచ్చి తీరాలని, అలా యివ్వకపోవడానికి కిరణ్ కారణమని రాయడం ఏం సబబు?

అసలు ప్రతీదీ కులం కళ్లతో చూడడం యిటీవల ప్రబలిన వ్యాధి. ఎన్టీయార్ సిఎం కాగానే, కాంగ్రెస్‌వారు, వారిని సమర్థించే మీడియావారు కలిసి అతనిపై కమ్మ ముద్ర కొట్టేసి రెడ్లకు ద్రోహం చేసేస్తున్నాడని యాగీ చేసేశారు. ఉన్నతోద్యోగాలలో వున్న కమ్మల లిస్టు ప్రచురించి వీళ్లందరూ రామారావు కారణంగానే ఆ పదవులు అధిరోహించారని రాశారు. వారిలో చాలామంది స్వయంప్రతిభతో పైకి వచ్చినవారు. వారు ఉద్యోగాలలో ప్రమోషన్లు తెచ్చుకున్నపుడు రామారావుగారికి రాజకీయాల్లో వచ్చే వూహ కూడా వుండి వుండదు. అయినా వారిపై బురద జల్లారు. అలాగే వైయస్ పదవిలో రాగానే రెడ్ల కందరికీ ప్రమోషన్లు వచ్చేశాయని, టిడిపివారు వారి అనుకూల మీడియా అల్లరి చేశాయి. రెడ్ల విషయమూ అంతే, వాళ్ల ప్రతిభతో పైకి వచ్చినవారే తప్ప వైయస్ అధికారంలోకి వచ్చాడు కదాని అప్పటికప్పుడు ఐయేయస్‌లు పాసయిపోలేదు. ఒకే స్థాయిలో వున్నవారిలో తనకు ఆత్మీయులైన వారికి కీలకమైన పదవులు యివ్వడం వరకు నిజం. ఆత్మీయులందరూ తన కులం వారే అవరు. వైయస్ హయాంలో ఓ వెలుగు వెలిగిన బిపి ఆచార్య, శ్రీలక్ష్మి వైయస్ కులం వారా? కాదుగా !

అధికారుల విషయంలోనే కాదు, రాజకీయ నాయకులకు కూడా యీ సూత్రం వర్తిస్తుంది. కాంగ్రెస్ రెడ్ల పార్టీ అయిపోయిందనీ, ముఖ్యమంత్రిగా రెడ్డిని తప్ప వేరే వాళ్లను పెట్టలేదనీ, అతను యితర రెడ్లను ప్రోత్సహిస్తున్నాడనీ, జగన్ పార్టీ మరీ అన్యాయమనీ, రెడ్లని మరీ ప్రోత్సహిస్తోందనీ, రెడ్లంతా జగన్ పార్టీ క్యూలో నిలబడ్డారనీ కులపరంగా యింత యాగీ చేస్తున్న జ్యోతి టిడిపి, తెరాసల గురించి ఎందుకు రాయదో నాకు అర్థం కావటం లేదు. టిడిపి గెలిస్తే సిఎం ఎవరవుతారు? కమ్మ కాదా? ఎన్టీయార్, చంద్రబాబు, రేపు అయితే గియితే బాలకృష్ణ, లేదా లోకేష్ – ఎవరైనా సరే కమ్మే కదా! కాంగ్రెస్‌లో సిఎం కావడానికి ఓ రెడ్డికి, ఓ కాపుకి, ఓ బిసికి, ఓ ఎస్సీకి, ఓ మైనారిటీకి ఛాన్సు వుంటుంది కానీ టిడిపిలో వారెవరూ కలలో కూడా ఆ సీటును వూహించలేరు. మహా అయితే నెంబర్ టూ, డిప్యూటీ.. వగైరా వగైరా. సిఎం పోస్టు మాట సరే, అది కుటుంబానికి అంకితం అయిపోయింది కాబట్టి మరేం చేయలేం అనవచ్చు. కానీ ఎమ్మెల్యేల మాటేమిటి? జనాభాలో కమ్మలు 4% వుంటారనుకుంటే, టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థులలో 4% మంది మాత్రమే కమ్మలా? ఇది చూసి తక్కినవారందరూ టిడిపికి ఓట్లేయకూడదా?

ఇదే సూత్రం తెరాసకు అన్వయిస్తుంది. నాయకత్వం వెలమల చేతిలోనే వుంది. తెరాస అధికారంలోకి వస్తే ఎస్సీని సిఎం చేస్తామని కెసియార్ అంటున్నా, నిజంగా అది జరిగినా ప్రధానమైన పదవులన్నీ కెసియార్ కుటుంబసభ్యుల చేతిలో, ఆయన కులానికే చెందిన ఆయన పార్టీ నాయకుల చేతుల్లో వుండబోతోంది. మరి జనాభాలో వెలమల శాతం ఎంత? తెరాస నాయకుల్లో వెలమల శాతం అదే నిష్పత్తిలో వుందా? ఇవేమీ యీ విశ్లేషకుల కంటికి ఆనవా?

కిరణ్‌ను రెడ్డి పక్షపాతి అంటున్నారు. రెడ్లకే అన్నీ చేస్తున్నాడంటున్నారు. మరి దానివలన ఆయన పొందుతున్న లాభం ఏమిటట? కాబినెట్‌లో రెడ్లయినా ఆయన పక్షాన నిలుస్తున్నారా? కిరణ్‌ను అనునిత్యం తిట్టే డియల్, రెడ్డి కాదా? సొంతజిల్లాలో కిరణ్‌పై కత్తి

కట్టిన రామచంద్రారెడ్డి, రెడ్డి కాదా? తెలంగాణ విషయంలో తప్పుడు రిపోర్టులు యిస్తున్నారంటూ కిరణ్‌పై నిప్పులు కక్కుతున్నవారిలో రెడ్లు లేరా? ఇవన్నీ ఆలోచిస్తే – పోరాటాలన్నీ రాజకీయ అవసరాల కోసం జరుగుతున్నాయి తప్ప కులాల లెక్కల ప్రకారం జరగటం లేదని అర్థమవుతుంది. ఈ మాత్రం దానికి కిరణ్‌ను రెడ్డిపక్షపాతి అంటూ రెచ్చిపోవడం శుద్ధ అనవసరం. **(సమాప్తం) – ఎమ్బీయస్ ప్రసాద్ (ఏప్రిల్ 2012)**

**ఏప్రిల్ 24** **ఎమ్బీయస్ : జోరుమీదున్న సైకిలు**

ఉపయెన్నికల అడావుడంతా టిడిపిలోనే కనపడుతోంది. అవి గెలవకపోతే కొంప మునిగిపోతుందేమో, తన ప్రతిపక్ష నాయకుడి హోదా పోతుందేమోనంత పోరాటం చేస్తున్నారు బాబు. నిజానికి యిది వాళ్ల జీవన్మరణ సమస్య కానే కాదు. అవి గెలవకపోతే ఆయనకు వచ్చే నష్టం ఏమీ లేదు. అసలు నష్టమంతా కాంగ్రెస్, జగన్‌లకుంది. అవి స్వతహాగా కాంగ్రెస్ సీట్లు కాబట్టి వాటిని తిరిగి గెలవకపోతే కాంగ్రెసు నాయకులు సంజాయిషీ చెప్పుకోవలసి వుంటుంది. అన్నీ కాకపోయినా మెజారిటీయైనా గెలిచి తీరాలి. లేకపోతే 2014లో కూడా యిదే జరుగుతుందన్న భావనతో కాంగ్రెస్ నాయకులు కంచె దూకేస్తారన్న భయం వారికి వుంది. అదేమీ జరగకపోయినా 'ఉపయెన్నికలు గెలిపించకపోయిన కిరణ్ లేదా బొత్స లేదా యిద్దరూ రాజీనామా చేసి యితరులకు అవకాశం యివ్వాలి' అనే నినాదం ప్రబలుతుంది.

ఇక జగన్‌కైతే యివి గెలవడం మరీ అవసరం. లేకపోతే తన పంచన చేరిన వాళ్లను గెలిపించలేని అసమర్థుడిగా చూస్తారు. అవి స్వతహాగా కాంగ్రెస్ స్థానాలే కావచ్చు. కానీ ఆ యా స్థానాల్లో జగన్‌కి ప్రజాదరణ వుందని స్థానిక నాయకులు అనుకోవడం బట్టే కదా, వాళ్లు రాజీనామా చేసి జగన్ పార్టీ తరఫున మళ్లీ పోటీ చేస్తున్నది ! అందువలన వాళ్లు అక్కడ మళ్లీ గెలిచి తీరాలి. తెలంగాణలో మొన్నటి ఉపయెన్నికలలో తెరాస ఎదుర్కున్న సమస్యే యిప్పుడు జగన్‌దీ. గెలవడమే కాదు, మంచి మెజారిటీతో గెలవాలి. అప్పుడే అతనివైపు యింకొంతమంది వస్తారు. లేకపోతే 2014 వరకు అధికార పార్టీలోనే వుండి, అన్నీ అనుభవించి అప్పటి ప్రజల మూడ్ బట్టి వద్దాంలే అనుకుంటారు. జగన్ అలా, అలా ఓదార్చుకుంటూ, మధ్యమధ్యలో తనను తాను ఓదార్చుకుంటూ ముందుకు సాగాల్సి వస్తుంది.

కడప, పులివెందుల ఫలితాలు రాష్ట్రమంతటా పునరావృతం కావని కోవూరు చాటి చెప్పింది. స్థానిక అభ్యర్థి గుణగణాలు కూడా ఫలితాన్ని ప్రభావితం చేస్తాయని జగన్ వర్గీయులు యిప్పుడు ఒప్పుకుంటున్నారు. ఈ 18 నియోజకవర్గాలలో వైయస్సార్పీ తరఫున అభ్యర్థులందరూ ప్రసన్న కంటె, ఎక్కువో తక్కువో త్వరలోనే తేలుతుంది. కామన్ సెన్స్ ప్రకారం చూస్తే కొందరు ఎక్కువ కావచ్చు, మరి కొందరు తక్కువ కావచ్చు. తక్కువైన వారిలో బాగా తక్కువైనవారూ వుండి ఓటమి అంచుల్లో తారాడవచ్చు. వీరిలో పనులు చేసి నియోజకవర్గ ప్రజలను మెప్పించిన వారెందరు చెప్పండి. 2009 ఎన్నికలు అయి కాస్త సర్దుకుంటూండగానే వైయస్సార్ పోయారు. అప్పుణ్నుంచి జగన్ వారసత్వపు గొడవలే. రోశయ్యను గుర్తించం అన్నారు, మరి పనులు ఏమవుతాయి?

ఆ తర్వాత కిరణ్ వచ్చాక బయటకు వచ్చేసి జగన్ వెంట తిరిగారు. ఇక కిరణ్ వాళ్ల పనులు ఎందుకు చేస్తాడు? రేపు ఎన్నికలలో ప్రజల వద్దకు వెళ్లి 'మేం మీకు ఫలానాది చేశాం' అని చెప్పుకోవడానికి వీళ్లకు ఏమీ లేదు. ఎంతసేపూ 'వైయస్ పథకాలకు తూట్లు పొడిచారు. రేపు 2014లో జగన్ సిఎం అయ్యాక మళ్లీ వాటిని పునరుద్ధరిస్తాం. అందువలన యిప్పుడేమీ కోరికలు కోరకుండా మాకు ఓట్లేయండి' అని చెప్పాలి. రేపటికోసం యివాళ్టిని త్యాగం చేసే ప్రజలే వుంటే యిన్ని సంక్షేమపథకాలు వుండేవే కావు. ప్రజలకు నిన్న, రేపు అక్కరలేదు. 'ఇవాళ నాకేంటి?' అని అడిగే రకాలు. వైయస్‌మీద ప్రేమతో పోనీ యీ సారి ఓట్లు వేశారనుకోండి. మళ్లీ 2014లో కూడా యిదే అస్త్రం పనిచేస్తుందా?

ఇందిరా గాంధీ హత్యకు గురైతే జాలి కొద్దీ రాజీవ్‌కు ఓ సారి ఓట్లేశారు. వచ్చేసారికి ఆ సానుభూతి ఆవిరై పోయింది. రాజీవ్ గాంధీ హత్యకు గురైతే జాలి కొద్దీ కాంగ్రెస్‌కు ఓ సారి ఓట్లేశారు. వచ్చేసారికి అది ఆవిరై పోయింది. వైయస్ పేరు చెప్పినప్పుడల్లా ఓట్లు రాలుస్తూ వుండడానికి అదేమీ 'ఖుల్‌జా సిమ్‌సిమ్' మంత్రం కాదు. ఇప్పుడు గెలిచినవారందరూ 2014 నాటికి పెర్‌ఫామెన్స్ చూపించగలగాలి. అధికారంలో వుంటే చూపిస్తారు కానీ ప్రతిపక్షంలో వుంటే ఏం చూపిస్తారు? టిడిపి వాళ్లు యివాళ ఓ సమస్య మీద ధర్నా చేస్తే మర్నాడు అదే సమస్యపై వైయస్సార్పీ చేయాలి. అసెంబ్లీలో వాకౌట్లు చేయాలి. స్పీకరు పోడియం దగ్గరకు దూసుకుపోవాలి, కాగితాలు చింపి గవర్నరు నెత్తిన పోయాలి.

చాలా అన్యాయంగా మాట్లాడుతున్నట్టుంది కదా, యీ లెక్కన ప్రతిపక్షంలో వున్నవారెవరికీ మళ్లీ అధికారంలోకి వచ్చే ఛాన్సు లేనట్టు అనుకోవాల్సి వస్తుంది. కానీ అలా జరగదు కదా ! వాళ్లూ గెలుస్తారు. ఎందుచేత? అసెంబ్లీలో వాళ్ల నియోజకవర్గ సమస్యలు లేవనెత్తుతూ వాళ్ల ఓటర్లకు తమ పలుకుబడితో పనులు చేసిపెట్టినపుడు వాళ్లు పాప్యులర్ అవుతారు. మరి వైయస్సార్పీ అభ్యర్థులలో ఎందరు అసెంబ్లీలో తమ నియోజకవర్గ సమస్యల గురించి ధాటీగా మాట్లాడారు అన్నది లెక్కలు తీసి చూడండి. ఎవరు ప్రజాసేవ చేశారు అన్నది చూడండి. అప్పుడు వాళ్లల్లో ఎవరికి ఛాన్సుందో తెలుస్తుంది. జగన్ పట్ల సానుభూతి/ గ్లేమర్/క్రేజ్.. ఏదైనా అనండి కొన్ని ఓట్లు తప్పక తెచ్చి పెడుతుంది. కొన్ని నియోజకవర్గాల్లో అది 20% కావచ్చు, మరికొన్నిటిలో 25% కావచ్చు. గెలవాలంటే

అది సరిపోదు కదా. ఆ పైన కొంత శాతం అభ్యర్థి తెచ్చుకోవాలి.

అది తెచ్చుకోగలిగిన వారెవరు? ఎందరు? ఎదుటి అభ్యర్థి గుణగణాలు, బలాబలాలపై కూడా వీరి గెలుపు ఆధారపడుతుంది. ఎన్నికల ఫలకం నునుపు తేరినకొద్దీ వీటిలో స్పష్టత వస్తుంది. అప్పటిదాకా సీట్లలో వైయస్సార్సీకి 60%-70%, కాంగ్రెస్, టిడిపిలకు 15%-20% వస్తాయని అనుకోవడం సమంజసం. ఏ సీట్లలో ఎవరిది గెలుపు అని నేను లెక్కలు వేయలేదు కాబట్టి వీటిపై చర్చకు దిగను. ఏ పార్టీనీ సాంతం కొట్టి పారేయలేమనీ, ప్రతీవారికీ ఎంతోకొంత ఓదార్పు వుంటుందనీ మాత్రం అందరం గ్రహించాలి.

ముఖ్యంగా కాంగ్రెస్ వీటిని తేలిగ్గా తీసుకోవడం లేదని బాగా అర్థం చేసుకోవాలి. తెలంగాణ ఉపయెన్నికలలో టి కాంగ్రెస్ నాయకులు పోటీ చేయడానికి వ్యతిరేకంగా మాట్లాడి, ప్రచారానికి వెళ్లకుండా బిగుసుకు కూర్చున్నా, వెళ్లినవాళ్లను యీసడించి శల్యసారథ్యం చేసినా హై కమాండ్ ఏమీ అనలేదు. కనీసం గతంలో తాము గెలుచుకున్న స్థానాలను నిలబెట్టుకోవాలనైనా ప్రయత్నించలేదు. స్థానిక నాయకత్వంపై నమ్మకం చాలక, ఢిల్లీ నుండి మందీ మార్బలాన్ని దింపలేదు. కిరణ్, బొత్సల చేతిలో బాధ్యత పెట్టి వూరుకుంది. తన నియోజకవర్గంలో తను నెగ్గడం తప్ప కిరణ్‌కు ఏ అనుభవమూ లేదు. తన జిల్లాలో కూడా వేరెవర్నీ గెలిపించి ఎరగడనుకుంటాను. అలాటి వాడు తెలంగాణలో ఎన్నికల స్ట్రాటజీ ఏం చేయగలడు? పెద్ద వక్తా కాదు, ప్రజలను ఆకర్షించడానికి. గ్లేమరూ లేదు. పరిస్థితి అనుకూలంగానూ లేదు.

ఇక బొత్స – ఇప్పటిదాకా పిసిసి అధ్యక్షుడిగా వున్నదీ లేదు, పొడిచేసినదీ లేదు. తాను గెలిచి, యితరులను గెలిపించిన రికార్డు వుంది (ఆ యితరులు కూడా తన కుటుంబసభ్యులే ననుకోండి) కానీ అదంతా తన సొంత జిల్లాలోనే. రాష్ట్రస్థాయి నాయకుడు కాదు. తెలంగాణలో అనుచర వర్గమూ లేదు, పూర్వానుభవమూ లేదు. ఆయనేం చేయగలడు? చివరకు తెలంగాణ మంత్రులకే బాధ్యత అప్పగించి చేతులు దులుపుకున్నారు. తెలంగాణ మంత్రులకు ప్రజల్లో ఏం సానుభూతి వుంది? వాళ్ల కార్ల మీద, యిళ్లమీద రాళ్లు వేయించుకున్న రికార్డు వాళ్లది. వాళ్లు వచ్చి ఓట్లడిగితే ఓట్లు పడతాయా? అభ్యర్థులే తంటాలు పడ్డారు కాబట్టి డిపాజిట్లు దక్కాయి. కానీ విన్నింగ్ ఎడ్జ్ రావాలంటే అది సరిపోలేదు. హై కమాండ్ వాళ్లు పూనుకోవాల్సింది. వాళ్లు వూరుకున్నారు.

అప్పుడూరుకున్నారు కానీ కోస్తా, సీమల్లో వూరుకోదలచలేదు. ఏదీ నా రోడ్ మ్యాప్? ఏదీ నా సమన్వయకమిటీ? ఏదీ నా బస్సు యాత్ర? ఏవీ నా క్షేత్రస్థాయి నివేదికలు? అంటూ గర్జించడానికి ఆజాద్ గారు వస్తున్నారు. తరుముకూత పట్టినట్లు ఒకరి తర్వాత మరొకరు ఢిల్లీనుంచి నాయకులు వచ్చిపడిపోయి ఉక్కిరిబిక్కిరి చేసేస్తున్నారు. ఇంత పూదరగొడితే ఎంతో కొంత ఫలితం వుండకపోదు. 3, 4 సీట్లు గెలవకపోరు. గెలవకపోతే యిక్కడి నాయకులకే కాదు, ఢిల్లీ నాయకులకు కూడా మూడిందే. సోనియమ్మ తెగ చిరాగ్గా వుంది. ఆవిడ పేరు చెపితే ఓట్లు రాలలేదని ఋజువైపోతే ఆవిడకు ఒళ్లు మండదా? ఆంధ్రా చేజారిపోతే రాహుల్ ప్రధాని కావడం సాధ్యం కాదని తెలియదా? ఈ భయాల చేత వాళ్లు ఎంతో కొంత సాధిస్తారని నా అంచనా. జగన్ సంగతి చెప్పనే అక్కరలేదు. అన్నీ నెగ్గితీరాలి. లేకపోతే కొత్తగా వచ్చేవాళ్లు ఎవరూ వుండరు.

ఇటువంటి ప్రమాదాలు ఏమీ లేని పార్టీ టిడిపి. ఇవి వాళ్ల సీట్లు కావు. వస్తే బోనస్సే. బోనస్సుగా వచ్చిన సీట్లతో వాళ్లు చేయబోయే అద్భుతాలు ఏమీ లేవు. ధర్నాలో మరింతమంది కూర్చోవడం తప్ప యింకేమీ జరగదు. కానీ యీ గెలుపు వలన చంద్రబాబుకు మాత్రం తేడా పడుతుంది. ఆయన నాయకత్వంపై ఆయన పార్టీలో మరింత నమ్మకం పెరుగుతుంది. 2014 నాటికి యాంటీ-ఎస్టాబ్లిష్‌మెంట్ ఓటులో టిడిపి శాతం ఘనంగా వుండబోతున్న నమ్మకం ఓటర్లలో బలపడుతుంది. టిడిపిని గెలుపుగుఱ్ఱంగా భావించి వారిపై పెట్టుబడి పెట్టేందుకు కొందరు బేహారులు ముందుకు వస్తారు. ఆయన నుంచి నాయకత్వం గుంజుకోవడానికి ఉ రకలేస్తున్న నందమూరి వంశజులు కాస్త తమాయిస్తారు. టి-టిడిపి నాయకులలో పూగిసలాట తగ్గుతుంది. ఎప్పటికైనా గట్టెక్కించేవాడు బాబే నని ఓపిక వహిస్తారు.

అందుకే బాబు యీజ్ లీవింగ్ నో స్టోన్ అన్‌టర్న్‌డ్. ఏ రాయి కింద ఏ ఆయుధం వుందోనని అన్నీ తిరగేసి చూస్తున్నారు, ఏ పుట్టలో ఏ పాముందోనన్న ఆశతో పుట్టలు, గుట్టలు అన్నీ ఎక్కి దిగుతున్నారు. పూచికపుల్ల దొరికినా దాన్ని బ్రహ్మాస్త్రంగా వాడుతున్నారు. సాధారణ ఎన్నికలలో యిచ్చినట్టు వాగ్దానాలు గుప్పిస్తున్నారు. మేం నెగ్గితే... అంటున్నారు. ఈ ఎన్నికలలో నెగ్గితే ఏం చేయగలరు? 2014లో నెగ్గి అధికారంలోకి వస్తే ఏమైనా చేయగలరు కానీ. అయినా వాగ్దానాలు ఎడాపెడా చేసేస్తున్నారు. బొత్స యిలాకాలో చేసిన ధర్నాలో విజయం సాధించారు. బాబు వేసిన ఉచ్చులో బొత్స పడ్డారు. అక్కడ ధర్నా చేయించి నవ్వులపాలయ్యారు.

ఆ నాడు కాంగ్రెస్ ధర్నా ఎందుకట? టిడిపిలో వున్న మద్యం వ్యాపారులను పార్టీలోంచి బహిష్కరించాలనట ! భేష్, తమ వద్దకు వచ్చేసరికి వ్యాపారం చేయడం చట్టవిరుద్ధమా? అయినా నేరం నిరూపణ కానిదే దోషిగా ఎలా చెప్తారు? అని లాజిక్‌లు లాగుతారు. ఎదుటివారి వద్దకు వచ్చేసరికి అనుమానం రాగానే పార్టీలోంచి తీసేయాలట. బాబు చిత్తూరు జిల్లాలో ఎందుకు చేయలేదు? అనే ఓ పిచ్చిప్రశ్న ఒకటి. ఎక్కడైనా చేయవచ్చు. ఓపికుంటే మీరెళ్లి చిత్తూరులో చేయండి. బొత్సకు ప్రస్తుతం వున్న యిమేజికి ఆయన ఏం చెప్పినా, ఎవర్ని విమర్శించినా చెల్లేట్టు లేదు. ఆయన మీద సాధించిన విజయంతో బాబు రెచ్చిపోతున్నారు. జగన్‌పై మరీ దూకుడుగా వెళుతున్నారు. అవినీతి అన్నారు, ఆ మధ్య కులమతాలతో రాజకీయం అన్నారు, యిప్పుడు హత్యా రాజకీయాలంటున్నారు.

కులమతాల ప్రస్తావన తెచ్చిన బాబే ఆ తర్వాత తిరుపతికి వెళ్లి జగన్ తిరుపతికి వచ్చి కూడా తిరుమల వెళ్లి దైవదర్శనం చేసుకోలేదని ఆరోపించారు. ఇది అవసరమా? జగన్ క్రైస్తవుడని అందరికీ తెలుసు. అదేమీ రహస్యం కాదు. అతను వాటికన్

వెళ్లకపోయినా నష్టం లేదు. అలాటిది తిరుమల వెళ్లకపోతే తప్పు పట్టగలమా? (లేదు, వెళ్లానని మళ్లీ క్లారిఫికేషన్ వచ్చింది) ఇవన్నీ ప్రస్తావించడం వలన జగన్ యిమేజికి జరిగే డామేజి కంటె బాబు యిమేజికి ఎక్కువ జరుగుతుంది. సూటుకేసు బాంబు కేసు తీర్పు రాగానే దాన్నీ జగన్‌కు ముడిపెట్టారు. ఇంకా ఎన్ని పెడతారో ఏమో. ఋజువు కానిదే చేసే ఆరోపణలకు ఏం విలువ వుంటుంది?

పైగా టిడిపి మాత్రం నేరరాజకీయాలకు దూరంగా వుందా? పరిటాల రవిని రాజకీయాల్లోకి తీసుకుని వచ్చినదెవరు? అతను పోయినప్పుడు రాష్ట్రమంతా బస్సుల దహనం చేయించిన దెవరు? వైయస్ కుటుంబానికి ఫ్యాక్షన్ నేపథ్యం వున్నమాట నిజం. చంద్రబాబు కుటుంబానికి ఆ నేపథ్యం లేదు, అదీ నిజమే కానీ టిడిపి నాయకులెవ్వరికీ లేదా? వారికి వీరు టిక్కెట్లు యివ్వటం లేదా? ప్రజలకు మరీ మతిమరుపు అనుకోవడం కూడా ప్రమాదమే. కార్యకర్తల్లో ఉత్సాహం నింపడానికి కొన్ని అతిశయోక్తులు పలకవచ్చు, కాస్త తీవ్రంగా మాట్లాడవచ్చు కానీ కొన్ని కొన్ని కొందరికి అతకవు. బాబుకి యీ ధోరణి అస్సలు అతకడం లేదు. ఒఱలు రామయ్యగారి లాటివారికి ఆ పని అప్పచెప్పి ఆయన హుందాగా మాట్లాడితేనే బాగుంటుంది. **(సమాప్తం) – ఎమ్బీయస్ ప్రసాద్ (ఏప్రిల్ 2012)**

**ఏప్రిల్ 26 ఎమ్బీయస్ : అండాదండా పోయిన కోదండ**

సొంతబలం లేకున్నా కోదండరాం గారు కొంతకాలం ఓ వెలుగు వెలిగారు. ఇప్పుడు చీకట్లు కమ్ముకొస్తున్నాయి. పల్లకీలో కూర్చోబెట్టి వూరేగించిన బోయీలు వారిలో వారు కలహించుకుని పల్లకీ దింపేశారు. ఈయన ప్రయాణం ఆగిపోయింది. దిగి బయటకు రాలేదు. వస్తే కాలినడకన నడుచుకుంటూ కాలేజీకి వెళ్లి పాఠాలు చెప్పుకోవాలి. పల్లకీ మోతకు అలవాటు పడిన ప్రాణాన్ని పాఠాలు చెప్పి బతకమంటే కష్టమే మరి. 'గడీ వేషానికి గడ్డం మీసం గీయించాడు' అని విద్యార్థులు అనకపోయినా అసూయాపరులైన సహోద్యోగులు అంటారన్న గుబులు మనసులో వుంటుంది. కానీ ఓ లాభం వుంది. ఆంధ్ర పారిశ్రామిక వేత్తలు తయారు చేసిన వస్తువులు జాబితా తయారుచేయడానికి యిప్పుడు తీరిక దొరుకుతుంది. తీరా జాబితా తయారయ్యాక తెలంగాణలో వాటిని నిషేధించాలని పిలుపు నిస్తే "నమస్తే తెలంగాణ"లో వేస్తారో లేదో, "టి-ఛానెల్"లో ఆ వార్త ప్రసారం చేస్తారో లేదో గ్యారంటీ లేదు. ఎందుకంటే ప్రస్తుతం కోదండుని మండిపడుతున్న పార్టీ ఏదయ్యా అంటే తెరాసయే ! పాపం ఎందుకింత కోపం అని అడక్కండి.

ఇప్పుడు మీరొక చిలుకను తెచ్చి చక్కగా పంజరంలో పెట్టి, శుభ్రంగా తిండిపెట్టి పోషించి, దానికి మాటలు నేర్పిస్తే దాన్నుండి చిలుకపలుకులు ఆశిస్తారా లేదా? మీరేం చెపితే అది అదే పలకాలని అనుకుంటారు తప్ప మరొకటి పలికితే ఒళ్లు మండదూ? 'మాటలు నేర్చిన కుక్క ఉస్కోమంటే ఉస్కోమందిట'. 'గుంటఓనమాలు దిద్దడానికి ముందు కాకరకాయ అన్న గుంటడు దిద్దాక కీకరకాయ అన్నాట్ట'. ఈ చిలకేమిట్రా మనం తెరాస తెరాస అనమంటే జాక్ జాక్ అంటోంది, కళ్లు నెత్తికెక్కి చుట్టూ కట్టిన పంజరం కనబట్టంలేదా? పదవినిషాలో కళ్లు కాషాయపు రంగులోకి మారాయా?' అని అనుకోరా?

తెలంగాణకోసం కొన్ని పండగలూ అవీ జరపాలని ఫర్మానాలు జారీ చేశారు కానీ కోదండరాం గారు స్వతహాగా వామపక్షవాది కాబట్టి పూజాపునస్కారాల గురించి పట్టించుకుని వుండరు. అందువలన ఆయనకు పసుపు విఘ్నేశ్వరుడు గురించి అవగాహన వుండి వుండదు. పెద్ద పూజ చేసేటప్పుడు మొదట తమలపాకులో పసుపుతో చిన్నముద్ద చేసి దానికి విఘ్నేశ్వరుడు అని పేరు పెడతాం. దానికి విఘ్నేశ్వరుడు షేపు తీసుకువచ్చే ప్రయత్నం కూడా చేయం. పెద్ద పూజకు శిష్యుడు ఏర్పాట్లు చేస్తూండగా పురోహితుడు ఈ పసుపు విఘ్నేశ్వరుడికి పూజ కానిచ్చేస్తాడు. ఎంత, మహా అయితే పది నిమిషాలు. ఆ తర్వాత ఉద్వాసనే ! తీసి పక్కన పడేస్తాం. తర్వాత ఏమయిందో కూడా పట్టించుకోం. పూజ చేస్తామంటూ మందిరంచుట్టూ చిన్నపిల్లలు మూగితే ఒకళ్లనొకళ్లు తోసుకుంటూ ఎవళ్లో ఒకళ్లు దాన్ని తొక్కేసినా తొక్కేయగలరు. అంత యిన్‌సిగ్నిఫికెంట్‌గా వుంటుంది. పెద్ద వినాయకుడి నిమజ్జనం కూడా గ్రాండ్‌గా జరుగుతుంది కానీ యీ పసుపు విఘ్నేశ్వరుణ్ని నిర్మాల్యంతో బాటు ఎత్తి ఎక్కడో పడేస్తారు. కనీసం సెల్‌ఫోన్‌తో నైనా ఫోటో తీయరు.

కోదండరాం గారి సమయం అయిపోవచ్చిందని అందరికీ తెలిసిపోతోంది. ఆయన్ను పీఠమెక్కించిన తెరాస కోడు ఎలా విరిచేస్తోందో ఆంధ్రజ్యోతి విపులంగా చెప్తోంది కాబట్టి నేను మళ్లీ చెప్పటం లేదు. పరకాలలో తెరాసకు సమర్థన తెలుపుతూ జాక్ నిర్ద్వంద్వంగా, విస్పష్టంగా ప్రకటన చేస్తేనే కోదండరాం యింకొన్నాళ్లు అక్కడ నిలవవచ్చు. లేకపోతే అనేకానేక తెలంగాణ సంస్థల్లో ఆయనదీ ఒకటవుతుంది. కెసియార్‌కు కోపం ఏమిటంటే కోదండరాం బిజెపిని కట్టడి చేయటం లేదని. మతపరమైన ప్రచారం చేసిన బిజెపిని చాటుగా సమర్థించాడు చూడు అని ఆయన బిజెపి అంటే అస్సలు పడని న్యూ డెమోక్రసీ లీడర్లకు ఫోన్లు చేశాడట. నిజానికి కోదండరాంకు మాత్రం బిజెపిపై ప్రేమ వుందా ఏమన్నానా? ఆయన చెపితే వినేవాళ్లెవరు? అది ఆయనకీ తెలుసు కాబట్టి పాలమూరులో జాక్ తటస్థం అన్నాడు. 'కానీ ఆచరణలో తటస్థంగా లేదు, స్థానికంగా వున్న జాక్ నాయకుడు బిజెపికి సపోర్టు చేశాడు' అంటుంది తెరాస – అక్కడి కేదో జాక్‌లోని జిల్లా నాయకులందరూ కోదండరాంకు జీ హుజూర్ అంటున్నట్టు !

అసలు జాకే కలగూరగంప. ఒకే సిద్ధాంతం, ఒకే మ్యానిఫెస్టో అంటూ కలిసి పనిచేసే మహా మహా పార్టీల్లోనే చచ్చేటన్ని లుకలుకలు. ఇక జాక్‌లో వున్నది సిద్ధాంతాలు కలవని డజన్లకొద్దీ సంస్థలు, మొహాలుమొహాలు చూసుకోని రాజకీయపార్టీలు. వాళ్లందరూ రాజకీయ దుమారం చెలరేగగానే తెలంగాణ అనే గొడుగు కింద చేరారు తప్ప జడివాన చల్లారగానే ఎవరిదారిన వాళు వెళ్లేవారే ! వీళ్లందరూ కోదండరాంను సేనాధిపతిగా మన్నించి ఆయన ఆదేశాలను సుగ్రీవాజ్ఞగా మన్నిస్తారని ఎవరనుకోగలరు?

వాళ్లు మాట విననందుకు కోదండరాంను శిక్షిస్తే ఏం న్యాయం? అసలు కెసియార్ ఆయన్ని ఉత్తినే కూర్చోబెట్టారు కానీ బలోపేతం చేశారా? జాక్ దగ్గరకి తను వెళ్లడం కంటె కెసియార్‌నే తన ఆఫీసు చుట్టూ తిప్పుకున్నారు. ముఖ్యమైన నిర్ణయాలు జాక్‌ను అడగకుండానే తీసుకున్నారు. పైగా ఆ విషయం బహిరంగంగా చెప్పారు. జాక్‌లో తక్కిన పార్టీలన్నీ కోదండరాం కెసియార్ చేతిలో కీలుబొమ్మ అని ఆరోపిస్తూంటే 'అవును కీలుబొమ్మే' అని చాటిచెప్పారు. అలాటి బొమ్మ హఠాత్తుగా మనిషిలా అయిపోతుంది?

తెరాస ఉద్దేశంలో జాకే కాదు, తెలంగాణలో మనదలచిన పార్టీలన్నీ తను చెప్పినట్టే వినాలి. తెలంగాణలో రాజకీయ ఉద్యమం యావత్తూ గులాబీజండా కిందనే జరగాలి. బిజెపి స్వంతంగా రాజకీయ ఎజెండా పెట్టుకోవడం దానికి యిష్టం లేదు. బిజెపి మాత్రం రాజకీయపార్టీ కాదా? దాని లెక్కలు దానికి వుండవా? అందుకే వాళ్లు కోదండరాం చెప్పినదాన్ని పట్టించుకోవడం లేదు. పరకాలలో పోటీ చేసి తీరతాం అంటున్నారు. అదే జరిగితే తనకు కోదండమే అని కోదండునికి తెలుసు. అందుకనే ఆయన జాక్ సమావేశం పెట్టి – జాక్ తరఫున ఉమ్మడి అభ్యర్థి వుండాలి అంటున్నారు. పాలమూరు విజయంతో ఉరకలు వేస్తున్న బిజెపి వింటుందా? పాలమూరు పరాజయంతో రంకెలు వేస్తున్న తెరాస వింటుందా? వారిలో ఎవరో ఒకరు గెలవవచ్చు, లేదా బహుముఖ పోటీలో యిద్దరూ ఓడిపోవచ్చు. ఎటుపోయి ఎటు వచ్చినా దండన మాత్రం కోదండునికే ! అది ఖాయం !!– **ఎమ్బీయస్ ప్రసాద్ (ఏప్రిల్ 2012)**

## మే 01 ఎమ్బీయస్ : దీనిలోనూ వైయస్ వారసత్వమా?

జగన్ తన తండ్రి వైయస్ వారసత్వాన్ని ఆస్తుల విషయంలో కోరుకున్నారు. ఓకే. రాజకీయ వారసత్వాన్ని కోరుకున్నారు. సోనియా కాదంది. జనాల్లో పడి తేల్చమని అడుగుతున్నారు. ప్రయత్నం చేయడంలో తప్పేమీ లేదు కాబట్టి అదీ ఓకే. మతం విషయంలో, గుడి మర్యాదల విషయంలో కూడా కోరుకోవడంలోనే చిక్కు వస్తోంది. జగన్ వాదన ఏమిటి ? – మా నాన్న తిరుమల గుడికి 23 సార్లు వెళ్లారు. తిరుమలకు నడిచి వెళ్లారు. ప్రభుత్వనేతగా బ్రహ్మోత్సవాలలో పట్టువస్త్రాలిచ్చారు. అలాటాయన కొడుకుని డిక్లరేషన్ అడగడమేమిటి? అని.

ఇది అత్యంత హాస్యాస్పదమైన విషయం. తండ్రిది ఏ మతమైతే కొడుకు అదే మతం అవలంబిస్తున్నాడని ఎవరు చెప్పగలరు? ఇక్కడ వైయస్ క్రైస్తవుడిగా బతికారు, క్రైస్తవుడిగా మరణించారు. ఆయన్ని క్రైస్తవాచారాల ప్రకారమే ఖననం చేశారు తప్ప హిందూ పద్ధతిలో దహనం చేయలేదు. అయితే ఆయనకు హిందూ దేవుళ్లపై అభిమానం వుండి వుండవచ్చు. అది మనసులోంచి వచ్చి వుండవచ్చు, లేదా జనం కోసమైనా మర్యాద చూపవచ్చు, నటించవచ్చు. మనం వున్న ప్రదేశంలో వాళ్ల పద్ధతులు పాటిస్తున్నామా లేదా అన్నదే ముఖ్యం. వైయస్ అలా పాటించినంత మాత్రాన కొడుకు పాటించాలని లేదు. మతం పట్ల గాఢత వ్యక్తి వ్యక్తికి మారుతుంది.

గాంధీగారు హిందూమతాన్ని ఎంతో అభిమానించారు. ఆయన కొడుకు ముస్లిముగా మారాడు. అంబేద్కర్ తలిదండ్రులు హిందువులు. ఆయన బౌద్ధమతం తీసుకున్నారు. అనేకమంది విదేశీ ఇస్కాన్ భక్తుల తలిదండ్రులు క్రైస్తవులు. వాళ్లు హిందువులుగా మారారు. షర్మిలా టాగోర్, హేమా మాలిని తలిదండ్రులు హిందువులు, కానీ వీళ్లు ముస్లిములుగా మారారు. ఇలా ఎన్నో చెప్పవచ్చు. చెవిరెడ్డి భాస్కరరెడ్డి వాదన మరీ వింతగా వుంది – వైయస్ కుటుంబసభ్యులకు డిక్లరేషన్ అవసరమా?ట. వాళ్లు పక్కా క్రైస్తవులని అందరికీ తెలుసు. అల్లుడు క్రైస్తవమత ప్రచారకుడు కూడా. విజయలక్ష్మిగారు కూడా క్రైస్తవంమీద పుస్తకం రాశారని విన్నాను. వీళ్లందరూ తిరుమలకు వచ్చినపుడు అక్కడి సంప్రదాయాలు పాటించనక్కరలేదనడానికి ఏమైనా దిగి వచ్చారా? మసీదులోకో, గురుద్వారాలోకో తల కప్పుకోకుండా వెళ్లమనండి చూదాం.

జూపూడి ప్రభాకరరావు సాధారణంగా న్యాయంగా, తెలివిగా మాట్లాడే వ్యక్తి. ఆయన కూడా 'జగన్ 10,15 సార్లు దర్శనానికి వచ్చారు. డిక్లరేషన్ యివ్వడం అవసరమా? ఆయనమైనా ఇతర దేశాల నుండి వచ్చిన వ్యక్తా?' అని వాదిస్తున్నారు. మీరు వందసార్లు రాంగ్ సైడ్‌లో వాహనాన్ని నడిపి వుండవచ్చు. పోలీసులు వాళ్లు వదిలేసి వుండవచ్చు. ఈ సారి పట్టుకున్నారు. చలాన్ కడతారా? లేక ఇంతకుముందు వదిలేశారు, యిప్పుడేం వచ్చింది పోయేకాలం అని వాదిస్తారా? పైగా జగన్ విదేశాలనుండి వచ్చిన వ్యక్తా అని అడుగుతున్నారు. ఇక్కడ పాస్‌పోర్టు చెక్ చేయడం లేదు స్వామీ, మతం.. మతం గురించి చర్చ. నాన్–రెసిడెంట్ హిందూలను డిక్లరేషన్ యిమ్మనమని అడగటం లేదు. నాన్–హిందూలనే అడుగుతున్నారు.

జగన్ 10, 15 సార్ల మాట ఏమో కానీ 2009లో వచ్చినప్పటి సంగతి గురించే యిప్పుడు చర్చ జరుగుతోంది. అప్పుడు అడగలేదు కానీ, యిప్పుడెందుకు అడుగుతున్నారు? అని జగన్ అన్నారని ఒక పత్రిక రాసింది. డిక్లరేషన్‌కై కోరిన సిబ్బందికి జగన్‌నుండి స్పందన లేదు అని ఈనాడు రాసింది. జ్యోతి 'మంగళవారం సాయంత్రం నుండి డిక్లరేషన్‌కై ప్రయత్నించారు, రిజిస్టర్‌లో సంతకం చేసేందుకు జగన్ అంగీకరించలేదు, గతంలో వచ్చినపుడు సంతకం చేయలేదు అని జగన్ నిరాకరించారని సుబ్రహ్మణ్యం ధ్రువీకరించారు.' అని రాశారు. కానీ సాక్షి ప్రకారం – అప్పుడు యిచ్చారు కాబట్టి యిప్పుడు యివ్వటం లేదు అని జగన్ అనుచరులు చెప్పారని సుబ్రహ్మణ్యం అన్నారట. అసలు మా దగ్గరకి ఎలాటి పత్రాలూ తీసుకురాలేదని చెవిరెడ్డి అంటున్నారు. ఇంతకీ జగన్

గతంలో ఒక్కసారైనా యిచ్చారా? యివ్వలేదా?

వీళ్లంతా భారతీయ క్రైస్తవులు. అసలుసిసలు విదేశీక్రైస్తవురాలు సోనియా యిచ్చిందా లేదా? భూమన కరుణాకరరెడ్డి 'ఇటాలియన్ అయిన సోనియా నుండి ఒక్కసారైనా డిక్లరేషన్ తీసుకున్నారా?' అని అడిగారు. 'ఆహా, నాలుగుసార్లు వచ్చారు, నాలుగుసార్లూ యిచ్చారు' అని పిసిసి ఉపాధ్యక్షుడు నవీన్ కుమార్ రెడ్డి అంటున్నారు. జ్యోతి కూడా దాన్ని కన్‌ఫమ్ చేసింది. ఈనాడు ప్రకారం చంద్రబాబు హయాంలో వైయస్ సోనియాను తీసుకుని వచ్చి డిక్లరేషన్ యివ్వకుండా తీసుకుని వెళ్లాలని శతథా ప్రయత్నించి విఫలమయ్యారుట. అప్పుడు సోనియా సైన్ చేశారట. "ది హిందూ" ప్రకారం '2006లో సోనియా వచ్చినపుడు ఈ అంశం లేవనెత్తలేదు'. అప్పటికి వైయస్సేగా సిఎం. అందుకని డిక్లరేషన్ జాన్తానై.

సరే, వైయస్ యివ్వలేదు. వైయస్‌పై అప్పట్లో యింత ఒత్తిడి లేదు. ఆయన హిందూయా, క్రైస్తవుడా అన్న చర్చ లేదు. ఏదో పంచె కట్టుకున్నాడు కదా, హిందువేలే అనుకుని వూరుకున్నారు. ఆయన కూడా తనది 'దేవుడి పాలన' అని ఉభయతారకంగా అన్నాడు కానీ 'జీసస్ పాలన' అని ప్రత్యేకంగా అనలేదు. ఆ మాట కొస్తే తిరుపతికి వచ్చిన అనేకమంది విఐపిల వద్ద డిక్లరేషన్ తీసుకుని వుండరు. ఉదాహరణకి రతన్ టాటా పార్శీ. అన్యమతస్తుడు. ఆయన వద్ద అడిగి వుండరు. పార్శీ దేవాలయంలో మనం అడుగుపెడతానంటే కాళ్లు విరక్కొడతారు. చాలామంది హిందూ విఐపిల అల్లుళ్లు, కోడళ్లు అన్యమతస్తులు అయివుండవచ్చు. కుటుంబంతో వచ్చినపుడు వాళ్లూ వచ్చేస్తున్నపుడు వాళ్ల మొహానికి అడ్డంగా పుస్తకం పెట్టి సంతకం పెట్టు అంటే ఎబ్బెట్టుగా వుంటుంది అనుకుని వూరుకోవచ్చు. వాళ్ల కుటుంబం కోట్లాది రూపాయల విరాళాలు యిస్తున్నపుడు వెంకటేశ్వరుడిపై భక్తితో యిస్తున్నట్టేగా అనుకుని సమాధాన పడి వుండవచ్చు. అది అలా నడుస్తూ వచ్చింది.

ఇప్పుడు జగన్ వంతు వచ్చింది. రెడ్డి కులస్తులందరూ జగన్ వైపు వెళ్లిపోతున్నారన్న ప్రచారం రావడంతో జగన్ రెడ్డి కాదు, క్రైస్తవుడు సుమా అని ప్రతిక్షకులు మనకు తెల్లవార్లూ చెపుతున్నారు. జగన్ మతాన్ని అడుగడుగునా గుర్తు చేస్తున్నారు. రేపో మాపో అతను 'రెడ్డి' అనే పదాన్ని వుపయోగించకూడదంటూ ఎవరైనా పిల్ వేయవచ్చు కూడా. ఇది క్షేత్రస్థాయి వాస్తవం.

దీన్ని జగన్ గుర్తించాలి. అవును, నేను క్రైస్తవుడిగా పుట్టాను. అయినా హిందూ మతాన్ని గౌరవిస్తాను అని ఒక్కమాటంటే పోతుంది. నా కులం పేదరికం, మతం బీదరికం అంటూ డిఎంకె డైలాగులు ఎందుకు? మతం పేదరికం అన్నాడు కదాని ఆయన తన పెళ్లి గుడిసెలో చేసుకుని వుండడు కదా, చర్చిలోనే చేసుకుని వుంటాడు. తిరుమలలో డిక్లరేషన్ గురించి అడిగినపుడు దాన్ని వివక్షత కింద అనుకోవడం దేనికి? వాళ్ల పద్ధతి వాళ్లు పాటిస్తున్నారు, సంప్రదాయాన్ని గౌరవిద్దాం అనుకుంటే యింత రగడ అయివుండేది కాదు. అక్కడ సంతకం పెట్టకపోయినంత మాత్రాన ఆయన హిందువని మనమంతా అనుకుంటా మనుకుంటున్నాడా? జగన్‌కు ఓట్లు పడేది, పడుతున్నదీ – ఆయన క్రైస్తవుడా? హిందువా? అన్న అంశంపై కాదు. ఆయన ఏదో ఉద్ధరిస్తాడన్న ఆశ కొద్దీ ఆయన చుట్టూ తిరుగుతున్నారు.

తిరుమలలో డిక్లరేషన్‌పై రాజకీయం చేస్తున్నారంటూ సాక్షి తెగ రాస్తోంది. ఏం చేయకూడదా? క్రైస్తవ సంఘాలు తనపై దండెత్తినపుడు తాను పరిపూర్ణ క్రైస్తవుడనంటూ డిక్లరేషన్ యిచ్చిన జగన్ యిప్పుడు హిందూ సంఘాలు దండెత్తినపుడు వెంకటేశ్వరుడిపై తనకు నమ్మకం వుందంటూ తన పత్రికలో ఓ సైన్‌డ్ ఆర్టికల్ రాయకూడదా?

ఓ సారి సాక్షి పత్రికలో క్రీస్తు ఫోటో వేయాల్సివచ్చింది. డెస్క్ చూసే సబ్ ఎడిటర్ ఇంటర్నెట్‌లోంచి ఓ ఫోటో డౌన్‌లోడ్ చేసి వేసేసింది. నిజానికి ఆ బొమ్మ క్రీస్తును అవమానపరిచే తీరులో ఓ చేతిలో సిగరెట్టు, మరో చేతిలో వైన్ గ్లాసు వున్నాయి. అది ఆ అమ్మాయి చూసుకోలేదు. మర్నాడు పేపర్లో వచ్చాక క్రైస్తవసంఘాలు విరుచుకుపడ్డాయి. సాక్షి క్రైస్తవాన్ని అవమానపరిచిందంటూ స్టేటుమెంట్లు గుప్పించాయి. అప్పుడు జగన్ ముందుకు వచ్చి సంజాయిషీలు యిచ్చారు. తనెంత పరమ పవిత్రుడైన క్రైస్తవుడో చెప్పుకున్నారు. అసలు సాక్షి పత్రిక క్రైస్తవ పర్వదినం నాడే ప్రారంభించామని గుర్తు చేశారు. ఆ ఫోటో పొరపాటున వేసినమ్మాయి కూడా పవిత్ర క్రైస్తవురాలే, ఓ ఫాదిరీ కూతురు కూడా అని చెప్పారు. (అదే పొరబాటు ఏ హిందువో చేసి వుంటే కావాలని చేసిందని కొరత వేసేవారేమో, క్రైస్తవురాలు కాబట్టి బతికిపోయింది) పొరపాటు మన్నించమని లెంపలు వేసుకున్నారు. అదే తిరుమల విషయానికి వచ్చేసరికి డిక్లరేషన్ అడగడమే పాపమన్నట్టు ప్రవర్తిస్తున్నారు.

పైగా సాక్షిలో చిలుకూరు సౌందరరాజన్ గారి నుండి సర్టిఫికెట్టు ఒకటి వేశారు. 'తిరుపతిలో సంతకం చేయకుండా వెళ్లడం పెద్ద తప్పేమీ కాదు' అంటూ. ఆయన స్వంత రాష్ట్రమైన తమిళనాడులో కొన్ని దేవాలయాల్లో చొక్కా విప్పకపోతే తోలు తీస్తారు. అదేమంటే సంప్రదాయం అంటారు. దేవాలయాల అభివృద్ధిలో వైయస్‌కు సాటి లేరని ఆయన చెప్పారు. కావచ్చు. వైయస్ దేవాలయాలే కాదు, చర్చిలు కూడా అభివృద్ధి పరిచారని అందరికీ తెలుసు. ఇక్కడ వివాదం వైయస్ గురించి కాదు. ఆయన్ని ఎవరూ డిక్లరేషన్ అడగలేదు, ఆయన సంతకం పెట్టలేదు. ఇస్యూ జగన్ గురించి. డిక్లరేషన్ అడిగినప్పుడు కూడా ఆయన పట్టించుకోకపోవడమే తిరుమల పట్ల ఆయన తృణీకారాన్ని చూపిస్తోంది.

'అంత తృణీకారం వుంటే ఆయన గుడికే వచ్చేవాడు కాదు, రెండు గంటల పాటు ఓపిగ్గా దర్శనం కోసం పడిగాపులు కాచేవాడు కాదు' అని మీరనవచ్చు. అలాటప్పుడు దాన్ని భయంగా వర్ణించాలి. డిక్లరేషన్‌పై సంతకం పెడితే నాన్-హిందూగా, నాన్-రెడ్డిగా ప్రజల మనస్సులో ముద్ర పడిపోతానన్న జంకు అయివుంటుంది అంటాను. ఆ జంకును కప్పిపుచ్చుకోవడానికి ఆయన బింకం

చూపిస్తూ వుండవచ్చు. ఇలాటి భయాలు అనవసరం. సోనియా భారతీయురాలు కాదని తెలుసు, హిందూ కాదని తెలుసు. అయినా భారతదేశాన్ని ఆవిడ నడిపేస్తూ వుంటే మనం సహిస్తున్నామా లేదా? మన్‌మోహన్ సింగ్ సిక్కు. హిందువు కాదు. మనకేమైనా చిక్కు వచ్చిందా? వైయస్ క్రైస్తవుడు. 2009లో మళ్లీ ఎన్నుకున్నామా లేదా? మజ్లిస్ పూర్తిగా ముస్లిముల పార్టీ, హిందువులు ఓట్లు వేయడం లేదా? బిజెపి హిందూత్వ పార్టీ, అయినా అనేక రాష్ట్రాలలో ముస్లిములు ఓట్లు వేయలేదా?

ఈ ఫ్యాక్టర్లన్నీ చిన్న స్థాయి వరకే తప్ప ఓ స్థాయి దాటాక యివేమీ పరిగణనలోకి రావు. చంద్రబాబును కమ్మనాయకుడిగా చూస్తామా? కెసియార్‌ను వెలమనాయకుడిగా చూస్తామా? అక్కడ పార్టీ, సిద్ధాంతాలు యివే లెక్కలోకి తీసుకుంటాం. తనను ఆ స్థాయిలో చూడరని, కేవలం రెడ్డి నాయకుడిగా తీసుకుంటారని, డిక్లరేషన్‌పై సంతకం పెట్టడం వలన క్రైస్తవుడిగా తెలిసిపోయి హిందువులు దూరం పెట్టేస్తారని జగన్ అనుకుంటూ వుంటే అతన్ని చూసి జాలిపడాలి.

ఇక జగన్ అనుయాయులు గుడిలో చేసినదాన్ని గురించి కూడా కాస్త చెప్పేసుకుంటే యీ టాపిక్ ముగించేయవచ్చు. ఈనాడు ప్రకారం 'జగన్ గుడిలో రెండు గంటలపాటు తిష్ట వేశారు, దానితో భక్తులు భయకంపితులయ్యారు, అనుచరగణం జై జగన్ అని నినదించారు. అది చూసి అర్చకులు లెంపలేసుకున్నారు.' సాక్షి ప్రకారం – 'జగన్‌కి ఏ మర్యాదా యివ్వలేదు. 7.30కు వైకుంఠం కాంప్లెక్సులో వుండి, 17 వ నెంబరు చాంబర్ తాళం తీయకపోతే పక్కదాంట్లో కూర్చుని, అరగంట ఆగాక 8.00 కి రంగనాయకమండపం చేరి, 200 మంది భక్తులు దర్శనం అయ్యాకనే 9 గం౹౹లకు లోపలకి వెళ్లి 15 ని౹౹లు వెయిట్ చేసి దర్శనానికి వచ్చారు. దర్శనం అయ్యాక తిరిగి వస్తూంటే ఓ భక్తుడు జై జగన్ అంటే జగన్ వారించాడు'.

ఆలోచిస్తే – ఎవరూ తిరుమల గుడిలో రెండు గంటలపాటు తిష్ట వేయరు. మనమే వేయం. వెళ్లగానే దర్శనం కోసం ఉబలాటపడతాం. తనను తాను సూపర్ విఐపి అనుకునే జగన్ అవతల ఎన్నికల ప్రచారం పెట్టుకుని మామూలు భక్తుడిలా కూర్చున్నాడు అనుకోవడం అవివేకం. టిటిడి వాళ్లు పెద్దల ఆదేశంతో అతన్ని కావాలని అలా కూర్చోబెట్టారు. ఇక స్లోగన్స్ – బాపిరాజు గారు యీ మధ్య ఓ స్వాములార్ని తీసుకుని వస్తే ఆయన శిష్యులు కూడా యిలాగే స్లోగన్స్ యిచ్చారు. ఈనాడు, సాక్షి చెప్పిన రెండింటిలో చాలా తేడా వుంది కాబట్టి 'ది హిందూ' రిపోర్టు నమ్మవచ్చు. వాళ్ల ప్రకారం – 'దర్శనానంతరం మహాద్వారం వద్ద జగన్ అనుయాయులు స్లోగన్స్ యిస్తే వాళ్ల పార్టీ నాయకులు మందలించి ఆపించారు'.

ఈ కార్యకర్తలను ఆపడం అంత సులభం కాదు. ఈ మాత్రానికే భక్తులు భయకంపితులయ్యారని, అర్చకులు లెంపలేసుకున్నారనీ రాయడం ఈనాడు కవిత్వం. అర్చకులు లెంపలేసుకోవలసిన ఘట్టాలు చాలా వున్నాయి. వచ్చిన ప్రతీ డబ్బున్నవాడికీ పూర్ణకుంభాలతో స్వాగతం చెప్పి చెప్పి, అడగవలసిన చోట కూడా డిక్లరేషన్స్ అడగకుండా వాళ్లు వెంకన్నను పలుచన చేసేశారు. అందుకే యీ రోజు ఓ కాగితమ్ముక్కపై ఓ చిన్న సంతకం పెట్టడానికి జగన్ యింత మొరాయిస్తున్నాడు. మొండివాడు రాజుకంటెనే కాదు, దేవుడి కంటె కూడా బలవంతుడని తేలింది. **(సమాప్తం) – ఎమ్బీయస్ ప్రసాద్ (మే 2012)**

## మే 03 ఎమ్బీయస్ : ఎట్టకేలకు ప్రైవేటు బిల్లు

తెలంగాణపై ఎట్టకేలకు ప్రైవేటు బిల్లు పెట్టబడింది. అధికారికంగా బిల్లు వచ్చే ఆశ యిప్పట్లో కనబడటం లేదు. ప్రైవేటు బిల్లుకై బిజెపి మూడేళ్ల కితం నోటీసు యిస్తే యిన్నాళ్లకు మోక్షం కలిగింది. బిజెపి లీడరు జావదేకర్ ప్రసంగం చేస్తూ తెరాసవారి వాదనను వినిపించారు. 'కొత్త రాష్ట్రాన్ని అడగటం లేదు, 1956కు పూర్వం వున్న హైదరాబాదు రాష్ట్రాన్ని పునరుద్ధరించమంటున్నాం' అని. హైదరాబాదు రాష్ట్రమంటే ప్రస్తుతం మహారాష్ట్రలో వున్న మరాట్వాడా, కర్ణాటకలో వున్న హైదరాబాదు-కర్ణాటక ప్రాంతం కూడా కలిసివున్న రాష్ట్రం. ఇప్పుడు దాన్ని పునరుద్ధరించాలంటే జావదేకర్ సొంత రాష్ట్రంవాళ్లు ఒప్పుకుంటారా? ఆ మాత్రం కూడా ఆలోచించకుండా ఆయన పాఠం అప్పచెప్పేశాడు. తెలంగాణ కోసం మేం చేయాల్సినదంతా చేసేశాం అని చెప్పేసుకుంటారిక. నిజంగా వాళ్లు నెగ్గి ఎన్‌డిఏ ప్రభుత్వం ఏర్పడ్డాక తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు మరో 'రామమందిర నిర్మాణం' అవుతుందో, 'మూడు రాష్ట్రాల ఏర్పాటు' అవుతుందో వేచి చూడాల్సిందే !

ఈ సందర్భంగా కాంగ్రెస్ ఏం చేసిందో చూస్తే తెలంగాణ ఏర్పాటుపై ఒక అంచనాకు రావచ్చు. రాజ్యసభలో తెలంగాణపై ప్రయివేటు బిల్లు ప్రవేశపెట్టే సమయానికి కోరమ్ లేకుండా చేయడానికి కాంగ్రెస్ శతథా ప్రయత్నించింది. గంట కొట్టినా ఎవరూ లోపలికి వెళ్లకుండా బయటే కబుర్లు చెప్పుకుంటూ కూర్చున్నారు. ఇది గమనించి బిజెపి తన పార్టీ సభ్యులను, ప్రతిపక్షసభ్యులను తోలుకుని వచ్చింది. 25 మంది పోగడడంతో సభ ప్రారంభమైంది. ఇక దీన్ని అడ్డుకోలేమని గ్రహించి కాంగ్రెస్ వాళ్లూ వచ్చారు. జావదేకర్ మాట్లాడాక కాంగ్రెస్ తరఫున యిద్దరు మాట్లాడారు – కెవిపి, వి హనుమంతరావు. ఇద్దరూ ఆ పార్టీ ప్రతినిధులే. ఇద్దరి చేతా తలోరకంగా మాట్లాడించింది అధిష్టానం.

కెవిపి ఇదంతా రాజకీయ పరమైన డిమాండ్ తప్ప అభివృద్ధి అనేది అంశమే కాదన్నారు. తక్కిన ప్రాంతాల కంటె తెలంగాణ వెనకబడలేదని కృష్ణ కమిటీ చెప్పిందని గుర్తు చేశారు. రెండో ఎస్సార్సీ వేస్తే మంచిదన్నట్టు మాట్లాడారు. (మాట్లాడారు అనడం కరక్టు కాదు, తడబడుతూ మాటలు వదిలారు అనడం కరక్టు). ఇక హనుమంతరావు ఎప్పటిలాగా తెలంగాణ వాదం వినిపించారు.

కాంగ్రెస్ తన ద్వంద్వ వైఖరిని కొనసాగించదలచుకుంది అనేగా దీని అర్థం అనవచ్చు మీరు. ఆడా, మగా సమానమే కానీ మగాళ్లు కాస్త ఎక్కువ సమానం అన్న సామెతలా కాంగ్రెస్ రాష్ట్రవిభజనకు వ్యతిరేకతను ఎక్కువ ప్రదర్శిస్తోంది అని గమనించి తీరాలి. లగడపాటి చేత ఆగస్టు తర్వాత కానీ తెలంగాణపై నిర్ణయం రాదని చెప్పించడం ఒకటి. లగడపాటి చెప్పేదాని వెనుక అధిష్టానం ఆశీస్సులున్నాయని ఎలా చెప్పగలవు అనవచ్చు మీరు. గతంలో దీని గురించి కొంత రాశాను.

డిసెంబరు 9 తర్వాత కాంగ్రెస్ పక్షాన రాజీనామా చేసిన తొలి నాయకుల్లో లగడపాటి ఒకరని అందరికీ తెలుసు. అప్పటికే చంద్రబాబు రాజీనామాల పర్వానికి ప్రణాళిక రచించారని ఢిల్లీ వాళ్లకు ఉప్పు అంది వుంటుంది. కోస్తా, సీమల్లో అది బాంబులా పేలుతుందని తెలుసు. ఆ క్రెడిట్ టిడిపికి పోకుండా లగడపాటిని, జెసిని రాజీనామా చేయమని వాళ్లే చెప్పి వుంటారు. డిసెంబరు 23 తర్వాత తెలంగాణలో మళ్లీ యిలాటి డ్రామానే అభినయించమని ఢిల్లీ నుండి గాంధీభవన్‌లో వున్న తమకి ఆదేశాలు వచ్చాయని అప్పుడు కాంగ్రెస్‌లో యిప్పుడు వైయస్సార్పీలో వున్న గట్టు రామచంద్రరావు చెప్పారు. డిసెంబరు 23 న చేసిన ఆ పని చేసిన వాళు డిసెంబరు 10న చేసి వుండరా? అందుకే ఢిల్లీని ధిక్కరించినట్టు కనబడిన లగడపాటి, జెసిలకు ఏ హానీ కలగలేదు. ఆ తర్వాత కూడా అనేకసార్లు ఢిల్లీవాళ్లు యిలా చేయబోతున్నారని లగడపాటి చెప్తూ వచ్చారు. అలాగే జరుగుతూ వచ్చింది.

ఇక చిదంబరం నెలవారీ సమావేశాల్లో మామూలుగా చెప్పేది చెప్పడమే కాకుండా పార్లమెంటులో మళ్లీ పునరుద్ఘాటించారు – రాష్ట్రంలో ఏకాభిప్రాయం వస్తే దాన్నే తాము అమలు చేస్తామని. గతంలో పై నుంచి రుద్దబోతే ఏమైందో రుచి చూశారు కదా ! నిజానికి ఆ రుద్దుడు కూడా రాష్ట్రనాయకుల నయవంచకత్వంపైనే జరిగింది. బంతి అవతలి కోర్టులో పడేసి తాము మంచిపేరు తెచ్చుకుందామని టిడిపి వాళ్లనుకున్నారు. ఫైనల్‌గా నిర్ణయం ప్రకటించబోయేముందు ఢిల్లీ వారు సమావేశం పెడితే అప్పుడు అడ్డుపుల్లలు వేసి, సన్నాయి నొక్కులు నొక్కుదామనుకున్నారు. తాము విభజనకు అనుకూలం అన్నట్టు నటిస్తూనే వుంటూ ఢిల్లీనే ఉ రేద్దామనుకున్నారు.

ఢిల్లీ వాళ్లు శుబ్బరంగా '..మీరు చెప్పిన ప్రకారం' – అంటూ డిసెంబరు 9 ప్రకటన చేసి వీళ్లను యిరకాటంలో పడేశారు. వెంటనే ఆంధ్రప్రాంతపు టిడిపివాళ్లు రాజీనామాలు మొదలుపెట్టారు. వాళ్లకు ఎడ్వాంటేజి వెళ్లకుండా ఢిల్లీ అధిష్టానం రాష్ట్ర కాంగ్రెస్‌వాళ్లనూ చేయమంది. ఇక రెండువైపులా నాటకం ప్రారంభమైంది. అదే చిదంబరం గుర్తు చేశారు. 'ఇలాటి పరిస్థితుల్లో నేనే కాదు, ఏ హెూం మంత్రీ తెలంగాణపై ప్రకటన చేయలేదు. మా సొంత పార్టీతో సహా అందరూ అభిప్రాయాలు మార్చుకుంటూ పోతే ఎవరు మాత్రం ఏం చేయగలరు?' అని నిర్మొగమాటంగా చెప్పేశాడు. కేంద్రం తన అభిప్రాయాన్ని బలవంతంగా రాష్ట్రంపై రుద్దదంటూ ఉదారత్వాన్ని ప్రదర్శించాడు.

విడిగా చూస్తే చిదంబరం మాటల్లో బేసబబు ఏదీ కనబడదు. ఉమ్మడి కుటుంబం విడిపోవాలంటే తేల్చుకోవాల్సింది అన్నదమ్ములే. తండ్రిని, ఊళ్లోని పెద్దల్ని కూర్చోబెట్టుకుని అన్నదమ్ములు తమకు ఏం కావాలో, ఎదుటివాళ్లకు ఏం యివ్వడానికి సిద్ధపడతారో క్లియర్‌గా చెప్తారు. తేడాలు వచ్చినచోట పెద్దలు పరిష్కారం చేస్తారు. తెలంగాణ విషయంలో అన్నదమ్ములు కలిసి కూర్చోవటం లేదు. ఇక పరిష్కారం ఎలా వస్తుంది? ఆజాద్ యిరుప్రాంతాల నాయకులను – కనీసం తన పార్టీ వాళ్లనైనా – కూర్చోబెట్టి మాట్లాడితేనే రథం ముందుకు సాగుతుంది. అది జరగలేదు. ఎవరికి వాళ్లు విడివిడిగా వచ్చి అవతలివాళ్లను తిట్టేసి వెళ్లిపోతూ వుంటే ఏం తేలుతుంది? సమస్యను పరిష్కరిద్దామనే ఉద్దేశం కాంగ్రెస్‌కు వుండి వుంటే తమ పార్టీ వాళ్లను ఒత్తిడి చేసి కూర్చోబెట్టేది. ఇప్పుడు విభేదాలున్న బొత్స, కిరణ్‌లను కలిసి రమ్మనమనలేదా? అలా ఆంధ్ర, తెలంగాణ ప్రాంతపు నాయకుల్ని కూర్చోబెట్టడం లేదంటే దానికి అర్థం – పరిష్కరించే ఉద్దేశం ఏ కోశానా లేదనే !

ఢిల్లీ ఎప్పుడూ వాళ్లు అటువాళ్లను, యిటువాళ్లనూ గిల్లుతూనే వుంటారు. జోకొడుతూనే వుంటారు. ఆ విధంగా ఎప్పుడూ తమ చేయే పైన వుండేట్టు చూసుకుంటారు. టి కాంగ్రెస్ ఎంపీలు సస్పెండ్ అయ్యారు. తర్వాత ఏమవుతుందో అని ఆసక్తిగా చూశాం. ఏమైంది? ఏమీ కాలేదు. గతంలో లాగానే బయటకు వచ్చి కూర్చుంటున్నారు. ముఖ్యమైన బిల్లులు పాస్ చేయాలంటే లోపలకి వెళ్లి ఓట్లేసి వస్తారట. మరి యింకెందుకు యీ నాటకం? వాళ్లను బయటకు తోసేసే ధైర్యం హై కమాండ్‌కు లేదు. తమంతట తాము వెళ్లే ధైర్యం వాళ్లకు లేదు. వెళ్తే తెరాసలో చేరాలి. కాంగ్రెస్‌లో వుండే స్వేచ్ఛ కెసియార్ దగ్గర వుండదు కదా !

ఇప్పటికే కెసియార్ 2014 వరకు తెలంగాణ రాదన్నట్టు మాట్లాడుతున్నారు. యుద్ధం ఆఖరి స్టేజిలో వుందని చెపితే వెళ్లి గెలిచే టీములో చేరవచ్చు. ఫలితాలు త్వరగా అందిపుచ్చుకోవచ్చు. ఇంకో రెండేళ్లదాకా రాదంటే ఆ లోపున రూలింగ్ పార్టీలోనే ఊరేగవచ్చుగా ! తెరాసలో చేరకుండా టిడిపి లేదా బిజెపిలో చేరాలి. టిడిపికి తెలంగాణలో భవిష్యత్తు ఎలా వుంటుందో యిప్పుడే తెలియదు. ఇక బిజెపిలో చేరదామా అని చూస్తే – చిదంబరం చెప్పినట్టు బిజెపికి యిప్పటిదాకా తెలంగాణలో భాగస్వామ్యం లేదు. ఇప్పణ్నుంచి పెరగవచ్చు. ఎంతకాలానికి, ఎంత పెరుగుతుందో గమనించాలి.

వైయస్సార్పీది కూడా అదే పరిస్థితి. ప్రస్తుతానికి లేదు. వైయస్ పేరుకున్న పలుకుబడి వలన క్రమేపీ పెరగవచ్చు. ప్రస్తుతానికి ఖాతా తెరవలేదు. ఇక చేయాల్సింది తెలంగాణ కాంగ్రెస్ పేర వేరే పార్టీ పెట్టి పోరాటం చేయాలి. ఇప్పటికే ఉద్యమపు ఓట్లు తెరాస, బిజెపిల మధ్య చీలిపోతున్నాయి. వీళ్లు పార్టీలోంచి రాజీనామా చేసి వస్తే వీళ్లపైన కూడా సింపతీ వస్తుంది. తెలంగాణ వాదం బలంగా వున్నచోట ఓట్లు కూడా పడతాయి. కానీ మళ్లీ గెలవగలరా లేదా అన్నది ఎవరూ చెప్పలేరు. అవే తెలంగాణ ఉద్యమపు ఓట్లు

ముగ్గురు, నలుగురు పంచేసుకుంటే ఎవరికీ గ్యారంటీ లేదు. అందరిదీ లాటరీయే.

ఇవన్నీ తెలిసే టి–కాంగ్రెస్‌వారు తాము పార్టీ వదలకుండా కెసియార్‌ను తమ పార్టీలోకి రమ్మంటున్నారు. ఆయన వస్తాడని తమకు నమ్మకం లేకపోయినా హై కమాండ్‌ను నమ్మిద్దామని చూస్తున్నారు. కెసియార్‌తో సోనియాకు పరిచయం లేకపోతే నమ్మేదేమో, కానీ యుపిఏ1 లో కాబినెట్‌లోకి తీసుకుని రుచి చూసిన తర్వాత కెసియార్ ఎంత తిక్కమనిషో ఆవిడకు పూర్తిగా తెలిసిపోయింది. ఆయన వస్తానంటాడో లేదో తెలియదు, వచ్చినా తన పని అయ్యాక వుంటాడో లేదో తెలియదు. మొన్న తెరాస వార్షికోత్సవ సమావేశంలో కెసియార్ స్పష్టంగా చెప్పాడు – ఎవరైనా మా పార్టీలో విలీనం కావలసిందే తప్ప, మేం వెళ్లి ఎవరిలోనూ కలవం అని. అలా కలవడానికి మాకేమైనా పిచ్చి లేచిందా అని.

దేశస్వాతంత్ర్యం కోసం కాంగ్రెస్ పార్టీతో పాటు ముస్లింలీగు, హిందూ మహాసభ, సోషలిస్టులు, కమ్యూనిస్టులు, అతివాదులు, మితవాదులు.. అందరూ కష్టపడ్డారు. వీళ్లల్లో అందరి కంటె పెద్ద పార్టీ అయిన కాంగ్రెస్ పార్టీ మీరంతా మాలో కలిసిపోవాలి అని తక్కినవారిపై ఒత్తిడి తేలేదు. వాళ్లని దేశద్రోహులని నిందించలేదు. (1942 క్విట్ ఇండియా సందర్భంగా కమ్యూనిస్టులను మాత్రం అన్నారు).

మేం మర్డర్ చేసినా తెలంగాణ కోసమే చేస్తున్నాం కాబట్టి మా చర్యల్లో ఉచితానుచితాలు, సభ్యాసభ్యాలు వెతకకూడదని తెరాసవారు చెప్పుకుని దులిపేసుకుంటారు. అనాల్సింది ఎవర్నైనా వుందా అంటే యిటువంటి టూ–టైమింగ్ ప్రియుడితో ఢిల్లీ కాంగ్రెస్‌తో పరిణయం కుదిర్చిన తెలంగాణ కాంగ్రెస్ నాయకుల్ని అనాలి. పాదయాత్ర చేసి వెలిగిపోతున్న వైయస్‌కు ముకుతాడు వేయడానికి కెసియార్‌ను వాడుకున్నారు వాళ్లు. ఫలితాలు అటూయిటూగా వస్తే కెసియార్ మద్దతు యిచ్చినవారికే సిఎం పదవి దక్కుతుందనే పరిస్థితి ఏర్పడుతుందని, అప్పుడు తమలో ఒకరికి ఆ పదవి దక్కుతుందని వాళ్ల ప్లాను. వాళ్ల ప్లాను పసిగట్టి వైయస్ యీ పొత్తును వ్యతిరేకించారు కానీ ఆయన మాట చెల్లలేదు. హై కమాండ్ కంటె వైయస్‌ను ప్రజలు ఎక్కువ నమ్మారు. కాంగ్రెస్‌కు ఘన మెజారిటీ కట్టబెట్టారు. తర్వాత జరిగినది చరిత్ర.

తెరాస ఉద్భవించేవరకు ప్రత్యేక తెలంగాణ గురించి ఎవరూ మాట్లాడేవారు కారు. ఈరోజు ఏ రోజు చూసినా, ఏ గంట చూసినా, ఏ వేదిక చూసినా అదే చర్చ. దానికి కారణం మేం కదా, తెలంగాణ అంశం మా సృష్టి. గాలిలోంచి పట్టుకుని వచ్చి ప్రతిష్ఠాపించాం. ప్రసాదం మాకు దక్కక యితరులకు పోతే ఎలా? అని కెసియార్ భావన. తెలంగాణ అని అనదలచుకుంటే కారెక్కి మాత్రమే అనాలి. సైకిలెక్కి అంటే వినబడలేదంటాం అంటాడు. పార్లమెంటులో గోల చేసి సస్పెండ్ అయిన కాంగ్రెస్ ఎంపీలను కూడా ఆయన స్పేర్ చేయలేదు, అయ్యోపాపం అనలేదు. అక్కడెందుకు వేళ్లాడడం? బయటకు వచ్చేయాలి అన్నాడు. వచ్చి మాలో కలవాలి.. అని చేర్చలేదు కానీ అదే భావం. అదే టోన్‌లో బిజెపిని తిట్టిపోశాడు. జాతీయపార్టీలా గాడిదగుడ్డా వీళ్లంతా మాలాటి ప్రాంతీయ పార్టీలే, కొత్తబిచ్చగాళ్లలా తెగ ఎగురుతున్నారన్నాడు.

పార్లమెంటులో ఒకప్పుడు సుష్మా స్వరాజ్ కెసియార్, విజయశాంతిలను వెనకేసుకుని రావచ్చు. అదంతా గతం. ఇప్పుడు యిద్దరూ పోటీదార్లుగా మారారు. ఎక్కడైనా బావ గానీ వంగతోట దగ్గర బావ కాదన్నట్టు బిజెపితో ఢిల్లీలో స్నేహమే కానీ తెలంగాణలో వైరమే. కెసియార్ తన ప్లాను స్పష్టంగానే చెప్తున్నారు. 2014 వరకు ఆయనకు తెలంగాణ అక్కరలేదు. ప్రజలను ఓపిక పట్టమని పదేపదే చెప్తున్నాడు. 2014 ఎన్నికలలో తెలంగాణలో వీలైనన్ని ఎక్కువ అసెంబ్లీ సీట్లు, పార్లమెంటు సీట్లు ఆయనకు కావాలి. ఆ బలంతో ఆయన ఏం చేద్దామనుకుంటే అది చేస్తారు. తెలంగాణ యివ్వకపోతే మద్దతు యివ్వనని కేంద్రప్రభుత్వంలోని కూటమిని బెదిరించవచ్చు. లేదా రాష్ట్రంలో త్రిశంకు ప్రభుత్వం ఏర్పడితే తనే బలంతో సిఎంగా ఎవరినైనా నిలబెట్టవచ్చు, లేదా తనే సిఎం కావచ్చు, మొత్తం రాష్ట్రాన్ని ఏలవచ్చు. తెలంగాణ ఏదయ్యా అంటే 'ఇప్పుడు రాష్ట్రమంతా మనదే. గతంలో వాళ్లు మనల్ని దోచుకున్నారు కదా, మనం యిప్పుడు వాళ్లను దోచుకుందామని సిఎంను అయ్యాను. పదండి, దోచండి' అని ట్విస్టు యివ్వవచ్చు. చెన్నారెడ్డి ఎప్పుడూ ప్రత్యేక తెలంగాణ అంటూ వుండేవారు. ఎప్పటిదాకా? తను సిఎం అయ్యేదాకా. అయ్యాక 'తెలంగాణ అన్నది ముగిసిన అధ్యాయం' అని ప్రకటించారు. మొత్తం రాష్ట్రాన్ని ఏలారు. రాజకీయాల్లో ఏదైనా సాధ్యమే.

కెసియార్ ప్రస్తుత మనఃస్థితి తెలిసినవారెవరూ ఆయన కాంగ్రెస్‌లో కాని, బిజెపిలో కాని ప్రస్తుతం చేరతారని అనుకోరు. అది తెలిసికూడా ఆయన చేరతాడు అని టికాంగ్రెస్ నాయకులు తమను మభ్యపెట్ట చూస్తున్నారని హై కమాండ్ వారు గ్రహించారు. అందుకే వీళ్లను ఖాతరు చేయడం లేదు. చిదంబరం పార్లమెంటు ప్రకటనలోనే ఆ నిర్లక్ష్యం కనబడింది. దానితోబాటు ఆయన టిడిపిని యిరకాటంలో పెట్టాలని చూశాడు. నామా నాగేశ్వరరావుతో 'నిన్నూ, నీ నాయకుణ్నీ కలిశాను' అన్నాడు. నాయకుడు అనగానే చంద్రబాబు అని కాంగ్రెస్‌వాళ్లు, జగన్‌వాళ్లు గోల మొదలుపెట్టేశారు. ఇదే ఘోరమనుకుంటే ఆంధ్రభూమి మరీ ఘోరంగా చిదంబరం 'మీ పార్టీ అధ్యక్షుడు చంద్రబాబు..' అని అన్నారని రాసేసింది. ఇంకో నాలుగు రోజులు పోయాక 'దూకుడు' అనే కథనం వేస్తూ 'ఇటీవలి ఉపయెన్నికలలో ఘనపూర్‌లో తప్ప టిడిపికి తెలంగాణలో డిపాజిట్ దక్కలేద'ని రాసింది. టిడిపికి 50% స్థానాల్లో దక్కిందని అందరికీ గుర్తుండే వుంటుంది. అయినా అలా రాసి పారేశారు టిడిపిపై వ్యతిరేకతతో.

చిదంబరం లాయరు. ఏ మాట ఎలా వాడాలో తెలిసిన వ్యక్తి. కావాలనే 'నాయకుడు..' అని అస్పష్టంగా వదిలేశాడు. ఏం సందర్భంలో కలిశాడు, ఏం మాట్లాడాడో చెప్పి వుంటే క్లారిటీ వుండేది. క్లారిటీ లేకుండా అసందిగ్ధంగా మాట్లాడితేనే గోల చేసే

అవకాశం వుందని తెలుసు కాబట్టి అలా మాట్లాడాడు. ఇక మన పత్రికలన్నీ ఒకటే కథనాలు – అది బాబేనని. తనపై సిబిఐ కేసుల్లో విషయంలో కలిశానని కొందరు, కాదు తెలంగాణ యివ్వవద్దని చెప్పడానికి కలిశాడని మరికొందరు, యిలా వూహాగానాలు. కలవలేదని బాబు క్లారిఫికేషన్ యిచ్చారు. ఇదంతా అవసరమా? బాబు పేరు చిదంబరానికి తెలియదా? యునైటెడ్ ఫ్రంట్ ప్రభుత్వం రోజుల్లో మిత్రులే కదా. అదే ఏ ఎర్రబెల్లియో, నాగమో అయితే ఏమో అనుకోవచ్చు. బాబు పేరు కోసం చిదంబరం తడుముకోనక్కరలేదు. మీ బాబుకూడా వచ్చారు అని వుండేవాడు. ఒకవేళ బాబు కలిసేరే అనుకోండి. అయితే ఏమిటిట? ఫైనల్ రిజల్టుగా మావాళ్లు, మీ వాళ్లు నోరు విప్పలేదు అని ఆయనే చెప్తున్నాడుగా. కలిస్తే ఎంత, కలవకపోతే ఎంత! ఇదంతా పనికి మాలిన, పైసకు కొరగాని చర్చ.

తెలంగాణ విషయంలో ఎవరూ నోరు విప్పరు, ఏదీ తేల్చరు. రాష్ట్రాన్ని మాత్రం నిలువునా ముంచారు. ఇవాళ పేపర్లో వచ్చింది – ఐటీ రంగంలో రాష్ట్రం కుదేలైందని. డిసెంబరు 9 తర్వాత నెలకొన్న అనిశ్చితిలో రాష్ట్రంలో ఐటీ వాణిజ్యం కుంటుపడింది, పెట్టుబడులు తగ్గిపోయాయి అని. ఈ ముక్క యిదివరకు చెప్తే తెలంగాణవాదులెవ్వరూ ఒప్పుకోలేదు. ప్రభుత్వం తరఫున మంత్రులు కూడా అబ్బే, అదేం లేదు అన్నారు. రోగి ఓ పక్కన చచ్చిపోతున్నా డాక్టరుగారు మనకు చెప్పరు. క్రిటికల్‌గా వుందంతే, కంగారు పడకండి అంటారు. పెట్టుబడులు రావటం లేదు, ఉన్నవే పోతున్నాయని బహిరంగంగా చెపితే – వద్దామా వద్దా? అని ఊగిసలాడేవాళ్లు కూడా వెనక్కి వెళతారని వాళ్ల భయం. నాకు మాత్రం అనేకమంది విదేశాలలో వున్న ఐటీ ఉద్యోగులు మెయిల్స్ రాశారు. మా కంపెనీవారు హైదరాబాదులో పెడదామనుకున్న ప్రాజెక్టు బెంగుళూరుకు షిఫ్ట్ చేశారని కొందరు, చెన్నయ్‌కని మరి కొందరు రాస్తే యింకొందరు ఇండియాకే గుడ్‌బై చెప్పారని రాశారు. చిదంబరంగారి సారథ్యంలో యుపిఏ2 మన రాష్ట్రానికి చేసిన మేలు యిది ! ప్రస్తుతం తెలంగాణ రాలేదని ఆత్మహత్యలు చేసుకుంటున్నారు కొందరు. కొద్దికాలం పోయాక తెలంగాణ వచ్చినా ఉద్యోగాలు రాలేదని చేసుకోవాలి. అశాంతి వున్న చోట ఎవడు మాత్రం పరిశ్రమలు పెడతారు? బంద్‌లంటూ యిక్కడ వాహనాలు తిరగనీయకపోతే స్టాఫ్ వచ్చి పనిచేయగలరా? దాని కారణంగా పని ఆలస్యమైందంటే విదేశీ క్లయింటు వూరుకుంటాడా? బందులు లేనిచోట పని చేయించు, లేదా ఆర్డరు కాన్సిలు అంటాడు.

కాంగ్రెస్ మన రాష్ట్రాన్ని తగలేయగా మిగిల్చింది ఏమైనా వుంటే బిజెపి మిగతా తగలవేత పని పూర్తిచేద్దామని చూస్తోంది. ఇప్పుడు వాళ్ల ద ృష్టిలో తెలంగాణ ఒక్కటే ప్రధాన సమస్య. రాష్ట్రాన్ని విభజించేస్తే అన్ని సమస్యలూ తీరిపోతాయి. వాళ్లు ఇంతకుముందు విభజించిన రాష్ట్రాలలో సమస్యలు తీరిన దాఖలాలేమీ లేవు. మావోయిస్టులు కలక్టర్లనే కిడ్నాప్ చేసేస్తున్నారు. అతన్ని విడిపించడానికి పోలీసులు ప్రాణాలు బలిపెట్టి పట్టుకున్న మావోయిస్టులను వదిలిపెడుతున్నారు. కలక్టరు ప్రాణాలతో యింటికి వచ్చాడు బాగానే వుంది. అతనికి రక్షణగా నిలిచిన సెక్యూరిటీ గార్డుల ప్రాణాలను మావోయిస్టులు పొట్టన పెట్టుకున్నారు కదా, మరి వాటికి లెక్కాపత్రం లేదా? ఈ మధ్యవర్తుల కంటికి వాళ్లు ఆనరా? వేరే అంశంలోకి వెళ్లిపోతున్నాం లాగుంది. చెప్పవచ్చేదేమిటంటే రాష్ట్రసాధన అన్నది గమ్యం కాదు, ప్రయాణంలో ఒక మజిలీ. దానికి ముందూ, వెనకా ఎంతో ప్రయాణం వుంటుంది. బిజెపి అది గ్రహించి వుంటే బాగుండేది. ఇప్పటికే తెలంగాణలో తెరాస, టిడిపి, కాంగ్రెస్ కొట్టుకుంటున్నాయి. ఇప్పుడు బిజెపి కూడా చేరింది. పరకాలలో తెరాసపై తొడకొడుతోంది. పాలమూరు ఎన్నిక సందర్భంగా మతవిద్వేషాలు బయటకు వచ్చాయి. ఈ సారి కులవిద్వేషాలు వస్తాయేమో. పరకాలలో కాంగ్రెస్, టిడిపిలు బిసి కాండిడేట్లను పెట్టారని తెరాస కూడా బిసి అభ్యర్థినే పెట్టబోతోందట. ఇలా తక్కినవాళ్లందరూ బిసిలపై పడ్డారు కాబట్టి యితరుల ఓట్లకోసం బిజెపి ఏ రెడ్డి అభ్యర్థినో పెట్టిందనుకోండి. 'అదుగో కిషన్ రెడ్డి రెడ్డి కాబట్టి రెడ్డి అభ్యర్థిని నిలబెట్టాడు, పాలమూరులోనూ యిదే చేశాడు' అని కులం కలరింగు యిచ్చి మళ్లీ గోల చేస్తారు. మేం లేకపోతే రజాకార్లు వచ్చి మిమ్మల్ని దోచుకునేవారంటూ బిజెపివారు మతం రంగు పులుముతారు.

కానీయండి, ఇలాటివన్నీ చేసి చివరకు 'తెలంగాణ కోసం ప్రయివేటు బిల్లు పెట్టి మా చిత్తశుద్ధి నిరూపించుకున్నాం. కాంగ్రెస్, తెరాసలు ఆ పని చేయలేద'ంటూ బిజెపి పరకాల ఉపయెన్నికలో, రాబోయే సాధారణ ఎన్నికలలో ప్రచారం చేసుకుంటారు. దానికి తప్ప మరెందుకూ ఈ ప్రయివేటు బిల్లు పనికిరాదు. **– ఎమ్బీయస్ ప్రసాద్ (మే 2012)**

## మే 13 ఎమ్బీయస్ : యాడ్స్‌కీ, కేసులకీ లింకుండాలా?

జగన్–కాంగ్రెస్ తగాదా పుణ్యమాని పెద్దగా పట్టించుకోని చాలా విషయాలపై యిప్పుడు ద ృష్టి సారిస్తున్నాం. వాటిల్లో ఒకటి ప్రభుత్వం ప్రకటనలు యిచ్చే విధానం ! "సాక్షి"లో పెట్టుబడులపై సిబిఐ కేసులు పెట్టింది కాబట్టి ఆ పేపరుకూ, టీవీ ఛానెల్‌కు యాడ్స్ ఆపేస్తున్నాం అంది కిరణ్ ప్రభుత్వం. ఆ మాట కొస్తే "ఈనాడు"పై కూడా కేసులు వున్నాయి కాబట్టి వాళ్లకు కూడా ఆపలేదేం అని బహుశా జగన్ సానుభూతిపరుడైన ఓ లాయరుగారు ప్రజాప్రయోజనవ్యాజ్యం వేశారు. దాంతో ప్రజాధనంతో నడిచే ప్రభుత్వం ప్రజాహితం కోరి యిచ్చే ప్రకటనలు ఎటువంటి వారికి, ఎలా యివ్వాలి అన్న చర్చ ప్రారంభమైంది.

అసలు ప్రకటనలు ఎందుకు యిస్తారు? ఫలానా వస్తువు తయారుచేశాం, చాలా బాగుంటుంది, కొనుక్కోండి అని పదిమందికీ చెప్పడానికి, వాళ్ల చేత కొనిపించడానికి ! మరి ఆ ప్రకటన దేనిలో యిస్తాం? మన భావాన్ని/సందేశాన్ని/ప్రచారాన్ని ఎక్కువమందికి ఏది చేరవేస్తుందో ఆ మాధ్యమంలో యిస్తాం. ఏదో మన ఫ్రెండు ఓ పేపరు పెట్టాడు కదా, పడి వుంటుందని దానిలో యివ్వం కదా.

ఆ పేపరు సర్క్యులేషన్ ఎంత లెక్కలు వేసి చూస్తాం. అందుకే ఏదైనా వస్తువు కొనగానే వాళ్లు మనను ఓ ఫారం నింపి పంపమంటారు. ఈ వస్తువు గురించి మీకెలా తెలిసింది? దీని యాడ్ టీవీలో చూశారా, దినపత్రికలో చూశారా, వారపత్రికలో చూశారా, దాని పేరేమిటి? మీరు మగా, ఆడా? మీ కుటుంబ ఆదాయం ఏమిటి? మీకు కారుందా? మీరు చేస్తున్న ఉద్యోగం ఏమిటి? ఇలా పది, పదిహేను ప్రశ్నలేస్తారు.

పోనీ కదాని యిన్నాళ్లకి మైక్రో అవన్ కొంటే యిన్ని ఆరాలేమిటి అని మనకు చికాకేస్తుంది. కానీ వున్న విషయం ఏమిటంటే అది తయారు చేసేవాడు తన మార్కెటింగ్ స్ట్రాటజీని యీ ప్రశ్నల ద్వారానే నిర్ణయించుకుంటాడు. మైక్రో అవన్ వంటి వస్తువు కొనే స్థాయి, అభిరుచి గల వ్యక్తి చదివే మ్యాగజైన్ ఏదో (సాధారణంగా అది ఏ 50 రూ.ల ఇంగ్లీషు మ్యాగజైనో అయి వుంటుంది) తెలుసుకుంటాడు. దానిలో యాడ్ యిస్తాడు. అదే ఏ నిర్మా వాషింగ్ పౌడరో అనుకోండి స్థానిక భాషలో తక్కువ రేటులో అమ్మే మ్యాగజైన్‌కి యిస్తాడు. తమిళనాడు మార్కెట్‌లో మన ఉత్పాదన ప్రవేశపెడదామనుకుంటే మన స్నేహితుడు నడుపుతున్నాడు కదాని తెలుగు పత్రికలో యివ్వం, మనకు యిష్టం లేనివాడు నడుపుతున్నా పాప్యులర్ తమిళ పత్రికలోనే యిస్తాం.

ఎందుకిన్ని లెక్కలు అంటే పబ్లిసిటీకి కేటాయించిన బజెట్‌లోనే కంపెనీకి సాధ్యమైనంత ఎక్కువ ప్రయోజనం కలిగేట్టు చూసుకోవాలి కాబట్టి ! ప్రభుత్వం కూడా యివే లెక్కలు వేస్తుంది. వేయాలి. వాళ్లు అమ్మేది వస్తువులు కాదు – ఆలోచనలు, ప్రణాళికలు, పథకాలు వగైరా. ప్రజలకోసం వాళ్లు ప్రవేశ పెట్టిన స్కీముల గురించి, ఆరోగ్య పరిరక్షణ గురించి ప్రజల్లో అవగాహన పెంచడానికి తీసుకోవల్సిన చర్యల గురించి, జాతీయ నాయకులందించిన స్ఫూర్తి గురించి వాళ్లు ప్రజలను చైతన్యవంతం చేయాలి. ఇవి కాకుండా వివిధ ప్రభుత్వశాఖలు టెండర్ల గురించి, ఉద్యోగ నియామకాల గురించి, ఆచూకీ కావలసిన వ్యక్తుల గురించి ప్రకటనలు యివ్వాలి.

కంపెనీ అయినా, ప్రభుత్వం అయినా లక్ష్యం ఒక్కటే – సాధ్యమైనంత ఎక్కువమందికి, సాధ్యమైనంత తక్కువ ఖర్చుతో తమ సందేశాన్ని చేర్చగలగడం ! అంటే వీళ్లు సర్క్యులేషన్ ఎక్కువ వున్న పేపర్లకు, మ్యాగజైన్లకు, వ్యూయర్‌షిప్ ఎక్కువ వున్న టీవీ ఛానెల్స్‌కు ప్రకటనలు యివ్వాలి. అంశం యింత స్పష్టంగా వున్నా, ప్రభుత్వాన్ని మూడేళ్లో, ఐదేళ్లో నడిపే నేతలు ఆ ప్రభుత్వధనం అంతా తమదైనట్టు, తమ యిష్టం వచ్చినట్టు దాన్ని ఖర్చు పెట్టచూస్తున్నారు. తమ మద్దతుదారులు నడిపే సర్క్యులేషన్ లేని పత్రికలకు యాడ్స్ దోచి పెడుతున్నారు. ఇతర పత్రికలు కనబరిచే స్వేచ్ఛను హరించడానికి వారికి యింధనమైన యాడ్ రెవెన్యూను నియంత్రించాలని చూస్తున్నారు. ప్రభుత్వ ప్రకటనలు తమ చేతిలో వున్నాయి కాబట్టి ఆపేస్తున్నారు.

ఇక్కడ క్యాచ్ 22 పరిస్థితి వుంది. ప్రతి ప్రభుత్వం తమను పొగిడినవాడికే యాడ్స్ యిద్దామనుకుంటుంది. కానీ ప్రభుత్వాన్ని పొగుడుతూ కూర్చుంటే పాఠకులు హర్షించరు, పత్రిక కొనడం మానేస్తారు. అలాటి ప్రజాదరణ లేని పత్రికలో యాడ్స్ యిచ్చి ప్రయోజనం ఏముంది అనే కారణం చూపించి ప్రభుత్వం ప్రకటనలు ఆపేయవచ్చు. అందుకని పాఠకాభిమానం, తద్వారా ప్రకటనలు రావాలని ప్రభుత్వానికి వ్యతిరేకంగా రాస్తే అప్పుడూ ప్రభుత్వం యాడ్స్ ఆపేస్తుంది. ఇక ఎలా చచ్చేది?

అందువలన రాజకీయపు వాసనల్లేని మ్యాగజైన్ నడుపుకుంటే ప్రభుత్వ యాడ్స్‌కు ఢోకా వుండదు. ఏదో రాజకీయాల గురించి కూడా ఓ వ్యాసం వుండాలి కాబట్టి ఓ రెండు పేజీలు దానికి కేటాయించి ఓ వారం ప్రభుత్వాన్ని తిడుతూ, మరో వారం పొగుడుతూ, అసలుకి ఎసరు రాకుండా కాలక్షేపం చేయవచ్చు. ఇది గుర్తించిన దినపత్రికలు కూడా తమ పేజీల్లో చాలావాటిని రాజకీయేతర విషయాలకే కేటాయించేస్తున్నాయి. పాతకాలంలో దినపత్రికల్లో వార్తలు మాత్రమే వుండేవి. తర్వాత్తర్వాత మ్యాగజైన్లలో కనబడాల్సిన ఫీచర్సన్నిటినీ వీళ్లు కైవసం చేసుకున్నారు. "ఈనాడు", "సాక్షి" పత్రికల రాజకీయ పక్షపాతం మనకు తెలిసినా యింకా వాటిని కొంటున్నది – ఆ ఫీచర్ల కోసమే.

పత్రికలు యింత జాగ్రత్త తీసుకున్నా ప్రభుత్వం అప్పుడప్పుడు కన్నెర్ర చేస్తూనే వుంటుంది. "మాకు వ్యతిరేకంగా రాసే పత్రికలకు మేం నడిపే ప్రభుత్వం ప్రకటనలు ఎందుకివ్వాలి?" అని వీళ్ల అహం, అదేదో వీళ్ల స్వంత డబ్బయినట్టు ! స్వంత డబ్బయినా సరే, ప్రకటనలు యివ్వాల్సిందే – ఆ పత్రికలకు అధిక సర్క్యులేషన్ వున్నంతకాలం ! అంతగా అయితే ఆ సర్క్యులేషన్ తగ్గించే ఉపాయాలు కనిపెట్టాలి, పోటీగా పత్రిక పెట్టో, దాని ఆర్థికమూలాలపై దెబ్బ కొట్టో! "ఈనాడు" విషయంలో వైయస్ అదే చేయబోయారు. ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం "సాక్షి" విషయంలో అదే చేయాలి తప్ప యాడ్స్ ఆపడం పిచ్చిపని. పాపం కేసులు పెట్టారు, అవి కుంటుకుంటూ నడుస్తున్నాయి. అవసరమైతే కోర్టే మూయించేస్తుంది అనుకుంటూ వాటి అతీ, గతీ తేలేవరకూ ఓపిక పట్టాలి. ఇవాళ "సాక్షి" గాని, రేపు "ఈనాడు" కానీ, ఎల్లుండి "జ్యోతి" కానీ – పత్రికకు సర్క్యులేషన్ బాగా వున్నంతకాలం యాడ్స్ తగ్గించకూడదు.

"శరవణ భవన్"లో టిఫెన్ తినేవాడు అక్కడ రుచి నచ్చకపోతే మానేస్తాడు తప్ప దాని యజమాని ఎవర్నో హత్య చేశాడు కదాని మానేయడు. అలాగే పత్రికా పాఠకుడు పేపరు అధిపతిపై కేసులున్నాయా లేదా? దానిలో పెట్టుబడి పెట్టినధనం నల్లదా? తెల్లదా? దీని సంపాదకుడు ముఖ్యమంత్రికి వియ్యంకుడా? కాంగ్రెస్ వ్యతిరేకా? నాస్తికుడా? బిసియా కాదా?– అనే విషయాలు చూడడు. వాడికి నచ్చినంతకాలం పత్రిక చదువుతాడు. అలాటి వాళ్లు ఎంత ఎక్కువమంది వుంటే ప్రభుత్వం అన్ని ప్రకటనలు యిచ్చితీరాల్సిందే ! ఎందుకంటే ప్రభుత్వప్రయాసంతా వాళ్లను చేరడానికే ! అలా చేరనక్కరలేదనుకుంటే అన్ని ప్రభుత్వేతర పత్రికలకూ యాడ్స్ ఆపేసి హాయిగా "యోజన", "ఆంధ్రప్రదేశ్", "ఆకాశవాణి", "దూర్‌దర్శన్"లలోనే యాడ్స్ యిచ్చుకుంటే బోల్డంత డబ్బు ఆదా ! ఆర్థికమంత్రి ఆనంవారు ఆలోచించాల్సిన పాయింటు యిది! **– ఎమ్బీయస్ ప్రసాద్ (మే 2012)**

అవుననే అంటున్నారు లక్ష్మీపార్వతి. ఎందుకట? వైకాపా అన్ని సీట్లూ గెలవడం వలన కాంగ్రెస్ నుండి అందరూ గోడదూకి వచ్చేయడంతో, కిరణ్ ప్రభుత్వం పడిపోతుందిట! భలే ఆశ !

ఒకవేళ పడిపోవడమే జరిగితే కేంద్రంలో వున్న యుపిఏ అర్జంటుగా మధ్యంతరం పెట్టేస్తుందా? ఎందుకు పెడుతుంది? 'ప్రస్తుతం జగన్ హవా నడుస్తోంది. కొన్నాళ్లు ఆగి హవా తగ్గాక చూదాం' అనుకుని రాష్ట్రపతి పాలన పెడుతుంది తప్ప వ్యతిరేక పవనాల్లో ఎన్నికల నావ నడపాలని చూడదు. రాష్ట్రపతి పాలన ఓ ఏడాది నడిచిందంటే గోడ దూకి వచ్చిన వాళ్లందరికీ నోట్లో కరక్కాయే. ఓ పక్క సిబిఐ చూస్తే చార్జిషీట్ల మీద చార్జిషీట్లు పెట్టేసి, మంత్రులను, అధికారులను తమ చుట్టూ ప్రదక్షిణాలు చేయిస్తోంది. ఇప్పుడైతే అధికార పార్టీలో వున్నామన్న గొడుగు వుంది కాబట్టి అరెస్టు కాకుండా నెట్టుకు రాగలుగుతున్నారు. విచారణ చేపట్టినపుడు ఫైళ్లు దొరకలేదనో, సంబంధిత అధికారి లీవులో వున్నాడనే ఏవో చెప్పి విచారణ సాగదీయగలరు.

రాష్ట్రపతి పాలనలో ఆ సౌలభ్యం ఏది? అప్పుడు గవర్నరుగారి ఆధ్వర్యంలో అధికారులు చెలరేగుతారు. రాజకీయ నాయకులపై సహజంగానే ప్రజలకు విసుగు వుంటుంది. ఒకరి మీద ఒకరు ఆరోపణలు చేసుకుని పలుచన చేసుకున్న కొద్దీ అది అసహ్యంగా మారుతుంది. చిన్న దేశాలలో అయితే అలాటి సందర్భాల్లో మిలటరీ వాళ్లు అధికారాన్ని హస్తగతం చేసుకుని యీ నాయకులందరినీ ఉరి తీసో, జైళ్లలోకి తోసో ఇనుప పిడికిలితో జనజీవితంలో క్రమశిక్షణ తెస్తారు. మొదట్లో కాస్త నిజాయితీగా ప్రవర్తిస్తారు. దాంతో ప్రజలంతా మిలటరీ పాలనకు హర్షం పలుకుతారు. ఇలాటి పాలకుడు వుండాలి అనుకుంటారు. ఆర్నెల్లు పోయాక ఆ మిలటరీ వాడు నియంతగా మారి దారుణమైన అవినీతి మొదలుపెడతాడు. అది బయటకు రాకుండా పత్రికల నోళ్లు నొక్కుతారు. కొన్నాళ్లకు మామూలు ప్రజలను కూడా హింసించడం మొదలు పెట్టాక వాళ్లకూ తెలిసి వచ్చి తిరగబడతారు.

మన దేశంలో కేంద్రస్థాయిలో యిలాటిది జరగలేదు కానీ రాష్ట్రాలలో, మునిసిపాలిటీలలో యిలాటివి జరిగాయి. మునిసిపల్ కౌన్సిల్ సమావేశాల్లో అధికార, ప్రతిపక్ష సభ్యులు కుర్చీలెత్తి కొట్టేసుకున్న వార్తలు వినివిని విసిగిపోయిన ప్రజలు కౌన్సిల్‌ను రద్దు చేసి, కమిషనర్ చేతికి పాలన అప్పగిస్తే హర్షిస్తారు. ఓ ఏడాది ఆ పాలన నడిచేసరికి కమిషనర్‌ను తిట్టుకుంటారు. రాష్ట్రాలలో గవర్నరు పాలన ప్రవేశపెట్టిన సందర్భాలలో కూడా యిదే జరుగుతోంది. రేపు మన రాష్ట్రంలో అదే జరిగితే మనం అందరం దాన్ని స్వాగతిస్తాం. ఎందుకంటే ఇటీవలి కాలంలో ఏ నాయకుణ్ని చూసినా 'కోట్లు తినేశాడట, చంచల్‌గూడాకు పంపి చిప్పకూడు తినిపించాలి' అని పళ్లు నూరుకుంటున్నాం. వీళ్లందరినీ సెక్రటేరియట్‌లోకి రానీయకుండా అధికారులే పాలన జరిపితే మనం చప్పట్లు కొడతాం. పైగా మన గవర్నరు మాంచి హుషారుగా వుండే నరసింహన్. సఫారీ నుండి పట్టు పంచె దాకా ఏం వేసినా రాణించగల ధీరుడు. ఎన్‌డి తివారీలా కదలలేని శాల్తీ కాదు. అభావచేష్టలు చేసి అప్రదిష్టపాలైన వ్యక్తి కాదు.

నరసింహన్‌గారి పాలన ఓ ఏడాది నడిస్తే చాలు, యీ నాయకులందరూ స్మృతిపథంలో వెనకబడడం ఖాయం. అధికారులే చకచకా నిర్ణయాలు తీసుకుని పరుగులు పెట్టిస్తారు. ఇప్పుడు రాజకీయపు బేరసారాల్లో బలైన అధికారులు అప్పుడు పుంజుకుంటారు. రాజకీయ నాయకులు లేకపోతేనే ప్రాణానికి హాయి అనే భావనను ప్రజల్లో చొప్పించడానికి ప్రయత్నిస్తారు. ఇటీవలి కేసుల్లో మంత్రుల కారణంగా కేసుల్లో యిరుక్కుంటున్నామన్న కసితో అధికారులకు మాజీమంత్రులై పగ తీర్చుకునే అవకాశం పుష్కలంగా లభిస్తుంది. సిబిఐకు పూర్తి స్థాయిలో సహకరించి, వీళ్లందరిపై కేసులు నడిచేట్లు చేస్తారు. ఓ ఏడాది యిలా గడిచి, ఎన్నికలు వచ్చేసరికే యీ నాయకులందరి పరువూ బజారున పడి గెలుపు ప్రశ్నార్థకం అయిపోతుంది. ఓ ఏడాది పాటు అధికారానికి దూరంగా వుంటారు కాబట్టి చేతిలో డబ్బూ ఆడదు. ఈ విషయాలన్నీ మీకూ, నాకూ తట్టకపోయినా నాయకులకు తప్పకుండా తడతాయి. అధికార పార్టీలోనే వుంటూ 'జగన్‌వైపు వెళతాం జాగ్రత్త' అంటూ బెదిరించి వడేసుకుంటారు తప్ప, నిజంగా గోడ దూకరు.

అయినా యిదంతా ఎప్పుడు జరుగుతుంది? జగన్ అన్ని సీట్లూ గెలుచుకుంటేనే ! అది సంభవమా? జగన్ వీరాభిమాని కూడా ఆ మాట గట్టిగా అనలేడు. మొన్న కోవూరులో 35 వేలు మెజారిటీ వస్తుందని లక్షలు లక్షలు పందాలు కట్టి ఓడిపోయిన జనాభా అయితే అసలే అనరు. కాంగ్రెస్, టిడిపి కలిసి 3, 4 సీట్లయినా గెలుచుకుంటాయని రోజూ పేపరు చదవనివాడు కూడా చెప్పగలడు. తన కోసం రాజీనామా చేసిన అందరినీ గెలిపించుకోలేని జగన్ కోసం వున్న పదవులు వదులుకోవడానికి వీళ్లేమైనా పిచ్చివాళ్లా?

జగన్‌కోసం కాకపోయినా ఉపయెన్నికల తర్వాత కిరణ్ స్థానంలో నాలుగో కృష్ణుడు వస్తాడని, ఆ స్థానంపై ఆశ పెట్టుకున్నవాళ్లు విడిగా వచ్చేసి ప్రభుత్వాన్ని పడగొడతారని మరి కొందరు వూహ చేస్తున్నారు. ఉపయెన్నికలలో కాంగ్రెస్ నాలుగు సీట్లు గెలిచిందనుకోండి. ఆ క్రెడిట్‌ను కిరణ్‌కు యిచ్చేవాడు ఎవడైనా వున్నాడా? "కాంగ్రెస్ యిన్నాళ్లకు ధైర్యంగా జగన్, తెలంగాణ సమస్యలను ఎదుర్కుంది. అందుకే జనం మెచ్చారు." అంటారు. ఈ మాట నిజం కూడా. నిజానికి యీ రెండు సమస్యలను నానబెట్టి ముదరబెట్టిన కాంగ్రెస్ యిన్నాళ్లకు ధైర్యంగా ఏదో ఒకటి చేస్తోంది. జగన్ విషయంలో సిబిఐ ద్వారా కేసుల మీద కేసులు మోపుతున్నారు. ప్రభుత్వపరంగా తీవ్రమైన చర్యలు చేపట్టారు. అవి ఫైనల్‌గా కోర్టులో గెలుస్తాయో లేదో వేరే విషయం. కానీ ఎగ్రెసివ్‌గా వెళుతున్నారా? లేదా అన్నది

పాయింటు.

అదే విధంగా తెలంగాణ విషయంలో పార్లమెంటులో బిజెపి ప్రవేశపెట్టిన ప్రయివేటు బిల్లును అడ్డుకుంటున్నారు. పైగా కిరణ్ చేత 'సెంటిమెంటు తాత్కాలికం, డెవలప్‌మెంట్ శాశ్వతం' అనిపించేశారు. తెలంగాణ గడ్డపై కెసియార్ కుటుంబంపై వ్యక్తిగత విమర్శలు చేయించారు. నినాదం పేర రాజకీయం చేయడం తగదని కెసియార్‌కు హితబోధ చేయించారు. ఈపాటి ధైర్యం ఐదేళ్ల క్రితమే కనబరిచి వుంటే రాష్ట్ర ప్రగతి యింత కుంటుపడేది కాదు. ప్రజలెప్పుడూ ధైర్యాన్నే ఆరాధిస్తారు. సోనియాను ఎదిరిస్తున్నందుకు జగన్‌పై కొందరు అభిమానం చూపినట్లే, జగన్‌పై కఠిన చర్యలకు ఉద్యమించినందుకు కాంగ్రెస్‌ను మరికొందరు అభిమానిస్తారు. చేతులు ముడుచుకుని కూర్చునేవాళ్లంటే అందరికీ అలుసే. కాంగ్రెస్ చేసిన యీ ప్రయత్నాలు వృథాగా పోవని నా అంచనా.

అదే జరిగినా ఆ ఘనత కిరణ్‌కు కట్టబెట్టరు. జరగలేదనుకోండి, కిరణ్ నెత్తిన ఆ పాపం కడితే అతని పట్ల ప్రజలకు సానుభూతి కలుగుతుంది. ఎందుకంటే యీ ఉపయెన్నికల సారథ్యమంతా సోనియా మనుష్యులదేనని అందరికీ తేటతెల్లంగా తెలుస్తోంది. తీసేస్తే వాయలార్ రవిని, కృష్ణమూర్తిని తీసేయాలి తప్ప కిరణ్, బొత్సలను అనేందుకు ఏముంది? కిరణ్‌ను తీసేసినా ఎవర్ని పెడతారు కనుక? రెండేళ్లపాటు గట్టిగా పాలించి, జగన్‌ను ఢీకొనగల మొనగాడు ఎవరు కనబడుతున్నారు? ఉన్నవాళ్లందరూ జిల్లా స్థాయి నాయకులే. కిరణ్ చేయలేనిది, వీళ్లు చేయగలిగేది ఏముంది? సరే, యితన్నే కానిద్దాం అనుకోవచ్చు.

అందువలన చెప్పదలిచినదేమిటంటే ఉపయెన్నికల తర్వాత యథాతథ స్థితే కొనసాగుతుంది తప్ప, యివి చరిత్రగతిని మార్చేసి బ్రహ్మాండాన్ని బద్దలు చేసేయవు. **– ఎమ్బీయస్ ప్రసాద్ (మే 2012)**

**మే 21** **ఎమ్బీయస్: అవుతాడా? అవడా?**

గతవారంగా మనవాళ్లకు ఒక్కటే రంధి – జగన్ అరెస్టవుతాడా లేదా అని. ప్రేమలో పడిన అమ్మాయి ఓ కొమ్మ పట్టుకుని 'హీ లవ్స్ మీ, హీ లవ్స్ మీ నాట్' అనుకుంటూ ఒక్కో ఆకూ తుంపిపోస్తుందంటారు. చివర్లో ఏ ఆకు మిగిలితే అది నిర్ధారణ అయినట్టన్నమాట. ఆ విధంగా 'జగన్ అరెస్టవుతాడు, అవడు' అనుకుంటూ ఆయన అభిమానులో, శత్రువులో కొమ్మల్లో ఆకులు తుంపడం మొదలుపెడితే రాష్ట్రంలో ఏ చెట్టుకూ ఒక్క ఆకూ మిగిలేది కాదు. ఏమో, తుంపుతున్నారేమో కూడా.. అందుకే యీ ఏడాది ఎండలు యింతలా మండిపోతున్నాయి!

రుక్మిణి దేవి కృష్ణుడికి ఓ వృద్ధ బ్రాహ్మణుడి చేత ఓ లేఖ పంపింది, '..యిలా మా వాళ్లు వేరే సంబంధం చూశారు, నాకేమో నిన్నే చేసుకోవాలని వుంది. నువ్వు వచ్చి నన్ను తీసుకుని వెళ్లిపోయి పెళ్లి చేసుకో' అని. అది ఎస్సెమ్మెస్‌ల యుగం కాదు, ఠంగున ఓకే అనో, 'ఐ యామ్ యిన్ ఎ మీటింగ్ విత్ గోపికాస్, విల్ కాల్ లేటర్' అనే ప్రి-సెట్ మెసెజ్ పంపడానికి. అందుకని యీ ముసలాయన వెళ్లి, కృష్ణుణ్ని కలిసి, ఆయన తిరుగుసందేశాన్ని పట్టుకురావడానికి టైము పట్టింది. ఈ లోపున యీవిడకు గుబులు పుట్టింది. గుట్టల కొద్దీ సందేహాలు పుట్టల్లో పాముల్లా బయటకు రాసాగాయి.

ఆ సందర్భంలోనే పోతన గారు 'ఘనుడా భూసురుండేగెనో...' పద్యం రాశారు. ఈ బాపనాయన వెళ్లాడో, లేక మధ్యలోనే శోష వచ్చి వడదెబ్బ కొట్టి పోయాడో, కృష్ణుడి ఆడియన్స్ దొరికిందో లేదో, దొరికినా నా సందేశం వినిపించగలిగాడో లేదో, విన్నాక కృష్ణుడు యీ పిల్లేమిటి, మరీ డాషింగ్‌గా వుంది, కాపురం చేసే రకమేనా? అని భయపడి 'చూద్దాం లెండి, మా వాళ్లు నాకు ప్రస్తుతం ఓ సంబంధం చూస్తున్నారు...' అన్నాడేమో.. అని యిలాటి సందేహాల్తో కొట్టుమిట్టులాడింది రుక్మిణి.

ప్రస్తుతం కాంగ్రెస్ వాళ్లకూ యిలాటి సందేహాలే ! 'సిబిఐ వాళ్లు శుక్రవారం నాడు పిలుస్తున్నారు. పిలిచి పండూ, తాంబూలం యిచ్చి పంపేస్తారా? వచ్చినవాడివి ఎలాగూ వచ్చావ్, అరెస్టయిపోయి అందుబాటులో వుండు అంటారా? అరెస్టు చేస్తే ఎన్నికల్లోపునే బయటకు పంపుతారా? ఎన్నికలయ్యేదాకా వుంచుతారా? కటకటాల వెనుక జగన్ ఫోటో పోస్టర్లతో వైకాపా ప్రచారం చేస్తుందా? (1977 ఎన్నికల్లో జార్జి ఫెర్నాండెజ్ ఎన్నికల ప్రచారం యిలాగే సాగింది లెండి) దాని ఫలితం ఎన్నికల్లో ఎలా వుండబోతుంది? ఫలితం ఎలా వున్నా.. జైల్లో కంటిన్యూ చేసేయవచ్చా.. ' అని సస్పెన్సుతో ఎదురుచూస్తున్నారు.

ఆంధ్రజ్యోతికైతే యిలాటి సందేహాలు ఎంతమాత్రం లేవు. వాళ్ల లెక్కప్రకారం సాక్షిపై ఎటాక్, ఆస్తుల ఎటాచ్‌మెంట్, ఖాతాల స్తంభన, సాక్షి మూసివేత, మోపిదేవి అరెస్టు, ఆపై జగన్ అరెస్టు.. అన్నీ టకటకా అయిపోయాయి, అయిపోతున్నాయి. 'అంతా మేం చెప్పినట్టే..' అని పైన రాస్తారు. సిబిఐ చేసినదాన్ని కోర్టు తిరగదోడిందని వార్త కింద కనబడుతూనే వుంటుంది. పోతులూరి వీరబ్రహ్మం గారి తర్వాత యింతటి కాలజ్ఞానం బోధించినవారు మరొకరు లేరు. ఈనాడు అయితే మరీనూ, ఎప్పుడో ఏడాది క్రితమే జగన్‌ను జైలుకి పంపేసింది. జైల్లో జగన్ ఏ డ్రస్సు వేసుకోవాలో అతని భార్య సూటుకేసు సర్ది యిచ్చినట్టు, అతను జైలుకూడు తిన్నాక కంచం కడుక్కుని ఓ మూల పెట్టుకున్నట్టు... అన్నీ వూహించి చాలా కార్టూన్లు వేసేసింది. జగన్ నిజంగా అరెస్టయ్యాక వెయ్యడానికి కార్టూనిస్టుకి థీమ్స్ కూడా లేకుండా చేసుకున్నారు.

ఓ జోక్ వుంది – ఒక ప్రముఖనేత చావుబతుకుల్లో యిప్పుడో, యింకాస్సేపట్లోనో అన్నట్టు వున్నాడట. పేపరు ప్రింటింగుకి వెళ్లే సమయానికి యింకా తేలలేదు. ఈనాడు, ఆంధ్రజ్యోతి వంటి పత్రికొకటి ఇంకేం బతుకుతాడులే అనుకుని "ఫలానా ఆయన పోయాడు"

అని హెడ్‌లైన్సు పెట్టేసి అచ్చుకొట్టేసింది. తీరా చూస్తే ఆయన పోలేదు. మర్నాడు పోయాడు. తక్కిన పత్రికలు హెడ్‌లైన్సులో మరణవార్త వేశాయి. ఈ పేపరుకు సంకటం వచ్చిపడింది. వాళ్లతో సమానంగా వార్త వేయాలి. కానీ నిన్ననే చంపేసి, యివాళ మళ్లీ పోయాడని రాస్తే అసహ్యంగా వుంటుంది. అందువలన "ఫలానాయన యివాళ పూర్తిగా... మరణించారు" అని రాసింది. అంటే చావు కూడా యిన్‌స్టాల్‌మెంట్స్‌లో వస్తుందన్నట్టు, యమలోకానికి మొదటిరోజు బయలుదేరి రెండో రోజుకి చేరినట్టు...! అలాగ జగన్ నిజంగా అరెస్టయినప్పుడు "ఈనాడు" కార్టూన్ ఆ తరహాలో వుంటుందేమో చూడాలని నాకు మహా ఉబలాటంగా వుంది.

జగన్ అరెస్టు గురించి వీళ్లు ఎంతలా పూదరగొట్టారంటే, చివరకి అది నిజంగా జరిగిన రోజున 'ఓస్ యింతేనా!' అని అనిపించవచ్చు. వీళ్లకు తగ్గట్టు జగన్ కూడా తన అరెస్టుతో ప్రపంచ చరిత్ర మారిపోతుందన్న బిల్డప్ యిస్తున్నాడు. 'నా అరెస్టు తథ్యం, హై కమాండ్ ప్లాను చేసింది, సిబిఐను పురికొల్పింది, అరెస్టు కాగానే రాష్ట్రంలో అల్లర్లు అవుతాయి, ఆ పాపాన్ని నా నెత్తిన తోస్తారు, నా ప్రజల్లారా శాంతంగా వుండండి' అని పిలుపు నిచ్చేశాడు. రేపు నిజంగా అరెస్టయి జనాలు ఎవరూ పట్టించుకోలేదనుకోండి, 'జనాలంతా కోపోద్రిక్తులైనా, నా పిలుపుకి స్పందించి, నా మాట మన్నించి శాంతంగా వున్నార'ని చెప్పుకోవచ్చు. అల్లర్లయ్యాయనుకోండి – వాళ్లంతా జగన్ అభిమానులే కాకపోవచ్చు, అసాంఘిక శక్తులు యిదే తరుణమని దుకాణాలు దోచుకోవచ్చు – 'యీ ప్రజాగ్రహం రాబోయే ఎన్నికలలో కాంగ్రెస్‌ను మట్టికరిపిస్తుంద'ని హుంకరించవచ్చు.

రాజకీయలబ్ధికోసం ఏం చేసినా తప్పు లేదు కానీ, యీ పేరు చెప్పి యువకులను ఆత్మహత్యలకు ప్రేరేపించకుండా వుంటే చాలు, జగన్‌కు దండం పెడతాను. తెలంగాణ పేరు చెప్పి యిప్పటికే కొన్ని వందలమంది పోయారు. ఇటీవలి కాలంలో తెలంగాణలో చావులన్నిటికీ తెలంగాణ స్టిక్కర్ అంటించేస్తున్నారు. మొన్న ఒకబ్బాయి పోతే జగన్ అరెస్టు స్టిక్కర్ అంటించేశారు. నిజానిజాలు దేవుడికి తెలియాలి. జగన్ అరెస్టవుతాడేమోనన్న భయంట. ఎందుకు భయం? ఎవరైనా అరెస్టు కావచ్చు. ఉత్తిపుణ్యానికి కూడా ఏదో ఒక కేసులో యిరుక్కుని రిమాండులోకి వెళ్లవచ్చు, తర్వాత బెయిల్‌లో బయటకు రావచ్చు, ఆ తర్వాత మళ్లీ వెళ్లవచ్చు. సాధారణ పౌరుడికే యీ రిస్కు వున్నపుడు జగన్ వంటి పారిశ్రామికవేత్త, రాజకీయనాయకుడు, పత్రికాధిపతికి ఆ పాటి రిస్కు వుండదా? జగన్ అరెస్టు అయినంత మాత్రాన ఆకాశం బద్దలవదు, భూమి క్రుంగదు. ఒక సుదీర్ఘ పోరాటంలో అది తొలి ఘట్టం. దానికి యింత బుర్ర బద్దలుకొట్టుకోనక్కరలేదు. **– ఎమ్బీయస్ ప్రసాద్ (మే 2012)**

## మే 22 ఎమ్బీయస్‌ః కళ్లెం వున్నది చేతిలో.. గుఱ్ఱం పడె గోతిలో..

ఎప్పుడో దాశరథిగారు రేడియోలో చదివిన వచనకవిత్వంలో మకుటం యిది. బుర్రలో నాటుకుపోయింది. ఈ కాంగ్రెస్–సిబిఐ వ్యవహారం చూస్తూ వుంటే నిన్నటినుండి పదేపదే గుర్తుకు వస్తోంది. సిబిఐ ఏ క్షణాన ఏ అడుగు వేయాలో కాంగ్రెస్ హై కమాండే నిర్ణయిస్తోందని సాధారణంగా అనుకుంటాం. జగన్‌ను అడిగితే చంద్రబాబు, రామోజీ, వాయలార్... అంటూ పెద్ద లిస్టు చదివేస్తారు. అదో పెద్ద జోక్‌లా అనిపిస్తుంది కానీ వరస చూస్తూంటే అదే నిజమేమో అని కూడా అనిపిస్తోంది. వంటవాళ్లు ఎక్కువైన కొద్దీ వంటకం పాడవుతుందట. ఎవరో ఒకరి చేతిలోనే పెట్టి వుంటే సిబిఐ జాగ్రత్తగా పని చేసుకుని వచ్చేదేమో. నలుగురు డైరక్షన్ చేయడంతో కన్‌ఫ్యూజ్ అయిపోయే నటుడిలా సిబిఐ అడ్డదిడ్డంగా వెళ్లిపోతోంది. దాని చేతిలో ఓ కత్తి పెట్టి నరికేయ్ అన్నారు, అది నరుక్కుంటూ వెళ్లిపోతోంది. తెగి కిందపడే తలల్లో కత్తి యిచ్చినవాడిది కూడా వుందేమో తెలియదు.

దూర్వాసుడు ఓ సారి విష్ణుభక్తుడైన అంబరీషుణ్ని వేధిస్తే విష్ణువు అతనికి బుద్ధి చెప్పాలని చక్రం వదిలాడు. ఆ చక్రాన్ని చూసి దూర్వాసుడు పరుగులు పెట్టాడు. అయినా ఆ చక్రం వదలలేదు. అతనికి స్థిరమైన దూరాన్ని మేన్‌టేన్ చేస్తూ తరుముతూ పోయింది. స్పీడు పెంచి తలకాయ కోసేయలేదు, అలా అని స్పీడు తగ్గించి వెనకబడి దూర్వాసుడికి ఊరట కల్గించలేదు. అతనికి చక్రం మీద తప్ప వేరే దేనిమీదా ధ్యాస లేకుండా చేసింది. అలా ఏడాది పాటు ముల్లోకాలు తిప్పించి తిప్పించి చివరకు విష్ణువు కాళ్లమీద పడేసింది. ఆయన అంబరీషుడి కాళ్లమీద పడమన్నాడు. చక్రం తిప్పినా, వదిలినా అలాటి ఒడుపు వుండాలి. ఇక్కడ సిబిఐ కనుక కాంగ్రెస్ విడిచిన విష్ణుచక్రం అనుకుంటే అది దారిలో కనబడ్డవాళ్లందరి వెనకా పడింది. కాస్సేపు వీళ్ల వెనక్కాల, కాస్సేపు వాళ్ల వెనక్కాల పరుగులు పెట్టి అలిసిపోయింది. మళ్లీ పుంజుకుని తలలు నరుక్కుంటూ వెళ్లిపోతోంది. ఇక్కడ జగన్ అనే దూర్వాసుడు పరుగు పెట్టడం మానేసి, అదిగో వాణ్నీ నరికేయ్, వీణ్నీ నరికేయ్ అంటూ విష్ణుచక్రానికి మనుష్యుల్ని చూపిస్తున్నాడు.

జగన్‌ను అరెస్టు చేస్తే గీస్తే ఎప్పుడు చేస్తారన్న ప్రశ్నతో ఆగిపోలేదు. చేస్తే ఒక్కణ్నీ చేస్తారా? రాజు వెడలె.. అన్నట్టు తోడుగా ఎవరినైనా పంపుతారా? ఆ పంపడంలో కూడా కుడిఎడమల కత్తులు మెరయగ, ముందువెనుకల బంటులు నడవగ.. అన్నట్టు మంత్రులను కూడా పంపుతారా? ఒంటరిగా పంపితే ఏమవుతుంది? తోడుగా పంపితే ఏమవుతుంది? అంటూ రకరకాల వూహాగానాలు సాగాయి. చివరకు పారిశ్రామికవేత్తలు, అధికారులతో మొదలుపెట్టారు. పారిశ్రామికవేత్తలను యిలా అరెస్టు చేస్తూ పోతే రాష్ట్రంలో పెట్టుబడులు రావని కొందరు లబలబ లాడుతున్నారు. ఇలాటి పారిశ్రామికవేత్తలు రాకపోతేనే మేలు, నిజాయితీపరులైనవారు కావాలి కానీ, యిలాటి దోచుకుతినేరకం అక్కరలేదు అని మరికొందరు సముదాయిస్తున్నారు. 'అసలు పెట్టుబడిదారు అన్న పదంలోనే దోపిడిదారు అనే పదం దాగి వుంది. రిలయన్సు నుండి హిందూజా దాకా అందరూ యిదే రకం. డబ్బులన్నీ వాళ్ల దగ్గరే వుంటే

వాళ్లకు ఎబ్బి తివాచీ వేయక ఎర్ట్దీపం చూపిస్తారా?' అని లాజిక్ లాగుతారు ప్రాక్టికల్‌గా మాట్లాడే కొందరు.

పెట్టుబడిదారు వచ్చి రాష్ట్రంలో పెట్టుబడి పెట్టేసి, యిక్కడి జనాలకు ఉద్యోగాలు యిచ్చేస్తాను అనగానే రాష్ట్రంలో అధికారంలో వున్న ప్రభుత్వం 'రా, నాయనా' అని పిలిచేస్తుందనుకుంటున్నారా? అబ్బే ! 'ఇందులో నాకేంటి?' అని అడుగుతాడు సంబంధిత అధికారో, మంత్రో, ముఖ్యమంత్రో. డబ్బు పడేసి పనులు గబగబా జరిపించుకుంటారు కొందరు అనుభవజ్ఞులు. డబ్బు లేకనో, చాదస్తం కొద్దో కొందరు ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు 'రిస్కు తీసుకుని యిండస్ట్రీ పెడుతున్నాం కదండీ' అంటూ నచ్చచెప్పబోతారు. ఇక వాళ్లని యీ నాయకులు, అధికారులు కారిడార్లలో కూర్చోబెడతారు, తిప్పుతారు. తిప్పట భరించలేక కొందరు మధ్యలో విరమించుకుంటే చాలా తక్కువమంది చివరిదాకా నిలదొక్కుకుంటారు. ఇలాటి 'దండగ' బేరాల్లో కూడా నాయకులు ఎంతో కొంత పిండుకుంటారు. ఆ ఇండస్ట్రీ ఏదో తమ నియోజకవర్గంలో పెట్టమనో, తమ వాళ్లకు ఉద్యోగాలు యిప్పించమనో ఏదోలా సతాయిస్తారు. ఇన్ని కష్టాలు తట్టుకుని చివరివరకు నిలబడిన గట్టిపిండాలను చూసి పళ్లు నూరుకుంటూనే 'మా వల్లనే వీళ్లందరూ పైకి వచ్చారు' అని చెప్పుకుని ఉత్తిపుణ్యానికి పేరు కొట్టాలని చూస్తారు నాయకులు.

జగన్‌పై పెట్టిన కేసుల పుణ్యమాని అతని కంపెనీల్లో పెట్టుబడులు పెట్టిన పాపానికి అనేకమంది యిన్వెస్టర్లను తమ ఖాతా పుస్తకాలతో సహా సిబిఐ తిప్పించుకుంటోంది. ఇటీవల అరెస్టులు కూడా మొదలు పెట్టింది. పారిశ్రామిక వర్గాల్లో 'అధికారంలో ఎవరున్నా వారికి యివ్వక తప్పదు కదా. వాళ్లల్లో వాళ్లకు తగాదాలు వచ్చినందుకు, మధ్యలో మమ్మల్ని బలిపశువుల్ని చేశారు. రేపు యింకో యిండస్ట్రీ పెట్టినపుడు వీళ్లు మాత్రం లంచం అడక్కుండా వుంటారా?' అని ఆందోళన ప్రారంభమైంది. ఇంకో కేసులో అధికారులు కూడా అరెస్టయ్యారు. దాంతో అధికారగణం 'లంచాలు పట్టినది మంత్రులు. వాళ్లు చెప్పినదానికి తల వూపిన పాపానికి మేం బలిపశువులం అవుతున్నాం" అంటూ ఆందోళన మొదలుపెట్టారు. ఏ ఫైలు మీదా సంతకం పెట్టకుండా కాలక్షేపం చేద్దామని చూస్తున్నారు. చేతనైతే మంత్రులను అరెస్టు చేయాలి అని అనసాగారు.

నిన్న ఆ ముచ్చటా తీరింది. మోపిదేవిని అరెస్టు చేశారు. ఇప్పుడిక మంత్రులు మొదలు పెట్టారు – "మమ్మల్ని బలిపశువులను చేశారు" అంటూ. "జస్ట్ ఓ చిన్న సంతకం – అదీ ముఖ్యమంత్రి చెప్పారు కదాని పెట్టాను. ఆ మాత్రానికే యింత వేధింపులా?" అని మోపిదేవి వాపోయారు. ముఖ్యమంత్రి కార్యాలయంలో పెట్టినా, స్వంతయింట్లో కిచెన్‌లో పెట్టినా – సంతకం సంతకమే కదా ! అలాటి సంతకాలు పెట్టినందుకే కదా మీ శాఖల్లో అధికారులను సస్పెండ్ చేయడాలూ, డిస్మిస్ చేయడాలూ జరుగుతున్నాయి. వాళ్లెవరైనా వచ్చి "నేను అమాయకుణ్ని సార్, నేరం నాది కాదు, నాలోని మద్యానిది, నా జేబులోని నోట్లకట్టది" అని చెప్పుకున్నపుడు మీరేం చెప్పారు? – "చట్టం తన పని తాను చేసుకుపోతుంది." అని! అప్పుడు అది ఎంత పని చేసిందో యిప్పుడూ అంతే పని చేస్తోంది.

అమాత్యవర్యా, మంత్రిపదవి స్వీకరిస్తూ మీరేం ప్రమాణ స్వీకారం చేశారు? 'ప్రజల ఆస్తిపాస్తులను, మానమర్యాదలను రక్షిస్తాను' అనా, లేక 'ముఖ్యమంత్రిగారు ఎక్కడ, ఎప్పుడు, ఎలా, ఎందుకు ..సంతకం పెట్టమన్నా నోరెత్తకుండా, ఫైలు చదవకుండా పెడతాను' అనా? ఆ మాత్రానికి మీకు చదువెందుకు? తెలివితేటలెందుకు? అధికారులతో చర్చలు, సమీక్షా సమావేశాలు, ఫైళ్లపై నోటింగ్సూ, పిఏసిలు, కాగ్‌లు.. యివన్నీ ఎందుకు? సర్వం జగన్నాథం అన్నట్టు సర్వం ముఖ్యమంత్రిమయం అనేస్తే సరిపోతుందా? రేపు మీరు జగన్ పార్టీలోకి దూకేశారనుకోండి, అప్పుడేమంటారో నాకు తెలుసు. ఇవాళ్టి స్టేటుమెంటును యిప్పటి ముఖ్యమంత్రిపై తోసేస్తారు. 'వైయస్ అంటే నాకు దేవుడితో సమానం. ఆయనకు వ్యతిరేకంగా ఎందుకు మాట్లాడతానండి? కిరణ్‌గారే స్టేటుమెంటు రాసిచ్చి సంతకం పెట్టమంటే పెట్టా' అంటారు. ఇలాటి డమ్మీలు మనకు అవసరమా? ఇంత సువిశాల రాష్ట్రాన్ని పాలించడానికి వీళ్లు సమర్థులా?

చంద్రబాబుగారు 'ఒక్క కుటుంబం స్వార్థం కారణంగా రాష్ట్రం నాశనం అయిపోతోంది. ఎందరో సమర్థులు కష్టాల పాలవుతున్నారు' అంటున్నారు. ఆయన పాలనలో ఓ వెలుగు వెలిగిన శ్రీలక్ష్మి, ఆచార్య వంటి అధికారులు, సత్యం రాజు, కోనేరు ప్రసాదు వంటి పారిశ్రామికవేత్తలు వైయస్ కారణంగానే చెడిపోయి చెరసాల పాలయారని ఆయన ఆవేదన. అంత జాలి అనవసరం సార్. స్వార్థం వైయస్‌కు మాత్రమే వుంటే యింత అనర్థం జరిగేది కాదు. వీళ్లకూ వుంది కాబట్టే యిలాటి రిస్కులు తీసుకున్నారు, చట్టాలను ఉల్లంఘించారు, చిక్కుల పాలయ్యారు. జగన్ అనే పెద్దమనిషి కాంగ్రెస్‌లోనే వుండి వుంటే వాళ్లు యింకా యింకా వెలుగుతూ పైపైకి వెళ్లిపోయేవారు. జగన్–సోనియా నువ్వెంతంటే నువ్వెంత అనుకోవడంతో ఆ ఉరుము యీ మంగలాలపై పడింది. లంచాలు పట్టేటప్పుడు, పెట్టేటప్పుడు ఆ పాటి రిస్కు వుంటుంది మరి. లోపలున్న స్వార్థం, దురాశ వీళ్లను ప్రేరేపించిందని ఒప్పుకుంటే చాలు. ఎంత ఆకలి వేసినా ఆడాళ్లందరూ పడుపువృత్తికి దిగరు. అతితక్కువమందికే ఆ లక్షణం వుంటుంది. అలాటివాళ్ల చేతిలో మన రాష్ట్రపాలన వుందని అందరం కలిసి ఏడవాలి తప్ప, వీళ్ల గురించి ఏడ్చి కన్నీరు కార్చడం అనవసరం. ఆ ఒక్క కుటుంబమే చెడ్డది, వాళ్లని ఉరి వేస్తే సర్వం సుభిక్షం అని అనడం స్వవంచన, పరవంచన.

ఇటువంటి నేపథ్యంలో యివాళ జగన్‌ను సిబిఐ విచారిస్తోంది. దీనినుండి అత్యధిక రాజకీయప్రయోజనం సాధించడానికి జగన్ పూర్తి ప్రయత్నాలు చేశాడు. 9 నెలలుగా విచారణ సాగుతూండగా సరిగ్గా ఎన్నికల సమయంలోనే ఎందుకు పిలవాల్సి వచ్చిందంటూ ప్రశ్నించాడు. 'నా పార్టీకి వున్న పాప్యులారిటీ తట్టుకోలేక పార్టీ అధ్యక్షుణ్ని అయిన నన్ను విచారణ పేర కొన్ని రోజుల పాటు ప్రచారం

నుండి తప్పిస్తున్నారు.' అన్నాడు. 'ఎన్నికలలో మా విజయం తథ్యం కాబట్టి, ఎన్నికలు వాయిదా వేయించడానికి నా అరెస్టు తర్వాత అల్లర్లు జరిపించి, శాంతిభద్రతలను భగ్నం చేసి, ఆ పాపాన్ని మాపై తోసి, వాయిదాకు మేమే కారణమని ప్రజలకు చెప్పడానికి చూస్తున్నారు' అంటూ వాళ్ల స్క్రీన్‌ప్లే యీయనే చెప్పేశాడు. అరెస్టు చేస్తే లక్ష చేతులు లేస్తాయంటూ అంబటి రాంబాబు స్టేటుమెంటు యిస్తే లేచిన ఆ చేతులు మా వాళ్లవి కావు, టిడిపి, కాంగ్రెస్ వాళ్లవి. మా వాళ్లను శాంతియుతంగా వుండమని చెప్పా.." అని జగన్ కలరింగ్ యిస్తున్నాడు.

ఇలాటి పరిస్థితుల్లో జగన్ అరెస్టయితే సింపతీ పెరిగిపోతుందేమోనన్న భయం పట్టేసుకుంది కాంగ్రెస్‌కు. అరెస్టయితే సింపతీ వస్తుంది అనుకుంటే మరి మోపిదేవి అరెస్టు అయినందుకు కాంగ్రెస్‌పై కూడా సింపతీ రావాలిగా? పైగా ఆరుగురు మంత్రులు కూడా అరెస్టు కావచ్చంటున్నారు కాబట్టి జగన్ తరఫునుండి ఒక నాయకుడు అరెస్టవుతే కాంగ్రెస్ తరఫునుండి ఆరుగురు నాయకులు అవుతారు కాబట్టి ఆరు రెట్లు ఎక్కువ సింపతీ రావాలి. ఆ సింపతీ అంతా ఓట్లుగా మారుతుందనుకుని వాళ్లు ఎక్కువ సంతోషించాలి. అదేమిటో కానీ వాళ్లు అలా అనుకోవడం లేదు. వాళ్లే కాదు, టిడిపి కూడా అలాగ అనుకోవడం లేదు. అరెస్టు వలన లాభపడేది జగన్ ఒక్కడే అనుకుంటున్నారు. మొన్నటిదాకా జగన్‌ను అరెస్టు చేయాలి, అతని లక్ష కోట్లు లాక్కుని పేదలకు పంచాలి అని నినాదాలు చేసిన చంద్రబాబు హఠాత్తుగా ప్లేటు ఫిరాయించి కాంగ్రెస్, జగన్ కుమ్మక్కయి యీ డ్రామా ఆడుతున్నాయంటున్నారు. జగన్‌ను అరెస్టు చేసి తద్వారా అతని పట్ల సింపతీ కలిగించి లాభం చేకూరుద్దామని జగన్, కాంగ్రెస్ కలిసి చేసిన కుట్ర అంటున్నారు.

అరెస్టు వలన సింపతీ పెరుగుతుందని భావించేవారిలో జగన్ కూడా వున్నారు. అందువలన తనను అరెస్టు చేయబోతున్నారంటూ అందరి కంటె ముందు తనే చెప్పుకుంటున్నాడు. తను లేనప్పుడు తన తల్లి పార్టీ నడుపుతుందని ప్రకటించి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు కూడా చేసుకున్నానని చాటి చెప్పాడు. మళ్లీ ఏమనుకున్నాడో ఏమో, తన తల్లికి పెద్దగా అనుభవం లేదు కాబట్టి మైసూరా రెడ్డిని అర్జంటుగా పార్టీలో మార్పించుకుని, ఆయన చేతిలో పార్టీ పెట్టి మరీ వెళ్లాడు. అది చూసి ఆయన తనను అరెస్టు చేస్తారని పూర్తిగా విశ్వసిస్తున్నాడన్నమాట అని మనం అనుకోవాలి. మైసూరా రెడ్డి యిలా జంప్ చేస్తారని ఎప్పణ్నుంచో అంటున్నారు. అది యిప్పుడు జరిగింది. ప్రస్తుత పరిస్థితుల్లో ఆయన భరతుడి వేషం వేయాలి. జగన్ లేకపోయినా ఆయన పాదరక్షలతో పార్టీ నడిపించి, తర్వాత తిరిగి రాగానే పాదరక్షలతో సహా సింహాసనాన్ని అప్పగించేయాలి. టిడిపినుండి యిక రాబట్టుకునేది ఏమీ లేదని తేలిపోయింది కాబట్టి యీ ఫిరాయింపు వలన మైసూరాకు నష్టం ఏమీ లేదు.

కానీ మైసూరా జగన్ పార్టీలో చేరిన సమయమే ఆశ్చర్యకరంగా వుంది. పార్టీ నాయకుడిపై పుట్టెడు కేసులున్నాయి. అరెస్టయి ఎప్పుడు బయటకు వస్తాడో తెలియదు. అతను ప్రచారం చేయనిదే పార్టీ గెలుపు ఎలా వుంటుందో తెలియదు. గెలిచినా రాజీనామా చేసిన సీట్లన్నీ గెలుస్తారని నమ్మకం లేదు. అయినా వైకాపాలోకి నాయకులు వస్తున్నారు. అదే వింత ! మైసూరాయే కాదు, ఆళ్ల నాని కూడా మళ్లీ యిటు తొంగి చూస్తున్నారు. ఇంకో యిద్దరు టిడిపి వాళ్లు కూడా రావచ్చు అని ఈనాడే రాసింది. ఇది ఆశ్చర్యంగా లేదా? కాంగ్రెస్ నుండి పార్టీ మార్పిళ్లు జరుగుతూంటే అదో దారి. వైయస్ బొమ్మ పెట్టుకుని గెలిచాం కదా, ఈ సారి వైయస్‌ను తిడితే ఓటర్లకు నచ్చచెప్పడం ఎలా? అన్న భయం వారిది. కానీ టిడిపి సంగతి వేరు. వాళ్లు వైయస్‌ను అప్పుడూ తిట్టారు, యిప్పుడూ ధారాళంగా తిట్టవచ్చు. వాళ్లెందుకు మారాలి?

సిబిఐ 26 జీవోలను తప్పుపట్టినపుడు ప్రభుత్వం ఆ ఆరుగురు మంత్రులపై విచారణ ప్రారంభించి వుంటే బాగుండేది. డిపార్టుమెంటల్ ఎన్‌క్వయిరీ చేస్తున్నాం, మీరు కొంచెం ఆగండి అని సిబిఐకు చెప్పవచ్చు. వాళ్లు ఏమీ చెయ్యకుండా కూర్చున్నారు. ఇప్పుడు సిబిఐ టపటపా అరెస్టులు చేసేస్తూ వుంటే ఓ ప్రశ్న వస్తుంది. ప్రభుత్వం వున్నదెందుకు? ప్రజాధనాన్ని కాపాడడానికి కదా ! దాన్ని కొందరు దోస్తున్నారని తెలియవచ్చినపుడు వాళ్లు కొన్ని చర్యలు తీసుకుని దోపిడీ ఆపాలి. అందుకే తన వ్యవస్థలో పనిచేసే ఉద్యోగులను సైతం ప్రభుత్వం వదిలిపెట్టదు. పట్టుకుని శిక్షలు వేస్తుంది. ఆరుగురు మంత్రులపై, 26 జీవోలపై ఆరోపణలు వచ్చినపుడు ప్రభుత్వం తరఫు నుండి అవి సవ్యమైనవనో, కాదనో, అలా చేసినవారు దోషులనో, కాదనో ఏదో ఒక క్లారిఫికేషన్ రావాలి. దోషులైతే తామే అప్పగించాలి, నిర్దోషులైతే ప్రభుత్వం తరఫున న్యాయవాదులను నియమించి వాదింపచేయాలి. ఏదీ చేయకుండా కూర్చుని సిబిఐ ఒక్కోళ్లను అరెస్టు చేస్తూ పోతే, వాళ్ల దగ్గర్నుండి రాజీనామాలు తీసుకుని, ఓ పక్క తెల్లగా వుందని రఫ్ బుక్ కుట్టించుకుని పెట్టుకుంటే ఏం లాభం?

అయినా తన మంత్రుల్లో కొందరైనా అవినీతిపరులని అనిపించుకుంటే కాంగ్రెస్‌కు ఏం లాభం? జగన్‌ను ఎదుర్కొనేందుకు అతని ప్రత్యర్థులైన కాంగ్రెస్, టిడిపిలకు వున్న బ్రహ్మాస్త్రం – అవినీతి. 'జగన్‌కు ఎంత ప్రజాదరణైనా వుండుగాక, అతను అవినీతిపరుడు, మేం కాదు' అని చెప్పుకునే కదా వీళ్లు ఓట్లు అడగవలసినది. ఇప్పుడు యిలా మంత్రుల మొహానికి మసిపూసి ఎన్నికలకు సిద్ధమైతే ఆ బ్రహ్మాస్త్రం వ్యర్థమైనట్లే కదా. ఓటరేమనుకుంటాడు? 'జగనే కాదు, అందరూ లంచాలు తిన్నారట. సాక్ష్యాలు దొరకడం చేతనే సిబిఐ వాళ్లు అరెస్టు చేశారు, ఆధారాలు దొరకనివాళ్లు యింకా ఎంతమంది వున్నారో ! జగన్ చేసిన పాపమేమిటి, వీళ్లు చేసిన పుణ్యమేమిటి! అందరూ దొంగలే అయినపుడు మనకు నచ్చిన దొంగకే వేద్దాం, దొంగ కదాని మానేయనక్కలేదు.' అనుకోడా? అయితే టిడిపికి యింత చెడ్డ పేరు రాలేదు కదా! వాళ్ల వాళ్లు అరెస్టులు కాలేదు కదా ! ఏమైనా అంటే అవినీతికి టిడిపి కిటికీలు తెరిచింది, వైయస్ హయాంలో వాటినే ద్వారాలు చేశారు' అన్న ఒక్క వర్ణనతో కొట్టుకుపోతోంది. అందువలన అవినీతి ఫ్యాక్టర్ కారణంగా కాంగ్రెస్, వైకాపాలు దెబ్బ తింటే టిడిపి వెలగాలి.

కానీ అదేమిటో కానీ టిడిపి వెలగడం లేదు. దాన్నుంచి కూడా వైకాపాకు వద్దామని చూస్తున్నారు. మైసూరా రెడ్డి వంటి పెద్ద నాయకుడు కూడా వచ్చేశాడు. నెల్లూరులో టిడిపి కాండిడేటు మారతానంటున్నాడట. ఉపయెన్నికల సర్వేలు, విశ్లేషణలు – టిడిపికి మహా అయితే 2 లేదా 3 వస్తాయనే అంటున్నారు. అదీ త్రిముఖ పోటీ బలంగా వున్నచోట మాత్రమే ! ఇది ఆశ్చర్యం కలిగించే అంశం కదా ! జగన్ పట్ల సింపతీ పెరిగినకొద్దీ తమకు ఓట్లు తగ్గుతాయని బాబు భయపడ్డారని తేటతెల్లం అయింది. జగన్‌ను అరెస్టు చేసేది సిబిఐ అయినా వెనకనుండి సిబిఐ చేత కాంగ్రెసే చేయిస్తోందనుకోవడం వలన, కాంగ్రెస్ వాళ్లు అరెస్టయినా వాళ్లకు సింపతీ రాదని అనుకుందాం. మరి టిడిపికి ఆ భయం లేదు కదా, వాళ్లకెందుకు జంకు? ఎందుకంటే జగన్ విషయంలో కాంగ్రెస్, టిడిపి కుమ్మక్కయ్యాయని జగన్ చేస్తున్న ప్రచారం జనాలు నమ్ముతున్నారన్న సందేహం టిడిపికి కలగడం చేత!

కాంగ్రెస్సే సిబిఐ చేత యివన్నీ చేయిస్తోందా? అన్న ప్రశ్న గురించి గట్టిగా ఆలోచిద్దాం. అసలు సిబిఐ చేస్తున్న పనులన్నీ సవ్యంగా చేస్తోందా అని పరికించి చూడండి. సాక్షి ఖాతాలు స్తంభింపచేమంటూ కోర్టుకి వెళ్లారు. సాక్షి టీవీపై కేసులు లేకపోయినా దాన్నీ కలపడమే పెద్ద తప్పు చేశారు. పైగా వెళ్లేటప్పుడు ఫలానా యింత అమౌంటు గురించి సందేహాలున్నాయి. ఆ ఎమౌంటుకు సరిపడా గ్యారంటీ యిమ్మనమనో, ఫిక్సడ్ డిపాజిట్లు స్తంభింపచేయమనో అడిగి వుంటే మర్యాదగా వుండేది కదా. కరంటు అక్కవుంటే నిలిపివేయమన్నారు. దాంతో కోర్టువాళ్లు కుదరదన్నారు. ఈ లోపున సాక్షి ఉద్యోగుల గతి ఏమిటంటూ ఊహూ ప్రచారం చేసేసింది. ఇప్పటికీ సాక్షి పేపర్లో రోజూ ఆ ఫోటోలే ! ఆ ఉద్యోగాలు రోజూ కాస్సేపు కలానికి, కాస్సేపు గళానికి (నినాదాలు యివ్వడానికి) పని చెప్పవలసి వస్తోంది.

పాత్రికేయులైనా మరొకరైనా – ఉద్యోగానికి ఎవరూ భద్రత యివ్వలేరు కదా. మహేంద్రా వాళ్లు ఆదుకోవడం బట్టి సత్యం వుద్యోగులు ఒడ్డున పడ్డారు కానీ లేకపోతే సత్యం కంపెనీ మూతపడేదే ! ఉద్యోగులకు కష్టం కాబట్టి సత్యంపై కేసులు పెట్టకండి, రామలింగరాజును జైలుకి పంపకండి అని వాదించలేం కదా ! సాక్షి మూతబడితే మా ఉద్యోగాలు పోతాయంటూ ఏకంగా మానవహక్కుల కమిషన్‌కి వెళ్లిపోతే ఎలా? గవర్నమెంటు అండర్‌టేకింగ్ ఉద్యోగాలకే కాదు, గవర్నమెంటు ఉద్యోగాలకే గ్యారంటీ లేదు. ఫలానా కార్పోరేషన్ నష్టాల్లో వుంది, మూసేశాం. విఆర్‌యస్ యిస్తున్నాం పుచ్చుకుని పొండి అంటే ఏం చేస్తారు? ఒక వ్యాపారసంస్థ బాగోగులపైననే ఉద్యోగాలు నిలవడమో, ఊడడమో జరుగుతాయి. వార్త ఒకప్పుడు ఎందరో జర్నలిస్టులకు ఉద్యోగాలిచ్చింది. ఇప్పుడు అన్నదమ్ములు కొట్టుకుని సంస్థను ధ్వంసం చేసుకున్నారు. ఉద్యోగాలు పోతున్నాయి. ఇండియన్ ఎక్స్‌ప్రెస్ ఎటువంటి సంస్థ ! ఎంతమంది పాత్రికేయులను తయారుచేసింది. వారసత్వ తగాదాల్లో దెబ్బ తింది. స్టాఫంతా రోడ్డున పడ్డారు. రేపు హఠాత్తుగా మద్యనిషేధం ప్రవేశపెడితే లిక్కర్ వ్యాపారంలో వున్న లక్షలాది కుటుంబాలు వీధిన పడతాయి. ఇవన్నీ సహజపరిణామాలే!

జగన్ పేరు మొదటి నిందితుడిగా చేర్చిన 9 నెలలకు సిబిఐ విచారణకు పిలుస్తోంది. అదీ ఎన్నికల సమయంలో. జగన్ ఎన్నికల ప్రచారం గురించి ఆలోచించాల్సిన పని సిబిఐది కాదు. అయినా అది ఎటువంటి సంకేతాన్ని పంపింది. కావాలని యిప్పుడు పిలిపించారు అనుకునేట్లా వుంది కదా ! కాంగ్రెస్, టిడిపి నాయకులు లక్ష కోట్ల అవినీతి అని ఊదరగొడుతూంటే కనీసం దానిలో ఒక శాతం వెయ్యికోట్ల గురించైనా చార్జి షీటు తయారుచేస్తే వాళ్ల పరువు దక్కేది కదా. బొత్తిగా వందల్లో చేస్తే ఎలా? సిబిఐ కాంగ్రెస్‌కు చేసే ఉపకారం యిదా?

నెలల తరబడి సిబిఐ తెగ లీకులు యిచ్చేస్తోంది. తెలుగు మీడియా తమ వంతు మసాలా చేర్చి తెలుగు మీడియా తమ వంతు మసాలా చేర్చి యింకా యింకా రాసేస్తున్నారు. ఇంత హంగామా జరిగి ఫైనల్‌గా చూస్తే ఎవరి మీదా పూర్తి ఆధారాలు దొరకటం లేదు. ఇదేమీ ఓపెన్ అండ్ షట్ కేసు కాదు. ఎడ్మినిస్ట్రేటివ్ మతలబులతో కూడిన వ్యవహారం. జీవోలపై సంతకాలు పెట్టిన అధికారులు, మంత్రులు వాటిని కాదనలేరు. వారిని ప్రభుత్వం కాదనలేదు. చేయగలిగేది కొంతలో కొంత ఏమిటంటే వైయస్ దొంగ, వీళ్లందరినీ బెదిరించి, పీకమీద కత్తిపెట్టి సంతకాలు పెట్టించాడు అని కాంగ్రెస్ ఓపెన్‌గా డిక్లేర్ చేసి వీళ్లందరినీ బయటపడేసే ప్రయత్నం చేయాలి.

అది అంత సులభమా? వైయస్ పీక మీద కత్తి పెట్టి సంతకాలు చేయించినట్టు యిన్నాళ్లూ ఎందుకు చెప్పలేదంటారు. అలా దోచుకుంటూ వుంటే మూలపుటమ్మ సోనియమ్మ ఏం చేస్తోందంటారు. అందువలన యిప్పుడు కాంగ్రెస్ నాయకులు వైయస్ అన్యాయం చేశాడు కానీ, అది పాపం పుత్రప్రేమ చేత చేశాడు అంటూ సన్నాయినొక్కులు నొక్కుతున్నారు. ధృతరాష్ట్రుడుకి వున్నది కూడా పుత్రప్రేమే ! ఆయన్ని మెచ్చుకుంటున్నామా? తిట్టిపోయడం లేదా? పుత్రప్రేమ వుంటే అప్పుచేసి ముచ్చట తీర్చమను కానీ ప్రజలను దోచి పెట్టడం దేనికి అని అడగమూ!? అది గుర్తించాక 'అబ్బే పుత్రప్రేమ కాదు, కొడుకు ఒత్తిడికి లొంగాడు' అన్నారు. అదీ తప్పేగా ! అది పాయింటుగా చూపించి వైయస్ నిర్దోషి, ఆయన కొడుకు దోషి అన్న వాళ్ల వాదన ఆమోదిస్తే లంచగొండులెవరూ జైలుకి వెళ్లరు. వాళ్ల పిల్లలు, పెళ్లాలు, ప్రియురాళ్లు మాత్రమే వూచలు లెక్కెట్టాలి. వీళ్లు హాయిగా బయటే తిరుగుతూ మరిన్ని లంచాలు పట్టవచ్చు.

సిబిఐ కేసు పెట్టింది సరే, అది యింకా విచారణకు వెళ్లాలి, కోర్టు ఏదో ఒక నిర్ణయం తీసుకోవాలి. ఈ లోపునే అదేదో పెద్ద ఆయుధం దొరికినట్టు కిరణ్ సర్కారు యాడ్స్ ఆపేసి బోల్తా పడింది. సాక్షి మీద కేసు రాగానే కాంగ్రెస్ నాయకులు వీరాలాపాలు మొదలుపెట్టారు. సత్యం కంప్యూటర్స్‌ను మహేంద్రా వాళ్ల చేత స్వాధీనం చేయించుకుని నడిపించినట్టు సాక్షిని కూడా వేరేవారి చేత

(ఇంకెవరు, కాంగ్రెస్ సానుభూతిపరులు) స్వాధీనం చేయించేసుకుని నడిపేస్తాం, అందువలన ఉద్యోగులు తమ నౌకరీలు పోతాయని భయపడనవసరం లేదు అంటూ హామీలు గుప్పించారు. ఆ హామీ ఉద్యోగులు నమ్మినా నమ్మకపోయినా 'హార్నీ, యిదా వీళ్ల ప్లాను' అని అందరికీ తెలిసిపోయింది. దీనివలన కాంగ్రెస్సే సిబిఐ చేత అన్నీ చేయిస్తోందన్న భావం కలిగింది. ఆధారాలు సరిగ్గా యివ్వలేక కోర్టు చేత సిబిఐ అక్షింతలు వేయించుకున్నపుడల్లా కాంగ్రెస్ మరింత బద్‌నామ్ అవుతోంది. పైగా సిబిఐ చేస్తున్న తలతిక్కపనులను సాక్షి ఎన్‌క్యాష్ చేసుకుంటోంది.

సిబిఐ తనకు యీ విధంగా హాని చేస్తూ వుంటే కాంగ్రెస్ ఎందుకు సహిస్తోంది? అన్న ప్రశ్న ఉత్పన్నమవుతుంది. అసలు సిబిఐ కాంగ్రెస్ చేతిలో వుందా, లేక స్వతంత్రంగా వ్యవహరిస్తోందా అన్న అనుమానమూ వస్తుంది. ఇలా అనుకోవడానికి కారణం ఏమిటంటే – కాంగ్రెస్ అనేది ఒక వ్యక్తిగా, సిబిఐ అనేది మరొక వ్యక్తిగా మనం భావిస్తాం. అది తప్పు. రెండూ పెద్ద పెద్ద ఆర్గనైజేషన్స్. అందునా యిటువంటి ప్లాన్లు వేసినపుడు అన్నీ విపులంగా విప్పి చెప్పరు. సూచనప్రాయంగా ఆత్మీయుల వద్ద అంటారు. అది అవతలివాళ్లు గ్రహించి చేసుకుని పోతారు. రాజుగారు 'నాపై కుట్ర పన్నుతున్న సవతి సోదరుణ్ని చంపించండి' అని డైరక్టుగా మంత్రికి చెప్పడు. 'తెగ సతాయిస్తున్నాడు. చావైనా రాదు, వెధవకి' అని మంత్రి వద్ద విసుక్కుంటాడు. అంతే మంత్రి అది గ్రహించి వాణ్ని చంపిస్తాడు. శవాన్ని చూసి రాజుగారు పబ్లిగ్గా భోరున ఏడుస్తాడు. 'ఎలా జరిగింది యిది?' అని నిలదీస్తాడు. 'చీకట్లో చాటుగా వస్తూ వుంటే దొంగ అనుకుని మన సైనికులు దాడి చేశారు ప్రభూ. అడ్మినిస్ట్రేటివ్ హెడ్‌గా పొరబాటుకి నేను బాధ్యత వహిస్తున్నాను' అంటాడు మంత్రి. 'సరే, యీ సారికి క్షమించాను పొండి' అంటాడు రాజు.

మంత్రికూడా సేనాపతిని పిలిచి డైరక్టుగా వాణ్ని చంపించేయ్ అని చెప్పడు. 'రాజుగారు అతని పేరు చెప్తేనే మండిపడుతున్నారయ్యా' అనే అంటాడు. సేనాపతికి బుఱ్ఱ పనిచేస్తే వెళ్లి చంపిస్తాడు. లేకపోతే 'పోన్లెండి, వేరే వూరు వెళ్లిపోమని చెప్దాం' అంటాడు. ఇక మంత్రి ఏమీ చేయలేడు. అందుకే చాణక్యుడు రాజుగారి హృదయం తెలుసుకుని మంత్రి మాట్లాడాలి, వాటిని అమలు చేయాలి అంటాడు. సోనియా గాంధీ కూడా జగన్‌ని యిలా యిలా చేయండి అని వి హనుమంతరావును వాళ్లనీ పిలిచి చెప్పరు. ఆవిడ అంతరంగికుల వద్ద ఏదో సణుగుతుంది. వాళ్లు మరొకరిని.. ఆ మరొకరు సిబిఐను యిలా కదుపుతూ పోతారు. సిబిఐ టాప్ బాసెస్‌కు స్పష్టమైన ప్రణాళిక వున్నా, లక్ష్మీనారాయణగార్ని పిలిచి యిలా చేయ్ అని చెప్పరు, చెప్పలేరు. అన్యాపదేశంగా యిలా జరిగితే బాగుంటుంది అని చెప్తారు. సిబిఐ డైరక్టరు కింద అనేకమంది పని చేస్తారు. అందరూ పై వాళ్లు చెప్పినట్టే తుచ తప్పకుండా చేస్తారని లేదు. వ్యక్తిగత యిష్టాయిష్టాలుంటాయి కదా. అర్థం కానట్టు నటించో, నోటితో చెప్తే కుదరదు కాగితం మీద రాసివ్వండి అని అడ్డం తిరిగో పానకంలో పుడకలా తయారవుతారు.

మొన్ననే ఎవరో అడిగారు – చిరంజీవి కాంగ్రెస్ ఎంపీ కదా, కాంగ్రెస్ ప్రభుత్వం వారి కింద పనిచేసే ఐటీ శాఖ వారు ఆయన వియ్యంకుడి యింటిపై దాడి చేసే డబ్బు పట్టుకోవడం ఏమిటండీ అని. ఐటీ శాఖ టాప్ బాస్ కాంగ్రెస్ చెప్పినట్టు ఆడవచ్చు కానీ పైనుండి కిందవరకు ఆయన మనుష్యులే వుండరు కదా. మధ్యలో ఎందరో నిజాయితీపరులుంటారు. వాళ్లు తమ పని తాము చేసుకుని పోతారు. అందుకే యిలాటి దాడులు జరుగుతాయి. ఎటొచ్చీ పర్యవసానాల దగ్గరకి వచ్చేసరికి మళ్లీ పై వాళ్లు కలగజేసుకుని అస్మదీయులను ఒడ్డున పడేస్తారు. మనం చేయగలిగినది చేశాం అంటూ యీ నిజాయితీపరులు నిట్టూర్చి తమ పని తాము చేసుకుంటూ పోతారు. రాష్ట్రంలో ఎసిబి దాడుల విషయం ఒక్కసారి పరికించండి, నా పాయింటు అర్థమౌతుంది. బొత్స మీద కోపంతోనే కిరణ్ లిక్కర్ లాబీపై దాడులు ప్రారంభించా రనుకుందాం. తర్వాత హై కమాండ్ చొరవతో కిరణ్, బొత్సల మధ్య సయోధ్య కుదిరి ఎసిబిని నియంత్రించాలంటే చేయగలిగారా? అప్పటికే వ్యవహారం భూపతిబాబు చేతిలోకి వెళ్లిపోయింది. ఆయన తన మార్గాన వెళ్లసాగారు. ఆయన్ని ఏమీ చేయలేక ఆయనపై యింకోర్ని వేశారు. ఈయన సెలవులో వెళతానంటున్నారు. ప్రభుత్వం పరువు బజారున పడింది. లిక్కర్ లాబీపై దాడులు ప్రారంభించినపుడు కిరణ్ యిదంతా వూహించి వుండరు.

సిబిఐ విషయంలో కూడా యిదే జరిగివుంటుందని నా ఊహ. ఢిల్లీ వాళ్లు ఏదో ఉద్దేశంతో ఆట మొదలుపెట్టారు, అది వాళ్లనుకున్నట్టు సాగకుండా ఎటెటో వెళ్లిపోతోంది. దానివలన జరిగే అపకారం సరే, నింద కూడా మోయాల్సి వస్తోంది. అందుకే అనుకుంటున్నాను – కళ్లెం వున్నది చేతిలో.. గుఱ్ఱం పడె గోతిలో.. అని. **– ఎమ్బీయస్ ప్రసాద్ (మే 2012)**

## మే 26 ఎమ్బీయస్ : హమ్మయ్య.. అయిపోయింది

నిన్న రాత్రి జగన్ అరెస్టు వార్త వినగానే ఏదో పెద్ద బరువు దిగిపోయినట్టనిపించింది. ఇదిగో అవుతున్నాడు, అదిగో అవుతున్నాడు, ఇవాళ…కాస్సేపటిలో.. తప్పదు.. ఖచ్చితం.. ఎప్పుడో చెప్పాం.. అనే మసాలా వార్తలు, చట్టానికి ఎవరూ అతీతులు కారు.. చట్టానికి చుట్టాలు లేరు.. న్యాయదేవత ఆస్థానంలో ఆలస్యం వుండవచ్చు కానీ, అంధకారం వుండదు… చేసిన పాపానికి శిక్ష అనుభవించక తప్పదు… వంటి వ్యాఖ్యలు, అరెస్టవుతే ఏమవుతుంది? అనుయాయులు నోరు విప్పితే ఎన్నేళ్ల శిక్ష పడుతుంది, విప్పకపోతే ఎన్నేళ్లు? సాధారణ ప్రజలు దీన్ని ఎలా రిసీవ్ చేసుకుంటారు? సానుభూతి బరామీటరు పెరుగుతుందా, తగ్గుతుందా..అన్న చర్చలు ఏడాదిగా సాగుతున్నాయి. సిబిఐ కేసు ఫైల్ చేసిన 9 నెలలుగా అయితే మరీనూ. జగన్, కటకటాల గ్రాఫిక్స్ ఎన్నిసార్లు వాడారో చెప్పనే

అక్కరలేదు. ఇక ఎన్నికల ప్రక్రియ ప్రారంభమైన దగ్గర్నుంచి మరీ రెచ్చిపోయారు. ఎట్టకేలకు అరెస్టు అధ్యాయం ముగిసింది కాబట్టి వీటికి తెర దించవచ్చు.

ఇకపై బెయిల్ యిస్తారా? ఇవ్వరా? ఇస్తే ఎన్నాళ్లు? మళ్లీ చేస్తారా? కోర్టులో విచారణకు ఎప్పుడు వస్తుంది? వంటి ప్రశ్నలు వేసుకుంటూనే వుండవచ్చు. కానీ మొదటిసారి అరెస్టు చేసినప్పుడు వుండేటంత సంచలనం తర్వాత వుండదు. మళ్లీ అరెస్టు చేశారా, ఓహో అనుకుంటారు. నిన్న అరెస్టు చేశారు. అల్లర్లు జరుగుతాయనే భయంతో ముందు జాగ్రత్తగా తక్కినవారిని అరెస్టు చేశామన్నారు పోలీసులు. మంచిదే. విజయమ్మగారు దీక్ష చేస్తున్నారు. సాయంత్రానికి వాళ్ల పార్టీ వాళ్లే నిమ్మకాయ రసం యిచ్చి విరమింపచేస్తారు. ఎందుకంటే యీ దీక్షల వలన సిబిఐ కాని, కోర్టు కాని, ప్రభుత్వం కానీ చలించదు. స్పందించదు. చంద్రబాబు రైతులకోసమంటూ చేసినప్పుడు చూడలేదా? అదే కథ. రాష్ట్రంలో పరిస్థితి అదుపు తప్పలేదు. కడప జిల్లాలో బంద్ సక్సెస్ కాలేదని టీవీ 9 అంటోంది. అయిందని రేపు సాక్షి పేపరు చెప్తుంది. మనం వీటిని పట్టించుకోవడం ఎప్పుడో మానేశాం.

అయినా పట్టించుకుంటామనే భ్రమతో రాజకీయపక్షాలు ఏవేవో విన్యాసాలు చేస్తాయి. లీటరు పెట్రోలు సీసాతో దొరికిన వారి కథ అలాటిదే. అది నిజం కావచ్చు, లేదా పోలీసులు అల్లిన కథ కావచ్చు. అది పెట్టుకుని టిడిపి రాజేంద్రప్రసాద్‌గారు 1100 మండలాల్లో 1100 బస్సులను తగలబెట్టడానికి జగన్ 1100 కోట్లు ఎలాట్ చేశారన్న కథ (అంటే ఒక బస్సు తగలేయడానికి కోటి రూపాయలా? ఇలా అయితే రాజకీయాలు నడపడం మహా ఖర్చుతో కూడుకున్న వ్యవహారం సుమా! పరిటాల రవి పోయినప్పుడు టిడిపి వారు బస్సులు తగలేయడానికి పెట్టిన ఖర్చుని బేస్ చేసుకుని యిప్పటి రేట్లలో యింత అవుతుందని లెక్క వేసి వుంటారు) అల్లేయవచ్చు. అబ్బే యిదంతా కల్పన కాదు, వాస్తవమే అన్నా నేనేమీ ఆశ్చర్యపడను. పార్టీలో చురుగ్గా వున్నాడు అని అనిపించుకుందామనుకున్న నాయకులు అనేకమంది తమ చురుకుతనాన్ని యిలాటి చర్యల ద్వారానే ప్రదర్శిస్తారు. అలాటి వాళ్లు యీ పార్టీలోనే కాదు, ఏ పార్టీలోనైనా వుంటారు. ఉంటారని పోలీసులకూ తెలుసు.

అయితే వాళ్లు కొందరి విషయాల్లో వాళ్లు ముందే వూహిస్తారు, కొందరి విషయాల్లో ప్రమత్తంగా వుంటారు. మోపిదేవికి అనుచరులు ఎవరూ వుండరని, ఆయన అరెస్టయినా వాళ్లు పట్టించుకోరని అనుకున్నారు గాబోసు, ఆయన నియోజకవర్గంలో ముందస్తు అరెస్టులు చేయలేదు. అల్లర్లు జరిగాయి. అరెస్టయ్యే మంత్రుల లిస్టు యింకా వుంది కదా, మరి వాళ్లు అరెస్టు అయినపుడు వాళ్ల నియోజకవర్గాల్లో అల్లర్లు జరగనిస్తారో లేదో చూదాం. పోలీసుల చిత్తం, మన ప్రాప్తం. 'జగన్ అరెస్టుతో రాష్ట్రం అట్టుడికిపోయింది' అనే హెడ్‌లైన్సు రాకుండా చేశారు, అంతవరకూ సంతోషం. ఈ బందలు, హర్తాళ్లు రాష్ట్రాన్ని, జనజీవితాన్ని అతలాకుతలం చేస్తున్నాయి. ఇంకో రెండు రోజుల్లో పెట్రోలు ధరల హర్తాళ్ ఎలాగూ వుంది. బయట ఎన్ని దిష్టిబొమ్మలు తగలేసినా జైల్లో వున్ననాయకుడికి ఒనగూడేది ఏమీ లేదు. ఈ దిష్టిబొమ్మలు తగలేస్తూ కూర్చునే బదులు యింటింటికి వెళ్లి ఎన్నికల ప్రచారం చేయండిరా బాబూ అని చెప్తాడు తన అనుచరులతో.

సిబిఐ చేసిన అరెస్టును ఖండించడానికి తప్పుపట్టలేరు కానీ టైమును మాత్రం తప్పుపట్టవచ్చు. సరిగ్గా ఎన్నికల సమయంలోనే అరెస్టు చేసి, రెండు వారాల పాటు రిమాండులో పెట్టడం కావాలని ఎన్నికల సీను నుండి తప్పించడానికే అంటారు జనమంతా. అది కూడా ఎన్నికల చివరిదశలో, డబ్బు పంపిణీ చేయవలసిన సమయంలో పెట్టడం కుట్రలో భాగమే అనుకుంటారు. జగన్ పాప్యులారిటీ సహించలేక కాంగ్రెస్ యిలా చేయిస్తోందని వైకాపా అంటే, జగన్ పాప్యులారిటీ పెంచుదామనే కాంగ్రెస్ యిలా చేయిస్తోందని టిడిపి అంటోంది. తాము ఏం చేయిస్తున్నామో, ఎందుకు చేయిస్తున్నామో కాంగ్రెస్‌కూ తెలుసో తెలియదో ! జగన్ అరెస్టు వలన కాంగ్రెస్ లాభపడుతుందో లేదో ఎన్నికల తర్వాతనే తెలుస్తుంది. లాభపడితే సిబిఐకు కాంగ్రెస్ థాంక్స్ చెప్పుకోవాలి. కానీ నష్టపోతే...?

ఏది ఏమైనా కాంగ్రెస్‌వారు సిబిఐను మరీ వెనకేసుకుని రావడం వాళ్లకే అనర్థం. వైయస్‌కు సిబిఐ అంటే చాలా గౌరవం, వాళ్లబ్బాయి సిబిఐని నిందించడం తప్పు అంటూ స్టేటుమెంట్లు యిస్తున్నారు. వైయస్ కాంగ్రెస్ నాయకుడు, వాళ్లబ్బాయి వైకాపా నాయకుడు. వైయస్‌ది పాలకపక్షం, జగన్‌ది ప్రతిపక్షం. సిబిఐ పాలకపక్షానికే కొమ్ముకాస్తుంది అని అంటున్నపుడు జగన్ సిబిఐను ఎందుకు మెచ్చుకుంటాడు? తను అధికారంలోకి వచ్చేవరకూ మెచ్చుకోడు. అప్పుడు కాంగ్రెస్‌వారు ప్రతిపక్షంలోకి వచ్చారనుకోండి 'సిబిఐ చెడ్డది' అని వాళ్లే అంటారు. మరి యిప్పుడు యిలా, అప్పుడు అలా అన్నావేం? అంటే నవ్వు వస్తుంది.

ఇక జగన్ అరెస్టు వలన సానుభూతి పెరుగుతుందా? అని అడిగితే నా సమాధానం ఒక్కటే – జగన్ అరెస్టుకు ప్రజలు మానసికంగా ఎప్పుడో సిద్ధపడిపోయారు. తమతమ యిష్టాయిష్టాలకు అనుగుణంగా ఏదో ఒక అభిప్రాయానికి వచ్చేశారు. ఇవాళ ఫిజికల్‌గా చంచల్‌గూడకు పంపినంత మాత్రాన వారిలో మార్పు రాదు. ఇమ్యూన్ అయిపోయారు. అరెస్టయిన రోజున ఈనాడు కార్టూన్‌ను గమనిస్తానని చెప్పాను కదా. నేను భయపడినట్టుగా పేలవంగానే వుంది. డబ్బు మూట ఒకటి జగన్‌ను సంకెళ్లు వేసి తీసుకెళుతున్నట్టు వేశారు. ఎందుకంటే కార్టూనిస్టు శ్రీధర్ కూడా జగన్ అరెస్టు వార్తకు యిమ్యూన్ అయిపోయినట్టున్నారు. **– ఎమ్బీయస్ ప్రసాద్ (మే 2012)**

**మే 27** **ఎమ్బీయస్‌ః ఎలక్షన్ హాస్యం**

మీరీ మధ్య కబుర్లు చెప్పటం లేదేమని చాలామంది మెయిల్స్ రాశారు. ఎన్నికల పేరు చెప్పి అనేకమంది సరదా కబుర్లు

చెపుతూంటే మనవి ఎవరు చదువుతారు చెప్పండి. నాకు బాగా నవ్వు తెప్పించిన కొన్నిటిని గుర్తు చేస్తాను, చిత్తగించండి. జగన్ లక్షకోట్లు తిన్నాడు అని ప్రచారం చేస్తూ వచ్చిన టిడిపి హఠాత్తుగా ఓ రోజు అబ్బే లక్ష కాదు, రెండు లక్షల కోట్లు అనేసింది. ఒక లక్ష వైయస్ తీసుకుని మరో లక్ష సోనియాకు పంపాడట. అసలు అదేం లెక్కో నాకు తెలియదు. సోనియా స్థాయితో, సోనియా అవసరాలతో పోలిస్తే వైయస్ ఎక్కడ తూగుతాడు చెప్పండి. దేశమంతా జరిగే ఎన్నికలకు నిధులు పంపవలసిన అవసరం సోనియాది. కాంగ్రెస్ పాలిస్తున్న రాష్ట్రాలే తక్కువ. పైగా వాటిల్లో నాగాలాండ్ లాటివి వుండి ఎంత ప్రయోజనం వుంటుంది? మహారాష్ట్ర లాటి పెద్ద రాష్ట్రాలలో మిశ్రమ ప్రభుత్వం ఆయె. తామే పూర్తిగా పాలిస్తున్న పెద్ద రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ ఒకటే అయినపుడు మరి సోనియాకు మన రాష్ట్రంపై ఎన్ని ఆశలుంటాయి, అలాటప్పుడు ఫిఫ్టీ-ఫిఫ్టీతో సరిపెట్టుకుంటుందా?

పోనీ వ్యక్తిగతంగా చూసినా సోనియాకు యిద్దరు పిల్లలు, వైయస్‌కూ యిద్దరే. వైయస్ పిల్లలిద్దరికీ పెళ్లిళ్లయిపోయాయి. సోనియా కొడుక్కి పెళ్లి కూడా కాలేదు. అదో ఖర్చు వుంది పాపం. పైగా వైయస్ పిల్లలు యిక్కడిక్కడే కడప, బెంగుళూరు, హైద్రాబాదుల మధ్య తిరుగుతారు. సోనియా పిల్లలు విదేశాలకు కూడా వెళ్లాల్సి వస్తుంది. ఇన్ని ఖర్చులు పెట్టుకుని, వైయస్ సగం నీకు-సగం నాకు అంటే సోనియా ఒప్పుకుంటుందా? ఒక రాష్ట్రపు సిఎం ఎక్కడ? దేశం మొత్తం పాలించే సూపర్ పిఎం ఎక్కడ? టిడిపి వాళ్లు సోనియా వాటాను కూడా దృష్టిలో పెట్టుకుని వైయస్ లక్ష కోట్లు సంపాదించారు కానీ దానిలో 90% సోనియా పట్టుకుపోగా, 10% మాత్రమే వైయస్‌కు దక్కిందిఅని ఆరోపించివుంటే వైయస్ ఆస్తుల లెక్కకు అది సరిపోయేదేమో. కానీ వీళ్లు జగన్‌కు లక్ష కోట్లు అని ఫిక్సయిపోయారు. అందుకని సోనియా వాటాకు లక్ష కోట్లు మాత్రమే ఎలాట్ చేశారు. సోనియాకు తెలిస్తే తన లెవెలు పడిపోయిందని ఫీలవుతారో ఏమో.

లక్ష కోట్లు లక్ష కోట్లు అనడమే తప్ప ఆ ఫిగర్ ఎలా వచ్చిందో చెప్పడం కష్టంగా వుంది. సిబిఐ విచారణ కూడా దానిలో 1%లో మూడో వంతుపై జరుగుతోంది. టిడిపివాళ్లు, శంకర్రావుగారు కలిపి యిచ్చిన (కలిపి ఏమిటిలెండి, యిద్దరిచ్చినవీ ఒకటే) దస్తావేజుల్లో పనికి వచ్చేవి ఏరితే అంతే దొరికినట్టుంది సిబిఐకి. ఇలాటివి యింకో మూడు వందలిస్తే అప్పుడు లక్ష కోట్లు టార్గెట్ చేరతారు. అదెలా చేర్రా్రా భగవంతుడా అనుకుంటూ వుంటే సడన్‌గా ఆ టార్గెట్‌ను డబుల్ చేసి పారేశారు. అనేవాళ్లకేం పోయింది? ఓ రోజు పేపర్లలో పేరు వస్తుంది, చాలు. కానీ దాన్ని సమర్థించుకు రావడానికి టీవీ చర్చల్లో టిడిపి ప్రతినిధులు ఎన్ని సర్కసులు చేయాలో అది ఆలోచిస్తే యింత అనాలోచితంగా వ్యవహరించేవారు కాదు.

అసలు నాయకులకు అంకెలమీద గౌరవం పోయింది. తను అరెస్టవుతే వంద బస్సులు తగలేయించడానికి జగన్ కుట్ర పన్నాడని బాబు అంటే (మే 27 నాటి జ్యోతి) అంటే మర్నాటికి వంద కాదు, 1100 బస్సులని రాజేంద్రప్రసాద్ అన్నారు (ఆంధ్రభూమి మే 28) కేలండరులో ఓ పేజీ చిరిగేసరికి ముందు ఒకటి అంకె వచ్చి చేరింది. దానికి బజెట్ కూడా బస్సుకి కోటి (కొనడానికి కాదు, తగలేయడానికి) అని చెప్పేశారు రాజేంద్రప్రసాద్! తీరా చూస్తే ఒకటి రెండు బస్సులు మాత్రమే తగలడ్డాయి. ఎలాట్ చేసిన 1100 కోట్ల డబ్బేమైందో కనుక్కోండి మరి అని రాజేంద్రప్రసాద్‌గార్ని అడిగితే అబ్బే, అది మలేసియా ద్వారా మళ్లీ జగన్ ఖాతాల్లోకి వచ్చేసింది అని గడుసుగా చెప్పగలరు కూడా.

వైయస్ తమది మడమ తిప్పని వంశం, మాట తప్పని వంశం అని చెప్పుకుంటూ చంద్రబాబుకి విశ్వసనీయత లేదనడం, అది ఓటర్లు నమ్మడం టిడిపి వారిని మండించింది. వైయస్‌ది మాట తప్పని వంశం కాదని నిరూపించడానికి వారు సాక్షిని ఎంచుకున్నారు. సాక్షి మొదట్లో రెండు రూపాయల కిచ్చారు. మూడు రూపాయలకు అమ్ముతున్న తక్కినవారిని కూడా రెండు రూపాయల రేటుకి యిమ్మనమని ఛాలెంజ్‌లు చేశారు. వాళ్లేం యివ్వలేదనుకోండి. ఆ తర్వాత సాక్షి కూడా తక్కిన పేపర్ల రేటుకే అమ్మనారంభించింది. మాట తప్పని వంశం కాబట్టి మొదటి రేటుకే అమ్మాలని, రేటు పెంచారు కాబట్టి విశ్వసనీయత కోల్పోయారని ముద్దు కృష్ణమనాయుడిగారి ఆరోపణ.

వ్యాపారం అంటూ వున్నాక మార్కెటింగ్ టెక్నిక్కులు ఎన్నో అవలంబిస్తారు. గొప్ప తగ్గింపు ధరలతో ఎగ్జిబిషన్. బట్టలపై 5 - 50% డిస్కౌంట్ అని ప్రకటనలిస్తారు. వెళితే పట్టు చీర మీద 5% డిస్కౌంట్ అంటారు. మరి 50% దేని మీద అంటే అదిగో ఆ మూల అసహ్యంగా, మాసిపోయి కుప్పపోసిన నాప్‌కిన్‌లున్నాయి కదా, వాటి మీద అంటారు. పెట్రోలు తగలేసి ఎలాగూ వచ్చాం కదా, వట్టి చేతులతో వెళ్లడం ఎందుకు, ఎప్పణ్నుంచో దుప్పట్లు కొందామనుకుంటున్నాం, కొంటే సరి అనుకుని ఓ నాలుగు దుప్పట్లు కొనుక్కుని వస్తాం. షాపువాడి లక్ష్యం నెరవేరిందిగా, ఆ 50% అంకె చూడకపోతే మనం అక్కడికి వెళ్లి వుండేవాళ్లం కాదు, వాడి దగ్గర ఆ దుప్పట్లు కొనేవాళ్లం కాదు.

న్యూస్ పేపర్లు కొత్త ప్రాంతాల్లో మార్కెట్‌లోకి వచ్చినపుడు ఇన్విటేషన్ ప్రైస్ అంటూ వారంలో కొన్ని రోజులు పేపరు రూపాయికే అమ్ముతారు. తక్కిన రోజుల్లో మామూలు ధరే. ఈనాడు వైజాగ్ కేంద్రంగా ఓ ఏడాది నడిచాక, హైదరాబాదుకి కార్యాలయం మార్చారు. అప్పట్లో ఆంధ్రపత్రిక, ఆంధ్రప్రభ, ఆంధ్రజ్యోతి రాజ్యం చేస్తూ వుండేవి. కొత్తతరహా భాషతో, లే ఔట్‌తో ఈనాడు మార్కెట్‌లోకి వచ్చింది. ఎవరైనా పేపరు చూస్తే కదా యీ ప్రయోగాల సంగతి తెలిసేది. రుచి చూపించడానికి నగరమంతా వారం రోజుల పాటు ఈనాడు ఉచితంగా పంపిణీ చేశారు. వారం అవుతూనే ఏజంటు వచ్చి 'కొనసాగించమంటారా? అయితే చందా యింత" అంటూ వచ్చి అడిగాడు. అందరూ టపటపా చందాలు కట్టేశారు. పేపరు సక్సెసైంది. ఆనాడు ఉచితంగా యిచ్చారు కదాని

ఎల్లకాలం  ఫ్రీగా యివ్వండి అనడం భావ్యమా?

తెలంగాణలో టీ ఎలా అలవాటైందో దాశరథి రంగాచార్యగారు తన జీవితచరిత్రలో రాశారు. టీ కంపెనీవారు తెలంగాణ గ్రామాలకు వచ్చి ఓ చెట్టు కింద కూర్చుని, ఊళ్లో అందరికీ ఫ్రీగా టీ పోస్తామని కూర్చునేవారట. ఎవరూ వచ్చేవారు కారు. ఎవరో ధైర్యం చేసి తాగినవారు తాగగా సాయంత్రానికి మిగిలినది పారబోసి మళ్లీ మర్నాడు వచ్చి కూర్చునేవారు. ఇలా నెల్లాళ్లు సాగేసరికి టీ రుచి మరిగినవాళ్లు రోజూ వచ్చి తాగేవారు. వారి సంఖ్య పెరిగింది. అప్పుడు కంపెనీవారు 'టీ మొత్తం ఫ్రీగా యివ్వం, మీరు పాలు, పంచదార ఓ గ్లాసులో పోసి తెచ్చుకుంటే టీ డికాషన్ వూరికే పోస్తాం' అన్నారు. అలా రెండు నెలలు పోయాక 'టీ డికాషన్ కూడా అమ్మాల్సి వస్తోంది, ఏమీ అనుకోకండి, పొట్లం అణా' అన్నారు. అప్పటికే తేనీటి సేవనానికి అలవాటు పడిన జనాభా గత్యంతరం లేక కొని తాగసాగారు.

ఇలా చూస్తే ఈనాడు కూడా టీ కంపెనీవారి టెక్నిక్కునే వాడిందనుకోవాలి. ఆ పేపరుకి అలవాటు పడిపోయాం కాబట్టి రోజూ 3 రూ॥లు పెట్టి కొంటున్నాం. ఈ పేపరును ఎదిరించి నిలదొక్కుకోవాలంటే అంతే క్వాలిటీతో వున్న పేపరును అంతకంటె తక్కువ రేటుకి అందించాలి. టైమ్స్ ఆఫ్ ఇండియా హైదరాబాదు ఎడిషన్ ప్రారంభించినపుడు డెక్కన్ క్రానికల్, ది హిందూ పేపర్ల మార్కెట్ సంపాదించడానికి ఏం చేసిందో, సాక్షి కూడా అదే చేసింది. ఆ మాత్రానికి వంశం దాకా పోవడం దేనికి? రామోజీరావుగార్ని, బ్రూక్‌బాండ్, టైమ్స్ ఆఫ్ ఇండియా జైన్‌లను.. యిలా లక్షా తొంభైమందిని అందర్నీ యిలాగే వర్ణిస్తూ పోతే భలే తమాషాగా వుంటుంది.

చంద్రబాబుగారు పబ్లిగ్గా వాపోయారు – 'తొమ్మిదేళ్లు ముఖ్యమంత్రిగా చేసినా, పేపరు పెట్టి నడపడం నాకు చేతకాలేదు, ఈ జగన్ మాత్రం నడిపేస్తున్నాడు' అని. ముఖ్యమంత్రిగా చేయడానికి, పేపరు పెట్టి నడపడానికి లింకేమిటో నాకు తెలియలేదు. అది వేరే కళ, యిది వేరే కళ. ఆ మాట కొస్తే ఎందరు ముఖ్యమంత్రులకు పాల వ్యాపారం చేయడం తెలుసు? పాలనాసమర్థుడిగా పేరు తెచ్చుకున్న వెంగళరావుగారికి తెలుసా? ఇంటా బయటా పేరు మారుమ్రోగిపోతున్న నరేంద్ర మోదీకి తెలుసా? పాతికేళ్లపాటు బెంగాల్ పాలించిన జ్యోతి బసుకి తెలుసా? వారెవ్వరికీ రాని పాలవ్యాపారం నాకు వచ్చు అని బాబుగారు గర్వించడం పోయి, పేపరు వ్యాపారం చేయడం రాలేదని బాధ పడడమేమిటి సిల్లీ !

అయినా బాబుగారు ఓ విషయం గుర్తించాలి. 'నెసెసిటీ యీజ్ మదర్ ఆఫ్ యిన్వెన్షన్'. అవసరం వుంటే అవకాశాన్ని వెతుక్కుంటారు. 'ఆ రెండు పత్రికలు'ను సహించలేక వైయస్ "సాక్షి" పెట్టించారు. ఆయన పోయాడు కానీ పేపరు మిగిలిపోయింది. ఆ రెండింటికి పక్కలో బల్లెంలా తయారై మార్కెట్‌లో వాటా పంచుకుంటోంది. ఆ రెండు ఏదో కాస్త అటూయిటూగా రాస్తూ వుండి వుంటే వైయస్ ఆ డబ్బుతో బెంగుళూరులో మరో భవంతి కట్టించి వుండేవారు. చంద్రబాబుకి కూడా "ఈనాడు" ఎదురు తిరిగి వుంటే ఆయనా హెరిటేజిలో పెట్టిన డబ్బు పెట్టి ఓ పేపరు పెట్టి వుండేవారు. కానీ టిడిపి అదృష్టం ఏమిటంటే దాని పుట్టుక నుండీ "ఈనాడు" వంటి బలమైన మీడియా అండగా నిలిచింది. 1995 తర్వాత ఆ అండ ఎన్టీయార్‌నుండి చంద్రబాబుకి బదిలీ అయింది. అందువలన బాబుకి అవసరం పడలేదు. పేపరు పెట్టలేదు. టిడిపికి రోజులు దగ్గరపడ్డాయని "ఈనాడు"కి అనిపించిన రోజున, పేపరు పెట్టి తీరాలని వైయస్ లాగే బాబు కూడా అనుకుంటారు. అలా అనుకున్న మూణ్నెల్లల్లో ముచ్చటైన పేపరు బయటకు తీసుకురాగలిగిన నిర్వహణాసామర్థ్యం ఆయనకుంది.

బాబుగారు ఉపయెన్నికలను అతి సీరియస్‌గా తీసుకున్నారు. జనరల్ ఎలక్షన్‌లో యివ్వాల్సిన వాగ్దానాలన్నీ యిప్పుడే యిచ్చేస్తున్నారు. 2014లో మ్యానిఫెస్టో రాయవలసిన అవసరం లేకుండా యిప్పుడే అన్నీ ఉచితం, ఉచితం అంటున్నారు. ఈ ఎన్నికల్లో 18 స్థానాలూ టిడిపియే నెగ్గినా – ఈ సీట్లతో ఆయన పార్టీ అధికారంలోకి రాలేదు కాబట్టి– వీటిల్లో ఒక్క వాగ్దానం కూడా ఆయన నెరవేర్చలేరు. కాంగ్రెస్‌తో కుమ్మక్కయి చిరంజీవిలా తన పార్టీని కాంగ్రెస్‌లో కలిపేస్తే చెప్పలేమనుకోండి. అసలు యీ కుమ్మక్కు అనే పదం ఒకటి తెగ వినబడుతోంది. అన్ని పార్టీలదీ ఒకటే మాట – మాకు వ్యతిరేకంగా వున్న పార్టీలన్నీ ఒకరితో మరొకరు కుమ్మక్కయ్యాయి! ఇన్ని పార్టీలు 'ఒకే మాట' మీద నిలబడడం నాకు చాలా ఆనందంగా వుంది. అసలు పార్టీల మధ్య యింత ఐకమత్యం వుంటుందని, ఒకరితో మరొకరు కలిసి పని చేస్తాయని కూడా ఎప్పుడూ అనుకోలేదు.

'కాంగ్రెసు నుండి బయటకు వచ్చిన జగన్ మళ్లీ దానిలో కలవడం  ఖాయం. వాళ్లంతా ఒక తానులో ముక్కలే' అంటుంది టిడిపి. 'బాబు కూడా  కాంగ్రెస్‌నుండి వచ్చినవారే కదా, ఆయనదీ అదే తాను' అంటుంది వైకాపా. పెద్ద జోకేమిటంటే పార్టీ ఫిరాయింపుదారులను పదేళ్ల పాటు రాజకీయాల్లోంచి బహిష్కరించాలని బాబు డిమాండ్ చేస్తున్నారు. అసలు ఆయనే ఓ పెద్ద ఫిరాయింపుదారు. ఇప్పుడు జగన్ బలం పెంచడం కోసం రాజీనామా చేసి ప్రజాధనాన్ని వృథా చేస్తున్న మాజీ ఎమ్మెల్యేలను స్పీకరు అనర్హులుగా ప్రకటించాలట. మరి కెసియార్ బలం పెంచడం కోసం రాజీనామా చేసిన వారి మాటేమిటి? వారి విషయంలో యీయన అలా డిమాండ్ చేయలేదేం? చేసి వుంటే తెలంగాణలో పడిన ఆ పాటి ఓట్లు కూడా పడవని భయపడ్డారా? ఎవరైనా పార్టీ మారినపుడు ఆ పార్టీ ద్వారా సంక్రమించిన పదవులు రాజీనామా చేసి, కొత్త పార్టీ తరఫున మళ్లీ పోటీ చేసి గెలవడం ఒక మంచి పరిణామంగా ఎప్పణ్నుంచో పరిగణిస్తున్నారు. తెరాస ఎమ్మెల్యేలు అదే పార్టీలో కొనసాగుతూ కూడా పదేపదే రాజీనామాలు చేసి, ఎన్నికలు రప్పించి ఎంతో ధనవ్యయం కావించారు. వారి నేమనాలి?

'ఐదేళ్లు మాకు సేవ చేయండి అని మీరు వారిని గెలిపిస్తే మూడేళ్లలోనే సేవ చేయకుండా పారిపోయి, మళ్లీ మీ ఎదుటకు వస్తున్నవారిని ఛీ కొట్టండి, ఓడించండి' అని పిలుపు నిచ్చారు చిరంజీవి. ప్రస్తుతం తిరుపతిలో తమరు చేసినదేమిటి స్వామీ? తిరుపతి ఎమ్మెల్యేగా ఐదేళ్లపాటు మమ్మల్ని ఉద్ధరించవయ్యా అంటే రాజ్యసభలో సీటు యివ్వగానే తిరుపతి ఓటర్లకు గుండు కొట్టించి వెళ్లిపోయావు కదా, మీరే యిలా పిలుపు నిచ్చేస్తే ఎలా?

చిరంజీవిగారికి యీ ఎన్నికలు కాని కాలంలో వచ్చిపడ్డాయి. ఓ పక్క ఏకైకకుమారుడి పెళ్లి. ఎంత మగపెళ్లివారైనా బోల్డు మందిని పిల్చుకోవాలి. సరిగ్గా ఆ ముహూర్తంతో క్లాష్ అయ్యేట్లు ఎన్నికలు పెట్టారు. దానికి మూడు వారాల ముందునుండి మండుటెండల్లో ప్రచారం. ఎండ గీరెక్కించేసింది. లోపల టెన్షన్. ఇంటికి వచ్చి టీ తాగండి అని ఓ వూళ్లో ఓ నాయకుడు పిలిచాడు. ఈయన వెళ్లాడు. ఈయన తీసిన "రుద్రవీణ" సినిమాలో అలా పిలిచినవాళ్లు వచ్చీ రాగానే టీ యివ్వకుండా 'రండి, రండి, రండి, దయచేయండి, తమరి రాక..' అంటూ సమూహగానం చేసి ఆ తర్వాత టీ బిస్కెట్లు యిచ్చిన దృశ్యాన్ని గుర్తు చేసుకుని, అతను పాట పాడడం రాక పాట పాడలేదు గానీ 'టీ, బిస్కట్ యిమ్మంటారా?' అని కుశలప్రశ్నలు వేశాడు. ఎండలో తిరిగి వచ్చిన మెగాస్టార్‌కు మహాకోపం వచ్చింది. 'టీ యివ్వకుండా యీ వెధవ ప్రశ్నలేమిటి?' అని తిట్టిపోశాడు. దాంతో పిలిచినాయన అలిగాడు. వెంటనున్న శైలజానాథో ఎవరో యిద్దరికీ నచ్చచెప్పి చిరు చేత టీ చప్పరింపచేశాడు. 'చాయ్' మీద "మృగరాజు"లో పాటలు పాడినట్టు పాడకుండా మొహం మాడ్చుకుని టీ తాగి చిరు బయటపడ్డారు.

వైయస్ చనిపోయినప్పుడు సిఎం కావడానికి జగన్ పడిన ఆరాటం గురించి చిరంజీవిగారు చెప్తూ రాజీవ్ మరణం తర్వాత సోనియా ఐదేళ్లు ఆగడం గురించి చెప్తున్నారు. జగన్ కూడా ఓపిక పట్టాలని హితవు చెప్తున్నారు. ఇందిరా గాంధీ మరణం తర్వాత రాజీవ్ ఒక్క రోజు కూడా ఆగలేదన్న విషయం మర్చిపోతున్నారు. అప్పుడు ఆపద్ధర్మ ప్రధానమంత్రి అవుదామనుకున్న పాపానికి ప్రణబ్‌ను యిప్పటికి కూడా శిక్షిస్తూనే వున్నారు పాపం. తమాషా ఏమిటంటే ప్రజాపార్టీని కాంగ్రెస్ పార్టీలో విలీనం చేశాక మా వాళ్లందరికీ సరైన గుర్తింపు లేదని అందరం ఫీలవుతున్నాం అని ఓ పక్క నిస్పృహ వ్యక్తం చేస్తున్నదీ యీ చిరంజీవి గారే. అలాటి నిస్పృహ ఉండకూడదు అని జగన్‌కి హితబోధ చేస్తున్నదీ యీయనే. ఈ ఉపయెన్నికల తర్వాత కాంగ్రెస్‌కు అనుకున్నన్ని సీట్లు రాలేదనుకోండి. అప్పుడు వాళ్లు చిరంజీవికి కేంద్రంలో మంత్రిపదవి యివ్వనక్కరలేదని తీర్మానించారనుకోండి. అప్పుడు చూడాలి యీయన ఓర్పు ఏ మేరకు వుంటుందో !

ఏది ఏమైనా లగడపాటి వేస్తున్న జోకులతో యివేమీ సాటి రావు. ఆయన అసలే సెన్సేషనల్ మనిషి. ఏదో ఒకటి అనో, చేసో వార్తల్లో వుందామనుకుంటారు. జగన్ కంపెనీల్లో పెట్టుబడులు పెట్టిన తన తమ్ముడిపై కేసు రాకుండా చేసినందుకు యిప్పుడు ఋణం తీర్చుకుంటున్నారు. జగన్‌పై చెడామడా ఆరోపణలు చేసేస్తున్నారు. ఇలాటి జగన్‌తోనే కదా మొన్నటిదాకా యీయన వూరేగినది!

జగన్ వ్యతిరేకులు మాటిమాటికీ ప్రస్తావించే అంశం ఒకటి నాకు భలే నవ్వు తెప్పిస్తుంది. క్విడ్ ప్రో కో వుందని చెప్పడానికి 'నష్టాల్లో వున్న కొత్త కంపెనీలో పెట్టుబడి ఎవరు పెడతారు?' అని వీళ్లంటూ వుంటారు. కొత్త కంపెనీలకు నష్టాలు కాక, లాభాలు వస్తాయా? పాన్ షాపు పెట్టినా బ్రేక్ ఈవెన్ అవడానికి మూడేళ్లు పడుతుందని వీళ్లకు తెలియదా? వీళ్లందరికీ వ్యాపారాలు వున్నాయి కదా. పైగా టీవీ చర్చల్లో రాజేంద్రప్రసాద్ గారంటారు – "సాక్షిలో యింత పెట్టుబడి పెట్టారు, యిప్పుడు కరంటు ఎక్కవుంటులో చూస్తే యింతే వుంది. తక్కినదంతా ఏమైంది? తినేశారా?" అని. పెట్టిన పెట్టుబడి బ్యాంకులోనే పెట్టుకుని కూర్చుంటే వ్యాపారం ఏం నడుస్తుంది స్వామీ? రిసీవబుల్స్, పేయబుల్స్, ఎస్సెట్స్, లయబిలిటీస్.. యివన్నీ వుండవూ?

బాలన్స్‌షీట్ అనేది ఏమిటో తెలియకుండానే వీళ్లు యింతింత నాయకులయ్యారా? సాక్షి షేరు యింత పెట్టి ఎందుకు కొన్నారు? అని అడుగుతారు వీళ్లు. ఈనాడు షేరు అంత పెట్టి ఎందుకు కొన్నారు అని అడుగుతారు వాళ్లు. ఎన్నేళ్లయినా యిదే గోల! ఏ షేరైనా ఎవడైనా ఎంత పెట్టయినా కొనవచ్చు అని షేరు మార్కెట్ గురించి ముఖపరిచయం వున్నవాడికి ఎవడికైనా తెలుసు. ఏ కోర్టూ ఎందుకు యింత పెట్టి యీ షేరు కొన్నావని అడగలేదు. అయినా వీళ్లీ జోకులు మానరు.

టి–జాక్ కూడా ఓ జోకు పేల్చింది. పరకాలలో నెగ్గే పార్టీకే మా సపోర్టు అంటోంది జాక్. ఎవరు గెలుస్తారో ముందే తెలిస్తే అసలు తక్కినవారెవరైనా పోటీ చేస్తారా? జాక్ వాళ్ల దగ్గర అంజనం ఏమైనా వుందేమో, విజేతను చూడడానికి. సర్వే చేయించాం అంటే ఎవరు నమ్ముతారు? సర్వే అంటే ఎంత ఖర్చుతో కూడుకున్న వ్యవహారమో తెలుసా? లగడపాటి వంటి 'ఆంధ్రాపెట్టుబడిదారులు'కి ఆ ఖర్చు తట్టుకునే స్తోమత వుంటుంది తప్ప, టి–జాక్‌లో వున్న ఉద్యమసంఘాలకు ఎక్కడుంటుంది? దానిలో వున్న తెరాస, బిజెపి ఎలాగూ విడివిడిగా పోటీ చేస్తున్నాయి.

బిజెపి విషయం మరీ తమాషాగా వుంది. మేం నెగ్గి తెలంగాణ యిస్తాం. తెలంగాణ రావాలంటే పరకాలలో పోటీ పెట్టకు అని కెసియార్‌కు హితవు చెప్పారు జావడేకర్. అటు జాతీయసభల్లో చూస్తే తెలంగాణ గురించి తీర్మానమే చేయలేదు. ఇక కెసియార్ చాలా చాలా జోకులు వేశారు. వాటిల్లో 'పరకాలలో గెలిస్తే సోనియా నన్ను పిల్చి 'కెసియార్, తీసుకో నీ తెలంగాణ అంటుంది' అంటుంది అన్న జోక్ పరాకాష్ట. ఇన్ని స్థానాలు గెలిచినా అనలేదు కానీ పరకాలలో గెలిస్తే మాత్రం అంటుందా? కెసియార్ తెలివేమిటంటే యిది చెప్తూ 'నీ తెలంగాణ' అనే మాటను మైండ్‌లో పొజిషన్ చేశారు. తెలంగాణ అంటే కెసియార్‌దే తెలంగాణ.

బిజెపిది కాదు,  దాదాపు సగం సీట్లు గెలిచిన కాంగ్రెస్‌ది కాదు అని మెదడులో రిజిస్టర్ చేశారు.

ఇక జగన్ పార్టీనుండి వచ్చిన జోకుల గురించి చెప్పాలంటే మొన్న యిచ్చిన బంద్ పిలుపే ఓ జోక్. ఓ పక్క శాంతియుతంగా వుండండి అంటూనే, బంద్‌కు పిలుపు యిచ్చారు. బంద్ అనగానే బలవంతంగా దుకాణాలు మూయించడం వంటి ఏవో కొన్ని సంఘటనలు జరగక తప్పవు. కానీ బంద్‌కి స్పందన రాలేదు. చెప్పానుగా, జగన్ యివాళ భౌతికంగా అరెస్టు అయినా, ప్రజలు మానసికంగా యీ సీను ఎప్పుడో వూహించుకున్నారు. ఎవరూ షాక్ అవలేదు. అంబటి రాంబాబుగారు చెప్పిన లక్ష చేతులు లేచి వుంటాయి, ఒకరి కళ్లు మరొకరు తుడిచి ఓదార్చి వుంటాయి. జగన్ అరెస్టు రోజున జ్యోతిలో కార్టూన్ బాగుంది. ఆఖరి ఓదార్పు అని జగన్ అద్దంలో తన ప్రతిబింబాన్ని తనే ఓదార్చుకుంటూ వుంటాడు. ఎన్నికలకు యింకా చాలా సమయం వుంది. ఇంకా బోల్డు జోకులకు టైముంది. అప్పుడు మళ్లీ చెప్పుకుందాం. **– ఎమ్బీయస్ ప్రసాద్ (మే 2012)**

**మే 29, 30 గ్రేట్ ఆంధ్రా వీక్లీకై** **ఎమ్బీయస్ః ఆర్థిక నేరస్తుడిపై సానుభూతి వుంటుందా?**

జగన్ అరెస్టనేది జరిగిపోయింది కాబట్టి అది రగిలించే సింపతీ ఫ్యాక్టర్‌పై లెక్కలు వేయడం ప్రారంభమైంది. ''మొన్నటిదాకా జగన్‌కి ఏ పధ్నాలుగో, పదిహేనో వస్తాయనుకున్నాం. కానీ యిప్పుడు ఎన్నికల వేళ జైల్లో పెట్టారు కాబట్టి అన్ని సీట్లూ అతనే గెలుస్తాడు'' అని కొందరంటున్నారు.

''ఏదైనా మరణం సంభవించినపుడు సానుభూతి కలుగుతుంది, ఎమర్జన్సీ కాలంలో ఇందిరా గాంధీ ప్రతిపక్ష నాయకులను రాజకీయ కారణాలపై జైల్లో పెట్టినపుడు సానుభూతి కలిగింది. జగన్ ఆర్థిక నేరస్తుడిగా జైలు కెళితే సింపతీ ఏమిటి నా బొంద. సిబిఐకి యిన్నాళ్లకు ఆధారాలు దొరికాయి కాబట్టే అరెస్టు చేయగలిగింది, ఆ కేసులో ఎంతో కొంత దమ్ము వుంది కాబట్టే, కోర్టు కూడా రిమాండుకి పంపించింది. జగన్‌కు భయపడి యిన్నాళ్లూ నోరు విప్పనివాళ్లు, యిప్పుడు నోరు విప్పుతారు. నిమ్మగడ్డ ప్రసాద్ నోరు విప్పగానే జగన్ ఎలా విరుచుకు పడ్డాడో, అది అతని అరెస్టుకి ఎలా దారి తీసిందో ఆంధ్రజ్యోతి రాయలేదూ...? అహంకారం, అవినీతి కలనేత – యీ నేత అని ''ఈనాడు'' ఎడిటోరియల్ కూడా రాసిన తర్వాత యిక యితనిపై ప్రజలు జాలి ఎందుకు చూపిస్తారు? ఈ సంగతి గ్రహించాక జగన్ అభ్యర్థులకు కూడా కాళ్లు చల్లబడతాయి. పైగా డబ్బు పంపిణీ చేయాల్సిన టైములో నాయకుడు జైల్లో కూర్చుంటే ఎలక్షన్‌లో నెగ్గడం ఎలా అని దిగులుపడి రంగంలోంచి తప్పుకున్నా ఆశ్చర్యం లేదు.'' అని కొందరు వాదిస్తున్నారు.

అసలు సానుభూతి అంశం ఎలా వుంటుందని ఆలోచిస్తే చాలా చిత్రంగా అనిపిస్తుంది. ఎవరైనా ఉద్యోగానికి అప్లయి చేస్తే సవాలక్ష పరీక్షలు పెట్టి, అవి పాసయ్యాక వరుసగా యింటర్వ్యూలు జరిపి అప్పుడు ఉద్యోగం యిస్తారు. వాడు ఆ తర్వాత డిపార్టుమెంటు పరీక్షలు పాసయ్యి ఏ ఆఫీసరో అవుతాడు. అంతలోనే అతను పోయాడనుకోండి. అతని భార్య ఎస్సెల్సీ పాసయినా చాలు, పిలిచి క్లర్కు వుద్యోగం యిచ్చేస్తారు. పరీక్షలు లేవు, ఇంటర్వ్యూలు లేవు. కేవలం వితంతువు అన్న క్వాలిఫికేషన్ వుంటే చాలు. వీటినే కారుణ్య నియామకాలు అంటున్నారు. పోయినవాళ్ల కుటుంబానికి మామూలుగా రావల్సిన బెనిఫిట్స్ అన్నీ యిచ్చాక కూడా యిలాటి ఉద్యోగం ఒకటి యివ్వడం నిజంగా కారుణ్యమే. అయితే అది ఆ ఆఫీసుపై రుణ చూపించడం మాత్రం కాదు. ఎందుకంటే ఆమెకు సరైన క్వాలిఫికేషన్ లేదు, అనుభవం లేదు. అప్పటిదాకా భర్త యింటికి తెచ్చిన ఫైళ్ల కేసి అసహ్యంగా చూసి వుంటుంది కూడా. భర్త చనిపోతేనే కాదు, రైలు యాక్సిడెంటు అయినా,  రైతు ఆత్మహత్య చేసుకున్నా వారి కుటుంబంలో ఒకరికి ఉద్యోగం యిచ్చేస్తామని ప్రకటిస్తారు. అర్హులైన అనేకమంది బయట అల్లాడుతున్నా వీళ్లకు మాత్రం ఉద్యోగాలు కట్టబెడతారు. కానీ మనం వీటిని విమర్శించం. ఎందుకంటే మన భారతీయులకు సానుభూతి ఎక్కువ.

ఓ ఎమ్మెల్యే వున్నాడు. చిన్న కార్యకర్తగా మొదలుపెట్టి, నానా గడ్డీ కరిచి, ఏ పదేళ్లకో ఆ స్థాయికి చేరాడు. ఏ పనీ చేయడని అతనిమీద నియోజకవర్గ ప్రజలందరూ మండిపడుతూ వుంటారు. మా ఎమ్మెల్యే మూడేళ్లగా కనబడుట లేదు అని పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసి కసి తీర్చుకుంటారు. అంతలో అతను ఏదో రకంగా చనిపోయాడు. అంతే అందరూ అతనిపై జాలి కురిపిస్తారు. అప్పటిదాకా అతన్ని పడతిట్టిన ప్రత్యర్థులు కూడా సంతాపసభకు వచ్చి 'తార రాలిపోయింది, జ్యోతి ఆరిపోయింది, అతను అమర్ రహే, అతని ఆశయాల సిద్ధికోసం మనమంతా కంకణం కట్టుకోవాలి' అంటూ తెగ పొగిడేస్తారు. చావు వలన సంభవించే ఉపయెన్నికలో అతని భార్యకు  టిక్కెట్టిస్తారు. అప్పటిదాకా యింటికి వచ్చిన వాళ్లకు కాఫీ కలిపి యివ్వడం తప్ప ఆవిడకు ఏమీ రాదు. ప్రజల సమస్యలు తెలియవు, మాట్లాడడం రాదు. కానీ యీ ప్రజలు ఆవిణ్ని ఎన్నికల్లో గెలిపించి తీరతారు. ఎందుకు అంటే – సానుభూతి!

ఇందిరా గాంధీ చచ్చిపోతే సానుభూతితో రాజీవ్‌ను గెలిపించారు. ఎందుకని? రాజీవ్ ఏమైనా సాధించాడనా? అబ్బే, ఇందిరా కొడుకని. తర్వాతి ఎన్నికల్లో అతన్నే దారుణంగా ఓడించి యింటికి పంపారు. మళ్లీ అతను చనిపోతే, అతని మీద సానుభూతితో కాంగ్రెస్‌ను గెలిపించారు. బతికి వుంటే ఆ విజయం సాధించేవాడన్న నమ్మకం లేదు. అందుకేలాగుంది 'చచ్చి సాధించాడు' అంటారు. ఈ సానుభూతికి అర్థమే వుండదు. చనిపోతే కలిగే సానుభూతిని కొంత అర్థం చేసుకోవచ్చు. బతికుండగా కూడా సానుభూతి

పొందగలిగేవారు కొందరుంటారు. ఎమర్జన్సీ టైములో ఇందిరా గాంధీ నియంతృత్వంగా పాలించింది. ఆ పొరబాట్ల కారణంగా 1977 ఎన్నికల్లో దారుణంగా ఓడిపోయింది. మళ్లీ మూడేళ్లలో అదరగొట్టే మెజారిటీతో తిరిగి అధికారంలోకి వచ్చేసింది. దానికి కారణాలలో జనతా నాయకుల అంతఃకలహాలు చిన్న కారణమైతే, తక్కినది ఇందిరా గాంధీని కష్టపెట్టేస్తున్నారంటూ ప్రజల్లో కలిగిన సానుభూతి పెద్ద కారణం.

జనతా పార్టీ 1977లో అధికారంలోకి రాగానే తమను జైల్లో పెట్టిన ఇందిరా గాంధీని జీప్ స్కాండల్ కేసులో జైలుకి పంపాలని హెూం మంత్రి, ఉపప్రధాని అయిన చరణ్ సింగ్ మహా ఉబలాటపడ్డాడు. ఇండియన్ సైకీ తెలిసిన మొరార్జీ దేశాయ్ అప్పుడే వద్దు, నిదానించమన్నాడు. చరణ్ సింగ్ వినలేదు. పట్టుబట్టాడు. జైలుకి నెట్టాడు. ఇక ఇందిర పని అయిపోయింది అనుకున్నారు కాంగ్రెస్‌వారు. బ్రహ్మానంద రెడ్డి అధ్యక్షుడై పోయి ఆమెను పార్టీలోంచి బహిష్కరించాడు. మన రాష్ట్రంలో వెంగళరావు ఆ పార్టీ (కాంగ్రెస్-ఆర్) లో చేరాడు. 1978 ఎసెంబ్లీ ఎన్నికలలో జనతా, కాంగ్రెస్ ఆర్, ఇందిరా కాంగ్రెస్ మూడూ తలపడ్డాయి. ఆవుదూడ గుర్తు కాంగ్రెస్ (ఆర్) లాక్కోవడంతో ఇందిరకు హస్తం గుర్తు యిచ్చారు. చెన్నారెడ్డి తప్ప వేరే ప్రముఖ నాయకుడు ఎవరూ ఇందిరతో మిగలలేదు. అయినా 1978 ఎన్నికలలో ఆమె పార్టీ యిక్కడ అధికారంలోకి వచ్చిందంటే దానికి కారణం ఇందిర ప్రతి ఎన్నికల సభలో కార్చిన కన్నీరే ! 'మీకు సేవ చేసినందుకు నాపై పగబట్టి కష్టపెట్టారు' అంటూ ఆమె ప్రతీ చోటా కన్నీరు పెట్టింది. నిజానికి ఆమెపై వున్న కేసు ఆర్థికపరమైనదే, రాజకీయపరమైనది కాదు. కానీ ప్రజలకు ఆ తేడా తెలియలేదు. అభ్యర్థి ఎవరనేది పట్టించుకోకుండా ఓట్లు గుద్దేశారు.

ఎమ్జియార్ మరణానంతరం డిఎంకె మళ్లీ అధికారంలోకి వచ్చింది. అసెంబ్లీలో ఒక రోజు జయలలిత అనుచరులు కరుణానిధిపై దాడి చేస్తే, దానికి ప్రతిగా కరుణానిధి కాబినెట్‌లో మంత్రి దురై మురుగన్ జయలలితపైకి వురికి కొంగు పట్టుకున్నాడు. అంతే, మానభంగం జరిగినట్టు పెద్ద గోల చేసి జయలలిత అసెంబ్లీ బహిష్కరించి, ఆ తర్వాత వచ్చిన ఎన్నికలలో 'దురై మురుగన్ వంటి దుశ్శాసనుల పాలన పోవాలంటే నాకే ఓటేయండి' అనే నినాదంతో, సానుభూతి ఓట్లతో అధికారంలోకి వచ్చేసింది. అక్కడ చావూ లేదు, ఆర్థికనేరమూ లేదు. ఆడదానికి అవమానం అన్న ఒక్క అంశం మాత్రం వుంది.

అందువలన యీ సానుభూతి ఎలా పనిచేస్తుందో చెప్పడం అంత సులభం కాదు. మనమందరం రాబిన్ హుడ్ పాత్రను అభిమానిస్తాం. ఎందుకు? పెద్దవాళ్లను కొట్టి, పేదలకు పంచుతున్నాడని. కానీ చట్టప్రకారం అతను ఆర్థిక నేరస్తుడేగా. పట్టుబడితే ప్రభుత్వ ఖైదులో వుండవలసిన వాడేగా ! ఇటీవలే శిక్ష పడిన సుఖ్‌రామ్ టెలిఫోన్ స్కామ్‌లో విపరీతంగా ఆర్జించాడు. కోర్టులో కేసు నడిచి ఓడిపోయాడు. కానీ ఆయన ప్రాంతంలో ఆయన ఎంపీగా ఎప్పటికీ ఓడిపోడు. ఎందుకంటే ఆ నియోజకవర్గంలో అందరూ అతని వలన మేలు పొందినవారే. ఆ ప్రాంతంవారికి అతను దేవుడితో సమానం అని ఓ సారి వియస్ రమాదేవి గారు రాశారు. అతను చేసిన ఆర్థికనేరం అక్కడి ప్రజలు పట్టించుకోలేదు. లీగల్ కోర్టు వేరు, ప్రజా కోర్టు వేరు. అది తెలిసే నాయకులందరూ మా పై ఆరోపణలకు సమాధానం ప్రజల కోర్టులోనే లభిస్తుంది అంటారు. ఎన్నికలలో నెగ్గాం కాబట్టి మా పై కేసులు కొట్టేయాలి అని వితండవాదం చేస్తారు.

ఈ ప్రజలున్నారే వారికి చట్టాలతో పని లేదు. వారికి కావలసినది వారి గోడు పట్టించుకుని, సంపద పంచే నాయకుడు. వాడు జేబులు కొట్టి తెచ్చినా, ప్రభుత్వ ఖజానాను లూటీ చేసినా, మధ్యలో సగం నొక్కేసినా వీడికి అనవసరం. ఈ సంగతి గ్రహించే గత 25, 30 సంవత్సరాలుగా సంక్షేమపథకాలపై ఎక్కువ ఖర్చు పెడుతున్నారు నాయకులు. ఉచిత భోజనం, ఉచిత విద్యుత్, ఉచిత తాళిబొట్టు, ఉచిత గృహం, ఉచిత వైద్యం, మనిషికి రెండు రేషన్ కార్డులు.. ఎక్కణ్నుంచి వస్తాయండి నిధులు? ఓటర్లకు అనవసరం. 'నువ్వెలాగూ తింటావు. మాకు కాస్త పడేయ్. ప్రభుత్వం ద్వారా యివన్నీ ఫ్రీగా యియ్యి. ఎన్నికల సమయంలో ఓటుకి వెయ్యి యియ్యి.' ఇదీ డిమాండ్. ఇలాటి ప్రజల నాడిని ఎమ్జియార్, ఎన్టీయార్, వైయస్సార్..వంటి వాళ్లు పట్టుకున్నారు. రాబిన్ హుడ్ ఇ?మేజిని అరువు తెచ్చుకున్నారు. పాపం రాబిన్ హుడ్ తనకంటూ ఏమీ వుంచుకోలేదు. కానీ వీళ్లు మాత్రం తనకోసం దాచుకున్నారని ఆరోపణలున్నాయి. కోర్టుల్లో కేసులున్నాయి. అవినీతి ఆరోపణలున్న ఆ నాయకుడికి ఓటెలా వేస్తావ్? అని మనబోటివాడు ఓటర్ల నడిగితే 'తిననివాడెవడు? వీడైతే తాను తిని, పదిమందికి పెడుతున్నాడు' అంటారు. ఇది చాలా దురదృష్టకరమైనా, కఠోరవాస్తవం.

ఆర్థికనేరాలు, కార్పోరేట్ మోసాలు, క్రోనీ కాపిటలిజం, ఫెమా ఉల్లంఘనలు - యివన్నీ మనలాటి వాళ్లు చర్చించుకునే విషయాలు. సామాన్య ఓటరుకి యివి పెద్ద విషయాలు కావు. వాడు సానుభూతి కురిపించదలచుకుంటే రాజకీయబాధితుడి పైనా కురిపిస్తాడు, ఆర్థిక నేరస్తుడి పైనా కురిపిస్తాడు. నేడు మోపిదేవి, రేపు సబితా ఇంద్రారెడ్డి, గీతా రెడ్డి, ధర్మాన.. వీళ్లందరూ ఆర్థిక నేరాలపై జైలుకెళ్లే మంత్రులే. ఈ కారణం చేత వాళ్ల నియోజకవర్గాలలో ఓటర్లు సానుభూతి చూపించరని అనుకుంటున్నారా? తమ నియోజకవర్గానికి సేవ చేసి వుంటే చాలు, వీళ్లంతా తప్పక నెగ్గుతారు. అనేక ఆర్థిక నేరాలు చేసిందని ఆరోపణలున్న జయలలిత, ఆమె పార్టీ భారీ మెజారిటీతో మళ్లీ ఎన్నిక కాలేదా? అంటే అర్థమేమిటి? ఆర్థిక నేరస్తుడు కానీ, రాజకీయ బాధితుడు గానీ, ప్రజల మధ్య వుంటూ, ఆ దోపిడీ సొమ్మును వాళ్లకు వెదజల్లుతూ వుంటే సానుభూతి పొందగలడు. ఎక్కడో స్విస్ బ్యాంకులో డబ్బు దాచుకుంటే సానుభూతి రాదు. **- ఎమ్బీయస్ ప్రసాద్**

పాలమూరు నుండి పరకాలకు వచ్చేసరికి తెలంగాణ ఉద్యమస్వరూపంలో చాలా మార్పులే వచ్చేశాయి. ఏ పార్టీలో వున్నా తెలంగాణావాదులందరమూ ఒకటే అనే నినాదం పాలమూరుకు ముందు బలంగా వినబడేది. టి–జాక్ ఏర్పడినపుడు దానిలో కాంగ్రెస్, టిడిపిలతో సహా అందరూ చేరారు. సారథ్యం తెరాసదే అని అందరికీ తెలిసినా తెలియనట్టు, అందరూ సమానమేనన్నట్టు నటించారు. కోదండరాం స్వతంత్రంగా వ్యవహరించే సేనాపతి అయినట్టు, ఆయన ఏం చెప్పినా అన్ని పార్టీలవాళ్లూ తలవొగ్గాల్సిందే నన్న బిల్డప్ యిచ్చారు. నిజానికి జయశంకర్‌గారి కున్నంత స్టేచర్ కోదండరాంకు లేదన్న సంగతి అందరికీ తెలుసు. జయశంకర్‌కు ఆరోగ్యం బాగా లేని కారణంగానో ఏమో ఆయన్ని సారథిగా పెట్టుకోలేదు. కోదండరాంను అదిలించినంత సులభంగా జయశంకర్‌ను అదిలించలేమన్న అభిప్రాయం కెసియార్‌కు ఉందేమో! మంద కృష్ణ మాదిగ 'అగ్రకులస్తుడు కాబట్టి కోదండరాంను పెట్టుకున్నారు, జయశంకర్ బిసి కాబట్టి సారథ్యం యివ్వలేదు' అన్న మాటలు పట్టించుకోనక్కరలేదు. ఇక్కడ కులం కంటె మాటవినడం ప్రధానం.

జాక్ ఏర్పడిన రోజు నుండి పేచీలే. అన్నీ తాము చెప్పినట్టే జరగాలని తెరాస పట్టు. త్వరలోనే కాంగ్రెసు నిష్క్రమించింది. జాక్‌లో వుంటే తెలంగాణ కోసం పోరాడుతున్నామన్న కలరింగు యివ్వవచ్చనే ఆశతో టిడిపి పట్టుకు వేళ్లాడింది. దానికి ఆ లాభం కలగజేయడం కెసియార్‌కు యిష్టం లేదు. టిడిపిని చంపి ఆ స్థానాన్ని భర్తీ చేద్దామని ఓ పక్క ప్రయత్నిస్తూ మరో పక్క వారికి గౌరవం కలగజేస్తే ఎలా? అందుకని వాళ్లను మెడబట్టి బయటకు గెంటించేశాడు. ఇక మిగిలినవి చిన్నా చితకా సంఘాలే ప్లస్ ఒక్క ఎమ్మెల్యే కూడా లేని న్యూ డెమోక్రసీ పార్టీ, ఇద్దరే యిద్దరు ఎమ్మెల్యేలు వున్న బిజెపి. వీళ్లు తను చెప్పినట్టు పడి వుంటారనుకుని వీళ్లను వుండనిచ్చారు.

అయితే తెలంగాణ ఉద్యమకారులు టి–జాక్‌కు చాలా ప్రాధాన్యత యివ్వసాగారు. మీడియా కోదండరాం ఎత్తేయసాగింది. కోదండరాం కూడా తెలంగాణ ముగ్గులు వేయాలని, రోడ్డు మీద తెలంగాణ వంటలు వండాలని, ఇంటిచూరుకి తెలంగాణ జెండాలు కట్టాలని – యిలాటి పిలుపులు యిచ్చేయసాగారు. ఇది కెసియార్‌కు కంటగింపు అయింది. శ్రీకృష్ణ కమిటీ వేసినపుడు కోదండరాంను సంప్రదించకుండానే తెరాస ఎమ్మెల్యేల చేత రాజీనామా యిప్పించారు. మిలియన్ మార్చ్ టైములో కెసియార్ కంటె కోదండరాం ఎక్కువ వెలిగారు. కెసియార్ వ్యతిరేకించినా కోదండరాం మిలియన్ మార్చ్ జరిపించారు. టాంక్ బండ్‌పై కోదండరాం కోసం కెసియార్ గంటసేపు వేచి చూడాల్సి వచ్చింది. తెలంగాణకు ఏకైక నాయకుడిగా అనుకుంటున్న కెసియార్ యివన్నీ సహించగలరా? సకలజనుల సమ్మె విషయంలో తను చెప్పినది అమలు చేయలేకపోయాడని కోదండరాంపై కోపం ప్రదర్శించారు.

కోదండరాం మాత్రం ఏం చేయగలడు? ఆయనపై యితర పార్టీల ఒత్తిడి ఎక్కువై పోయింది. 'కెసియార్ చేతిలో కీలుబొమ్మగా వుంటే లాభం లేదు' అని జాక్‌లోని బిజెపి, న్యూ డెమోక్రసీ, సంఘాలు ఆయన్ని హెచ్చరించసాగాయి. ఢిల్లీ వెళ్లివచ్చాక సమ్మె మానేద్దామని కెసియార్ ప్రతిపాదిస్తే అవి ఒప్పుకోలేదు. కాంగ్రెస్‌తో కెసియార్‌కున్న మొహమాటాలు వాళ్ల కేముంటాయి? వారంతా తీవ్రవాదులు, బిజెపి కాంగ్రెస్ వ్యతిరేకి. కానీ కారు ఎప్పుడు స్లో డౌన్ చేయాలో, ఎప్పుడు పరుగులు పెట్టించాలో కెసియార్ షెడ్యూలు కెసియార్‌ది. ఆయనది పూర్తి రాజకీయ పోరాటం. '2014 వరకు తెలంగాణ రాకూడదు. ఆ ఎన్నికల్లో తెలంగాణ అంశాన్ని చూపించి అత్యధికమైన అసెంబ్లీ సీట్లు, పార్లమెంటు సీట్లు పొంది రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలను శాసించడం' – ఇదీ ఆయన లక్ష్యం. ఈ లోపుగా పార్టీ ఎదుగుదలకై అన్ని పార్టీలను కబళిస్తూ పోవాలి. కాంగ్రెస్, టిడిపిల విషయంలో అది సాగింది కానీ బిజెపి నోటికి చిక్కలేదు.

ఎందుకంటే తెరాస లాగ బిజెపికి కూడా తెలంగాణలోనే బలం వుంది. ఆంధ్రప్రాంతంలో అంతంత మాత్రమే. తక్కినవాటికి ఉభయప్రాంతాల్లో బలం వుండడం చేత ప్రత్యేక నినాదాన్ని వినిపించడం కష్టం. బిజెపి నాయకులు, మాజీమంత్రులు అందరూ యిక్కడివారే కాబట్టి తెరాసతో సమానంగా తీవ్రధోరణి చూపగలుగుతున్నారు. ఇలా అయితే తనకు కష్టమని కెసియార్‌కు తెలుసు. ఓ పక్క ఢిల్లీ స్థాయి బిజెపి నాయకులతో సంబంధబాంధవ్యాలు సాగిస్తూ మరో పక్క రాష్ట్రస్థాయి బిజెపితో ఎలా తుంచుకోవాలో తెలియక అవస్థపడ్డారు. అంతలో పాలమూరు ఎన్నిక వచ్చింది. తెలంగాణ ఉద్యమహితైషులు ఎందరు చెప్పినా వినకుండా బిజెపికి సీటు వదలలేదు. చివరకు ఓడిపోయారు. జరిగిన తప్పిదాన్ని గుర్తించి మళ్లీ బిజెపిని కలుపుకుని పోతే సరిపోయేది. కానీ పంతం పెరిగింది. పరకాలలో మళ్లీ తలపడుతున్నారు.

బిజెపిపై కోపం మధ్యలో కోదండరాంపై చూపించారు. పాలమూరులో లాగ తటస్థం అంటే కూర్చుంటే కోదండరాంకు కోదండం వేసేస్తామని బెదిరించారు. అసలు డిసెంబరు 9 కు ముందు జాక్ ఎక్కడుంది? నేను పుట్టిస్తే పుట్టింది, నేను గిట్టిస్తే గిడుతుంది జాగ్రత్త అన్నారు. సోనియా ఎలా ఆడిస్తే మన్‌మోహన్ అలా ఆడతారని అందరికీ తెలుసు. అయినా సోనియా పబ్లిగ్గా మన్‌మోహన్ పట్ల గౌరవం ప్రకటిస్తారు. కెసియార్‌కు అలాటి భేషజాలు లేవు. తను లేనిదే జాకే లేదన్నారు.

కోదండరాం యిరకాటంలో పడ్డారు. వెంటనే సాగిలపడకుండా సర్వే నాటకం ఒకటి ఆడి, యూనివర్శిటీ అధ్యాపకులు 600 మంది ఓటర్లను సర్వే చేసి (పనిలో పనిగా కోదండరాంను కెసియార్ జేబులో బొమ్మగా చూస్తున్నారా, కీలుబొమ్మగా చూస్తున్నారా? అనే అభిప్రాయ సేకరణ కూడా చేయాల్సింది) తెరాసకే గెలుపు తేల్చారు కాబట్టి వారికే జాక్ సపోర్టు అన్నారు. (సర్వేను ఎవరికీ చూపించమని చెప్పారు) ఈ గెలిచేవారికే ఓటు అనేది చాలా వింతైన పద్ధతి. రేపు సమైక్యవాదం బలంగా వున్న నియోజకవర్గంలో

కూడా యిదే ధోరణి అవలంబిస్తే సమైక్యవాదికి ఓట్లేయమని చెప్పాల్సి వస్తుంది. తటస్థంగా వుండడం నష్టదాయకమని జాక్ అభిప్రాయపడిందని కోదండరాం అంటున్నారు. రేపు మరో నియోజకవర్గంలో తెరాస, బిజెపి, న్యూ డెమోక్రసీ, సిపిఐ, లోకసత్తా (కొత్తగా వేర్పాటువాదం వినిపిస్తోంది) వంటి ప్రత్యేకవాదులన్నీ పోటీ చేశాయనుకోండి. అప్పుడు జాక్ ఏం చేస్తుంది?

తెరాసకు మాత్రమే ఓటేయండి అని డైరక్టుగా అనలేక మధ్యలో ఆంధ్రా పాలకులను తిట్టారు. ఆ సమైక్యవాద శక్తులు, కాంగ్రెస్, టిడిపి శక్తులు యిప్పుడు వైకాపా రూపంలో తెలంగాణపై పెత్తనాన్ని సాధిద్దామని చూస్తున్నాయట. (మరి పరకాలలో పోటీ చేస్తున్న కాంగ్రెస్, టిడిపి అభ్యర్థులు ఎవరో!?) పార్లమెంటులో ప్లకార్డు పట్టుకున్న పచ్చిసమైక్యవాది జగన్‌ను (జగన్ సమైక్యవాది అంటే టిజి వెంకటేష్ మండిపడతారు. అసలు జగనే తను సమైక్యవాదినని చెప్పుకోవడం మానేశాడు, కోదండరాంకు మాత్రం జగన్‌లో సమైక్యవాది కనబడుతున్నాడు) ఓడించాలంటే తెరాసకు ఓటేయాల్సిందేనట. పరకాల వరకే యీ నిర్ణయంట. దీని తర్వాత ఎప్పటిలాగ అన్ని శక్తులతోనూ కలిసి ముందుకు సాగుతారట. ఎన్నికల సమయంలో మాత్రమే ఒక పార్టీకి కొమ్ము కాస్తూ యిలాటి నిర్ణయాలు తీసుకుంటారు కాబోలు. ఆ తర్వాత అందర్నీ కలుపుకుని పోతూ వుంటారు. భేష్! ఎక్కడైనా బావ గానీ వంగతోట వద్ద కాదు.

విజయశాంతి జాక్ నిర్ణయాన్ని సహజంగానే సమర్థించారు. దాన్ని వ్యతిరేకిస్తే తెలంగాణకు ద్రోహం చేసినట్టే అన్నారు. బిజెపికి, జగన్‌కు లింకు కూడా కనపడింది ఆవిడకు. దీనిపై సహజంగానే బిజెపి మండిపడింది. తెరాసకు ఓటేస్తే తెలంగాణావాదానికి వేసినట్టూ, బిజెపికి వేస్తే తెలంగాణాకు ద్రోహం చేసినట్టా? అని అడిగింది. జాక్‌ను ఉద్దేశించి – 'ఒకవేళ పరకాలలో మేం గెలిస్తే జాక్ మాటకు విలువ లేనట్టు, ఎవరూ పట్టించుకోనట్టు తేలిపోతుంది కదా అప్పుడు మీ భవిష్యత్తు ఏమిటి?' అని అడిగింది. ఇది చాలా తెలివైన ప్రశ్న. జాక్‌లో యికపై రాజకీయపక్షాలు వుండకూడదని, కేవలం ఉద్యమసంస్థలు మాత్రమే వుండాలని కూడా జాక్ అనుకుంటోందట. పార్టీలు లేకపోతే అది ఒట్టి పేపరు సంస్థగానే మిగిలిపోతుంది, మీడియా కూడా పట్టించుకోదని గ్రహించాలి. జాక్ యిలా చేయడంతో బిజెపి పోటీ జాక్ పెట్టాలని చూస్తోందిట.

నిజానికి బిజెపి కూటమిధర్మం పాటించింది. ఇప్పుడు బిజెపిని మతతత్వ పార్టీ అని, వాళ్లకు ఓటేస్తే మతవాదానికి ఓటేసినట్టని చిత్తం వచ్చినట్టు మాట్లాడుతున్న కెసియార్ మొన్నటిదాకా వాళ్లతోనే కలిసి తిరిగారు. సెక్యులర్ ఫ్రంట్‌గా చెప్పుకునే మూడో ఫ్రంట్‌ను నట్టేట ముంచి 2009 ఎన్నికలు కాగానే ఎన్‌డిఏకి మద్దతు ప్రకటించింది ఈయనే కదా. కెసియార్ మరొకటి కూడా గుర్తుంచుకోవాలి. ఎమ్మెల్సీ ఎన్నికల్లో తెరాస తరఫున ముస్లిం కాండిడేటును నిలబెడితే ఆ కాండిడేటుకు ఓటేయ్యని ముగ్గురు తెరాస వారు, బిజెపి వారు కాదు. అప్పుడు బిజెపి ముస్లిం వ్యతిరేకత యీయనకు గుర్తు రాలేదా?

ఇప్పుడు కిషన్‌రెడ్డిని కూడా యీయన తిట్టిపోస్తున్నాడు. అందరితో పాటు రిజైన్ చేయని కిషన్‌రెడ్డి రాష్ట్ర అధ్యక్షుడిగా వున్న బిజెపికి మద్దతెలా యిస్తాం? అంటూ లాజిక్ లాగుతున్నారు. ఈ ముక్క కిషన్‌రెడ్డి రిజైన్ చేయనప్పుడు గుర్తుకు రాలేదా? సమైక్యవాదం బలంగా వున్న జంటనగరాల నుండి ఎన్నికైన కిషన్ రెడ్డి రిజైన్ చేస్తే మళ్లీ ఎన్నిక కావడం కష్టమని అందరికీ తెలిసే అప్పుడు మర్యాదగా వూరుకున్నారు. ఆ మర్యాద చివరిదాకా వుంచుకోవాలి. అంతెందుకు అప్పుడు తెరాస ఎమ్మేల్యేలు రాజీనామా చేశారు కానీ, ఎంపీలు చేయలేదు కదా. అంతమాత్రాన వారికి తెలంగాణపై చిత్తశుద్ధి లేదని కెసియార్ అనగలరా?

జాతీయ బిజెపి మాట ఎలా వున్నా రాష్ట్రస్థాయిలో బిజెపి తెలంగాణవాదాన్ని భుజాన్న వేసుకున్నమాట నిజం. ఆ వాదంతోనైనా యిక్కడ సీట్లు తెచ్చుకోవడానికి ప్రయత్నిస్తోందన్న మాటా నిజం. ప్రస్తుతానికి మాత్రం రాష్ట్రంలో బిజెపి, దాని అనుబంధ సంస్థలు తెలంగాణకోసం తెరాసతో సమానంగా పోరాడుతున్నాయి. ఆ వర్గాలకు చెందిన మేధావులు కూడా తెరాస వినిపించే వాదనలే వినిపిస్తున్నారు. మిలియన్ మార్చ్ సందర్భంగా ట్యాంక్ బండ్ పై జరిగిన విధ్వంసం వెనక్కాల తెరాస శ్రేణుల కంటె న్యూడెమోక్రసీ, బిజెపి సంస్థల చేతివాటమే ఎక్కువ వుందని అందరికీ తెలిసినదే.

అయినా కెసియార్ యిదంతా గుర్తించడానికి యిష్టపడటం లేదు. జరిగినదేమిటంటే తన పార్లమెంటు నియోజకవర్గంలో బిజెపి పాలమూరులో గెలిచేయడం కెసియార్‌ను దహించివేస్తోంది. పరకాలలో వారిని గడ్డిపరకగా తీసేద్దామనుకున్నారు. కానీ బిజెపి అక్కడ చివరిదాకా కాండిడేటును ప్రకటించకుండా చాలా పాలిటిక్స్ ఆడింది. తెరాస టిక్కెట్టు ఆశించి భంగపడినవారికి టిక్కెట్టు యిద్దామని కాచుక్కూచుని కెసియార్‌కు ముచ్చెమటలు పట్టించింది. పాలమూరు కథే యిక్కడా పునరావృతమవుతుందని కెసియార్ భయపడి తాత్సారం చేశారు. అంటే ఎవరిని నిలబెట్టినా గెలిపించుకుంటామన్న ధైర్యం తెరాసకు యిదివరకు వుండేది కానీ యిప్పుడు లేదని అందరికీ తెలిసిపోయింది. తెరాస బలహీనతను ఆ విధంగా బిజెపి ఎక్స్‌పోజ్ చేసింది. పరకాలలో ఏం జరిగినా జరగవచ్చు. అక్కడ అనేక పార్టీలు పోటీ పడుతున్నాయి. ఓట్లు చీలిపోవడంలో అతి తక్కువ మార్జిన్‌తో ఎవరైనా గెలిచే ప్రమాదం ఏర్పడింది.

ఇది గుర్తించినకొద్దీ కెసియార్ బిజెపి అంటే మండిపడుతున్నారు. నోటికి వచ్చినట్టు తిడుతున్నారు. నా దృష్టిలో యిది మంచిది కాదు. తెలంగాణ ఉద్యమం 11 ఏళ్లగా ఆయన నడిపిస్తున్నారు. ఇంకో రెండు మూడేళ్లు సాగవచ్చని ఆయనే చెపుతున్నారు. ఇది దీర్ఘపయనం. ఎందరినో లుపుకుంటూ సాగవలసిన బిడారి. దారిలో ఎవరెవరో కలుస్తారు, విడిపోతారు, మళ్లీ కలుస్తారు. ప్రస్తుతం విభేదించినంత మాత్రాన శత్రువులను చేసుకోవలసిన అవసరం లేదు. అది గుర్తించకుండా హ్రస్వదృష్టితో, తాత్కాలిక ప్రయోజనాలకోసం యింతలా కలహించుకోవడం దేనికి?

పరకాలలో గెలుపు కోసం ఈనాడు కోదండరాంను నిర్వీర్యం చేశారు, రెండున్నరేళ్లగా నిలబెట్టి యీ రోజు పక్కన పడేస్తే మరి

యిన్నాళ్ల శ్రమ వ్యర్థమే కదా! అలాగే బిజెపిని అనరాని మాటలంటున్నారు. రేపు కేంద్రంలో వస్తే కాంగ్రెస్ కూటమి రావాలి, లేదా బిజెపి కూటమి రావాలి. కాంగ్రెస్‌వారిని సన్నాసులు, చవటలు అంటూనే వున్నారు. ఇప్పుడు బిజెపి వారిని కూడా తిట్టాలా? ఇంతా చేసి పరకాలలో తెరాస గెలుస్తుందన్న హామీ ఎవరైనా యివ్వగలరా? జగన్ అరెస్టుతో సానుభూతి రగిలి 2-3% ఓట్లశాతం పెరిగినా కథ మారిపోతుంది. మిత్రపక్షంతో ఈ వైషమ్యమే మిగులుతుంది. అది గుర్తెరిగి సంయమనంతో వ్యవహరించాలి. **- (సమాప్తం) - ఎమ్బీయస్ ప్రసాద్ (మే 2012)**

**మే 35** **ఎమ్బీయస్‌: సుద్దులు చెప్పేస్తున్నారు...**

జగన్ అరెస్టు ధర్మమాని, విజయమ్మ గారికి అందరూ పిల్లల పెంపకం గురించి ప్రైవేటు చెప్పేస్తున్నారు. ఆవిడ యిన్నాళ్లూ రాజకీయాల్లో లేరు. భర్త పోటీ చేసినపుడు పులివెందులలో మర్యాదకి కాన్వాసింగ్‌కి కాస్త తిరిగి వుంటారు తప్ప ఆవిడ వెళ్లి పట్టుకుని వచ్చేసిన ఓట్లు ఏమీ లేవు. వైయస్ దుర్మరణం పాలవడంతో ఆవిడపై సానుభూతి కలిగింది. అందుకే ఏకగ్రీవంగా ఎన్నుకుని పంపించారు. తర్వాతి పరిణామాల్లో జగన్ పార్టీ పెట్టడం, అతనూ, యీవిడా రాజీనామాలు చేసి మళ్లీ ఎన్నికవడం, ఈవిడ మరిదిపైనే పోటీ చేసి గెలవడం యివన్నీ జరగడంతో రాజకీయాలు కొంత తెలిసి వుంటాయి. తను అరెస్టు కావడం ఖాయం అని జగన్ ఎప్పుడైతే గ్రహించాడో, అప్పుడే యీవిణ్ని పార్టీకి గౌరవాధ్యక్షురాలిగా నియమించి, అవసరమైతే ప్రచారానికి వెళ్లాల్సిందే అని చెప్పివుంటాడు. సరిగ్గా ఎన్నికల వేళ అదే జరిగింది. వైయస్ కొడుకుగా జగన్‌కే అంత సానుభూతి లభిస్తున్నపుడు, వైయస్ భార్యగా యీవిడకు మరింత లభిస్తుందని లెక్క వేసి వుంటారు. పార్టీ నిర్వహణ, ఎన్నికల లాజిస్టిక్స్ యివన్నీ తక్కినవారు చూసుకున్నా ప్రచారానికి ఆవిడ కూతుర్ని వెంటేసుకుని వెళితేనే ప్రజలు కరుగుతారని అంచనా వేసి వుంటారు.

ఆవిడ ఉత్తరాంధ్ర పర్యటన గమనిస్తే ఆ స్ట్రాటజీ వర్కవుట్ అవుతున్నట్టే వుంది. మొదట్లో కాస్త తడబాటు కనబడినా సాయంత్రానికి పుంజుకున్నారట. షర్మిల అయితే యింకా బాగా మాట్లాడారట. జనం చూడ్డానికి విరగబడ్డారని అన్ని పేపర్లూ రాశాయి. అయితే యివన్నీ ఓట్లుగా మారవని మళ్లీ మళ్లీ చెప్పుకోనక్కరలేదు. వీటిల్లో కొన్ని శాతం మారినా ప్రమాదమేగా అని పోటీ పార్టీల్లో ఆందోళన కలగడం సహజం. ఏమీకాదులే అని నిశ్చింతగా కూర్చునే పరిస్థితి అయితే లేదు. అందువలన 'ఆవిడ కన్నీళ్లకు కరిగిపోకండి' అని చెప్పవలసిన అగత్యమైతే వుంది. నా బిడ్డను ఏం చేస్తారో అంటూనే విజయమ్మ ఉపయెన్నికలలో గెలుపు గురించి మాట్లాడడాన్ని బాబు తప్పుబట్టారు. అంతవరకు బాగానే వుంది. అలా ఓ పక్క జనాలకు చెపుతూ మరో పక్క విజయమ్మగారికి సుద్దులు చెప్పడమే కాస్త శ్రుతి మించుతోంది. అది బాక్‌లాష్ అవుతుందేమో చూసుకోవాలి.

అవినీతి ఆరోపణలున్నది వైయస్‌పై, అతని కొడుకుపై. పుత్రప్రేమతో వైయస్ ప్రజలసొత్తును కొడుక్కి దోచిపెట్టాడని కాస్సేపు, అబ్బే కాదు, జగనే తండ్రి వద్ద మారాం చేసి ఆయన చేత దోపిడీ చేయించాడని కాస్సేపూ చెప్తూ వచ్చారు కాంగ్రెస్‌వారు. టిడిపి వారు అలాటి శషభిషలేమీ పెట్టుకోకుండా యిద్దరూ.. ఆ మాటకొస్తే పైన వున్న సోనియాతో కలిసి అందరూ దొంగలే అన్నారు. విజయలక్ష్మి తనకోసం భర్త చేత అవినీతి పనులు చేయించారని మాత్రం ఎవరూ అనలేదు. ఇప్పుడు ఆవిడ తన కొడుకు అరెస్టుకి వ్యతిరేకంగా దీక్ష చేయడంతో అంతా ఆవిడపై మండిపడుతున్నారు. ఆ దీక్షలో వైయస్ మరణంపై సందేహాలున్నాయి అనడంతో మరీనూ..! పోయినప్పుడు వాతావరణం బాగాలేదని అన్నారు కదా, యిప్పుడు ఎవరో చంపించారంటారేం? అని అడిగారు బొత్సగారు. ఆ రోజుకి వున్న సమాచారం అది. తర్వాత వేరే సమాచారం వచ్చి వుండవచ్చు. దానికి ఆధారాలు దొరక్కపోయి వుండవచ్చు. నిరాధారమైన వార్త పట్టుకుని "సాక్షి" వార్త వేయడం, అది పట్టుకుని జగన్ అనుచరులు రిలయన్సు స్టోర్సులపై దాడి చేయడం తెలిసినదే.

మరణం వెనక్కాల కుట్ర వుందా లేదా అన్నది యిప్పట్లో కాదు, ఎప్పటికీ తేలకపోవచ్చు. సుభాష్ బోసు అదృశ్యం, దీన్ దయాళ్ ఉపాధ్యాయ మరణం, లాల్ బహదూర్ శాస్త్రి మరణం - యివన్నీ మిస్టరీలగానే మిగిలిపోయాయి. వీటిని అప్పుడప్పుడు వెలికితీసి రాజకీయాలకు వాడుకుంటూ వుంటారు. ఇప్పుడు విజయమ్మ చేసినదీ అదే. భర్తను చంపించారు, కొడుకుని కటకటాల వెనక్కి తోశారు అంటూ సోనియాపై నింద మోపారు. జగన్ కున్న ఏకైక అస్త్రం సానుభూతి. అతను యిప్పటిదాకా చేపట్టిన అధికారం లేదు, ప్రజలకు చేసిన సేవ లేదు. కడప ఎంపీగా నియోజకవర్గానికి ఏమైనా చేశారేమో నాకు తెలియదు. అతను జనంలో తిరుగుతున్నది ఓదార్పుయాత్రల పేరిట. వైయస్ పథకాలు, వైయస్ దుర్మరణం, వైయస్ మరణంతో బాధపడిన కుటుంబాలు.. యివేగా అతను ప్రధానంగా మాట్లాడేది. ఆ సానుభూతినే మరింత తీవ్రంగా ఎన్‌క్యాష్ చేసుకోవడానికి విజయమ్మ వైయస్ మరణం వెనుక కుట్ర కూడా కలిపారు.

సోనియా పేరు కలపడంతో కాంగ్రెస్ నాయకులందరికీ విధిగా ఆమెకు వ్యతిరేకంగా మాట్లాడవలసిన అగత్యం వచ్చిపడింది. కొడుకు అరెస్టు అయితే దీక్ష చేశారు కానీ సునీల్ రెడ్డి అరెస్టయితే చేశారా, మోపిదేవి అరెస్టయితే చేశారా, జైలుకి వెళ్లి పలకరించారా అని అడగనారంభించారు. (ఊళ్లో బోల్డు మంది పోతే నీ భర్త హత్య విచారణ కోసమే దీక్ష చేశావేం అని పరిటాల సునీతను ఎవరూ అడగలేదింకా) విజయమ్మ వరస చూస్తుంటే ఏహ్యత కలుగుతోంది అన్నారు బొత్స. వైకాపా తప్ప తక్కినందరూ ముక్తకంఠంతో యిచ్చిన తీర్పు ఏమిటంటే - విజయమ్మ కొడుకుని సరిగ్గా పెంచలేదని. ఆవిడ మంచితల్లి కాదని రామచంద్రయ్య పెదవి విరిచారు.

కొడుకు అక్రమాలకు పాల్పడుతున్నాడని తెలియగానే మందలించి వుండాల్సింది కదాని సిపిఐ నారాయణ హితవు చెప్పారు. ముందే మేల్కొనవలసినది, యిప్పటికైనా అప్రూవర్‌గా మారమను అని జెసి దివాకరరెడ్డి సలహా. కొడుకుని సరిగ్గా పెంచితే యీ రోజు తిప్పలు వుండేవి కావుగా, తోటకూర నాడే చెప్పకపోతివి అని చంద్రబాబుతో సహా టిడిపివారందరూ పదేపదే చెప్తున్నారు.

విజయమ్మ కర్మ కాలింది కాబట్టి యివన్నీ వినాల్సి వస్తోంది సరే కానీ వీళ్లంతా ఎంత ధైర్యంగా పిల్లల పెంపకం గురించి లెక్చర్లు యిచ్చేస్తున్నారా అని నాకు ఆశ్చర్యం వేస్తోంది. మామూలు యిళ్లల్లో పిల్లలే మాట వినటం లేదు. ఇక డబ్బున్న, అధికారమున్న, పదవులున్న కుటుంబాలలోని పిల్లలు ఎలా పెరుగుతున్నారో అందరికీ తెలుసు. మంత్రిగారి అబ్బాయి లైసెన్సు లేకుండా వేగంగా కారు నడిపి అకాలమరణం పాలయ్యాడు, ఐపియస్ అధికారి కొడుకు డ్రగ్స్ అమ్ముతూ పట్టుబడ్డాడు, పిసిసి అధ్యక్షుడు ఏకంగా యింట్లో హత్య చేశాడన్న ఆరోపణ ఎదుర్కున్నాడు, ఇంకో మంత్రిగారి కొడుకు కస్టమ్స్ వారి చేతిలో చిక్కాడు... యిలా ఎన్నో, ఎన్నో కేసులు. రాష్ డ్రైవింగ్‌తో పాదచారులను చంపినవాళ్లూ వున్నారు. తాగి డ్రైవ్ చేస్తూ పట్టుబడిన కేసులైతే వందల్లో వుంటాయి. 'ఈ రోజు నీతులు చెప్తున్నాం కదా, రేపు మన సంతానం ఏదో కేసులో పట్టుబడితే ఎలా? జగన్ ఎదుర్కున్నన్ని కేసుల్లో యిరుక్కోకపోవచ్చు, కానీ ఓ పాటి కేసైనా సరే తలవంపులే కదా' అన్న భయం లేకుండా వీళ్లందరూ హితబోధలు చేస్తూ వుంటే వింతగానే వుంది. వాళ్లు యివాళ అన్నారు కాబట్టి వారి సంతానం ఏవో చెడ్డపనులు చేసి పట్టుబడాలన్న ఉద్దేశం నాకు ఎంతమాత్రం లేదు. అందరూ సత్ప్రవర్తనతో వుండాలనే కోరుకుందాం. తలిదండ్రులు చేసిన పాపాలు సంతానానికి కొడతాయంటారు. ఈ రోజుల్లో సంతానం చేసిన పనులకు తలిదండ్రులు జవాబు చెప్పుకోవలసి వస్తోంది. అన్ని రోజులూ మనవి కావు సుమా, రేపు ఎలా వుంటుందో తెలియదు, తొందరపడి సుద్దులు చెప్పకండి అని చెప్పాలనే నా తాపత్రయం. **– ఎమ్బీయస్ ప్రసాద్ (మే 2012)**

**జూన్ 01** **ఎమ్బీయస్‌ః సినిమాస్వేచ్ఛ అక్కరలేదా?**

బాలకృష్ణ నటించిన "అధినాయకుడు" ఎలక్షన్ టైములో రిలీజ్ చేయకూడదని వైకాపా ఎలక్షన్ కమిషనర్‌కు ఫిర్యాదు చేయడం జరిగింది. రిలీజ్ చేయవచ్చు కానీ ఆ సినిమాలో ఏయే భాగాలు ప్రచారానికి ఉపయోగపడ్డాయని కమిషన్ భావించిందో ఆ భాగాలు తీయడానికి అయిన ఖర్చుని (మొత్తం సినిమా ఖర్చుని అని కొన్ని పేపర్లు రాశాయి, "హిందూ" మాత్రం పోర్షన్ ఆఫ్ ద ఫిల్మ్ అనే రాసింది) టిడిపి కాండిడేట్ల ప్రచార ఖర్చు కింద రాస్తారట. ఏయే పోర్షన్లు ఎన్నికల ప్రచారంగా, పెయిడ్ న్యూస్ కేటగిరీలోకి వస్తాయో తెలుసుకోవడానికి కమిషన్ వారు శుక్ర, శనివారాల్లో సినిమాను చూస్తారట. ఇదంతా చాలా వింతగా తోచింది నాకు.

యీ మధ్య యీ పెయిడ్ న్యూస్ రగడ ప్రారంభమైంది. "సాక్షి" పేపరును, టీవీ ఛానెల్‌ను కరపత్రాలుగా, నేత్రపత్రాలుగా భావించి పెయిడ్ న్యూస్ కేటగిరిలో వేయాలని వారి వ్యతిరేకులు డిమాండ్ చేయడం, దాన్ని ఎవరూ సీరియస్‌గా పట్టించుకోకపోవడం చూస్తూనే వున్నాం. వైయస్ విగ్రహాలన్నిటికీ ముసుగులు వేయమని డిమాండు కూడా వచ్చింది. మాయావతిలా బతికున్న నాయకుడి విగ్రహమైతే అనుకోవచ్చు కానీ చనిపోయిన వారి విగ్రహాలు మూయ నారంభిస్తే ఎప్పటికి తెమిలేను? గాంధీ, నెహ్రూ, ఇందిరా విగ్రహాలు చూసినా, కాలనీల పేర్లు విన్నా కాంగ్రెస్ గుర్తుకు వస్తుందని ఫిర్యాదు చేస్తే..? అంబేద్కర్ విగ్రహం చూస్తే దళితుడికి ఓటెయ్యబుద్ధి అవుతుంది అని ఎవరైనా అంటే..? ఎన్టీయార్ బొమ్మ చూస్తే, సినిమా చూస్తే టిడిపికి వెయ్యబుద్ధవుతుందంటే..?

ఇలా రెచ్చిపోతూ వుంటే రేపు పేపర్లలో యాడ్స్‌కు కూడా అభ్యంతరం వచ్చేస్తుంది. సైకిలు యాడ్స్ (టిడిపి), హస్తసాముద్రికం యాడ్స్ (కాంగ్రెస్), ఫ్యాన్ యాడ్స్ (వైకాపా) అన్నీ ఆపించమనవచ్చు. బిజెపి విషయంలో మరీ ప్రమాదం. ఏ చీర మీదా, గ్రీటింగు మీదా, ఏ పత్రిక కవర్ మీదా కమలం డిజైన్ కానీ ఏ పువ్వు బొమ్మ కానీ కనబడకూడదంటే చచ్చిపోతాం. వైకాపా వారు ఈ సినిమాపై ఫిర్యాదు చేయడం శుద్ధ తప్పు. సినిమాలో ఓ వీధి దృశ్యం వుందనుకోండి. గోడ మీద పోస్టర్లు వున్నట్టు చూపిస్తూ ఆ పోస్టర్లలో ఏ చిరంజీవో కనబడితే కాంగ్రెస్‌కు లాభం కలుగుతోంది అని అభ్యంతర పెడతారా?

ఫైట్ సీన్లో ఛోటా విలన్ హీరో కొట్టిన దెబ్బకి సైకిళ్ల వరసపై పడి, సైకిళ్లన్నీ పడిపోయినట్టు సీను వుందనుకోండి. సైకిలు చూపించినందుకు టిడిపికి లాభమా? లేక అవి పడిపోయినట్టు చూపించారు కాబట్టి టిడిపికి పతనం అనే సందేశం యిచ్చినట్టు భావించి మనకు లాభం అనుకుంటారా? సినిమా మొదట్లో కమలంలో కూర్చున్న లక్ష్మీదేవిని చూపించే సీను వుంచాలా? బిజెపిని స్ఫురింపచేస్తోందని తీసేయాలా? హీరో తాగి వచ్చి నాలుగురోడ్ల కూడలిమీద వున్న గాంధీగారి విగ్రహం దగ్గర స్వాతంత్ర్యం ఎందుకు తెచ్చావయ్యా, మహానుభావా! వంటి డైలాగులు కొడితే గాంధీ విగ్రహం క్లోజప్పుల వలన కాంగ్రెసుకు లాభమా? తిట్టినందుకు కాంగ్రెస్‌కు నష్టమా? ఆ సీను తీసేందుకు అయిన ఖర్చును ఎన్నికల ఖర్చులోంచి తీస్తారా? కలుపుతారా?

సమాజంపై విసుర్లు విసరడానికి, అధికారంలో వున్న పార్టీలను విమర్శించడానికి నాటకం, సినిమాలను వాడుకోవడం ఎప్పుణ్నుంచో వుంది. కలియుగ మహాభారతం, యమగోల యిలాటి సినిమాల్లో సంజయ్ గాంధీపై ఎన్నో విసుర్లు వున్నాయి. మండలాధీశుడు, గండిపేట రహస్యం వంటి సినిమాలు ఎన్టీయార్‌పై ఎక్కుబెట్టిన సినిమా బాణాలు. ఆకలి రాజ్యంలో కాంగ్రెస్ పలు ముక్కలుగా విడిపోవడం గురించి జోకులున్నాయి. అసలు కళ అనేదే వ్యంజనంతో కలిసివున్నది. డైరక్టుగా చెపితే అందం ఏముంది? వ్యంగ్యంతో సూచించినప్పుడే చప్పట్లు పడతాయి. యమగోల సినిమాలో యమలోకంలో 'యమఅర్జన్సీ రద్దు' అని మాటవిరిస్తే నవ్వు వచ్చింది.

ఎమర్జన్సీ అని డైరక్టుగా చెపితే నవ్వేముంది?

మరి యిలాటి ఘట్టాలలో చమత్కారాన్ని గుర్తించి పార్టీ ప్రచారంగా, అవతలి పార్టీపై వ్యతిరేక ప్రచారంగా లెక్క వేస్తుందా కమిషన్? హీరో సైకిలెక్కితే, హీరోయిన్ పచ్చ చీర కట్టుకుంటే, ఓ గుళ్లో పూజారి 'మీరంతా పచ్చగా వుండండి నాయనా' అని దీవిస్తే.., విలన్‌ది భస్మాసుర హస్తమని తిడితే..., చివర్లో విలన్‌ను హీరో ఫ్యాన్‌కి ఉరేసి చంపితే..., కమెడియన్ కనబడిన వాళ్లందరి బుగ్గలు ఊహూ తడిమేసి కళ్లు తుడిచేస్తూ వుంటే..., సెజ్‌లో భూమి పోయిన ఓ రైతు సూర్యుణ్ని చూసి 'నా ఖర్మకు నీవే సాక్షి, ఓ కర్మసాక్షీ' అని పాటపాడితే... యివన్నీ ప్రచారంలో భాగాలా? ఒకవేళ కమిషన్ ఔననే అందనుకోండి. వీటి ఖర్చు ఎలా తేలుస్తారు? ఆ సీన్లు తీయడానికి అయిన ఖర్చు యింత అని నిర్మాత ఖచ్చితమైన లెక్కలిస్తాడా? అవి ఐటీ వారి చేత వెరిఫై చేయిస్తారా?

అసలు బాలకృష్ణను అనాలి. 'ప్రచారానికి వెళతారా?' అంటే ఉపయెన్నికలకు నేనెందుకు? అనో, అవి అసలు టిడిపి సీట్లు కావుగా అనో చెప్పేసి వుంటే పోయుండేది. గొప్పగా 'ప్రచారానికి నా సినిమా పంపుతున్నా' అన్నారు. అసలు సినిమాలలో నూటికి 80 ఆడవు. మహామహా హీరోలవే యింటి దారి పడుతున్నాయి. బాలకృష్ణగారికైతే ఉండీ ఉడిగి ఓ సినిమా ఆడుతోంది. పేద్ద యీ సినిమాతో ఎన్నికల ఫలితం మారిపోతుందన్న గ్యారంటీ ఏమీ లేదు. ఏదో ఓ పార్టీకి ఓటేద్దామనుకున్నవాడు యీ సినిమాలో బాలకృష్ణ మూడు పాత్రలు వేశారు కదాని, మూడు వేళ్లతో మూడు ఓట్లు వేయడు (ఐడియాకు స్ఫూర్తిప్రదాత – కిరణ్ కుమార్ గారు). మూడు పాత్రలకూ ముగ్గురు హీరోయిన్లు వున్నారా లేదాని చెక్ చేసుకోవడానికి వస్తాడు. ఏదో యీ సినిమా వలన వైకాపా అవకాశాలు తగ్గిపోతాయని అనుకోవడం వాళ్ల అధైర్యాన్ని చూపుతోంది. కాంగ్రెస్‌కు మాత్రం యిలాటి శంకలేవీ లేనట్టున్నాయి. వాళ్లు వస్తేరానీ అన్నట్టు కూర్చున్నారు.

చివరిగా నాకో అనుమానం – పాఠకులకు 'పత్రికా స్వేచ్ఛ' వుండాలంటూ రోజూ "సాక్షి" జిల్లా ఎడిషన్‌లో నాలుగైదు పేజీలు నిరసన ఫోటోలతోనే నింపుతున్న వైకాపా ప్రేక్షకులకు సినిమాస్వేచ్ఛ వుండనక్కర లేదనుకుంటోందా? ట్రయిలర్‌లో విగ్రహాలు ఎందుకు స్థాపించావు? అన్న డైలాగుపై యింత ఉడుక్కుంటే, రేపు ఎన్ని సినిమాల్లో ఎలాటి ఘట్టాలు వస్తాయో చూసుకోండి. తిరుమల గుడిలో జరిగిన ఘట్టమే చాలు, బ్రహ్మాండమైన ప్యారడీ తయారుచేయడానికి! 'పరమేశా, గంగ విడుము పార్వతి చాలున్' అన్నట్టు మనం కూడా పద్యం పాడాల్సి వస్తుంది – 'నాయకమ్మన్యులారా, సినిమాలు విడువుడు, తగలేయడానికి రాజకీయాలు చాలున్' ! అని. – **ఎమ్బీయస్ ప్రసాద్ (జూన్ 2012)**

## జూన్ 02 ఎమ్బీయస్ః మరణం వివాదంః బోస్–వైయస్

రెండవ ప్రపంచయుద్ధం ముగుస్తూ వుండగా సుభాష్ చంద్ర బోస్ అదృశ్యమయ్యారు. విమానప్రమాదంలో మరణించారని ప్రకటన వెలువడింది. కానీ బోసు భక్తులు దాన్ని నమ్మలేదు. బోసు అజేయుడని, ఈ ప్రమాదం కల్పితమనీ వాదించారు. దానిపై స్వతంత్ర భారతదేశం కమిషన్లు వేసింది. కమిషన్ రిపోర్టులను కూడా వీళ్లు నమ్మలేదు. మిత్రపక్షాలు (అమెరికా, ఇంగ్లండు, రష్యా) బోసును బతికే వుండగా పట్టుకుని రష్యాలో ఖైదులో పెట్టేశారనీ, ప్రధాని పదవికై తనకు పోటీ రాకుండా నెహ్రూయే కావాలని బోసును అక్కడ పెట్టించేశాడనీ పుకారులు లేవదీశారు. నెహ్రూ వ్యతిరేకులు దాన్ని నమ్ముతూనే వున్నారు. పాప్యులారిటీ విషయంలో, ప్రజామోదం విషయంలో బోసు నెహ్రూ కంటె ఎంత వెనకబడి వున్నాడో వీరెవరికీ అవగాహన లేదు. బోసు ఫార్వార్డ్ బ్లాక్ పార్టీ పెడితే దానిలో బెంగాల్ నుండి తప్ప మరెక్కడినుండీ నాయకులు చేరలేదు. వివరాలు సేకరిస్తే ఆజాద్ హింద్ ఫౌజ్ ప్రయోగం కూడా ఘోరంగా దెబ్బ తిందని అర్థమవుతుంది.

అన్నిటికంటె చిత్రమైన పుకారు ఏమిటంటే బోసు తప్పించుకుని వచ్చి ఉత్తరప్రదేశ్‌లో ఒక యోగిలా మారువేషం వేసుకుని బతుకుతున్నాడని. బోసు స్వభావం, సాహసం తెలిసున్నవారెవరూ అతను యింత అనామకుడిగా బతుకుతాడని అనుకోరు. స్వాతంత్ర్యానంతరం భారతదేశం చిక్కుల్లో వుంటే ముక్కు మూసుకుని కూర్చుంటాడని అనుకోరు. అయినా ఆ పుకారును ప్రచారంలో పెట్టే వుంచారు. బోసుకి నూరేళ్లు నిండినా బెంగాలీలు ఆ విషయం ఒప్పుకోరనీ, వారి దృష్టిలో అతను చిరంజీవి అనీ 1978లో ఎం.ఓ.మత్తయ్ రాశారు. నవ్వుకున్నాను. కానీ ఆ మాట నిజమే అని తేలింది. ఇప్పటికి బోసు శతజయంతి అయిపోయింది కానీ వర్ధంతిని జరుపుకోరు. ఓ సారి ఆంధ్రజ్యోతి వీక్లీకి ఆర్టికల్ రాస్తూ "బోసు వర్ధంతి ఎప్పుడు?" అని కాప్షన్ పెడితే 'ఎందుకండీ బాబూ, లేనిపోని గొడవ' అంటూ ఎడిటరు మార్చేశారు. అంటే బోసు మరణించినట్టుగా మనం ఎప్పటికీ ఒప్పుకోకూడదన్నమాట.

ఇప్పుడు వైయస్ మరణం కూడా అలా తయారైంది. శవం దొరికింది కాబట్టి మరణించారనాలి తప్ప ప్రమాదంలో చనిపోయారని అంటే వైకాపావారు ఒప్పుకోరు. దాని వెనుక కుట్ర వుందని మనను నమ్మమంటారు. మొన్న విజయమ్మగారు 'ఆయన్ని పొట్టనబెట్టుకున్నారు,యిప్పుడు యితన్ని చెరలో పెట్టారు' అంటే కొడుకు జైల్లో పడ్డాడన్న ఆవేదనలో అన్నారేమో అనుకున్నాను. దానికి రెస్పాన్సు రావడంతో యిక దీన్ని ఎలక్షన్ యిస్యూ చేద్దామనుకుని వైకాపా వ్యూహకర్తలు అనుకున్నారేమో. విజయమ్మగారు ప్రతీ మీటింగులోనూ భర్త మరణాన్ని ప్రస్తావిస్తూ కుట్ర జరిగింది అనేస్తున్నారు. పోయి మూడేళ్లయ్యాక యిప్పుడు ఆ సంగతి ఎత్తడమంటే ఎన్నికల కోసమే అని స్పష్టంగా తెలిసిపోతోంది. 'కుట్ర విషయం మా అబ్బాయిని అడిగితే అధికారంలో వుంటే తప్ప

తెలియవమ్మా' అన్నాడు అంటున్నారు విజయమ్మగారు. వైయస్ చనిపోయిన చాలా నెలలదాకా జగన్ అధికార పార్టీ ఎంపీగానే వున్నాడు. అతనంటే పడిచచ్చే మంత్రులు రాష్ట్ర కాబినెట్‌లో వున్నారు. వాళ్ల నాన్నకు వ్యక్తిగతంగా మిత్రులైనవారు కేంద్ర కాబినెట్‌లో వున్నారు. వీళ్లెవరూ సాయం చేయలేదా?

జగన్ చేతిలో "సాక్షి" వంటి నెట్‌వర్క్ వుంది. పరిశోధనాత్మక జర్నలిస్టులు బోల్డుమంది ఆయన వద్ద ఉద్యోగులుగా వున్నారు. రామోజీ గారి ఆస్తుల విషయంలో ఎన్నెన్నో ఆధారాలు సంపాదించి పాఠకులకు పంచుతున్న ఆ పాత్రికేయులు వైయస్ మరణం గురించి కనిపెట్టలేకపోయారా? అసలు భారతదేశంలో ఏదీ పెద్ద రహస్యంగా మిగలదు. దేశరక్షణ రహస్యాలనే మందుకి, మగువకి, డబ్బుకి అమ్మేస్తున్నారు ఉన్నతాధికారులు. మీ వంటి, నావంటి సామాన్యులైతే వాళ్లను చేరలేక, చేరినా వారిని సంతృప్తి పరచలేక నోట్లో గుడ్డ కుక్కుకుంటూ బయటకు రావాలి. జగన్ వద్ద పలుకుబడి వుంది, డబ్బు వుంది. సంకల్పం వుంటే కుట్ర లోతుపాతులు కనుగొనలేకపోయాడా? మొదట్లో అనుమానం రాలేదనుకుందాం. కానీ రష్యన్ వెబ్‌సైట్‌లో ఓ తలతిక్క కథనం వచ్చాకనైనా అన్వేషణ సాగించాలి కదా. ఓ పాటి ఆధారం దొరికినా చాలు అది పట్టుకుని తీగంతా లాగి, సోనియాను బజార్న పడేయవచ్చు. యుపిఏను పడగొడదామని చూసే ఎన్‌డిఏ, తృతీయ ఫ్రంట్‌వారు తమ వంతు సాయం తప్పక అందిస్తారు. వారి సానుభూతిపరులు వ్యవస్థలో చాలామంది వుంటారు.

అదేమీ జరగలేదంటే అర్థం ఏమిటి? కుట్ర కోణం లేదనేగా ! ఒకవేళ ఉన్నా ఎప్పటికీ పైకి రాదనేగా ! వైకాపా సానుభూతిపరుల కథనం ఏమిటి? రిలయన్సువారు రాష్ట్రాన్ని దోచేయబోతూ వుంటే రాష్ట్రభక్తితో వైయస్ అడ్డుపడ్డారని, అందుచేత రిలయన్సువారు పగబట్టారని ! సోనియా వారి తరఫున మాట్లాడబోయినా వైయస్ ఆమె మాట మన్నించకపోవడంతో ఆమెకు కోపం వచ్చి రిలయన్సుకి సహకరించారనీ! మొదట సోనియా గురించి చూడబోతే – వైయస్ మరణానంతర ఘట్టాలు గుర్తు చేసుకోండి. వైయస్ వారసుడెవరో నిర్ణయించుకోవడానికి హై కమాండ్ పడ్డ తడబాటు గమనించండి. హత్య ముందే ప్లాన్ చేస్తే పోయి పోయి రోశయ్యను సిఎంగా చేస్తారా? అంతకు ముందే ఒక యువకుణ్ని తయారుచేసి వైయస్ పక్కన తిరిగేట్లా చేసి ప్రజల దృష్టిలో పడేలా చేసి, అతన్ని పట్టుకుని వచ్చి వైయస్ స్థానంలో కూర్చోబెట్టేవారు. రోశయ్యను కూర్చోబెట్టిన విధానం, తీసేసిన విధానం చూస్తే ఇవన్నీ ప్రీ ప్లాన్‌డ్‌గా చేశారని అనుకోవడానికి ఏ మాత్రం ఆస్కారం లేదు.

ఇక రాష్ట్రం మీద ప్రేమతో వైయస్ రిలయన్సు పథకానికి అడ్డుపడారనేది – వైయస్‌కు అంత ప్రేమే వుంటే రాష్ట్రం తాలూకు భూములు అన్ని అమ్మేసేవారు కాదు, ఐటీ కంపెనీలకు, బ్రహ్మణి స్టీల్స్ వంటి కంపెనీలకు వేలాది ఎకరాలు కట్టబెట్టేవారు కారు, సెజ్‌ల పేరుతో అనేక కంపెనీలకు భూములిచ్చేసేవారు కారు, జలయజ్ఞం పేరుతో మొబిలైజేషన్ ఎడ్వాన్సులంటూ కోట్ల రూపాయలు కాంట్రాక్టర్లకు యిప్పించేవారు కారు. ఇంతమందికి యిన్నేసి యివ్వగా లేనిది రిలయన్సుకి మాత్రం ఫేవర్ చేయనని వుంటారా? మహా అయితే బేరాలు కుదరకపోయి వుండవచ్చు. ఆ మాత్రం చేత రిలయన్సు వారు చంపిచేస్తారా? అంటే నా వద్ద సమాధానం లేదు. ఎవరు ఎటువంటి వారో మనకి మాత్రం ఏం తెలుస్తుంది?

నేను చెప్పదలచినది ఏమిటంటే జగన్ పార్టీ ఉపయెన్నికలలో అన్ని సీట్లూ గెలిచినా, యింకో రెండేళ్లల్లో అతనే సిఎం అయినా యీ విషయాలు బయటకు రావని. బోసు స్థాపించిన ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ బోసు మరణం గురించి ఎప్పటికి కప్పుడు హంగామా చేస్తూనే వుంటుంది. కాంగ్రెస్ ప్రభుత్వం రహస్యాలు తొక్కి పెట్టిందని ఆరోపిస్తూనే వుంటుంది. మొన్నటిదాకా పాతికేళ్లపాటు బెంగాల్‌లో లెఫ్ట్ ఫ్రంట్‌లో భాగస్వామిగా వుంది కానీ ఆ కుట్ర ఏమిటో చెప్పలేకపోయింది. రేపు జగన్ ముఖ్యమంత్రి అయినా 'ఆనాటి ఫైళ్లన్నీ మాయం చేశారు, ఏమీ దొరకలేదు' అనేసి వూరుకుంటాడేమో. లేకపోతే 'అవన్నీ ఢిల్లీ వెళ్లాయట, నన్ను పిఎంను చేయండి, అక్కడికి వెళ్లి చూస్తా' అనవచ్చు. ఏది ఏమైనా వైయస్ మరణాన్ని ఎన్నికలకు వాడుకోవడం విజయమ్మగారు చేస్తున్న పొరబాటు. జగన్ కూడా దానిపై ఎక్కువ మాట్లాడలేదు. ఈవిడకు ఎవరు చెప్పి పెట్టారో ఏమో. ఇంతకంటె ఘోరమైనది – బొత్సగారు 'అసలు వైయస్ హత్య తల్లీ కొడుకులే కలిసి చేయించారని అనుమానం వస్తోంది' అనడం. నీచత్వానికి కూడా ఓ హద్దు వుండాలి! **– ఎమ్బీయస్ ప్రసాద్ (జూన్ 2012)**

**జూన్ 03** **ఎమ్బీయస్: ఇమేజి మాటేమిటి?**

కేవలం బెయిలు యివ్వడానికే సిబిఐ న్యాయమూర్తి కోట్ల రూపాయల లంచం తీసుకున్నారని తెలిసి అందరూ నివ్వెరపోయాం. ఇంతకింతైతే అంతకెంత? అన్నట్లు బెయిలుకే యిన్ని కోట్లయితే (ఎన్ని కోట్లో తెలియదు, దానిపై తర్వాత రాస్తాను) యిక అనుకూలమైన తీర్పుకి ఎంత తీసుకుంటారు? 'నాట్ బిఫోర్' అంటూ కేసును అనువైన పక్క కోర్టుకు పంపడానికి ఎంత తీసుకుంటారు? స్టే యివ్వడానికి ఎంత తీసుకుంటారు? ఇవ్వకపోవడానికి అవతలివారి వద్ద ఎంత తీసుకుంటారు? – ఇలా ఆలోచిస్తూ పోతే బుర్ర బద్దలైపోతుంది. అన్ని వ్యవస్థలలో లాగే న్యాయస్థానాల్లో కూడా అవినీతి ప్రవేశించిందని వింటాం కానీ బొత్తిగా యీ స్థాయిలోనా? ఇలాటి విషయాలకు కూడానా? ఇలా డబ్బుతో అన్నీ కొనేయగలిగితే యీ చట్టాలెందుకు? చట్టుబండలెందుకు? వాటిని మనం అధ్యయనం చేయడమెందుకు? వాటిపై వాదించుకోవడం ఎందుకు?

ఈ నాట్ బిఫోర్‌ల వివాదం రేగినపుడు ఓ టీవీ చర్చలో అంబటి రాంబాబు, లోకసత్తా నుండి కటారి శ్రీనివాసరావు తదితరులు కూర్చున్నారు. రాంబాబు సిబిఐ పక్షపాత ధోరణిని, నాట్ బిఫోర్ అంటూ తప్పించుకుంటున్న న్యాయమూర్తులను విమర్శించినపుడు కటారి ''రాజకీయాలకోసం ఇటువంటి ఉన్నతమైన వ్యవస్థలను విమర్శించి వాటిపై గౌరవాన్ని పోగొట్టకండి. ప్రజలకు వాటిపై విశ్వాసం పోయిందంటే మళ్లీ కలగడం కష్టం'' అంటూ హితవు చెప్పారు. రాంబాబు వెంటనే ''మీరు చెప్పినది నిజమే. అందుకే వాళ్లు తప్పులు చేసినపుడు మీలాటి తటస్థులు ఎత్తి చూపి విమర్శిస్తే, మేం మాట్లాడనక్కరలేదు. మీరే చెప్పండి వాళ్లు చేస్తున్నది తప్పో, రైటో.. '' అని రొక్కించారు. కటారి గొంతులో వెలక్కాయ పడింది. సిబిఐ, న్యాయమూర్తులు చేస్తున్నది రైటని చెప్పలేరు, తప్పు అంటే వైకాపా వాదనను సమర్థించినట్టు అవుతుంది. అందుకని తెలివిగా ''అందుకే 'యీ వ్యవస్థలను స్వతంత్రంగా వుంచాలని లోకసత్తా డిమాండ్ చేస్తుంది' అంటూ జనరల్‌గా మాట్లాడి తప్పించుకున్నారు.

ఈ లోకసత్తా మేధస్సు యిలాగే వుపయోగపడుతుంది. కంటికి ఎదురుగా వున్నదాని గురించి అవును, కాదు అని చెప్పరు. ఎక్కడా ఆచరణలోని లేని దాని గురించి ఉపన్యసించి, అది వున్నపుడు యిలాటి సమస్యలు రావు అంటారు. అది వచ్చేదాకా ఏం చేయాలిట? మీది ప్రత్యేక వాదమా, సమైక్యవాదమా అని అడిగితే సుపరిపాలన గురించి, నాయకులలో నిజాయితీ గురించి, అందరికీ చదువు గురించి, సమాచార హక్కు గురించి వినాల్సి వస్తుంది. రాష్ట్రం కలిసి వున్నా విడిపోయినా నాయకుల నిజాయితీలో తేడా ఏమీ రాదు, అందరూ రాత్రికి రాత్రి విద్యావంతులు అయిపోరు. అసలుదాన్ని పక్కకు పెట్టి యిలాగ మాట్లాడడం వలననే లోకసత్తా యీ మధ్య ప్రత్యేక తెలంగాణకు సరే అన్నా అది జనాల్లో రిజిస్టర్ కాలేదు. గట్టిగా నిలదీస్తే నేను కూడా సరే అన్నదో లేదో చెప్పలేను. అంత అయోమయంగా వుంది, ఆ స్టేటుమెంటు.

ఏదో మన చాదస్తం కానీ జెపి ఖండించినా మానినా, అన్నా హజారే అరిచినా, బాబా రాందేవ్ భోరుమన్నా జరిగేవి జరుగుతూనే వున్నాయి. ఈ పట్టాభిరామారావుగారి వ్యవహారం వ్యవస్థను ఓ కుదుపు కుదిపింది. దానిలో యిన్‌వాల్వ్ అయినవారెవరో చూడండి – ఓ రౌడీ షీటరు, ఓ మాజీ విలేకరి, ఓ రిటైర్డ్ న్యాయమూర్తి, ఓ లాయరు, ఓ మంత్రి.... రాజకీయనాయకులు ఎలాగూ వున్నారు. సమాజం గౌరవించే వ్యవస్థలకు చెందినవారు కూడా యీ రీతిగా పట్టుబడుతున్నారు. పట్టుబడని వారు చాలామందే వుంటారు కదా. కానీ పట్టుబడగానే మీడియా పండగ చేసుకుంటోంది. సిబిఐ దానికి సహకరిస్తోంది.

నిజానికి ఇటీవలి కాలంలో సిబిఐను తప్పుపట్టవలసిన అంశాల్లో అతి పెద్ద అంశం – లీకులివ్వడం. ఆధారాలు దొరికి, కోర్టులో రుజువైతే పోయే ప్రతిష్ఠను సిబిఐ కేవలం లీకుల ద్వారా దెబ్బతీస్తోంది. సిబిఐ విచారణలో ఎవరు ఎక్కడ కూర్చున్నారు, ఎవరు నోరిప్పారు, ఎవరు మూగనోము నోచారు, ఎవరు మొండిగా వాదించారు, ఎవరు బండరాయిలా కూర్చున్నారు, ఎవరిపై అరిచారు, ప్రతిగా ఎవరు కరిచారు... యివన్నీ కళ్లతో చూసినట్టు కొన్ని పేపర్లు రాసేస్తున్నాయి. అవుననీ, కాదనీ సిబిఐ అనదు. అనడం మా పని కాదు, ఎవరో ఏదో రాస్తే మేమెందుకు స్పందించాలి అంటారు.

ఆ పరిస్థితిని అలుసుగా తీసుకుని పత్రికలు రెచ్చిపోతున్నాయి. ఏది నిజమో, ఏది కల్పనో తెలియ ప్రజలు గందరగోళ పడుతున్నారు. అదే సిబిఐకు కావాలి లాగుంది. వాళ్లు ఏదో ఘనకార్యం చేసేస్తున్నారని ప్రజలు అనుకోవాలని వాళ్ల ఆశ. నిజానికి యిప్పటిదాకా వాళ్లు ఏం సాధించారో నాకు అర్థం కావటం లేదు. అందరిమీదా ఎడాపెడా కేసులు పెట్టేశారు. బోఫోర్స్‌లో యింకా అంతకంటె ఎక్కువ అదావుడి చూశాం. తిరుగులేని ఆధారాలు చూపించి కోర్టులో కేసులు గెలిచి, నిందితులకు శిక్షలు పడినప్పుడే సిబిఐ సాధించినట్టు లెక్క. అది జరగడానికి ఎన్ని దశాబ్దాలు పడుతుందో దేవుడి కెరుక. ఈ లోపున సిబిఐకు పబ్లిసిటీ వచ్చిపడుతోంది. ఈ పబ్లిసిటీ సిబిఐకు బాగానే వుండవచ్చు కానీ వ్యవస్థపై ప్రజల కుండవలసిన విశ్వాసానికి దెబ్బ తగులుతోంది. వాస్తవాలు రాస్తే అదో దారి. ఊహించి యిష్టమొచ్చినట్టు రాస్తే ఘోరం.

ఈ బెయిలు వ్యవహారంలో సిబిఐ బయటపెట్టిన దాని వలన రేపు జగన్‌కు న్యాయబద్ధంగా బెయిలు వచ్చినా ఆ న్యాయమూర్తిపై అభాండం పడుతుంది, ఆయన ఎంత మింగేశాడో అని. ఆయనకు కొడుకులెంతమంది, అతనికి లాకర్లు ఎన్ని? మిత్రులలో మాజీ జడ్జిలెవరైనా వున్నారా? అని పరిశోధన ప్రారంభమౌతుంది. బెయిలు యివ్వకూడదని కోర్టులో వాదిస్తున్న సిబిఐకు యిది అనువుగా వుంటుంది. అసలు అందుకోసమే సిబిఐ యిప్పుడు ఒక ప్రణాళికతో యీ లంచం అంశాన్ని బయటపెట్టిందని నమ్మేవాళ్లు కూడా వున్నారు. అది నిజం కాకపోవచ్చు. కానీ తన పంతం కోసం సిబిఐ ఏమైనా చేయగలదన్న అభిప్రాయం కలిగిందంటే అదీ బాధాకరమే. అలాగే న్యాయబద్ధంగానే కోర్టువారు జగన్‌కు బెయిలు యివ్వలేదనుకోండి, జగన్‌ను జైల్లో వుంచడానికి కాంగ్రెస్ న్యాయమూర్తికి లంచం పెట్టిందని వైకాపా ఆరోపించగలదు. అదీ బాధాకరమే.

పట్టాభిరామారావు గారి కేసులో కొడుకు లాకరులో దొరికినది మొదట్లో 2 కోట్లు అన్నారు. తర్వాత అబ్బే 3 కోట్లు(ట) అన్నారు. ఫుల్ డీల్ 5 కోట్లని, తక్కిన మూడు కోట్ల కోసం వెతుకుతున్నారనీ వార్తలు వచ్చాయి. కావచ్చు అనుకున్నాం. మర్నాటి కల్లా అబ్బే 5 కాదు, 15 కోట్లు అని వార్త. 5 న్యాయమూర్తికట. (ఈనాడు 10 కోట్లు అని రాసి పక్కన ప్రశ్నార్థకం పెట్టింది) తక్కినది తక్కినవారికట. బెయిలు యిచ్చే న్యాయమూర్తికే 5 యిచ్చినపుడు, తక్కినవాళ్లకి యివ్వాల్సిన పనేముంది? పోనీ మధ్యవర్తిత్వం చేసినందుకు... అనుకుంటే అంత యిస్తారా? ఏకంగా ఈయనకి యిచ్చినదానికి రెట్టింపా?

లంచాల్లో వాటాలెలా వుంటాయో మనకి కాస్తయినా అవగాహన లేదనుకుంటున్నారా యీ పేపరువాళ్లు అని చికాకు పడుతూండగానే

మర్నాటికి అబ్బే 15 కాదు, 60 కోట్లు అనేశారు. జనార్దనరెడ్డి, ఆయన తమ్ముడు, శ్రీలక్ష్మి, రాజగోపాల్ నలుగురికి కలిపి 15 యింటూ 4, 60 కోట్లు అని అనుకున్నారట. జనార్దనరెడ్డి రోజూ బంగారు సింహాసనంపై కూర్చోకపోతే ఏదో మిస్సయినట్టు ఫీలవుతారనుకుందాం. అందుకని ఆయన 15 కోట్లు విసిరేసైనా బెయిలు తెచ్చుకోవడానికి ప్రయత్నించాడంటే ఓహో అనుకోవచ్చు. తనతో బాటు తన తమ్ముడికి కూడా యిప్పిద్దాం అనుకుంటే పోనీ యిద్దరికి.. !

అంతేగాని శ్రీలక్ష్మి, రాజగోపాల్‌లకు కూడా పదిహేనేసి కోట్లు ఖర్చు పెడతాడా జనార్దనరెడ్డి? వాళ్ల స్థాయీ, నా స్థాయీ ఒకటేనా – అనుకోడా? వాళ్లకేమైనా యిళ్ల దగ్గర బంగారు సింహాసనాలున్నాయా కూర్చోడానికి..? నన్ను నమ్ముకున్నారు, పోన్లే.. వాళ్లకీ ఏదో చూడండి.. పదో, పరకో పడేద్దాం అనవచ్చు తప్ప తనతో సమాన స్థాయిలో లంచం యివ్వడానికి జనార్దనరెడ్డి ఏమైనా సోషలిస్టా? కాదూ, కూడదూ అని పట్టాభిరామారావు పట్టుబడితే ఒకడికి 15 ఐతే నలుగురికి టోకు మీద ఎంత? కనీసం 30% డిస్కౌంటైనా యివ్వండి అని బేరమాడకుండా వుంటాడా? ఈ బేరం ఇవాళ్టితో పోదు, మేం చేసిన అక్రమాలు చాలానే వున్నాయి, సిబిఐ మళ్లీ మళ్లీ అరెస్టు చేయవచ్చు, మేం మళ్లీ మళ్లీ బెయిలు అడుగుతాం, మీకు మళ్లీ మళ్లీ గిరాకీ తగులుతుంది అని ఆశ చూపవచ్చు. ఇలాటి పరిస్థితుల్లో కేవలం బెయిలు గురించి అరవై కోట్ల అవినీతి అని జంకు గొంకు లేకుండా పేపర్లు రాసేయడం ఎంత దారుణం చెప్పండి!

అసలు అంకెలకు విలువ లేకుండా పోయింది. టిడిపి చేసిన రెండు లక్షల కోట్ల గురించి నేను రాసినది చదివి ఒక పాఠకుడు రాశారు – ''ఈ లక్ష కోట్లు మాట ఎక్కణ్నుంచి వచ్చిందో తెలుసా? ''లీడర్'' సినిమాలో హీరో మాటిమాటికీ లక్ష కోట్ల ప్రజాధనం అంటాడు. ప్రాస కుదిరిందని వీళ్లు అదే పాడుతున్నారు.'' అని. కావచ్చు. మొన్నామధ్య మైసూరా రెడ్డిగారు ఆంధ్రజ్యోతి టీవీలో మాట్లాడుతూ ఈ అంకెలు ఎలా వచ్చాయో చెప్పారు. ''జలయజ్ఞంలో 5% తినేసి వుంటారని లెక్క వేస్తే 300 కోట్లు వచ్చాయి. అబ్బే, అంత తక్కువ అంటే బాగుండదని 3 వేల కోట్లు అందామనుకున్నాం. మా నాయకుడు 3 వేలు కూడా బాలేదు, 30 అందామని ప్రతిపాదించారు. ఆ తర్వాత ఎక్కణ్నుంచి పుట్టిందో కాని లక్ష అన నారంభించారు...'' అని. అంటే ఏం కావాలంటే అది అనేయవచ్చన్నమాట. లెక్కా డొక్కా అడిగేవాడు లేడు, అడిగినా చెప్పేవాడు లేడు.

మే 28 నాటి ఈనాడులో ఫుల్ పేజీలో 'క్విడ్ ప్రో కో' కింద జగన్ కంపెనీలకు చదివించుకున్న ముడుపులు అంటూ లిస్టు యిచ్చారు. అరబిందో, రాంకీ చెరో 10 కోట్లు, లేపాక్షి 70, దాల్మియా 95, ఇండియా సిమెంట్స్ 136, పివిపి గ్రూపు 147, పెన్నా గ్రూపు 45, ఎమ్మార్ 90, ఆర్ ఆర్ గ్లోబల్ 79, హెటిరో 20, వాన్‌పిక్ 850 అని వుంది. మొత్తం కలిపితే 1552 కోట్లు అయింది. లక్షకు సుదూరంలో ఆగింది. పైగా యివన్నీ పెట్టుబడులు. ఎంత శాతం అక్రమమో, ఎంత సక్రమమో తరచి చూస్తే తప్ప తెలియదు. ఈ కోట్లన్నీ జగన్ పేర లేవు. ఆ యా కంపెనీల పేర వున్న షేర్ల విలువ. ఆ తర్వాత వీటి విలువ పెరగవచ్చు, తరగవచ్చు. వాళ్లు తమ పేర పెట్టినవి జగన్ పేర 'లక్ష కోట్ల'లోకి రావు. ఇంకా ఏమైనా చెప్తారేమో చూడాలి. చంద్రబాబుపై కాంగ్రెస్, వైకాపా చేసే ఆరోపణలూ యిలాగే వుంటాయి. సింగపూరులో ఆస్తులున్నాయని వీళ్లంటారు. ఉంటే మీకిచ్చేస్తానని ఆయనంటాడు. ఎంచక్కా తీసేసుకోవచ్చు కదా. తీసుకోరు. ఎందుకంటే ఆధారాలేవీ వుండవు. ఇలా ఏళ్ల తరబడి ఆరోపణలు చేసుకుంటూనే వుంటారు. నమ్మినవాడు నమ్ముతాడు, నమ్మనివాడు నమ్మడు.

ఇప్పుడు గాలి జనార్దనరెడ్డి బెయిల్ స్కామ్ బయటపడగానే గాలి న్యాయవ్యవస్థను తనకు అనుగుణంగా ఎలా ఉపయోగించుకుంటున్నాడో తెలియవచ్చింది. వెంటనే జగన్ కారణంగా న్యాయవ్యవస్థ కూడా భ్రష్టు పట్టిపోయింది అంటూ విమర్శలు గుప్పించసాగారు. అలా ఎలా అంటే జనార్దనరెడ్డి జగన్‌కు సోదరుడి లాటివాణ్ని అన్నాడట. వాళ్ల కంపెనీకి వైయస్ మేలు చేకూర్చాడట. ఎవరైనా హత్య చేస్తే హంతకుడినే నిందిస్తారు తప్ప వాళ్ల సోదరుణ్ని, మేనల్లుణ్ని తప్పుపట్టరు. వైయస్ చేత అనేక కంపెనీలు మేలు పొందాయి. వాటిలో ఏ అక్రమం జరిగినా జగన్‌దేనా బాధ్యత? వాళ్లు యిన్‌కమ్ టాక్స్ ఎగ్గొట్టినా, ఓ అధికారికి లంచం యిచ్చినా జగన్‌దే తప్పా? జగన్ తప్పులు చేయలేదని నేను సర్టిఫికెట్టు యివ్వటం లేదు. కానీ యీ విషయంలో జగన్‌ను లాక్కు రావడాన్నే తప్పుపడుతున్నాను.

నిజానికి గాలి విషయంలో ఎందర్నో తప్పుపట్టాలి. కేవలం బెయిలుకే యింత లంచం యివ్వచూపాడంటే గాలి ఎంత సంపాదించారో తెలుస్తోంది కదా, ఆ డబ్బుతోనే కదా కర్నాటకలో ఆయన బిజెపికై ఎమ్మెల్యేలను కొన్నది ! అలా కొన్న ఎమ్మెల్యేలతోనే కదా బిజెపి ప్రభుత్వం నిలబడినది ! మరి బిజెపివారు సిగ్గుపడవలసిన అవసరం లేదా? ఇప్పుడు యీ వ్యవహారంలో మన రాష్ట్రప్రభుత్వపు న్యాయశాఖా మంత్రే మధ్యవర్తిత్వం నెరపారంటున్నారు. అది నిజమని రుజువైతే మన కాంగ్రెస్ ప్రభుత్వం తలవంచుకోనక్కరలేదా? ఈ వ్యవహారానికి సహకరించిన న్యాయమూర్తులు, న్యాయవాదులు, బ్యాంకు అధికారులు (మారుపేర్లతో ఎక్కవుంటు తెరవనిచ్చినందుకు) అందరూ తలవంచుకోవలసినదేగా! సమాజం ఏ మేరకు కుళ్లిపోయిందో తలచుకుని అందరం బాధపడాలి తప్ప ఒకే వ్యక్తిపై దీన్నంతా నెట్టేసి చేతులు దులుపుకుంటే తప్పు.

ఇలాటి వ్యవహారాల్లో కూలంకషంగా పరిశోధించి మురికినంతా బయటకు తేవడం మేలు. ఈ లోపున మీడియా కూడా సంయమనం పాటించాలి. సెన్సేషన్ కోసం ఉన్నదానికి పదింతలు చేసి రాయడం వలన మన రాష్ట్రం పరువు గంగలో కలుస్తుంది. చాలాకాలం ప్రవాసాంధ్రుడిగా వున్న అనుభవంతో చెపుతున్నాను. ఇలాటి వార్తలు తెలుగువారి యిమేజికి చాలా చెరుపు చేస్తాయి. హర్షద్

మెహతా కేసు బయటకు వచ్చినపుడు ఒకాయన అన్నాడు – ''ఇన్‌కమ్ టాక్స్ ఆఫీసరు పేరు 'వర్మ, సిన్హా' వంటివి కనబడితే అమ్మయ్య నార్త్ యిండియన్ కదా, ఫర్వాలేదు మేనేజ్ చేసేయవచ్చు అనుకునేవాళ్లం. అదే పేరు రామన్, గోపాలన్ అని కనబడితే సౌత్ యిండియన్ కాబట్టి నిజాయితీపరుడని అనుకుని భయపడేవాళ్లం. ఇప్పుడీ హర్షద్ మెహతాకు సహకరించినవాళ్లందరూ తమిళులే అని తేలడంతో ఫర్వాలేదు, వీళ్లూ యిలాటి వాళ్లే అన్న అభిప్రాయం కలుగుతోంది. సౌత్ యిండియన్స్ యిమేజి దెబ్బ తినిపోయింది'' అని.

ఇది వ్యక్తిగత అభిప్రాయమే అని కొట్టి పారేయవచ్చు. ఇలాటివి చేరితే జనరలైజేషన్ ప్రారంభమవుతుంది. ''అవుట్‌లుక్'' వారు యిటీవలి సంచికలో నార్త్ యిండియన్స్ ఎలా పుంజుకుంటున్నారో, సౌత్ ఇండియన్స్ పొగరు ఎలా తగ్గుతోందో కవర్ స్టోరీ వేశారు. యుపి, బిహార్‌కి బదిలీ చేస్తానంటే మార్పించుకోవడానికి ప్రయత్నిస్తాం. ఎందుకు? వాటికున్న యిమేజి అలాటిది. అలాగే రేపు మన రాష్ట్రంలో ఎవడైనా యిండస్ట్రియలిస్టు పెట్టుబడి పెడదామంటే 'అందరూ దొంగలే' అనుకుంటాడు. ఇంటర్నెట్ ధర్మమాని మన రాష్ట్రంలో జరిగే పరిణామాలన్నీ విదేశాల వారికీ నిమిషాల్లో తెలుస్తున్నాయి. బ్రాండ్ యిమేజి బిల్డప్ చేయడానికి ఏళ్లు పడుతుంది. చెడగొట్టడం రోజుల్లో చేయవచ్చు. రాజకీయకక్షలతో  అన్ని పార్టీల నాయకులు, సెన్సేషన్ కోసం మీడియా కలిసి బాధ్యతారహితంగా ప్రవర్తిస్తున్నాయి.

పట్టాభిరామారావు వ్యవహారంలో ముడుపుల మధ్యవర్తుల్లో ఒక మంత్రి వున్నారని రాస్తూ జూన్ 2 ఈనాడులో హెడ్‌లైన్సులో 'హైదరాబాదు స్టార్ హొటల్లో ఒప్పందం, సాక్ష్యంగా నిలిచిన సీసీ కెమెరాల దృశ్యాలు' అని పెట్టారు. 'అబ్బ, సిబిఐ ముందే వూహించి న్యాయమూర్తికి, మంత్రికి డబ్బు చేతులు మారుతూండగా సిసి కెమెరా పెట్టిందన్నమాట' అనుకుని లోపలి పేజీల్లో చదివాను. అక్కడ రాసినదేమిటంటే – 'గాలి ముఠా నగరంలోని ఓ హొటల్‌లో తరచుగా సమావేశం అయ్యేదనీ, అందులో మంత్రి కూడా పాల్గొనేవారని తెలుస్తోంది. దీనికి సంబంధించి సీసీ కెమెరాల నుంచి కొన్ని దృశ్యాలు కూడా సిబిఐ అధికారులు తీసుకున్నట్లు తెలుస్తోంది' అని రాశారు. ఉసూరుమన్నాను.

ఏరాసు ప్రతాపరెడ్డి గాలి జనార్దనరెడ్డికి సన్నిహితుడనీ అందరికీ తెలిసినదే. ఆ హొటల్లో గాలి సోదరులతోనో, అనుచరులతోనో కలిసి పార్టీ చేసుకుంటూ వుంటే సిసి కెమెరా ఫోటో తీసి వుండవచ్చు. దానికీ, యీ లంచానికి ముడి ఎలా పెడతారు? పైగా సిసి కెమెరాలను గదిలో పెట్టి వుంటారని అనుకోను. మంత్రిగారు హొటల్లోకి వస్తూ వున్నట్టుగా సీసీ కెమెరాలో వుండి వుంటుంది, లేదా లాన్‌లో పార్టీ చేసుకుంటూ వుంటే తీసి వుంటుంది. అది పెట్టుకుని మంత్రిని నిలదీస్తే ''అవును వాళ్లు మా బంధువులు. పార్టీలో కలిశాం. వాళ్ల వ్యాపారలావాదేవీల్లో నాకు సంబంధం లేదు'' అనేయవచ్చు. ఈ లోపున మీడియాలో చూసి మనం మాత్రం కెమెరాల సాక్ష్యం కూడా వుందన్నమాట అని నమ్మి, ప్రచారం చేస్తాం.

సిబిఐ కాంగ్రెస్ చెప్పినట్టు చేస్తోంది అని యింకా వాదిస్తూనే వుండేవాళ్లు ఏరాసు ఉదంతం కూడా గమనంలోకి తీసుకోవాలి. ఏ స్కాము మొదలుపెట్టినా అటు జగన్‌కి తగిలి ఆగిపోవడం లేదు, కాంగ్రెస్ నాయకులకు, మీదు మిక్కిలి మంత్రులకూ తగులుతోంది. ఇక వీళ్లు ఏ మొహం పెట్టుకుని జగన్‌ను నిందించగలరు చెప్పండి. చిన్నపుడు ఆల్జీబ్రాలో ఈజీక్వల్టూకి అటూ యిటూ ఎక్స్ స్వేర్‌లు, వైట క్యూబ్‌లు  కొట్టేసుకుంటూ పోయి చివర్లో ఏదో మిగిల్చినట్టు, అవినీతి ఫ్యాక్టర్‌ను అటూ, యిటూ కొట్టేస్తే యిక మిగిలేది పరిపాలన, సానుభూతి యిలాటి అంశాలే. పెట్రోలు ధర పెంపు వంటి అంశాల వలన కాంగ్రెస్‌కు మైనస్ మార్కులు వస్తాయి. పాపం వర్షాలు కూడా ఆలస్యమవుతున్నాయి. ఇక జగన్ వైపునుండి చూస్తే పార్టీ యంత్రాంగం సరిగ్గా వున్నట్టు లేదు. మొన్న బంద్ పిలుపు నిచ్చి తమకున్న లోపాలను తామే బయటపెట్టుకున్నారు. విజయమ్మగారి యాత్రలకు స్పందన క్రమేపీ తగ్గుతోందంటున్నారు.

ఈ లోపున ఆజాద్ తెలివితక్కువగా మాట్లాడి ఆవిడకు ఓ ఆయుధం యిచ్చాడు. జగన్ కాంగ్రెస్‌లో వుంటే కేంద్రమంత్రి అయ్యేవాడు, నిదానంగా సిఎం కూడా అయ్యేవాడు, బయటకెళ్లి జైలుకెళ్లాడు అని వున్న విషయం చెప్పేశాడు. నిజానికి అతి తెలివితక్కువ మాట కాదు, జగన్‌ను ఉద్దేశించి చెప్పలేదు. చెప్పి ప్రయోజనం లేదు. ఆల్‌రెడీ వెళ్లిపోయాడు. జగన్‌వైపు వెళదామని చూస్తున్న ఎమ్మెల్యేలకు హెచ్చరిక అది. జాగ్రత్త, మీ పై కూడా కేసులు పెట్టి వేధిస్తాం, కాంగ్రెస్‌లో వున్నంతకాలమే మీకు రక్షణ వుంటుంది అని చెప్పడం. విజయమ్మ వెంటనే 'చూశారా, ఆజాద్ కూడా చెప్పాడు, సోనియా మాట విననందుకే మా కుటుంబాన్ని కష్టపెడుతున్నారు' అని మొదలుపెట్టారు. వెంటనే ఆజాద్ జగన్ కాంగ్రెస్‌లో వున్నా జైలుకి వెళ్లేవాడు అని మాట మార్చాడు. ఎందుకంటే అప్పటికే జగన్‌వైపు చూసే ఎమ్మెల్యేలకు బెదిరింపు వెళ్లిపోయింది.

ఉపయెన్నికల వరకూ మనకు యీ గొడవలు తప్పవు, వాటిలో జగన్ పార్టీ బాగా గెలిచి అటువైపు వలసలు ప్రారంభమవుతే యీ కేసుల గోల మరీ పెరుగుతుంది. సిబిఐ గోరంత చెపితే మీడియా కొండంత చేసి అడావుడి చేస్తుంది. అది మంచిది కాదంటాను నేను. నా ఉద్దేశం – జరుగుతున్న అవినీతిని దాచేయమని కాదు, ఉన్నది చెప్పాలి తప్ప అతిశయోక్తులు అక్కరలేదని. సిబిఐ కూడా నేరారోపణ చేశాక వెంటనే న్యాయవిచారణ జరిపి త్వరగా శిక్షలు అమలు చేయాలి. ఎప్పుడో చార్జిషీటు, నెలలు గడిచాక అరెస్టు, మధ్యలో లీకులు, బయట వుంటే సాక్ష్యాలు తారుమారు చేస్తాడంటూ కోర్టుకి నివేదనలు. వీళ్ల వెర్రి గానీ తను కేసుల్లో యిరుక్కోబోతున్నానని జగన్‌కు కాంగ్రెస్‌లోంచి బయటకు వచ్చిన రోజునే తెలుసు. పడే జాగ్రత్తలు ఎప్పుడో పడి వుంటాడు. 9 నెలల కితం కేసు పెట్టి ఎ1గా పేరు రాయగానే తక్కిన కంతలు ఏవైనావుంటే మూసేసివుంటాడు. ఇప్పుడు బయటకు వచ్చి ప్రభావితం చేయడమేమిటి, నా మొహం

! ఇటువంటి తలతిక్క వాదనలతో సిబిఐ తన యిమేజి పోగొట్టుకుంటోంది. మన రాష్ట్రానికీ యిమేజి పోయి, సిబిఐ, కోర్టులు వంటి వ్యవస్థలకూ యిమేజి పోతే.. మన బతుకులు ఎలా సాగాలిట? **(సమాప్తం) – ఎమ్బీయస్ ప్రసాద్ (జూన్ 2012)**

**జూన్ 06** **ఎమ్బీయస్: మధ్యలో యీ ఫిల్టరింగ్ ఎందుకు?**

తమనుండి బయటకు వెళ్లిపోయి నానా రకాలుగా తిప్పలు పెడుతున్నందుకు జగన్‌పై కాంగ్రెస్ సిబిఐ ద్వారా మూడు చెఱువుల నీళ్లు తాగిస్తోందని సర్వే సర్వత్రా వినబడుతోంది. అబ్బే, మాకేం సంబంధం? 'చట్టం తన పని తాను చేసుకుపోతోంది. సిబిఐ తన ధోరణిలో తను పోతోంది, దీనిలో మా ప్రమేయం ఏమీ లేదు' అని కాంగ్రెసు చెప్పుకుంటోంది. 'అసలు సిబిఐ లాటి దొడ్డసంస్థను తప్పుపడితే కళ్లుపోతాయి, లెంపలేసుకోండి' అంటోంది. రేపు కేంద్రంలో ఎన్‌డిఏ సర్కారు వస్తే యిదే కాంగ్రెస్ వారు సిబిఐ అంత చెడ్డది లేదంటారు. ప్రతి పార్టీ వాళ్లూ ఏదో ఒక సమయంలో సిబిఐను పొగడడమో, తెగడడమో చేస్తారు. ఎందుకిలా? అంటే నాకు ముళ్లపూడి వెంకటరమణగారి 'రాజకీయ బేతాళ పంచవింశతిక'లో ఓ కథ గుర్తుకు వస్తోంది.

ఓ మంత్రిగారు, ప్రతిపక్షంలో వున్న నాయకుడు గారు యిద్దరూ కరువుపీడిత ప్రాంతాల పర్యటనకు బయలుదేరారు. దారిలో యిద్దరికీ పరిచితుడైన ఒకతని యింట్లో బస చేశారు. ఆ గృహస్తు మంత్రిగారికి వంటింట్లో విస్తరి వేసి, ప్రతిపక్షం ఆయనకు వసారాలో వడ్డన చేయించాడు. కరువు పర్యటనలో వుండగానే రాజధానిలో మార్పులు వచ్చాయి. అధికార పార్టీ ప్రతిపక్షం అయిపోయింది. ప్రతిపక్ష నాయకుడికి మంత్రిపదవి ఖాయం అని తేలిపోయింది. తిరుగు పర్యటనలో కూడా అదే గృహస్తు యింట్లో బస. ఈ సారి అతను మాజీమంత్రికి బయట వడ్డించి, కాబోయే మంత్రికి వంటింట్లో విస్తరి వేశాడు. ఈ కథంతా ఒకాయన చెప్పి బేతాళుడి టైపులో ఎందుకలా చేశాడు? అని శ్రోతను అడిగాడు.

ఆ శ్రోత కాస్సేపు ఆలోచించి – ''కరువుప్రాంతాల పర్యటనకు వెళ్లే అధికారపక్ష ప్రతినిథి కరువు మరీ తీవ్రంగా వుండకూడదని, ప్రజలు మరీ బాధపడకూడదనీ తద్వారా తమ ప్రభుత్వాన్ని తిట్టుకోకూడదనీ ఆశిస్తాడు. అదే ప్రతిపక్షం నుండి వచ్చినవాడైతే కరువు తీవ్రంగా వుండి, ప్రజలు ఏడుస్తూ వుండాలని, ప్రభుత్వ వ్యతిరేకత తమకు రాబోయే ఎన్నికలకు ఉపయోగపడాలనే నెగటివ్ థాట్స్‌తో వుంటాడు. ఆ గృహస్తు ఇది గ్రహించి సదుద్దేశంతో వున్న మంత్రిని వంటింట్లోకి పిలిచి సత్కరించాడు. దుష్టాలోచనలతో వున్న ప్రతిపక్ష నాయకుణ్ని దూరంగా పెట్టాడు. తిరుగు ప్రయాణం నాటికి పదవులు మారాయి. వాటితో ఆలోచనలూ మారాయి. దేశమంతా సుభిక్షంగా వుండాలని, ప్రజలు ఆనందంగా వుండాలని కోరుకోవడం యీ సారి మంత్రి కాబోయే నాయకుడి వంతైంది. అందుకే ఆయనకు మన్నన. జనం అష్టకష్టాలు పడాలని కోరుకుంటున్న మాజీమంత్రికి బయట భోజనం పెట్టి దండన.' అని జవాబిచ్చాడు.

కథ చెప్పినాయన ఫక్కున నవ్వి ''నువ్వు బేతాళ కథలు చదివి చదివి మరీ ఎక్కువ ఆలోచిస్తున్నావు. ఇందులో యింత బుఱ్ఱ బద్దలు కొట్టుకోవాల్సింది ఏమీ లేదు. ఆ గృహస్తుకి యింతింత ఆలోచనలు లేవు. ఎవడు అధికారంలో వుంటే వాణ్ని ఎక్కువ సత్కరించాడు. ప్రతిపక్షంలో వున్నవాడికి సెకండు క్లాసు ట్రీటుమెంటు యిచ్చాడు. ఇంతకు మించిన ధర్మసూక్ష్మం లేదు.'' అని. ఈ కథ నాకెంతో యిష్టం. మనం చాలాసార్లు సింపుల్ కామన్‌సెన్సును మర్చిపోయి, ఏవేవో క్లిష్టమైన ఆలోచనల్లో పడిపోతాం. విషయాన్ని సూటిగా చూడలేం. సిబిఐ జెడి లక్ష్మీనారాయణ గారు ఎంత నిజాయితీపరుడు, ఎంత ప్రతిభావంతుడు యిలా అనేకం చర్చిస్తాం. అంత అక్కరలేదు, సిబిఐ కేంద్రం చెప్పినట్టు ఆడుతుంది అని గుర్తు పెట్టుకుంటే చాలు. అయితే యింకో విషయం కూడా గుర్తు పెట్టుకోవాలి. సిబిఐ అనేది ఒక వ్యక్తి కాదు, సంస్థ. పదిమంది కలిసి చేసినప్పుడు, ఆదేశాలు రాతపూర్వకంగా లేకుండా, సంజ్ఞల రూపంలో వున్నపుడు పైవారి ఆదేశాలు తుచ తప్పకుండా అమలు కావు.

ఓ సినిమా రైటరు కథ యిలా వుండాలి అనుకుని వూహించుకుని కథ చెప్తాడు. ఆ తర్వాత కథాచర్చల్లోనే కథ మారుతుంది. ఆ పై ట్రీట్‌మెంట్, డైరక్టరు చేతివాటం, కెమెరామన్ పనితనం, తారాగణం చెప్పే మార్పులు – యివన్నీ కలిసి అయ్యవారిని చేయబోతే కోతి తయారయినట్టు అవుతాయి. కథకుడి ఊహల్లో వున్నదానికీ, తెరపై తేలేదానికి పోలికే వుండదు. అలాగే సిబిఐ విషయంలో కూడా కాంగ్రెస్ హై కమాండ్‌కు కూడా అది ఒక తీరులో నడవాలనే ఊహ వుంది. అది వాస్తవంలోకి అనువదించేసరికి అవకతవకలు వస్తున్నాయి. ఎందుకంటే మధ్యలో చాలా మంది ఒరిజినల్ స్క్రిప్టును తమకు అర్థమైన తీరులో ఊహించుకుని ఏదేదో చేయబోతారు. కథను నిర్మాతకు అమ్ముకున్న తర్వాత నిర్మాత తాలూకు మనుష్యులు ఏం చేసినా కథకుడు నోరు మూసుకుని వూరుకోవాల్సిందే. అయ్యో నేను పాత్రను ఊహించుకున్న తీరు యిది కాదండీ అని మొత్తుకోకూడదు. కాంగ్రెస్ పార్టీ కూడా సిబిఐకు అప్పగించిన తర్వాత వాళ్లు ఏం చేస్తే అలాగే కానీ అని వూరుకోవాలి. కానీ వూరుకోవడం లేదు. అక్కడ వస్తోంది ప్రాబ్లం.

ఎమ్మార్ కేసులో సిబిఐ బిపి ఆచార్యను, ఎల్వీ సుబ్రహ్మణ్యంను యిద్దరినీ ప్రాసిక్యూట్ చేస్తానంది. అనుమతి కోరింది. 'చట్టం ముందర అందరూ సమానులే' అనే సూత్రంలో నమ్మకం వుండి వుంటే ప్రభుత్వం యిస్తే యిద్దరి విషయంలోనూ అనుమతి యివ్వాలి, లేదా యిద్దరికీ నో అనాలి. కానీ ఆచార్యను విచారించుకోమని కేంద్రప్రభుత్వానికి సిఫార్సు చేసి, సుబ్రహ్మణ్యానికి రక్షణ కవచం తొడిగేసింది. అదేమంటే సుబ్రహ్మణ్యంపై వున్న కేసు తీవ్రమైనది కాదు అంటోంది. కాదని మా న్యాయనిపుణులు చెప్పారని అంటోంది. అంటే అర్థం ఏమిటి? ఏ కేసు తీవ్రమైనదో, ఏది కాదో వీళ్లే తేల్చేస్తే మరి సిబిఐ ఎందుకు? ఆధారాలు వుంటేనే సిబిఐ ముందుకు

సాగుతుంది, లేకపోతే విచారణతో సరిపెడుతుంది అనుకుని వూరుకోకుండా మధ్యలో ప్రభుత్వం ఫిల్టర్ చేయడం దేనికి? సొంతం విచారణ జరగకుండానే ప్రజల ద ృష్టిలో ఫలానావారు దోషి, ఫలానావారు అమాయకుడు, అన్యాయంగా యిరుక్కున్నాడు అనే సంకేతాన్ని పంపడం దేనికి? నిప్పు లేకుండా పొగరాదని సామెత. కానీ రావచ్చు అని రాజకీయాల్లో ఎప్పుడో నిరూపించారు. అక్కడున్నది నిప్పో, పప్పో తేల్చడానికే కదా సిబిఐ వున్నది. సిబిఐ భేషైన సంస్థ, పక్షపాతం లేని సంస్థ అని ఓ పక్క చెపుతూ దాని పనికి అడ్డు తగిలితే ఎలా?

ఇదే విధంగా మంత్రుల విషయంలోనూ పక్షపాతం కనబడుతోంది. జీవోల విషయంలో సుప్రీంకోర్టు నోటీసులకు స్పందన లేదు. అవి సక్రమమో, అక్రమమో ప్రభుత్వం తరఫు నుండి క్లారిఫికేషన్ లేదు. నోటీసులకు మంత్రులు వ్యక్తిగతంగా సమాధానం యిస్తారంటారు. ఈ లోపుగా మోపిదేవిని కటకటాల వెనక్కి పంపేశారు. పొన్నాలకు పిలుపు వచ్చింది. సబితా ఇంద్రారెడ్డిని మాత్రం యింకా అంటుకోలేదు. సిబిఐ ఆమెను కస్టడీలోకి తీసుకుంటానంటే కాంగ్రెస్ ప్రభుత్వం ఏం చేస్తుందో చూడాలి. ఆవిడకీ ఓ రక్షణ కవచం రెడీగా వుండే వుంటుంది. సిబిఐ అడక్కపోయినా అడక్కపోవచ్చు. కెవిపిని యిప్పటిదాకా అడిగిందా ఏమైనానా? వైయస్ హయాంలో మంచికిగాని, చెడుకిగాని కెవిపియే బాధ్యత వహించారని అందరికీ తెలిసున్న విషయం. ఆయన జోలికి పోకుండా సూరీడు, సునీల్ రెడ్డి వంటి వాళ్ల వెంట పడినప్పుడే సిబిఐ పని సజావుగా లేదని తేలిపోయింది. దొరికేదెవర్రా అంటే మోపిదేవి వంటి వాళ్లు. ఆయన బిసి కాబట్టి మూసేశారని నేననను. బొత్స కూడా బిసియే. ఆయనమీదా ఆరోపణలున్నాయి. ఆయన్ను యిలా అరెస్టు చేయగలరా? ఇక్కడ చూడవలసినది కులం కాదు, బలం. మోపిదేవి రాజకీయ అర్భకుడు (పొలిటికల్ లైట్‌వెయిట్). బొత్స హెవీ వెయిట్. జల్లెడ పడితే లోపల వుండిపోతారు. మోపిదేవి, పొన్నాల వంటి వారు జారిపోతారు.

ఓ పక్క జల్లెడ పడుతూ మరో పక్క మేం న్యాయవిచారణకు అడ్డు ఎలా వస్తాం? అంటూ వగలు పోవడం హాస్యాస్పదంగా లేదూ!? **– ఎమ్బీయస్ ప్రసాద్ (జూన్ 2012)**

**జూన్ 09** **ఎమ్బీయస్: ఎందుకొచ్చిన ఖర్చు**

ఉపయెన్నికలలో పోటీ పడుతున్న పార్టీలు సర్వేలు నిర్వహించుకుని అవసరమైన చోటే ఖర్చు పెడదామని, గెలవని చోట మానేద్దామని నిశ్చయించుకున్నారని యివాళ ఆంధ్రభూమి వారు బ్యానరు కథనాన్ని వేశారు. అది ఎంతవరకు నిజమో తెలియదు కానీ నిజమైతే బాగుండునని అనిపించింది.

ఉపయెన్నికలలో వైకాపా ఎక్కువ సీట్లు గెలుస్తుందని అందరూ మొదటినుండి అనుకున్నదే. అన్నీ గెలవదనీ తెలుసు. కాంగ్రెస్, టిడిపి కలిసి అయిదారు గెలుచుకుంటాయని ఒక అంచనా వుంది. అయితే జగన్ అరెస్టు పరిస్థితిని మార్చేసింది. అరెస్టు కారణంగా అతనిపై వున్న ఆరోపణలు నిజమైనట్టే అనుకుని సామాన్య ఓటరు అతనికి ఓటెయ్యడు కాబట్టి గతంలో అనుకున్నవాటి కంటె తక్కువ వస్తాయని కొందరు అనుకోసాగారు. అబ్బే, అరెస్టు కావడం వలన సానుభూతి పెరిగింది, అతని తల్లీ, చెల్లీ కాన్వాసింగ్ చేయడం వలన మహిళా సెంటిమెంటుతో గతంలో కంటె అవకాశాలు పెరిగాయి అని కొందరు వాదిస్తున్నారు. జగన్ పరమ దుర్మార్గుడని, అనేకమంది ప్రతిభావంతుల జీవితాలు అతని వలన నాశనమయ్యాయని, అతను చేసిన దోపిడీకి సాక్ష్యాలు యిబ్బడిముబ్బడిగా దొరుకుతున్నాయని మీడియా (అతని "సాక్షి" తప్ప), తక్కిన పార్టీలు చేస్తున్న ప్రచారానికి ఎంతో కొంతమంది స్పందించకుండా వుండరని అనుకోవడంలో ఆశ్చర్యం లేదు.

ఈ పరిస్థితుల్లో ఓటర్ల నాడి ఎలా మారిందో తెలుసుకోవడానికి కాంగ్రెస్, టిడిపిలు సర్వేలు చేయించాయట. సర్వే ఫలితాలు చూస్తే విజయలక్ష్మి ప్రచారానికి మంచి స్పందన లభించిందట. వైకాపా చాలా స్థానాల్లో గెలిచేట్టు వుందట. అలాటప్పుడు ఉ ట్టిపుణ్యానికి బోల్డు డబ్బు తగలేయడం దేనికి అని ఆ రెండు పార్టీలు పునరాలోచనలో పడ్డాయట. ఎన్నికలకై కేటాయించిన నిధులలో సగం యిప్పటికే ఖర్చయాయట. కీలకమైన తుదిఘట్టంలో విడుదల చేద్దామని పెట్టుకున్న తక్కిన సగం ఆపేశారట. ఎక్కడైతే అవకాశాలు వున్నాయో అక్కడే ఖర్చు పెడదాం, తక్కిన స్థానాల్లో యిక ఖర్చు పెట్టవద్దు అనుకున్నాయట. ఆ విధంగా ఆ రెండు పార్టీలు అయిదారు స్థానాల్లో మాత్రమే యికపై ఖర్చు పెడతారట. వాటిల్లో తిరుపతి ఒకటిట. ఇంతకంటె వివరాలు రాస్తే ఆంధ్రభూమికి అన్యాయం చేసినట్టవుతుంది.

నాకు ఆనందం కలిగించిన వార్త ఏమిటంటే – సర్వేలో వైకాపాకు ఎక్కువ సీట్లు వస్తాయని కాదు. ఈ సర్వేలు ఎలా తేలతాయో ఎవరూ చెప్పలేరు. ఫలితాలు ఏమైనా కావచ్చు, నాకు నిమిత్తం లేదు. నాకు నచ్చిన అంశం ఏమిటంటే ప్రధాన పార్టీలు డబ్బు ఖర్చు తగ్గించుకోవడం ! కారణం ఏదైనా కానీయండి. ఎన్నికలలో డబ్బు వెదజల్లకుండా వుంటే అంతే చాలు. అన్ని రాష్ట్రాలకంటె మన దగ్గరే ఎన్నికలలో అభ్యర్థులు విచ్చలవిడిగా డబ్బు ఖర్చు పెడుతున్నారని బాగా పేరుబడి పోయింది. దానికి తోడు అవినీతి కూడా ఎక్కువన్న విషయం బాగా వెలుగులోకి వచ్చేసింది. ఎన్నికల వేళ ఏ రాష్ట్రంలోనూ దొరకనంత భారీ స్థాయిలో ఎన్నికల కమిషన్‌కు మన దగ్గర డబ్బు దొరుకుతోంది. అయినా ఆఖరి రెండు రోజుల్లో మద్యం, డబ్బు పంపిణీ విపరీతంగా జరుగుతోందని వార్తలు రాస్తున్నారు. అందరూ చెప్పుకుంటున్నారు కూడా. అది ఒక జీవితవాస్తవంలా అయిపోయింది.

దీనికి ఆద్యుడు చంద్రబాబు అని రాజకీయపరిశీలకులు అంటూ వచ్చారు. బాబు నుండి విడిపోయి వచ్చిన నాయకులు కూడా అదే చెప్తున్నారు. ఆయన నాటిన మొక్క యిప్పుడు మహావృక్షమై పోయింది. అందరూ ఆయన బాట పట్టి, ఆయన్ను మించిపోయారు. చివరకు టిక్కెట్టు యివ్వాలంటే డబ్బు ఖర్చుకి తట్టుకోగలడా లేదా అన్నదే ముఖ్యమైపోయింది. దానికి ప్రాధాన్యత రావడంతో ప్రజల్లో ఎన్నేళ్లగా మసలుతున్నాడన్నది పట్టించుకోవడం మానేశారు. గతంలో రాజకీయనాయకులకు, వ్యాపారస్తులకు సంబంధబాంధవ్యాలు వుండి ఒకరి కొకరు ఆపత్సమయంలో ఆదుకునేవారు. ఇప్పుడే వ్యాపారస్తులే రాజకీయనాయకులు అయిపోయారు. అప్పటివరకు ప్రజల మొహం చూడపోయినా, నియోజకవర్గంలో ఎన్నడూ నివసించకపోయినా ఎన్నికలకు మూడు, నాలుగు కోట్లు ఖర్చు పెట్టగలడంటే చాలు వ్యాపారస్తుడిని రాత్రికి రాత్రి పార్టీలో చేర్చుకుని, టిక్కెట్టు యిచ్చేస్తున్నారు.

దాంతో ఎప్పటినుండో ఆ నియోజకవర్గంలో శ్రమిస్తున్న పార్టీ కార్యకర్తల్లో నిరాశా నిస్పృహలు ఆవరిస్తున్నాయి. అసంతృప్తి వెల్లడిస్తున్నారు. "పార్టీకి నిధుల అవసరం వుంది" అని చెప్పి నాయకులు వారిని బుజ్జగిస్తున్నారు. స్థానిక ఎన్నికలలో మీకు యిస్తాం లెండి అంటారు. ఏం, స్థానిక ఎన్నికలలో మాత్రం డబ్బు అవసరం పడదా? అప్పుడూ చిన్న తరహా వ్యాపారస్తుడికి టిక్కెట్టు యిచ్చేస్తారు. ఆ వ్యాపారస్తుడు గెలిచాక నియోజకవర్గంలోనే వుండడు. హైదరాబాదు, ఢిల్లీల మధ్య తిరుగుతూ తన సామ్రాజ్యాన్ని విస్తరించుకుంటాడు. కావాలంటే పార్టీ నాయకుడికి, పార్టీకి విరాళాలు యిస్తూ వుంటాడు. రాజ్యసభ నుండి సర్పంచ్ పోస్టు దాకా యిదే తంతు అయిపోతోంది.

డబ్బు లేనివాడు కొరగాడు అనే మాట ప్రబలిననాడు సామాన్యప్రజలతో మసలేవాడు వెఱ్ఱివాడే కదా. వాడికి ఎప్పటికీ పదవి రాదు. మహా అయితే ఎన్నికల వేళ డబ్బున్న అభ్యర్థి సంచీ విదిలిస్తే డబ్బులు ఏరుకోవచ్చు. అంతకుమించి లాభం లేదు. ఇక్కడ యింకో విషయం కూడా వుంది. వ్యాపారస్తుడు ప్రతీ దానిలోనూ వ్యాపారం చేద్దామనే చూస్తాడు. ఎన్నికలలో ఓ నాలుగు కోట్లు పెట్టుబడి పెడితే, గెలిచాక దాన్ని కనీసం రెండు రూపాయల వడ్డీతో రాబడదామని చూస్తాడు కదా. అలా రాబట్టడానికి అవకాశం యిచ్చే పార్టీలోనే చేరతాడు. అంటే గెలవని పార్టీకి, గెలిచినా నిజాయితీగా వుంటానని పట్టుబట్టే పార్టీకి అతని అండ వుండదు. ఈ పార్టీ ప్రతిపక్షంలో వుండబోతోంది అనుకుంటే, ఖర్చు పెట్టనే పెట్టడు.

జనరల్ ఎలక్షన్‌లలో అయితే అధికారంలోకి ఎవరు వస్తారో తెలియదు కాబట్టి ఛాన్సు తీసుకుంటారు. ఉపయెన్నికలలో అయితే వాటి కారణంగా ప్రభుత్వం మారిపోదు కాబట్టి ప్రతిపక్ష అభ్యర్థిగా నిలబడినతను డబ్బు ఖర్చు పెడితే ఏం లాభం? అనుకుంటాడు. అందుకే పోటీ చేయనంటాడు. టిడిపిని యీ సమస్య బాగా వేధిస్తోంది. గతంలో మైసూరా రెడ్డి, కోవూరులో చంద్రమోహనరెడ్డి, యిప్పుడు నెల్లూరులో వంటేరు – వీళ్లందరూ అర్ధమనస్కంగా పోటీ చేస్తున్నారనే అంటారు.

డబ్బు గొడవ లేకపోతే యీ సమస్య రాదు. ఎందుకంటే రాజకీయాలనేవి ఓ క్రీడ. వాటిలో డబ్బు వచ్చినా, పోయినా ఒక ప్యాషన్ (వెఱ్ఱి అనవచ్చు)కోసం ఆడతారు. పరపతికోసం రాజకీయాల్లోకి దిగి డబ్బులు పోగొట్టుకున్నవారు వేలాదిమంది కనబడతారు. కానీ యిప్పుడు డబ్బే ప్రధానం అయిపోయింది. స్టేక్స్ భారీ స్థాయికి చేరాయి. దాంతో ఆవేశంతో, ఉద్రేకంతో పాలిటిక్స్‌లోకి వచ్చేవారు తగ్గిపోయారు. ఎంత పూనకం వున్నా ఒక్కో ఎన్నికకు వ్యక్తిగతంగా అయిదారు కోట్లు పోగొట్టుకోవడానికి ఎవరు సిద్ధపడతారు? గతంలో తమకు ఖచ్చితంగా ఓట్లేస్తారనుకున్నవారికే డబ్బుపంచేవారు. అది పరిమితంగానే వుండేది. ఇప్పుడు ప్రతి ఓటరూ అన్ని పార్టీల నుండి తీసుకుంటున్నాడట. "అందరి దగ్గర్నుంచి తీసుకోండి, కానీ మాకే వేయండి" అని వీళ్లే ప్రచారం చేస్తున్నారు. మాట తప్పుతాడేమో నన్న భయంతో దేవుడిమీద ఒట్లు వేయిస్తున్నారు.

నియోజకవర్గంలోని ఓటర్లందరిపై ఖర్చవదు. పై తరగతివారికి, మధ్యతరగతి వారికి ఏమీ యివ్వరు. పేదలకే యిస్తారు. వారు జనాభాలో ఓ 40% ఐనా వుంటారనుకోవచ్చా? మరి ఓటుకి ఎంత యిస్తున్నారు? మీడియాలో ఓటుకి వెయ్యి, పదిహేను వందలు, రెండు వేలు యిలా చెపుతూ పోతారు. ప్రచారంలో పాల్గొన్న కొందరు నాకు స్వయంగా చెప్పినది – మద్యం కాకుండా ఓటుకి ఓ పార్టీ 500, మరో పార్టీ 700 ఇంకో పార్టీ వెయ్యి రూపాయలు అని! డబ్బు యివ్వకుండా ప్రచారం చేద్దామని చూస్తే ఓటర్లు పొమ్మంటున్నారట. వాళ్లివ్వగా లేనిది మీరివ్వలేరా? అని దబాయించి పుచ్చుకుంటున్నారట. అందరూ యిచ్చినా అందరూ నెగ్గటం లేదు కదా. ఓటు వేసేటప్పుడు డబ్బు ఫ్యాక్టరు పక్కన పడేసి వేరే ఫ్యాక్టరుని లెక్కలోకి తీసుకుని ఓటేస్తున్నారన్నమాట. అంటే డబ్బు దారి డబ్బుదే, ఓటు దారి ఓటుదే అని తెలుస్తోంది కదా. ఆ కాడికి డబ్బు యివ్వడం దేనికి? ఇవ్వటం వీరికి, పుచ్చుకోవడం వారికి అలవాటై పోయింది!

ఇలా తీసుకున్న డబ్బు ఓటర్లను ఏమైనా బాగుపరుస్తోందా? వారు దీన్ని సద్వినియోగం చేస్తున్నారా? ఎన్నికల వేళ ఓటుకి కనీసం 2 వేలు చేతికి వస్తోంది కదా, ఇంట్లో నాలుగు ఓట్లు వుంటే 8 వేలు. ఇప్పుడు పిల్లలకు స్కూలు ఫీజులు కట్టే వేళ, పుస్తకాలు కొనే వేళ. ఈ డబ్బుతో అవేమైనా కడుతున్నారా? పోనీ యింటికి సున్నాలు కొట్టిస్తున్నారా? కరంటు కోత వుంది కదా, ఓ సెకండ్ హేండ్ జనరేటరు కొంటున్నారా? ఇవేమీ చేస్తున్నారని అనుకోను. ఇలా ఉద్దరిగా వచ్చిన డబ్బు ఉద్దరిగానే పోతుంది. ఏవో వ్యసనాలకు తగలేస్తారు, లేదా విలాసాలకు తగలేస్తారు. కష్టార్జితాన్నే తాగేసే మహానుభావులు వున్నపుడు అప్పనంగా వచ్చేదానితో తప్పతాగే వారుండరూ? తాగి ఇలాటి ఎన్నికలు మళ్లీ మళ్లీ రావాలని కోరుకుంటారు. తమకు డబ్బిచ్చి ఓటేయించుకుని గెలిచేవాడు త్వరలోనే బాల్చీ తన్నేయాలనీ, మరో ఉపయెన్నిక తెచ్చిపెట్టాలని ఆశీర్వదిస్తారు కూడా.

ఇలాటి డబ్బు ప్రజల జీవితాలను అతలాకుతలం చేస్తుంది. పేదవారందరూ డబ్బుకి ఓటు అమ్ముకుంటున్నారని అనలేం. కొందరు నీతిగా వుండవచ్చు, కొందరు పార్టీ సిద్ధాంతాలకు అనుగుణంగా ఓటేస్తాం డబ్బు వద్దు అనవచ్చు. కానీ యింతింత ప్రలోభాలు కళ్ల

ఎదుట ఆడుతున్నపుడు నిలదొక్కుకోవడం చాలా కష్టం. ఈ లెవెలు తగ్గాలి. వ్రతం చెడ్డా ఫలం దక్కాలన్న సామెత. ఓటు అమ్ముకోకూడదన్న నీతి పక్కన పెడితే కుటుంబానికి ఓ పదివేలు వస్తాయి అనుకుంటే పక్కన పెట్టేస్తారు. అబ్బే పెట్టినా వెయ్యో, పదిహేను వందలో వస్తాయి అనుకుంటే 'ఆ మాత్రం దానికోసం కక్కుర్తి పడి నీతి చెడగొట్టుకోవడం దేనికి?' అనుకోవచ్చు. అందువలన మన రాష్ట్రంలో ఓటు ధరను అర్జంటుగా పడగొట్టేయవలసిన అవసరం వుంది. అప్పుడే ఓటు అమ్ముకోవడాలు తగ్గుతాయి.

ఓటు అమ్ముకోవడం తగ్గిందంటే అవినీతి పట్ల సెన్సిటివిటీ పెరుగుతుంది. 'జగన్ అవినీతి కథనాలు ఎన్ని రాసినా ప్రజలు వాటికి పెద్దగా స్పందించరు, ఓట్లేయదలచుకుంటే వేస్తారు' అని నేను రాస్తే జగన్‌కి ఓట్లేయమని నేను చెప్పినట్టు అనుకుంటారు కొందరు. అది పొరబాటు. ఎవరికీ ఓటేయమని నేను చెప్పను. అవినీతి పట్ల మధ్యతరగతి, పట్టణవాసులు స్పందించినంత తీవ్రంగా పేదలు, గ్రామీణులు స్పందించటం లేదనే వాస్తవాన్ని నేను పదేపదే రాస్తాను. ఓటుకి వెయ్యి రూపాయలు పుచ్చుకునే వాడికి తెలియదా తనెంత అవినీతికి పాల్పడుతున్నాడో? తనకు వెయ్యి యిచ్చినవాడు రేపు అడ్డదారిలో కోట్లు సంపాదించబోతున్నాడని తెలియనంత అమాయకుడా? తమకు యిస్తున్న డబ్బు పార్టీ నాయకుల యింట్లోంచి రాలేదని, తమను దోచుకున్న దాంట్లోంచో, దోచుకోబోతున్న దాంట్లోంచో యిస్తున్నారని అతనికి అర్థం కాదా? ప్రతీ పార్టీ తనకు లంచం యిస్తోందంటే అన్ని పార్టీలు ఎక్కువతక్కువగా అవినీతికి పాల్పడ్డాయని తెలియకుండానే వున్నాడా?

'నేనే నీతిగా లేను, దంచినమ్మకు బొక్కిందే దక్కుడు అన్నట్టు వాడు దండుకున్నదాంట్లోంచి కొంత యిస్తూవుంటే సిగ్గు లేకుండా తీసుకుంటున్నాను. వద్దంటే నష్టపోతాను తప్ప వాడు నిజాయితీగా వుండడు. ఆ కాడికి తీసుకోవడంలో తప్పు లేదనే తీసుకుంటున్నాను. ఇలా గంజాయివిత్తనం నాటి, తులసిమొక్క రావాలంటే ఎలా వస్తుంది? వాడు రేపు గెలిచి అవినీతికి పాల్పడతాడు. పాల్పడనీ. దాంట్లో నాకు కొంత పారేస్తే చాలు' యిదీ సగటు ఓటరు ఆలోచనాధోరణి. అందుకనే అవినీతిపరులుగా ముద్ర పడిన అనేకమంది నాయకులు మరల మరల ఎన్నికవుతున్నారు. ఇది చాలా ప్రమాదకరమైన ఆలోచనాధోరణి. ప్రజలు యిలా ఆలోచించినంతకాలం అవినీతిపరులు భయపడరు. తగ్గరు.

ఎన్నికలలో పార్టీలు డబ్బు యివ్వడం మానేశారనుకోండి. అప్పుడు వృద్ధనారీ పతివ్రతా అన్న పద్ధతిలో ఓటర్లు నిజాయితీపరులు కాక తప్పదు. అప్పుడు వాళ్లు నీతినియమాల పట్ల సెన్సిటవైజ్ అవుతారు. అది మనకు మంచిది. ఇప్పుడు ఆంధ్రభూమి కథనం నిజమై, కొన్ని నియోజకవర్గాలలోనైనా సరే ఎలాగూ గెలవం అనే లెక్కకు వచ్చి డబ్బు, మద్యం సరఫరా ఆపేస్తే కనీసం ఆ నియోజకవర్గాల ప్రజలు బాగుపడతారు. వాళ్ల ఆలోచన మారుతుంది. పార్టీలు ఆ మేరకు డబ్బు మిగుల్చుకుంటే మనకూ మంచిదే. కనీసం ఆ మేరకు మనల్ని దోచే అవసరం లేదు కదా అని ఊరడిల్లుతాం. **(సమాప్తం) – ఎమ్బీయస్ ప్రసాద్ (జూన్ 2012)**

## జూన్ 11 ఎమ్బీయస్‌: సమయం సందర్భం వుందా?

వైకాపాలో యిద్దరు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు చేరారు. ఇంకో యిద్దరు ఎమ్మెల్యేలు కూడా చేరతారని అంటున్నారు. తమాషాగా లేదూ? ఓ పక్క పార్టీ అధ్యక్షుడు జైలులో వున్నాడు. సిబిఐ వారు తమ చార్జిషీటును ఆంజనేయుడితోకలా పెంచుకుంటూ పోతున్నారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరక్టరేట్ వచ్చి ఢిల్లీకి పట్టుకుపోతారని మీడియా హెచ్చరిస్తోంది. గౌరవాధ్యక్షురాలు ఎన్నికల వరకు ప్రచారం చేస్తారు కానీ ఆ తర్వాత నీరసిల్లవచ్చు. పార్టీ ఆఫీసులో ఎవరుండాలో, ఎవరి ఆదేశాల క్రింద పనిచేయాలో యిప్పటివరకు స్పష్టత లేదు. జైలుకి వెళ్లబోయేముందు లాక్కుని వచ్చిన మైసూరా రెడ్డికి ఏ బాధ్యతలూ అప్పగించలేదు. జగన్ జైలునుండే పార్టీ యావత్తూ నడిపేయబోతే ప్రభుత్వం ములాఖత్‌ల సంఖ్య కూడా తగ్గించవచ్చు. అసలు పార్టీకి సరైన నిర్మాణం వుందో లేదో ఉపయెన్నికల పోలింగు తర్వాత తెలిసిపోతుంది. వైకాపా పట్ల గుడ్‌విల్ వుందో, సానుభూతి వుందో, ఆశ వుందో – అవన్నీ ఓటర్లను పోలింగుబూత్‌లకు తరలించగలిగిన యంత్రాంగం వుంటేనే, ...వున్నా పని చేస్తేనే తేలుతుంది. అది తేలకుండా యీ ఎమ్మెల్యేలు ఎందుకు చేరుతున్నట్టు?

వీళ్లు మొదట్లో జగన్‌ను అంటిపెట్టుకుని తిరిగినవాళ్లే. తర్వాత కాంగ్రెస్ ఆగమంటే ఆగారు. కిరణ్‌ను బ్లాక్‌మెయిల్ చేసి తమకు కావలసిన పనులన్నీ జరిపించుకున్నారు. నియోజకవర్గంలో పనులు అంటారు కానీ వ్యక్తిగతమైన పనులే కావచ్చు. ఇప్పుడు జగన్‌వైపు వస్తున్నారు. ఎన్నికలు యింకా సుదూరంలో వున్నపుడు యిప్పుడు జగన్‌వైపు రావడమేల? నియోజకవర్గంలో పనులన్నీ అయిపోయాయా? అక్కడే ఎక్కడవుతాయి? మరి!? ఇదంతా స్ట్రాటజీలో భాగమంటారు కొందరు. జగన్ అరెస్టు అవక తప్పదని అందరికీ తెలుసు. అరెస్టు అయినపుడు కార్యకర్తల మనోధైర్యం సన్నగిల్లకుండా నాయకులు ఆ క్లిష్ట సమయంలో కూడా జగన్‌వైపు వస్తున్నారని చూపడానికి అవిశ్వాసం వేళే అందర్నీ రప్పించకుండా కొందర్ని జేబులో దాచుకున్నారని అంటున్నారు. కావచ్చు. అలా అవడానికే ఛాన్సు ఎక్కువ వుంది. ఎందుకంటే యిదంతా సైకలాజికల్ గేమ్. ప్రజలు ఎవరి వైపు వుంటే ఆ నాయకుడివైపు ద్వితీయశ్రేణి నాయకులు మొగ్గుతారు అన్నది లోకవిదితం. ఇప్పుడు వీళ్లు యిలా మొగ్గారు కాబట్టి ప్రజలంతా జగన్‌వైపు వున్నారు అనే ఇన్‌ఫెరెన్స్‌కు అందరూ వస్తారు. అలా రావాలనే యిలా ప్రణాళిక రచించి వుంటారు.

ఈ వాదన ప్రకారం జనాలు జగన్‌వైపు మొగ్గినా మొగ్గకపోయినా వీళ్లు మొదటే యిదంతా స్కెచ్ వేసుకుని వున్నారు అనుకుంటే జనాలు యిప్పుడు జగన్ పట్ల సానుభూతి చూపుతున్నారా లేదా అన్నది తేలలేదనే అనాలి. విజయమ్మగారి సభలకు వచ్చినవారంతా

స్థానికులు కాకపోవచ్చు, స్థానికులైనా వాళ్లంతా ఓట్లు వేయకపోవచ్చు. ఇది జూనియర్ ఎన్టీయార్ నుండి చిరంజీవి దాకా అందరూ అనుభవం మీద నేర్చిన సత్యం. జగన్ అవినీతి పట్ల ప్రజలు వ్యతిరేకత చూపుతున్నారా లేదా అన్నది ఎన్నికల ఫలితాలు వచ్చాకనే తేలుతుంది అనవచ్చు. అప్పుడు చిన్నపిల్లవాడైనా చెప్తాడు. ఈలోపున పరిస్థితి ఎలా వుందో ఆలోచించడంలోనే థ్రిల్ వుంది.

ఇవాళ జ్యోతి రాధాకృష్ణగారు ఓ వ్యాసం రాశారు. 'మీడియాతో పాటు యిన్ని రాజకీయపార్టీలు ఏకమై జగన్ అవినీతి, అక్రమాల గురించి చెపుతున్నా.. ఒక వర్గం ప్రజలకు ఎక్కకపోవడానికి కారణం తెలియక ఆ పార్టీల నాయకులు తలలు పట్టుకుంటున్నారు. జగన్ అవినీతికి పాల్పడ్డారని చెపుతూ వుంటే.. 'ఎవరు తినలేదు కనుక' అని ప్రజల నుంచి సమాధానం వస్తున్నది. అందరూ అవినీతిపరులే అన్న భావన ప్రజలలో ఏర్పడినందున జగన్ మాత్రమే నేరస్థుడు అని అంటే అంగీకరించడానికి సిద్ధంగా లేదు.' నేను పదేపదే యిదే విషయం రాస్తూ వుంటే కొందరు పాఠకులు నన్ను జగన్ అభిమానిగా పొరబడుతున్నారు. లక్ష కోట్లు అవినీతి ఎక్కడ దానిలో వందోవంతు కూడా సాక్ష్యాలు చూపించలేకపోతున్నారే అని నేను రాస్తే, పోనీ 300 కోట్లు తిన్నా అది మాత్రం తక్కువా? దానికైనా శిక్ష పడాలిగా అని రాస్తున్నారు.

నేననేది – ఎవడైనా బలాత్కారం చేశాడనుకోండి. వాడిమీద బలాత్కారం కేసే పెట్టండి. హత్య కేసు పెడితే సాక్ష్యాలు చాలక వీగిపోతుంది. జగన్ కానీయండి, కిరణ్ కానీయండి, బాబు కానీయండి, ఎవరైనా కానీయండి.. ఎంత నేరం చేస్తే అంతే పెట్టండి తప్పు సెన్సేషన్ కోసం సాక్ష్యాలు దొరికిన దాని కంటె ఎక్కువ పెట్టి దాన్ని నిరూపించలేక కోర్టులో చివాట్లు తిని ముద్దాయిపట్ల ప్రజలకు సానుభూతి కలిగేట్లు చేయకండి. హత్య కేసులోంచి ముద్దాయి బయటపడితే వాడు బయటకు వచ్చి ' న్యాయం గెలిచింది. నాపై పెట్టినవన్నీ తప్పుడు కేసులని తేలిపోయాయి' అని క్లెయిమ్ చేస్తాడు. వాడికి బలాత్కారానికి కూడా శిక్ష పడదు. అది తప్పు కదా. జగన్ 300 కోట్లు సంపాదించినట్లు అనిపిస్తే ఆ మాత్రానికే కేసు పెట్టి గెలవండి. లక్ష కోట్లు అనవద్దు. ఆ తర్వాత 2 లక్షల కోట్లు అన్నారు. ఇవాళ 'వచ్చే 15 ఏళ్లలో అది 16 లక్షల కోట్లు అవుతుందని' టిడిపి వారు లెక్క వేసి గోల ఆరంభించారు. వచ్చే 15 ఏళ్లల్లో ఫైనాన్షియల్ ట్రెండ్స్ ఎలా వుంటాయో ఎవరైనా చెప్పగలిగితే వాళ్లని ప్రపంచబ్యాంకు అధిపతి చేయవచ్చు. 16 లక్షలని దాడి అనగానే సిపిఐ నారాయణ అడావుడిగా 16 లక్షలు దోపిడి చేసిన జగన్ అంటూ సోదె మొదలెట్టేశారు. ఈ అతిశయోక్తులే మానమంటున్నది.

రాధాకృష్ణగారు యింకోటి కూడా రాశారు – 'జగన్‌ను సమర్థిస్తున్నవారు ఆయన తప్పు చేయలేదని చెప్పడం లేదు. బాబుపై చర్యలు ఎందుకు తీసుకోవడం లేదు? నాటి మంత్రులపై, అధికారులపై చర్యలు ఎందుకు తీసుకోవడం లేదు? అని మాత్రమే ప్రశ్నిస్తున్నారు....జగన్‌తో బాటు బాబు అండ్ కోను కలిపి చూడాలనుకునే వారు వారిపై కూడా దర్యాప్తు జరిగే విధంగా కృషి చేయాలిగానీ నిందితులను సమర్థించడంలో ఔచిత్యం ఏమిటి?' అని. కరక్టుగా చెప్పారు. అవినీతి తుట్టె అంటూ కదిపారు కాబట్టి సిబిఐ వారు అందర్నీ ఓ వూపు వూపాలి. ఓ చూపు చూడాలి. కొన్ని 'ఆత్మ'లను వదిలేయకూడదు.

పార్టీలు కూడా తమంతట తామే ముందుకు వచ్చి మేం పునీతులమంటూ చూపించుకోవాలి. సాంకేతిక కారణాల వలన కోర్టుకు వెళ్లకుండా చూసే బాబు వంటి వారు, తమంతట తామే కోర్టులకు వెళ్లి, తమ కేసులపై విచారణ డిమాండు చేసి, క్లీన్ చిట్ తెచ్చుకుని చూపించాలి. ఎసిబి దాడులను మధ్యలో ఆపించేస్తే ఎలా అంటూ బొత్స గారే స్వయంగా తన బినామీ దుకాణాలపై దాడి చేయించాలి. సుప్రీంకోర్టు నోటీసులు అందుకున్న మంత్రులందరూ తమంతట తామే సిబిఐకు సరెండరు అయిపోయి, తమకు తెలిసున్నవన్నీ చెప్పేయాలి. తప్పులు ఒప్పేసుకోవాలి. ఇవేమీ జరగటం లేదు. అందరూ కలిసి జగన్ కుటుంబం ఒక్కదాని స్వార్థం కోసమే అధికారులు, నాయకులు అందరూ జైలుపాలవుతున్నారు, ప్రజలు నష్టపోతున్నారు అంటున్నారు. జగన్‌ను ఉరేస్తే చాలన్నట్టుగా ప్రచారం సాగుతోంది.

ఫోకస్ అంతా జగన్‌మీద పెట్టడంతోనే వస్తుంది చిక్కు. ఉదాహరణకి వీరప్పన్ వంటి ఓ స్మగ్లర్ వున్నాడనుకోండి. అతను అలా తయారవ్వడానికి కారణం కొందరు అధికారుల అవినీతి అయివుంటుంది. వాళ్లు హింసించడంతో సాధారణ జీవితం గడుపుతున్న మామూలు మనిషి అడవిదొంగగా మారతాడు. అప్పుడు అతన్ని వాళ్లు, లేదా వాళ్లలాటి మరొకళ్లు వుపయోగించుకోవడం మొదలుపెడతారు. అతనితో సహకరించి, అతని ద్వారా స్మగ్లింగ్ చేయించి వాటాలు తీసుకుంటారు. పైకి మాత్రం అతను ఘోరాలు చేస్తున్నాడని ఫిర్యాదులు చేస్తారు. అతనితో సంబంధం లేకుండా తాము విడిగా చేసే వెధవ పనులకు కూడా అతణ్నే బాధ్యుడిగా చూపిస్తారు. అతను పెద్ద దొంగ అయ్యాక రాజకీయ నాయకులు అతన్ని కాపాడడం మొదలుపెడతారు. దానికి గాను అతని నుండి నిధులు వసూలు చేస్తారు. పైకి మాత్రం అతను నరరూప రాక్షసుడు, పట్టుకుని ఉరేయాల్సిందే అంటారు.

చివరకు అతను పట్టుబడగానే వీళ్లకు గుండెల్లో రైళ్లు పరిగెడతాయి. అతను నోరిప్పితే తమ పేర్లు బయటకు వస్తాయని భయపడతారు. జైల్లోనే నోరు నొక్కేయమని పోలీసులకు చెప్తారు. ఇలా ఎంతోమంది నేరస్తులు పోలీసు కస్టడీలోనే చచ్చిపోతారు. ఒక్కోప్పుడు అతని కేసు విచారణ చేసే జడ్జిలు యాక్సిడెంట్లలో పోతారు. సాక్షులు ఎగిరిపోతారు. పోలీసులు యితరులు చేసిన కేసులన్నీ కూడా యితని నెత్తికి చుట్టేసి, అవన్నీ క్లోజ్ చేసి పడేస్తారు. అతను పోలీసు స్టేషన్‌లోంచి పారిపోయాడంటారు. ఏ ఎన్‌కౌంటర్‌లోనో చచ్చిపోయాడంటారు. ఇది యిప్పటి ఫినామినన్ కాదు. జానపద కథల్లో కూడా కనబడుతుంది. దొంగ అని ఎవడికైనా ముద్ర పడగానే ఘరానా మనుష్యులందరూ తమ నేరాలను కూడా అతడికి అంటగట్టేసి ఉరి తీయించేసేవారు. రాబిన్ హుడ్, జారో వంటి కథల్లో కూడా అది కనబడుతుంది.

నేను జగన్‌ను వీరప్పన్‌తో గాని, రాబిన్ హుడ్‌తో గాని పోల్చడం లేదు. ఫినామినన్ గురించి చెపుతున్నానంతే. జగన్ మీదనే

ఫోకస్ చేయడం గురించే నాకు అభ్యంతరం. అనేకమంది ఆర్థిక నేరస్తులున్నారన్నది జగద్విదితం. ఎవర్నీ విడిచిపెట్టకుండా అందరిపై కేసులు బుక్ చేయాలి. త్వరగా విచారణ జరిపించాలి. మద్యం సిండికేటుపై కేసులు ఎలా నడుపుతున్నారో చూడండి. శ్రీనివాసరెడ్డి బదిలీ, భూపతిబాబుపై యింకో అధికారిని వేయడం, ఇప్పుడు ప్రసాదరావు వచ్చిన తర్వాత కూడా విజయనగరం, చిత్తూరు జిల్లాల వైపుకి వెళ్లకపోవడం.... యివన్నీ ప్రభుత్వం చిత్తశుద్ధితో పని చేస్తున్నట్టు అనిపిస్తున్నాయా?

మద్యం సిండికేటులో చూడబోతే అన్ని పార్టీల వాళ్లూ పీకలదాకా కూరుకుపోయినట్టు తేలుతోంది. ఇలాటి సిండికేటు అక్రమాలు ఎన్ని వున్నాయో ! వీళ్లందరూ జగన్ చెప్తేనే యిలా మారారా? వైయస్ కుటుంబం ఒక్కటే వీళ్లందరినీ చెడగొట్టిందా? కమ్యూనిస్టుల దగ్గర్నుంచి డబ్బులు పుచ్చుకున్నారని తేలింది. అబ్బే, పార్టీ విరాళాలు అంటారు. ఇలాటి విరాళాలతో కార్మిక చైతన్యం తెస్తారంటే మనం నమ్మాలా!? మద్యంలో పువ్వాడ నాగేశ్వరరావు పేరు ఓ పక్క బయటకు వచ్చింది, మరో పక్క ఆ పార్టీ నాయకుడు నారాయణ జగన్ 16 లక్షల కోట్ల అవినీతి గురించి మాట్లాడుతున్నారు! వాట్ ఏన్ ఐరనీ!

ఎసిబి అప్పుడప్పుడు యాక్టివ్‌గా వుంటేనే యిన్ని పేర్లు బయటకు వస్తున్నాయి. అసలు ఎప్పుడూ యాక్టివ్‌గా వుంటే యింకెంతమంది దొరికేవారో ! ఇక సిబిఐ అయితే చెప్పనే అక్కరలేదు. దాని గతచరిత్రంతా వివాదాస్పదం. ఏ వ్యవస్థా రాజకీయాలకు అతీతంగా లేదు. శంకర్రావు రాసిన ఓ ఉత్తుత్తి లేఖ జగన్‌కు వ్యతిరేకంగా రాస్తే కోర్టు పరిగణనలోకి తీసుకుంది. మంత్రులకు వ్యతిరేకంగా రాస్తే తీసి అవతల పారేసింది. అనేక కోర్టుల తీర్పులు కూడా వివాదాస్పదం అయ్యాయి. వీటన్నిటికనీ పైనుండి ఢిల్లీ నడిపిస్తోంది అని అనుమానించేట్లే వుంది కదా. ములాయం పై కేసులున్నాయి. ఇప్పుడు వాటిని పట్టించుకోవడం లేదు. ఎందువలన? యుపిఏ తృణమూల్‌ను నమ్ముకోలేదు కాబట్టి, ఎస్పీని మచ్చిక చేసుకోవాలి. కాబట్టి ములాయంపై కేసులు ఎత్తేయాలి, వాళ్ల కోడల్ని ఏకగ్రీవంగా ఎన్నుకోవాలి. ఎక్కడుంది న్యాయం?

నేను నాలుగు దశాబ్దాలకు పైగా రాజకీయాలు గమనిస్తున్నాను. ఎన్నో ఆర్థిక నేరాల గురించి పేపరు కటింగ్స్ జాగ్రత్త పెట్టుకున్నాను. బోఫోర్స్ గురించి చిత్రా సుబ్రమణ్యన్, ఎన్.రామ్ రాసిన పరిశోధకాత్మక వ్యాసాలన్నీ దాచాను. ఇప్పుడు అవన్నీ బయటకు లాగి చూస్తే ఎవరికీ శిక్ష పడలేదని గుర్తుకు వస్తుంది. అప్పుడేదో ఉద్రేకంతో ఊగిపోవడానికి తప్ప యింకెందుకు పనికి రాలేదు. ఇటీవలి కాలంలో జరుగుతున్నదే గమనించండి – జయలలిత, లాలూ, కరుణానిధి, మాయవతి, బాదల్, ఎడ్యూరప్ప, ములాయం ! ఒక్కరికి శిక్ష పడిందా? పడుతుందన్న ఆశ వుందా? అంతెందుకు ఇవాళ జగన్ గురించి ఢిల్లీ యింత రచ్చ చేస్తోందా? సబ్బం హరి వంటి వాళ్లు యింకో యిద్దరు రిజైన్ చేసి వైకాపా తరఫున ఎంపీలైతే జగన్ వెనక్కాల ఐదుగురు ఎంపీలుంటే చాలు, వాళ్ల మద్దతుకోసం యుపిఏ యీ కేసులను మధ్యదారిలో వదిలేస్తుంది. ఇవి ఎక్కడో ఓ మూల పడి ఏడుస్తూంటాయి. తర్వాత ఎన్‌డిఏ వచ్చినా జగన్ మద్దతు వాళ్లకు అవసరం పడితే వాళ్లూ యిదే పాలసీ ఫాలో అవుతారు.

అంటే అన్నిటికీ మూలం ఏమిటన్నమాట? ఎన్నికలలో గెలిచి సీట్లు సంపాదించుకోవడం. ఆ శక్తి వుంటే నువ్వు ఎన్ని నేరాలు చేసినా ఫర్వాలేదన్న సంకేతం యిస్తున్నాయి మిశ్రమప్రభుత్వాలు. ఎన్నికలు గెలవగల శక్తి జగన్‌లో వుందని నాయకులు విశ్వసించినంతకాలం అతని పార్టీకి ఫిరాయింపులు సాగుతూనే వుంటాయి. శక్తి వుందని తేలేదాకా ఆగి అప్పుడు ఫిరాయించవచ్చు కదా, యీ యిద్దరూ యిప్పుడే ఎందుకు పార్టీ మారడం అంటారేమో ! ఫలితాలు వచ్చేముందు చేరిన వారికి దక్కే ప్రాధాన్యత, తర్వాత గుంపులో గోవిందాగా చేరేవారికి దక్కదు. తమ తమ నియోజకవర్గాల్లో ఎదురు లేకుండా చేసుకోవాలంటే ముందే రిస్కు తీసుకోవాలి. లేకపోతే తన నియోజకవర్గంలోని మరో నాయకుడు గబుక్కున వెళ్లాడంటే, యిక తనకు దక్కదు. అందుకే యిప్పుడు తొందర పడుతున్నారు.

ఉపయెన్నికలలో వైకాపా 13 సీట్ల కంటె ఎక్కువ గెలుచుకుంటే యీ కప్పదాట్లు మరిన్ని జరుగుతాయి. వీటివలన రాష్ట్రంలో రాజకీయ అస్థిరత తప్పదు. కిరణ్ ప్రభుత్వం కూలిపోతుందన్న భయం కాంగ్రెస్‌కు వేస్తే జగన్‌పై కేసుల విచారణ జోరు తగ్గే అవకాశం కూడా వుంది. కేంద్రంలో మమతా, ములాయంల మధ్య కాంగ్రెస్ చేసే గెంతులు చూస్తున్నాం కదా! అధికారం నిలబెట్టుకోవడానికి వాళ్లు ఏదైనా చేయగలరు. జగన్‌ను జైల్లోంచి బయటకు వదిలేసి, 'మా వాళ్లను యిక లాక్కోక నాయనా' అని బేరం పెట్టవచ్చు. తనకు బేరాలాడే శక్తి వుంది సుమా అని చూపడానికి జగన్ యిలా ఇద్దరిద్దరు ఫిరాయింపుదారుల స్ట్రాటజీ అమలు చేస్తూ వుండవచ్చు. **(సమాప్తం) – ఎమ్బీయస్ ప్రసాద్ (జూన్ 2012)**

జూన్ 13 వీక్లీకై ఎమ్బీయస్: జూదమూ – రాజకీయమూ

ఉపయెన్నికల ఫలితాలు రేపు రాబోతున్నాయి. ఎవరో ఒకరు గెలవక మానరు, మరొకరు ఓడక మానరు. ఎంత శ్రమించినా, ఎన్ని ఆశలు పెట్టుకున్నా అనుకున్న ఫలితం రానప్పుడు ఓడిపోయిన పార్టీ వారు చెప్పే మాటలు, యిచ్చే ప్రకటనలు ఎలా వుంటాయో మనకు తెలుసు. – 'ప్రజల తీర్పు మాకు శిరోధార్యం', 'దురదృష్టవశాత్తూ వారు మమ్మల్ని అర్థం చేసుకోలేకపోయారు.. ఎదుటివాళ్ల ప్రలోభాలకు లొంగిపోయారు', 'మా ప్రతిక్షకుల దుర్మార్గాలను ప్రజలకు చేరవేయడంలో మేం విఫలమయ్యాం', 'దీనితో కథ ముగిసిపోలేదు.. ఎన్నో ఏళ్ల పయనంలో యిది ఒక మజిలీ మాత్రమే', 'రాజకీయాలన్నాక ఎత్తుపల్లాలు తప్పవు.. ఇది ఒక ఆట,

క్రీడాస్ఫూర్తితో ఓటమిని కూడా స్వీకరించి మరింత ఉత్సాహంతో ముందుకు సాగుతాం.. లక్ష్యాన్ని చేరతాం...'

వాళ్లు క్రీడ అంటారు తప్ప అది ఏ క్రీడో చెప్పలేరు. అది జూదక్రీడ. వారు స్పష్టంగా అనలేనిది వారంటే అభిమానమున్న విశ్లేషకులు టీవీ చర్చల్లో కూర్చున్నపుడు మాత్రం అనేస్తారు – 'రాజకీయాలు భ్రష్టు పట్టిపోయాయి. ఎవరు ఎందుకు గెలుస్తారో ఎవరూ చెప్పలేకుండా వున్నారు. పార్టీ మ్యానిఫెస్టో ఎంత బాగా తయారుచేసినా ఏం లాభం? ఎవరైనా ఓటర్ని గట్టిగా పట్టుకుని ఫలానా వాడికి ఓటు ఎందుకు వేశావురా అంటే చెప్పలేడు వాడు. నెగ్గేవాడు ఎందుకు నెగ్గుతున్నాడో, ఓడేవాడు ఎందుకు ఓడుతున్నాడో ఎవరూ చెప్పలేరు. అంతా జూదంలా తయారైంది' అని.

ఇవి అత్యంత ఖరీదైన ఉపయెన్నికలు అని అన్ని పత్రికలూ ఘోషిస్తున్నాయి. అన్ని పార్టీలు విపరీతంగా ఖర్చు పెట్టాయంటున్నారు. ఓ పక్క ఎలక్షన్ కమీషనర్ అత్యంత సమర్థవంతంగా డబ్బు సరఫరాను ఆపుతున్నారు, యిప్పటికే 40 కోట్లు పట్టుకున్నారని వార్తలు వస్తాయి, మరో పక్క డబ్బు పంపిణీ అవుతోందంటారు – యిదేం చిత్రమో ! ఒకాయన చెప్పారు – 'గత ఎన్నికలలో యిలా దొరికిన డబ్బును ఏం చేశారని ఆర్‌టిఐ ద్వారా అడిగితే అప్పుడు తెలిసిందట – వాళ్లు పట్టుకున్న డబ్బులో కేవలం 1% మాత్రమే రాజకీయపరమైనదట. తక్కినదంతా వ్యాపారాలు, వ్యక్తిగత ఖర్చులతాలూకట. వాళ్లు ఋజువులు చూపించి డబ్బు వెనక్కి తీసేసుకున్నారట.'

అందువలన యీ సారి 40 కోట్లు పట్టుబడ్డాయన్నా ఆ మేరకు అవినీతిని అరికట్టారని మనం చంకలు ఎగరేయనక్కరలేదు. అదంతా ఉత్తుత్తి అంకె మాత్రమే. ఎన్నికల కోసం ఉపయోగించబోయిన డబ్బులో 40 లక్షలు మాత్రమే పట్టుబడిందని తెలుసుకోవాలి. డబ్బు పంపిణీ చేసేవారికి వేరే మార్గాలున్నాయని, అవి నిరాటంకంగా పనిచేసే ఉపాయాలున్నాయనీ అర్థమవుతోంది. ప్రజలు ముగ్గురి దగ్గరా డబ్బు తీసుకుని ఒకళ్లకే ఓటు వేస్తున్నారని పార్టీ నాయకులే చెపుతున్నారు. అంటే డబ్బు ఖర్చు పెట్టి గెలిచేవాడు ఒకడు. వాడితో పాటు డబ్బు ఖర్చుపెట్టి, పోగొట్టుకునేవారు యిద్దరు ! జూదంలో కూడా యింతే కదా, పదిమంది డబ్బు కాస్తారు, ఒక్కడికే గెలుపు. అందువలన రాజకీయం జూదం అని ఒప్పుకోవడానికి ఎవరికీ సందేహం అక్కరలేదు.

అయితే నేను భయపడుతున్నది – రాబోయే రోజుల్లో జూదమే రాజకీయం అవుతుందని! ఎన్నికల ఫలితాలపై ప్రజలు ఎలా పందాలు కడుతున్నారో వార్తలు వస్తున్నాయి. గతంలోనూ పందాలు వుండేవి. ఆ యా పార్టీల నాయకులు, అభిమానులు 'మా వాడు గెలిచి తీరతాడు, లేకపోతే నేను మీసం గీయించుకుంటా, గుండు గొట్టించుకుంటా..' వంటి పందాలు. ఇప్పుడు అలాటివి కావు. గెలిచే పార్టీపై అభిమానం వుండనక్కరలేదు. గుఱ్ఱపుపందాలకు వెళ్లేవాడికి గుఱ్ఱంమీద ప్రేమ వుండదు, దాన్ని ఓ అంగడి సరుకులాగానే చూస్తాడు. ఎప్పుడు పుట్టింది, ఎవరికి పుట్టింది, బరువెంత, ఎత్తెంత, గతంలో ఎలా పరిగెట్టింది.. యింతే ! అలాగే వీళ్లు కూడా..! మొన్న కోవూరు ఉపయెన్నికలో ప్రసన్న నెగ్గుతాడని అనేకమంది టిడిపివారు పందాలు కట్టారు. అంటే వాళ్లు అతన్ని అభిమానిస్తారనా? అబ్బే! ఇది గెలిచే గుఱ్ఱం, ఎటొచ్చీ వాళ్లనుకున్న 35 వేలు మెజారిటీ రాదు, 25కి లోపే వస్తుంది అని పందెం కట్టారు. తమ పార్టీవాడు బరిలో లేకపోతే అదో దారి. అతను వున్నా మా వాడు ఓడిపోవడం ఖాయం అని పందెం కట్టినట్టు అయిందన్నమాట.

సినిమా నటులకు అభిమానులు వుంటారు. వాళ్లు ఎన్నడూ యిలా చేయరు. 'డైరక్టరు చెత్తవాణ్ని పెట్టుకున్నాడు, మా వాడి సినిమా మటాష్, కావాలంటే పందెం' అని తన నోటితో ఏ అభిమానీ ఎన్నడూ అనడు. వేరే నటుడి అభిమాని వచ్చి '2 వారాల కంటె ఎక్కువ ఆడదని పందెం' అంటే సినిమా వీక్ అని తెలిసి పందాలెందుకు బ్రదర్ అని సున్నితంగా తోసిపుచ్చుతాడు తప్ప 'పద, ఆడదని నేనూ కడతా' అనడు. రాజకీయాల్లో మాత్రం అభిమానంతో సంబంధం లేకుండా పైనుండి కిందదాకా యిలా పందాలు కడుతున్నారు. పరిస్థితిని తమ ప్రయోజనాలకు ఉపయోగించుకోవడమే వీళ్ల లక్ష్యం.

ఓ కార్యకర్త వున్నాడనుకోండి – పార్టీ యిచ్చిన తిండీ, తాగుడూ, డబ్బు(రోజుకి వెయ్యి రూపాయలని మొన్న ఓ పార్టీ నాయకుడే టీవీలో చెప్పాడు)లతో నియోజకవర్గంలో నెల్లాళ్లు తిరిగి, ఆ పాటికి పరిస్థితి ఎలా వుందో ఒక అంచనా వచ్చాక తమ పార్టీ ఓడిపోతుందని పందెం కడుతున్నాడన్నమాట. ఎంత ఘోరం! పార్టీ ఎలాగూ దెబ్బ తింటుంది, మధ్యలో మనం ఓ నాలుగు డబ్బులు చేసుకుందాం అని తప్ప రాజకీయపరమైన రాగద్వేషాలు ఏమీ లేవన్నమాట. దీన్ని కాస్త కొనసాగించి చూస్తే నాకు ఓ చిత్రమైన ఊహాదృశ్యం తోచింది. ఉపయెన్నికలలో వైకాపాకు 70% సీట్లు వస్తాయని కిరణ్ కుమార్ పందెం కడుతూంటాడు. అతని సెక్రటరీ అదేమిటి సార్ అంటే – 'అవునయ్యా, ఎన్నికలతర్వాత పార్టీ ఫిరాయించకుండా ఎమ్మెల్యేలను ఆకట్టుకోవాలంటే డబ్బు కావాలిగా! కాంగ్రెస్ గెలుస్తుందని పందెం కట్టి ఓడిపోమంటావా?' అంటాడు.

క్రికెట్‌ను యిలాగే తగలేశారు. గతంలో క్రీడాభిమానులు ఆదరించినపుడు అందరూ తమ శక్తికొలదీ ఆడేవారు. ఆ రోజుల్లో పేరుప్రఖ్యాతులు తప్ప క్రీడాకారులకు ధనరూపేణా బావుకున్నది లేదు. మహా అయితే కొన్ని సంస్థల్లో ఉద్యోగాలు వచ్చేవి. ఆ తర్వాత స్పాన్సర్‌షిప్ అంటూ వచ్చాక డబ్బుకి అమ్ముడుపోయి ఒంటి నిండా స్టిక్కర్లు అంటించుకుని ఆడడం ప్రారంభించారు. అది చూస్తే సినిమాపోస్టర్లతో ఊళ్లో తిప్పే రిక్షా గుర్తుకు వచ్చేది నాకు. క్రమేపీ మ్యాచ్ ఫిక్సింగ్‌లు వచ్చిపడ్డాయి. వేలాలు వచ్చాయి. డబ్బుతో ఏ ఆటగాణ్నయినా కొని నీ టీములో పెట్టుకోవచ్చు. అవతలి పార్టీవాడు డబ్బిస్తానంటే ఎంతటి మొనగాడైన ఆటగాణ్నయినా ఆడనీయకుండా చేయవచ్చు. బాగా ఆడితే అండర్‌వరల్డ్‌ను పిలిచి కాళ్లు విరక్కొడతానని బెదిరించవచ్చు. మీ పిల్లల్ని కిడ్నాప్ చేస్తాననవచ్చు.

ఇప్పుడు ఎన్నికలపై బెట్టింగ్ తీవ్రస్థాయిలో జరుగుతోంది కదా, దీన్ని అరికట్టకపోతే క్రికెట్‌లో జరిగినదే యిక్కడా జరుగుతుంది. 'నువ్వు ఓడిపోతావని బోల్డంత పందెం కట్టాను. చూడబోతే యిప్పుడు నెగ్గేట్టున్నావు. పోటీలోంచి తప్పుకుంటావా. లేపేయమంటావా?'

అన్న బెదిరింపులు వస్తాయి. గుట్టుప్పందాల్లో జాకీలకు లంచాలివ్వడం, గుఱ్ఱాలకు మత్తుమందు యివ్వడం, పరిగెట్టే ట్రాక్ పాడుచేయడం – వంటివి ఎప్పణ్నుంచో జరుగుతున్నాయి. ఎన్నికలలో తప్పించడానికి సవాలక్ష మార్గాలు కనిపెట్టవచ్చు. వాడిపేర ఎస్సెమ్మెస్‌లు పంపవచ్చు, నోట్లు పంచవచ్చు, మనమే టీవీ కెమెరాలతో చిత్రీకరింపచేసి ఎన్నికల కమిషనర్‌కు ఫిర్యాదు చేయవచ్చు. నిజానిజాలు తేలేటప్పటికి నాలుగేళ్లు పడుతుంది. ఆ తర్వాత వాడు ఏమైతే మనకెందుకు? ఎన్నికల ఫలితాలు వెలువడేవరకే మన చింత. ఆ రోజున డబ్బు వచ్చి ఒళ్లో పడగానే యిక పట్టించుకోనక్కరలేదు. కోడిపందాల్లో పోటీ జరిగేవరకే కోడి గురించి పట్టించుకుంటాం. తర్వాత దాని కాలు తెగిందా, కూరొండుకుని తిన్నారా అని ఎప్పుడైనా పట్టించుకుంటామా?

ప్రస్తుతం నడుస్తున్నది రాజకీయజూదమైతే రానున్న కాలంలో జూదరాజకీయం. జూదాలే రాజకీయాల్ని నిర్ణయిస్తాయి. ఇదేదో కొత్తగా పుట్టుకు వచ్చినది కాదని గ్రహించాలి. మహాభారతంలో పాండవులు రాజ్యం పోగొట్టుకున్నది జూదం వల్లనే కదా! శౌర్యంతో సాధించలేనిది జూదంతో సాధించాడు దుర్యోధనుడు. ఆ తర్వాత ద్రౌపదికి గుడ్డలూడదీయించాడు. రాబోయే రోజుల్లో జరిగేది అదే – సిద్ధాంతాలతో సాధించలేనిది జూదంతో సాధిస్తారు యీ జూదరులు. ఆ తర్వాత ప్రజాస్వామ్యపు విలువలు, వలువలు రాలిపోవడం ఎంతసేపు! **– ఎమ్బీయస్ ప్రసాద్ (జూన్ 2012)**

## జూన్ 17 — ఎమ్బీయస్‌: సిబిఐవారు చదివించినది రెండు సీట్లు...

ఉప యెన్నికల ఫలితాలు వచ్చేశాయి. ఎన్నికలనగానే అభ్యర్థుల ఎంపిక కూడా కాకుండానే, ఏ లెక్కలూ వేయకుండా 'కోస్తా, సీమలలో వైయస్సార్సీకి 60%–70%, కాంగ్రెస్, టిడిపిలకు 15%–20% వస్తాయని అనుకోవడం సమంజసం' అని నేను రాశాను. తర్వాత తర్వాత కాంగ్రెస్ బాగా కష్టపడుతోంది కాబట్టి 3 గెల్చుకోవడంలో ఆశ్చర్యం లేదని, వైకాపాను నిలవరించడానికి కాంగ్రెస్, టిడిపి చేతులు కలిపినా కలపవచ్చునీ, ఆ బేరంలో టిడిపికి 1–2 వచ్చినా రావచ్చని కూడా అన్నాను. ఆ తర్వాత జగన్ అరెస్టు కావడంతో సానుభూతి గురించి చర్చ ప్రారంభమైంది. ఆర్థికనేరస్తుడిపై సానుభూతి వుండదని అనేక పార్టీలు వాదించినా, వుంటుందని నేను భావించాను. గతంలో వున్న ఉదాహరణలను చూపాను. సిబిఐ రాంగ్ టైమింగ్ వలన కాంగ్రెస్ నష్టపోతోందని కూడా అన్నాను. సిబిఐను ఉసిగొల్పడం వరకే కాంగ్రెస్ చేయగలిగిందని, తర్వాత అదుపు కోల్పోయిందని భావించాను.

ఇవాళ అదే జరిగింది. మామూలు పరిస్థితుల్లో వైకాపాకు 13 కంటె ఎక్కువ రాదని ఎందరో వూహించారు. కానీ 15 సీట్లు రావడంతో బాటు చాలా చోట్ల మెజారిటీలు కళ్లు తిరిగేట్లా వచ్చాయి. పూర్తి గణాంకాలు వచ్చాక లోతుగా విశ్లేషించుకోవచ్చు. ప్రస్తుతానికి కనీసం 10% ఓట్లు సిబిఐ కారణంగా ఎక్కువ పడి వుంటాయని వూహిస్తున్నాను. దానివలననే యింకో రెండు సీట్లు అదనంగా వచ్చి 15 వచ్చి వుంటాయి. అరెస్టు జరగడం, ఆ తర్వాత కోర్టులు కఠినంగా వ్యవహరించడం – వీటివలన సానుభూతి పెరిగిందని యిప్పుడు కాంగ్రెస్, టిడిపి వారే అంటున్నారు. ఇన్నాళ్లూ అలాటిదేమీ లేదని కొట్టిపారేశారు. వైకాపాకు కార్యకర్తలు లేరనీ, బంద్ సరిగ్గా నిర్వహించలేకపోయారనీ, అభిమానులను బూత్‌ల వద్దకు తీసుకు రాలేరనీ అనుకున్నాం. కానీ సానుభూతి వాటిని కమ్ముకుని వచ్చిందని జగన్ వ్యతిరేకులే అంటున్నారిప్పుడు.

అయితే సానుభూతి అన్నిచోట్లా ఒకేలా లేదు. సానుభూతి కారణంగా 10% ఓట్లు అదనంగా పడ్డాయని అనుకుని లెక్కేసి చూశా. నియోజకవర్గంలో పోలయిన ఓట్లలో 10% తీసుకుని దాన్ని వైకాపా అభ్యర్థికి వచ్చిన మెజారిటీతో పోల్చి చూశా. 10% కంటె తక్కువగా వచ్చిన స్థానాల్లో ప్రత్తిపాడు, మాచర్ల, పాయకరావుపేట, నరసన్నపేట కనబడుతున్నాయి. నరసన్నపేట అయితే బొత్తిగా 5%! అంటే సానుభూతి పాలు తగ్గి వుంటే కనీసం వీటిలో రెండయినా పోయి వుండేవి. రెండే అని ఎందుకంటున్నానంటే సానుభూతితో పాటు యితర అంశాలు కూడా పరిగణనలోకి తీసుకోవాలి కదా! ఏది ఏమైనా ఎన్నికల సమయంలో అరెస్టు చేయడం వలన సిబిఐ వైకాపాకు చదివించుకున్నది రెండు సీట్లు అని అందుకే అన్నాను. కాంగ్రెస్, టిడిపివారు యీ వాదనను ఒప్పుకోరు. సానుభూతి వలన 30% ఓట్లదాకా వచ్చి వుంటాయంటారు. ఈ పాలపొంగు తగ్గాక జగన్‌కి సాలిడ్‌గా మిగిలేది 15–20% ఓట్లే అని మనల్ని నమ్మమంటారు.

ఈ ఎన్నికలలో కొన్ని చోట్ల కాంగ్రెస్, టిడిపిల పెర్‌ఫార్మెన్స్ చూస్తే నివ్వెరపోతాం. కొన్ని చోట్ల 10% ఓట్లు కూడా తెచ్చుకోలేదు వారు. కాంగ్రెస్ ఓటుబ్యాంకు మొత్తం వైకాపావైపు వెళ్లిపోయిందని తీర్మానించబోతే అది తప్పు. వైకాపా గెలుస్తుందని అనుమానం వచ్చినచోట కాంగ్రెస్, టిడిపిలు చేతులు కలిపి, ఒకరి ఓట్లు మరొకరికి బదిలీ చేసుకున్నారని ఎవరైనా చెప్పగలరు. ఎక్కడ అలా జరిగింది అని అడుగుతారేమో. కాంగ్రెస్, టిడిపిలకు ఎక్కడైనా 20% ఓట్ల కంటె తక్కువ వచ్చాయంటే అక్కడ యిలాటి బదిలీ జరిగిందని సులభంగా చెప్పవచ్చు. దశాబ్దాలుగా రాజకీయాల్లో వుంటూ ఆ మాత్రం ఓటు బ్యాంకు కూడా లేకుండా వుండడం అసంభవం. నరసాపురంలో టిడిపి ఓట్లు కాంగ్రెస్‌కు పడ్డాయని ఎవరైనా చెప్పగలరు. లేకపోతే టిడిపికి గోదావరి జిల్లాలలో అన్ని తక్కువ ఓట్లు వస్తాయా? అలాగే అనంతపురంలో కాంగ్రెస్‌కు బొత్తిగా 17 వేలేమిటండి?

ఈ క్రాస్ ఓటింగు బ్రహ్మాండంగా జరిగినది పరకాలలో. అక్కడ బిజెపిది నాలుగో స్థానం, కాంగ్రెస్‌ది 5 వ స్థానం. ఇటీవలే తెలంగాణలో జరిగిన ఉపయెన్నికలలో 24% ఓట్లు తెచ్చుకుని అన్నిచోట్లా డిపాజిట్ దక్కించుకున్న కాంగ్రెస్ పరకాలలో అంత

ఘోరంగా ఎలా ఓడిపోగలిగింది? మెహబూబ్ నగర్‌లో గెలిచి, మంచి వూపు మీద వుండి, అనేకమంది జాతీయ నాయకులను ప్రచారంలోకి దింపిన బిజెపి తెచ్చుకున్నది బొత్తిగా 9 వేలా? అంటే 6% ఓట్లు కూడా తెచ్చుకోలేదా? నాన్సెన్స్! జరిగినదేమిటంటే తెరాస, బిజెపి హోరాహోరీగా పోట్లాడాయి. ఒకరినొకరు ఓడించుకోవాలని పట్టుబట్టాయి. ఐదు పార్టీలు బరిలో వున్నపుడు ఓట్లు చీలిపోతే ఎవరు గెలుస్తారో తెలియని పరిస్థితి వస్తోందని తెరాస, బిజెపి గుర్తించాయి. స్నేహితులకోసం అటూ యిటూ చూశాయి. భార్యకు టిక్కెట్టు దొరకలేదని రగులుతున్న గండ్ర గ్రూపు తెరాసకు ఓట్లు వేయించేశారు. ఇది గమనించిన బిజెపి ఆఖరి నిమిషంలో తెరాసను ఓడించాలంటే కొండా సురేఖయే సమర్థురాలనుకుని తమ ఓట్లన్నీ ఆమెకు వేయించారు. వారికీ డిపాజిట్ పోయింది. హోరాహోరీ పోరులో చివరకు తెరాస గెలిచింది.

ఈ క్రాస్ ఓటింగు గేమ్‌లో పూర్తిగా నష్టపోయినది టిడిపి. ఒక్క సీటు కూడా దక్కకుండా అయింది. జగన్ అవినీతి గురించి ఎంత ప్రచారం చేసినా, చేయించినా, రెండు లక్షల కోట్లన్నా, ఆఖరికి దాన్ని 16 లక్షలకు చేసినా – అర్బన్ ఓటర్ల దగ్గర్నుంచి వైకాపాకు ఓటేశారు. బాబు స్వంత జిల్లాలోని తిరుపతిలో కూడా ఆయన పార్టీ గెలవలేకపోయింది. అది కిరణ్ స్వంత జిల్లాకూడా. కాంగ్రెస్‌లో చేరి అహరహాలు శ్రమించిన చిరంజీవి తను రాజీనామా చేసిన సీటును సైతం కాంగ్రెస్‌కు సంపాదించి పెట్టలేకపోయారు. వాళ్లబ్బాయి పెళ్లి తర్వాత ఫలితాలు రావడం మంచిదయింది. లేకపోతే పెళ్లి సమయంలో దిగాలుగా వుండేవారేమో! ఆయన వలన కాంగ్రెస్‌కు ఒనగూడే మేలు ఏమీ లేదని తేలిపోయిన తర్వాత అక్కడ ట్రీట్‌మెంట్ ఎలా వుంటుందో ఏమో! ఇతర విశ్లేషణలు రేపు.. **– ఎమ్బీయస్ ప్రసాద్ (జూన్ 2012)**

**జూన్ 18**

## ఎమ్బీయస్ః సానుభూతా? వ్యతిరేకతా?

సానుభూతి పవనాలు వీచడం వల్లనే వైకాపా గెలిచిందని టిడిపి, కాంగ్రెస్ వారికి అనుకూల మీడియా చెప్పేసుకుంటున్నారు. దీన్ని యింత సులభంగా కొట్టిపారేయడం ఆత్మహత్యాసదృశం. సానుభూతి కొంతశాతం ఓట్లను తెచ్చిపెడుతుంది కానీ యీ స్థాయిలో ఓట్లు తెచ్చి పెట్టదు. పోలైన ఓట్లలో శాతం చూస్తే వైకాపాకు హీనపక్షం 39% వచ్చాయి. (నర్సన్నపేట) గరిష్టంగా 57%. 50% దాటినవి ఆరు. కాంగ్రెస్‌కు హీనపక్షంగా వచ్చినది 7.6% (అనంతపురం). గెలిచిన రామచంద్రపురం, నర్సాపురం తప్పిస్తే వేరెక్కడా 31% దాటలేదు. 20% లోపున వచ్చినవి 7. టిడిపికి హీనపక్షంగా వచ్చినది 4%. 20% లోపు వచ్చినవి 5. 30% దాటి వచ్చినవి 6 మాత్రమే.

రాష్ట్రంలో ముక్కోణపు పోటీ వుందనుకుంటే మూడు పార్టీలకు 25–30% ఓట్లు రావాలి. కానీ కాంగ్రెస్, టిడిపిలకు కలిపి వచ్చినన్ని ఓట్లు వైకాపాకు వచ్చాయి అంటే అర్థం ఏమిటి? రాష్ట్రంలో ఓటర్లు సగానికి చీలారు. ఒక సగం జగన్‌కి సాలిడ్‌గా వేస్తే, వ్యతిరేకించిన సగం మంది కాంగ్రెస్, టిడిపిల మధ్య చీలారు. ఇది గ్రహించే కాంగ్రెస్, టిడిపిలు చేతులు కలిపి జగన్‌ను ఓడించబోయారు. తన కోసం రాజీనామా చేసిన ముగ్గుర్ని (సురేఖ, ప్రసాదరాజు, బోసు) జగన్ తిరిగి గెలిపించుకోలేకపోయారు. తిరుపతిలో అదనంగా ఓ స్థానం గెలుచుకుని ఒక్క దెబ్బతో ముగ్గుర్ని (చిరంజీవి, కిరణ్, బాబు) ఉడికించాడు.

జగన్‌కు వచ్చిన మెజారిటీ అంతా కన్నీటి ఫలితమేననీ, అతి త్వరగా యిగిరిపోతుందనీ కాంగ్రెస్, టిడిపి నాయకులు తమ కార్యకర్తలకు నచ్చచెప్పి వారి ఆత్మవిశ్వాసం జారిపోకుండా చూస్తున్నారు. విజయమ్మ, షర్మిల కన్నీరు కార్చడం వలననే ఓట్లు కురిసాయని అనుకుంటున్నారు. ఎన్టీయార్ మరణం తర్వాత లక్ష్మీపార్వతి కూడా కన్నీళ్లు కురిపించారు. అప్పుడు కరగని జనం యిప్పుడెందుకు కరిగారని ఆలోచించాలి. అంతెందుకు, బాబు తనను దింపేసిన తర్వాత సాక్షాత్తూ ఎన్టీయారే తనకు పెట్టనికోట వంటి ఉత్తరాంధ్రకు వెళితే జనాల్లో స్పందన కనబడలేదు. ఆయన ద్వితీయ వివాహాన్ని ఆమోదించి, ఆయనా, రెండో భార్యా వేదిక మీద వేసిన డాన్సులని భరించి, 1994 ఎన్నికల్లో అఖండ విజయాన్ని చేకూర్చిన ప్రజలే 9 నెలలు తిరక్కుండా మొహం తిప్పేశారు.

అందువలన సానుభూతి ఎల్లవేళలా పనిచేయదని ఒప్పుకోవాలి. కేవలం సానుభూతి మీదనే వింతలూ, విడ్డూరాలూ జరగవని కూడా గ్రహించాలి. అసలంటూ సరుకుండాలి, ఆపై యిలాటివి తోడవ్వాలి. దీన్నే ఐసింగ్ ద కేక్ అంటారు. ఐసింగ్ అంటే ఐస్‌లోంచి నీరు అన్నమాట ( ఈ 'పన్' నాది కాదు, జయప్రద గారిది. ఆవిడ ఒకసారి టీవీ ఇంటర్వ్యూలో 'అది తలచుకుంటే కళ్లల్లోంచి నీళు వస్తాయి' అని చెప్పడానికి టెంగ్లీషులో 'అది తలచుకుంటే ఐస్‌లోంచి వాటరు వస్తుందన్నమాట' అన్నారు. మంచు కరిగితే నీరు రాక మరేమొస్తుంది, దానికి తలచుకోవడం దేనికి అని ఆశ్చర్యపడబోతూండగా ఆవిడ అభినయపూర్వకంగా కళ్లు టపటపలాడించడంతో భావం బోధపడింది)

ఈ విజయం మొత్తాన్ని సానుభూతి ఖాతాకే జమవేసి, విశ్రమిస్తే వీళ్లు ఖర్చయిపోవడం ఖాయం. వైకాపా సిద్ధాంతకర్త సోమయాజులుగారు గుర్తు చేసినట్లు – 2011 ఆగస్టులో "హిందూ" వారు చేయించిన సర్వేలలోనే వైకాపాకు 36% ఓట్లు వస్తాయని అంచనా వేశారు. టిడిపికి 24, కాంగ్రెస్‌కు 32 అన్నారు. ఆ బేస్‌ను లెక్కవేసుకుని సానుభూతికి 10% కలిపితే వైకాపాకు యిప్పుడు వచ్చిన ఓట్లశాతం యించుమించుగా వస్తోంది. ఈ 10%ను అది కాంగ్రెస్ నుండి 8%, టిడిపి నుండి 2% గుంజుకున్నట్టు తోస్తోంది. ఎందుకంటే గత 10 నెలల్లో కాంగ్రెస్ పార్టీ ఉద్ధరించినది ఏమీ లేదు. పేరు, ప్రతిష్ఠ పోగొట్టుకుంది. తెలంగాణ సమస్య

తేలలేదు. కిరణ్, బొత్స గొడవలు రచ్చకెక్కాయి. మంత్రులు, ఉన్నతాధికారులు జైలు కెళుతున్నారు. ప్రభుత్వ పనులు స్తంభించాయి. మద్యం మాఫియా, యిసుక లాబీ అంటూ అవినీతి విశ్వరూపం అందరికీ తెలియవచ్చింది. అవినీతి అరికట్టడానికి ప్రభుత్వం తన వంతుగా ఏమీ చేయడం లేదని, చేస్తున్నది కోర్టు ఆదేశాల మేరకే చేస్తోందని బాహాటంగా తెలుస్తోంది. ఈ విధంగా వుంటే కాంగ్రెస్‌పై వ్యతిరేకత ప్రబలి 8-9% ఓట్లు తగ్గి వుంటే ఆశ్చర్యం ఏముంది?

ఇక టిడిపి విషయంలో చూస్తే 2011 ఆగస్టులో చూస్తే 24% 10 నెలల తర్వాత వచ్చినది 22%. అంటే టిడిపి సమర్థకులు పెరగలేదు. తరిగికూడా వుండరు. అభిమానులే యీసారి ప్రత్యేక పరిస్థితుల్లో కాంగ్రెసుకు ఓటేశారు. తమ అభిమాన పార్టీ జగన్‌ను ఎదుర్కోలేదు అన్న సంగతిని వాళ్లు గుర్తించి అలా చేశారు తప్ప స్థానిక ఎన్నికలు జరిగితే వారు టిడిపికే ఓటేస్తారని అనుకోవచ్చు. దాన్ని తరుగు కింద లెక్క వేయలేం. కానీ యిలా 25% ఓట్ల స్థాయిలో వుండిపోతే ముక్కోణపు పోటీలో గెలవడం కష్టం. 5% ఓట్లయినా అదనంగా సంపాదించుకోవాలి. ఆ దిశగా ఏమీ చేయడం లేదని టిడిపి అభిమానులకు, సాధారణ ప్రజలకు దానిపై వ్యతిరేకత వుంది. అందుకే ప్రభుత్వ వ్యతిరేకతను అది సొమ్ము చేసుకోలేకపోయింది.

ఈ పరిస్థితులను గమనించే లోకసత్తా జెపిగారు అన్నారు – జగన్‌పై సానుభూతి కంటె కాంగ్రెస్, టిడిపిలపై వ్యతిరేకతే ఎక్కువ పనిచేసింది అని. జగన్ పట్ల పాజిటివ్ ఓటు, తక్కిన పక్షాల పట్ల నెగటివ్ ఓట్లు కలిసేటప్పటికి జగన్‌కు ఓటింగు శాతం విపరీతంగా పెరిగింది. రాబోయే ఎన్నికలలో యింతింత మార్జిన్‌లు వుండవు కానీ, జగన్‌కు ప్రస్తుతానికి 5-10% లీడ్ వుందనే ఒప్పుకోవాలి. దాన్ని పెంచడానికి జగన్, తగ్గించడానికి కాంగ్రెస్, టిడిపిలు కృషి చేయాలి. **– ఎమ్బీయస్ ప్రసాద్ (జూన్ 2012)**

## జూన్ 19 — ఎమ్బీయస్ః మధ్యలో టిడిపికి అక్షింతలు

ఉపయెన్నికల ఫలితాలు వచ్చాక వ్యాఖ్యలు, విశ్లేషణలు చూస్తే అందరూ టిడిపికి దుమ్మెత్తిపోస్తున్నారు. జగన్ యీ రీతిలో గెలవడానికి కారణం టిడిపియే అంటూ ఆ కోపమంతా టిడిపిపై చూపిస్తున్నారు. కనీసం రెండు సీట్లయినా గెలుస్తామనుకుంటూ వుంటే అది కూడా గెలవకపోయినందుకు టిడిపి వగస్తూంటే అది చాలనట్టు యితరుల చేత బుద్ధులు చెప్పించుకోవలసి వచ్చిన బాధ తోడవుతోంది.

జరిగినదేమిటి? అధికార పార్టీకి వ్యతిరేకంగా టిడిపి అవిశ్వాస తీర్మానం పెట్టింది. దానికి అనుకూలంగా ఓటేయమని వైకాపాను అడిగిందా? లేదే! వాళ్లంతట వాళ్లే వచ్చి తీర్మానానికి మద్దతు యిచ్చారు. మద్దతు యిచ్చినా యివ్వకపోయినా తీర్మానం ఎలాగూ ఓడిపోయేది. అయినా కాంగ్రెసుకు కోపం వచ్చింది. కోపం రావచ్చు కానీ జగన్‌తో పోట్లాడడానికి యిది అనువైన సమయం కాదన్న యింగితజ్ఞానం వారికి వుండాలి కదా. ప్రజలు చూస్తే జగన్‌ను చూడడానికి ఎగబడుతున్నారు. జాతీయసంస్థల సర్వేలు చూస్తే జగన్‌పార్టీకి కాంగ్రెస్ కంటె ఎక్కువ ఓట్లు వస్తాయని చూపిస్తున్నాయి. అలాటి సమయంలో చూసీ చూడనట్టు వదిలేసి వుంటే పోయుండేది. కానీ పంతం పట్టి జగన్ ఎమ్మెల్యేలందరినీ అనర్హులుగా ప్రకటించారు. అలా ప్రకటించమని జగన్ ఎమ్మెల్యేలు పట్టుబట్టవచ్చు. వాళ్ల బలం ప్రదర్శిద్దామన్న ఉబలాటం వాళ్లది (వాళ్లల్లో ముగ్గురు ఓడిపోయారంటే అనుకున్నంత బలం లేనట్టేగా). వాళ్లు చెప్పినట్టు వీళ్లెందుకు ఆడాలి? కానీ ఆడారు. దాంతో ఉపయెన్నికలు వచ్చాయి.

దీనిలో టిడిపి తప్పేముంది చెప్పండి. ఉపయెన్నికలన్నా, సాధారణ ఎన్నికలన్నా వాళ్లేమీ ఉత్సాహం చూపించడం లేదు. ఈ తెలంగాణ అంశమేదో తేలిపోయి కాస్త తెరిపిన పడితే పార్టీని బలోపేతం చేయవచ్చని చూస్తున్నారు. ఇప్పటిదాకా జరిగిన ఉపయెన్నికల్లో ఒక్కటీ గెలవలేదు. కాంగ్రెస్‌వాళ్లు తమలోతాము కుమ్ములాడుకుని ఎన్నికలు తెచ్చిపెడితే వీళ్ల తప్పేముంది? సరేనని శక్తి కొలదీ, విభవము కొలదీ ఎన్నికలలో పాల్గొన్నారు. బాబు విస్తృతంగా పర్యటించారు. అవినీతి గురించి పాఠాలు చెప్పారు. అన్నా హజారే ఫోటో ఆఫీసు దగ్గర పెట్టారు. రామ్‌దేవ్ బాబాను కౌగలించుకుని ఫోటో తీయించుకున్నారు. పిల్లల పెంపకం గురించి విజయమ్మకు లెక్చర్లు దంచారు. జైలు కెళ్లేవాళ్లు భోరున ఏడుస్తూ వెళ్లాలి తప్ప నవ్వుతూ చేతులు వూపుతూ వెళ్లకూడదని హితవు చెప్పారు. రెండేళ్ల తర్వాత మేం అధికారంలోకి వచ్చాక యివ్వబోయే వరాలు అంటూ ఉచితాల జాబితా చదివారు. నిజానికి ఏ దేవుడిలోనూ యింత సౌజన్యం వుండదు. రెండేళ్ల తర్వాత నువ్వు చేయబోయే తపస్సుకి మెచ్చి నేనిచ్చే వరాలు.. అంటూ యిప్పుడే చెప్పడు. బాబు చెప్పారు.

అయినా ఓటరు కరుణించలేదు. వైకాపాకు వచ్చిన ఓట్లశాతంలో సగం కూడా రాలేదు. కాంగ్రెస్ కంటె తక్కువ ఓట్లు, సీట్లువచ్చాయి. 5 చోట్ల 20% ఓట్ల కంటె తక్కువ వచ్చాయి. దశాబ్దాలుగా టిడిపికి ఓట్లేసే వర్గాలు కూడా "జగన్‌ను ఓడించడానికి వీళ్లకు ఎలాగూ శక్తి చాలదు. కాంగ్రెస్‌కు ఓట్లేసి జగన్‌కు బుద్ధి చెప్దాం" అనుకుని కాంగ్రెస్‌కు వేసేశారు. ఓటర్లకే నమ్మకం చెదిరినపుడు కార్యకర్తలకు చెదరకుండా వుంటుందా? 2014 దాకా దీన్ని అంటిపెట్టుకుని వుంటే లాభం వుంటుందా అన్న సందేహంలో పడతారని తెలిసిన బాబు "అబ్బే యిదంతా పాలపొంగు, నా హెరిటేజి పాల అనుభవంతో చెప్తున్నాను, ఎక్కువసేపు వుండదు" అంటూ ఊరుకోబెడుతున్నారు. ఏ నాయకుడికైనా యిటువంటి కష్టకాలాలు వస్తాయి. తను ధైర్యంగా వుంటూ, తనవాళ్లకు స్థయిర్యాన్ని చేకూర్చడమే యిలాటప్పుడు చేయదగిన పని. ఆ తంటాలేవో ఆయన పడుతూండగా మధ్యలో కాంగ్రెస్‌వాళ్లు టిడిపిని తిట్ట నారంభించారు.

ప్రభుత్వ వ్యతిరేకత (యాంటీ ఎస్టాబ్లిష్‌మెంట్) ఓట్లు ఎలాగూ వుంటాయి. ధరల పెరుగుదల, కనీస మద్దతు ధర యివ్వకపోవడం, పెట్రోలు ధరలు పెరగడం, జలాశయాల్లో నీరు తగ్గిపోయి సాగునీరు లేకపోవడం, విద్యుత్ సరఫరా యివ్వకపోవడం.... యిలా మేం ప్రజల జీవితాన్ని నానా రకాలుగా దుర్భరం చేశాం. దీనియొక్క ఎడ్వాంటేజి ప్రధాన ప్రతిపక్షమైన టిడిపికి వెళ్లాలి. కానీ వాళ్లు ప్రతిపక్షంగా విఫలమవడం వలన వైకాపాకు ఆ ఎడ్వాంటేజి దక్కింది. అందువలన వైకాపా నెగ్గిందంటే ఆ తప్పు టిడిపిదే – అన్న టోన్‌లో బొత్స మాట్లాడారు. ఎప్పుడో మహాభారత కాలంలో భీష్ముడు తనను ఎలా ఓడించాలో పాండవులకు చెప్పేశాడట. బొత్సగారు భీష్మడంతటి వారు. తమలో లోపాలు ఏమిటో, వాటివలన టిడిపి ఎలా లాభపడవచ్చో చెప్పేస్తున్నారు అనుకుంటున్నారా? దీనిలో కిటుకు ఏమిటంటే ప్రభుత్వ వ్యతిరేకత ఓట్లు చీలడమే ప్రభుత్వపక్షానికి కావలసినది. 2009లో వైయస్ గెలిచినది యీ సూత్రంతోనే. అప్పుడు ఆ ఓట్లను మహాకూటమి, పీఆర్పీ, లోకసత్తా పంచుకున్నాయి. నిజానికి జనాలు మన్‌మోహన్ విధానాలను ఆమోదించినంత స్థాయిలో వైయస్ విధానాలను ఆమోదించలేదు. అయినా వైయస్ వ్యతిరేక ఓట్లు చీలిపోయాయి కాబట్టి రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రాగలిగింది – కొద్ది మెజారిటీతో!

ఇప్పుడూ అదే జరగాలని కాంగ్రెసువారు ఆశించారు. టిడిపి, వైకాపా ఒకరితో మరొకరు సమానస్థాయిలో పోటీపడితే ముక్కోణపు పోటీలో కాంగ్రెస్ ఐదారు సీట్లయినా గెల్చుకుని వుండేది. రెండు, మూడు చోట్ల టిడిపి గెలిచివుండేది. జగన్‌ను ఏ 10 సీట్ల దగ్గరో ఆపగలిగేవారు. కానీ యిప్పుడు జరిగిన చీలిక – ప్రభుత్వ అనుకూల, వ్యతిరేక ఓట్ల మధ్య కాదు. జగన్ అనుకూల, వ్యతిరేక ఓట్ల మధ్య జరిగింది. పార్లమెంటులోని అసెంబ్లీ నియోజకవర్గాలతో కలిపి చూస్తే వైకాపాకు 18 లక్షలు వస్తే టిడిపికి 8 లక్షలు, కాంగ్రెస్‌కు 8 లక్షలు వచ్చాయి. శాతాల్లో చూస్తే వైకాపాకు 49, టిడిపికి 22, కాంగ్రెసుకు 23. ఇలా చూస్తే టిడిపి, కాంగ్రెసు కలిపినా వైకాపాను ఎదుర్కోలేవని అనిపిస్తుంది. కానీ సానుభూతికి కూడా కొన్ని శాతం ఓట్లు వుంటాయి. అన్ని చోట్లా ఒకేలా వుండకపోయినా సరాసరిన 10% అనుకుంటే (జ్యోతి రాధాకృష్ణ కూడా అంతే అన్నారు, తన వ్యాసంలో), దాన్ని టిడిపి, కాంగ్రెసుల మధ్య సమానంగా పంచితే వైకాపాకు నికరంగా వుండేది 39, టిడిపికి 27, కాంగ్రెస్‌కు 28. ఇలా అయినా వైకాపా తన సమీప ప్రత్యర్థి కంటె 10% ఓట్లతో ముందంజలో వుంది. అన్ని నియోజకవర్గాల్లో పరిస్థితి ఒకేలా వుండదు కాబట్టి 5-15% స్కేలు అనుకుంటే – అంటే కొన్ని నియోజకవర్గాల్లో 5%, కడప వంటి వాటిల్లో 15% అనుకుంటే – అప్పుడు కూడా వైకాపా తన సమీప ప్రత్యర్థి కంటె 5% ఓట్లతో ముందంజలో వున్నట్టే !

ఈ విధంగా చూస్తే రాబోయే ఎన్నికల నాటికి టిడిపి, కాంగ్రెసులలో ఏదో ఒకటి తాము పూర్తిగా తగ్గి మరొకరిని పెంచాలి. లేదా పొత్తు పెట్టుకోవాలి, లేదా రహస్య ఒప్పందం చేసుకోవాలి. ఇది ఎప్పుడైతే తేటతెల్లమైందో అప్పుడు కాంగ్రెస్ 'జగన్‌ను ఓడించడం మీకు చేతకాదు, మీరు మధ్యలో వచ్చి చెడగొడితే అతను నెగ్గకమానడు, నెగ్గాక మీ పని పట్టక మానడు. అందువలన మీరు రంగంలో నుండి తప్పుకోండి' అనే సందేశాన్ని టిడిపికి పంపుతున్నారు. 'మీరు ప్రతిపక్షంగా కూడా పనికి రారు. ప్రజాసమస్యల గురించి పట్టించుకోకుండా జగన్ గురించి నిరంతరం మాట్లాడి అతనికి గ్లేమర్ పెంచారు. మీకు విశ్వసనీయత పోవడం బట్టే జగన్ చెలరేగుతున్నాడు.' అంటున్నారు. కాంగ్రెస్ సరే, ''ఈనాడు'' కూడా తన సంపాదకీయంలో 'టిడిపి ప్రజాసమస్యల పట్ల కదనకాహళి మోగించకుండా మీడియా సమావేశాలు పెట్టి అంతటితో ఊరుకుంటే ఎలా?' అంటూ విమర్శిస్తే టిడిపి ఎక్కడకు పోవాలి చెప్పండి.

నిజానికి 2009లో గెలుచుకున్న సీట్లు తిరిగి గెలుచుకోలేకపోతే కాంగ్రెసు వారే సిగ్గుపడాలి. అధికారంలో వుంటే కలిగే అవకాశాలు చేతిలో పెట్టుకుని కూడా ఘోరంగా ఓడిపోవడం వారికి సిగ్గుచేటు. కానీ వారు తగుదునమ్మా అని టిడిపిని విమర్శిస్తున్నారు. ఇక టిడిపికి ఏం చెప్పాలో తెలియ 'అసలు అవి మా సీట్లు కానే కావు' అని చెప్పి తప్పించుకోబోయారు. దానిపై వైకాపావారు చెణుకులు వేశారు – మేం మూడు సీట్లు పోగొట్టుకున్నా, ఒక సీటు (తిరుపతి) కొత్తగా తెచ్చుకున్నాం. మీరు అక్కడే వుందా మనుకుంటున్నారు లాగుంది. అయితే యిప్పుడు చేతిలో వున్న 85 తప్ప తక్కిన 209 సీట్లపై ఆశ వదిలేశారన్నమాట! అని. ఓటమికి తోడు యీ అక్షింతలు ఒకటా! కటకటా! **– ఎమ్బీయస్ ప్రసాద్ (జూన్ 2012)**

**జూన్ 20** **ఎమ్బీయస్ః నో మోర్ ఏ హీరో**

ఉపయెన్నికలు ఫలితాలు వెలువడేదాకా మీడియా నుంచి జగన్ వ్యతిరేకుల ద్వారా అందరూ సిబిఐను ఆకాశానికి ఎత్తేశారు. అంత నిజాయితీ గల సంస్థ ఎక్కడా కానరాదని, సాక్షాత్తూ వైయస్సారే పరిటాల రవి హత్య కేసులో తన కొడుకుపై ఆరోపణలు వస్తే సిబిఐకు కేసు అప్పగించారనీ, అటువంటి సిబిఐను అనుమానిస్తే కళ్లు పోతాయనీ తెగ రాశారు. కేంద్రంలో ఎవరు అధికారంలో వుంటే సిబిఐ వారు చెప్పినట్టు ఆడుతుందని వీరందరూ ఏదో ఒక దశలో సిబిఐను ఆడిపోసుకున్నవారే. కానీ ఎప్పుడైతే జగన్‌పై కేసులు పెట్టిందో అప్పణ్నుంచీ సిబిఐ అంటే ఆహా, ఓహో అనసాగారు. కరక్టుగా చెప్పాలంటే సిబిఐ జెడి లక్ష్మీనారాయణ హీరో అయిపోయారు. ఆయన ఆయన సింప్లిసిటీ గురించి, నిజాయితీ గురించి, నిర్భీకత గురించి, కుటుంబం గురించి, ఆయన చదివిన స్కూలు గురించి, ఆ స్కూలులో జరిగిన ఫంక్షన్‌కు ఆయన వెళ్లిన వైనం దగ్గర్నుంచి – అన్నీ వార్తలే !

ఆయన కులం గురించి కూడా చర్చకు వచ్చేసింది. శ్రీ లక్ష్మి విషయంలో ఆమెకు బెయిలు దొరకడానికి కారణం ఏమిటి, ఆమె భర్త

లక్ష్మీనారాయణకు మిత్రులు కావడం చేతనా లేక వారిద్దరిదీ ఒకే కులమనా? అన్నంత వరకు చర్చలు జరిగాయి. నాకు తెలిసి యీ 9 నెలల కాలంలో లక్ష్మీనారాయణగారి ఫోటోలు పత్రికల్లో, టీవీల్లో కనబడినంత విరివిగా గతంలో ఏ సిబిఐ జాయింటు డైరక్టరువి పడలేదు. అనేక విషయాలు సిబిఐ లీక్ చేస్తోందని, ఆ లీకుల ఏకుల్లోంచి పత్రికల వాళ్లు తాన్లు తాన్ల దేవతావస్త్రాలు వడికేస్తున్నారని "సాక్షి" గోలపెడుతూన్నా అదంతా అరణ్యరోదనే అయింది. సిబిఐ గాని, లక్ష్మీనారాయణగారు గాని పత్రికలలో వచ్చే ఆ వార్తలను ఖండించడం తమ పని కాదనుకున్నారు. నిమ్మగడ్డ ప్రసాద్‌పై జగన్ విసురుగా లేచారని, ఆ దౌర్జన్యం చూసే అరెస్టు చేయకపోతే లాభం లేదనే నిర్ణయానికి లక్ష్మీనారాయణ వచ్చారని ఆంధ్రజ్యోతి రాసింది. వెంటనే టిడిపి వారు అదే సత్యం అన్నట్టు జగన్ సాక్షులను బెదిరిస్తున్నాడని, జగన్ పొగరుగా, తలబిరుసుగా సమాధానాలు చెపుతున్నాడని ప్రచారం చేశారు.

ఫలితాలు వెలువడ్డాయి. ప్రత్యర్థులు అనుకున్న దానికంటె వైకాపా ఎక్కువ సీట్లు సంపాదించింది. సీట్ల మాట సరే, ఓట్ల శాతం మరీ ఎక్కువగా వుంది. విన్నింగ్ మార్జిన్లు కళ్లు తిరిగేట్టు వున్నాయి. కడప జిల్లా సరే, నెల్లూరు పార్లమెంటు నియోజకవర్గమైతే మరీ దారుణం. దాదాపు 3 లక్షల మెజారిటీతో మేకపాటి గెలిచారు. టియస్సార్‌కు వచ్చిన ఓట్ల కంటె ఎక్కువగా ఆయన విన్నింగ్ మార్జిన్ వుంది. ఆనం సోదరుల స్వంత నియోజకవర్గాల్లో కూడా వైకాపా పతాకం ఎగరేసింది. అనంతపురంలో మంత్రి శైలజానాథ్‌ను ఇన్‌చార్జిగా పెడితే కాంగ్రెస్‌కు డిపాజిట్టు కూడా రాలేదు. రఘువీరారెడ్డి యిన్‌చార్జిగా వున్న చోట కాంగ్రెస్‌కు మూడో స్థానం. మొత్తం 7 స్థానాల్లో కాంగ్రెస్‌కు డిపాజిట్ పోయింది. 10 చోట్ల మూడో స్థానం వచ్చింది. పరకాలలో అయితే బొత్తిగా 5 వ స్థానం. గుంటూరు జిల్లాలో కాంగ్రెస్‌కు అంతమంది ఎంపీలు, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు వుండి కూడా ఒక్కసీటూ గెలుచుకోలేదు. గుంటూరు, ఒంగోలు జిల్లాలలో ఎప్పటినుండో మంచి ఓటుబ్యాంకు వున్న టిడిపి కూడా బొక్కబోర్లా పడింది. రాయలసీమలో ఒకప్పుడు టిడిపి మంచి బలంగా వుండేది. ఇప్పుడు కాలూనడానికి చోటు లేకుండా అయిపోయింది. మొత్తం మీద 10 చోట్ల రెండో స్థానం, 8 చోట్ల మూడో స్థానం దక్కింది. 5 స్థానాల్లో డిపాజిట్ పోయింది. నెల్లూరు పార్లమెంటు స్థానంలో డిపాజిట్ కూడా రాలేదు.

ఇక దానితో అందరూ సానుభూతిరాగం అందుకున్నారు. జగన్ పట్ల పెల్లుబికిన సానుభూతి వెల్లువలోనే తామంతా కొట్టుకుపోయామని ఆర్తనాదాలు చేయసాగారు. ఆ సానుభూతి కలగడానికి కారణం సిబిఐ అన్నారు. దాన్ని తిట్టనారంభించారు. అసలు 9 నెలల క్రితం చార్జిషీటు ఫైల్ చేస్తే యిప్పుడా అరెస్టు చేయడం అని అడగసాగారు. ఇదే ముక్క జగన్ అడిగితే అపుడు ఎద్దేవా చేశారు. సిబిఐ కుండే టైమ్ టేబుల్ దానికి వుంటుంది, నీ వెసులుబాటు బట్టి అరెస్టు చేస్తారా అని వెక్కిరించారు. ఆధారాలు సేకరించడానికి సమయం పట్టదా అని దబాయించారు – ఆధారాలు సేకరించకుండానే చార్జిషీటు పెట్టేస్తారా అని నాబోటి వాడికి అనుమానం వచ్చేట్లా ! బెయిలు కావాలని జగన్ అడిగితే సాక్ష్యాలను తారుమారు చేసేస్తాడని సిబిఐ భయం నటించింది (చేసేదేదో యిన్నాళ్లలోనూ చేయకుండా వుంటాడా?) ఆ భయం సహేతుకమే అని యీ నాయకులు అన్నారు. కోర్టులు బెయిలు యివ్వకపోతే శభాష్, మన న్యాయవ్యవస్థ చక్కగా పనిచేస్తోంది, దాన్ని విమర్శించడం తగదు అన్నారు. ఇప్పుడు చూస్తే 'సిబిఐ చేసిన పనికి మేము బలై పోయాం' అంటున్నారు. ఈ ఫలితాలకు బాధ్యత ఎవరిది అని బొత్స నడిగితే 'సిబిఐది' అన్నారాయన.

కాంగ్రెసు సిబిఐను ఉసిగొల్పి సరిగ్గా ఎన్నికల సమయంలో అరెస్టు చేయించడం వలననే యిలాటి ఫలితాలు వచ్చాయి అని బాబు వాపోయారు. జగన్ అరెస్టు కోసం ఎన్నోసార్లు డిమాండ్ చేసిన ఆయన అరెస్టయ్యాక 'జగన్, కాంగ్రెస్ కుమ్మక్కయ్యారు. జగన్‌కు సానుభూతి కలగాలనే కాంగ్రెస్ కావాలని అరెస్టు చేసింది' అనసాగారు. ఫలితాలు వచ్చాక కుమ్మక్కయినట్టు ఎక్కడా తోచలేదు. జగన్ తన ఓటు బ్యాంకును కొల్లగొట్టడానికి కాంగ్రెసు సహకరించిందని అంటే జనం నవ్వుతారు. మీడియా చాలా బాధ్యతాయుతంగా జగన్ అవినీతిని ఎండగట్టిందని మెచ్చుకున్న బాబు యిప్పుడు 'నిరంతరం జగన్ గురించి మాట్లాడి కాన్వాస్ చేసి పెట్టింద'ని ఆడిపోసుకుంటున్నారు.

'మీరే నిత్యం జగన్నామస్మరణ చేశారు కదా, ప్రతి ఉపన్యాసంలోనూ జగన్‌ను, అతని తల్లిని తిట్టడం తప్ప ప్రజాసమస్యల గురించి మాట్లాడినట్టు లేదు కదా!' అని విలేకరి అడిగితే బాబు మండిపడ్డారు – "అరగంట సేపు ఉపన్యాసం వుంటే 20 ని.ఎలు ప్రజాసమస్యల పట్ల మాట్లాడి, ఆఖరిలో 10 ని.ఎలు జగన్ గురించి మాట్లాడితే పేపరు వాళ్లు అదే హైలైట్ చేస్తే చావనా?" అని. ఇవన్నీ యిప్పుడంటున్నారు. జగన్ అవినీతి లక్ష కోట్లని, అబ్బే కాదు 2 లక్షల కోట్లనీ, 15 ఏళ్లల్లో అది 16 లక్షలవుతుందనీ... యివన్నీ అన్నది టిడిపి కాదా? ఎంతవరకు ఆధారాలు దొరికితే అంతవరకే ఆరోపిస్తే బాగుండేది, జనాలు నమ్మేవారు, యిలా అతిశయోక్తులు చెపితే మొత్తం నమ్మడం మానేశారు.

టిడిపిదే కాదు, కాంగ్రెసు పరువూ పోయింది. వాళ్లు అధికారంలో వున్నారు. పైగా జాతీయ నాయకులనుండి అందరూ దిగివచ్చి, పథకాలు రచించి, ప్రచారాలు చేసి, సిఎంను, పిసిసి చీఫ్‌ను చేయి పట్టుకుని నడిపించారు. తీరా చూస్తే రెండే రెండు చోట్ల – అదీ టిడిపి సహకారంతో – నెగ్గినట్టు తేలింది. ఓడినచోట్ల వైకాపా ఎంతో ముందంజలో వుంది. వారికి ఆ మధ్య కోవూరులో 23 వేల మెజారిటీ వస్తే అది జగన్ విపరీతంగా ఫోకస్ చేసి, స్వయంగా ప్రచారం చేయడం వలన అన్నారు. ఇప్పుడు జగన్ జైల్లో కూర్చున్నపుడు 23 వేల మెజారిటీ దాటిన స్థానాలు – 9! అంటే 18 స్థానాల్లో సగానికి సగం అన్నమాట!

కాంగ్రెసు ఎన్నో తప్పిదాలు చేసింది. ఇప్పుడు కూర్చుని అభ్యర్థుల ఎన్నికలో లోపం జరిగింది, అంతఃకలహాలు, వెన్నుపోట్లు వున్నాయి, ప్రభుత్వ పథకాలను వివరించడంలో విఫలమయ్యాం యిలా లిస్టు చదువుతున్నారు. కార్యకర్తల్లో నిస్తేజం ఆవరించింది

అని చెప్తున్నారు. ఇప్పటిదాకా 41 ఉపయెన్నికలు జరిగితే టెక్కలిలో మినహా అన్ని చోట్లా కాంగ్రెస్ ఓడిపోయింది. తెలంగాణలో అయితే తెలంగాణ సెంటిమెంటు కారణంగా ఓడాం అని చెప్పుకుంటున్నారు. ఆంధ్రప్రాంతంలో ఏమొచ్చిందట? నామినేటెడ్ పోస్టులు భర్తీ చేసి వుంటే, స్థానిక ఎన్నికలు జరిగి వుంటే పదవులు దక్కి నాయకులు ఉత్సాహంగా వుండేవారని చెప్తున్నారు. అంటే అర్థమేమిటి? పదవులు వుంటే మేయడానికి అవకాశం వుండేది, యిప్పుడు లేకపోవడం వలన నిరాశగా వున్నారు, అందుకని సరిగ్గా పనిచేయలేదు అని చెప్పినట్టేగా! అదే నోటితో జగన్ అవినీతి గురించి మాట్లాడితే జనం ఏం వింటారండి?

కాంగ్రెస్‌వారి మాజీ సిఎం వైయస్ అవినీతిపరుడని సిబిఐ చార్జిషీటులోనే వుంది. ఆయన పోయాడు కాబట్టి ఎక్యూజ్‌డ్‌గా పెట్టలేదన్నారు. మరో మాజీ సిఎం రోశయ్య వున్నారు కాబట్టి ఎసిబి కోర్టు సమన్లు పంపింది. గవర్నరుకి సమన్లు పంపించేటంత ధైర్యం చేశారంటే కేసు స్ట్రాంగ్‌గానే వుందేమో ! చివరకి కేసు కొట్టేయవచ్చు కానీ ప్రస్తుతానికి ఎంతోకొంత ఆధారం వుందనే అనిపిస్తోంది. కాంగ్రెస్ మాజీ సిఎంలు యిలాటి ఆరోపణలు ఎదుర్కొంటూండగా, ప్రస్తుత మంత్రులు జైలుకి వెళుతూండగా వాళ్లు అవినీతి గురించి మాట్లాడితే చెల్లుబాటు అవుతుందా? పార్టీలు సరే, కోర్టులు చూడండి. జడ్జిలకు కూడా కళంకం అంటుతోంది. పట్టాభిరామారావు, చలపతిరావు పేర్లు పాతబడ్డాయి, యివాళ బిపి ఆచార్య బెయిలు కేసులో నాగమారుతీశర్మ పేరు కూడా బయటకు వచ్చింది. సమాజంలో యింత కుళ్లు బయటకు వస్తూ వుంటే సామాన్య పౌరుడు స్పందన కోల్పోయి దానికి డీసెన్సిటివైజ్ అయిపోతాడు. అందుకే నీతులు వల్లించే లోకసత్తాకు 2009లో కంటె తక్కువ ఓట్లు వచ్చాయి. 2014కల్లా నిర్ణయాత్మకమైన పాత్రను పోషించే దిశగా వెళుతున్నాం అని 2009లో తెగ చెప్పుకున్నారు. అది రెండేళ్లలో రాబోతోంది మరి!

తమ ఓటమికి ఏం జవాబు చెప్పుకోవాలో కిరణ్‌కు తెలియక నోరు విప్పటం లేదు. పరకాలలో టిడిపి నుండి వచ్చినతనికి టిక్కెట్టు యిప్పిస్తే 5 వ స్థానం వచ్చింది కదా, మీతో చెప్పి యిప్పించిన మంత్రులు ఏమంటున్నారిప్పుడు అని పరకాల కాంగ్రెసు నాయకులు నిలదీస్తే, 'నాదేం లేదు, ఆజాద్ నిర్ణయం తీసుకున్నాడు' అని కిరణ్ చెప్పారట. అన్నీ ఆజాద్, వాయలార్ రవి చేసేస్తే యిక స్థానిక నాయకులు ఎందుకు? అసలు ఢిల్లీ వాళ్లకు మన రాష్ట్రం గురించి అవగాహన వుందా లేదాన్న అనుమానం వస్తోంది. తెలంగాణకు అన్యాయం జరిగిందని యింత ప్రచారం జరుగుతూంటే ముఖ్యమంత్రి, పిసిసి అధ్యక్షుడు పోస్టుల్లో ఒక్కటైనా తెలంగాణకు యివ్వాలన్న పాత సంప్రదాయాన్ని కూడా పక్కన పెట్టేసిన ప్రబలమైన కారణం ఎవరైనా వివరించగలరా? కిరణ్ గాని, బొత్స గాని చేసి చూపించింది ఏముంది? ఆ పోస్టులకు కనీసం ఆ స్థాయి వ్యక్తులు కూడా తెలంగాణవారిలో దొరకలేదా!?

ఎన్నికల సమయంలో చాలా ప్రగల్భాలు పలికిన బొత్స ఓటమికి సంజాయిషీలు చెప్పసాగారు. ఆయన చెప్పిన కారణాలు చూస్తే ప్రభుత్వ వైఫల్యం వల్లనే యిలా జరిగిందన్న ధ్వని వినబడుతోంది. కిరణ్‌ను మార్చే సమయం ఆసన్నమైందని ఆయన భావన. తనని మార్చే సమయం వచ్చిందని గ్రహించటం లేదు. మీరు సవ్యంగా ప్లాను చేసి సిబిఐను నిలవరించి వుంటే యింత సానుభూతి కురిసేది కాదు, యిదంతా మీ వల్లనే జరిగింది అని టిడిపి ఆరోపిస్తూ వుంటే కాంగ్రెసుకు ఏమనాలో తోచక 'సిబిఐ మా చేతిలో వుంటే ఎన్నికల సమయంలో అరెస్టు చేయనిస్తామా? సానుభూతి కలుగుతుందని మాకు మాత్రం తెలియదా?' అని ఎదురు తిరిగి వాదిస్తున్నారు.

అదే తెలిసి వుంటే ఎన్నికలకు ముందు 'యిప్పుడు అరెస్టు చేయడం దురదృష్టకరం, అతని ప్రజాస్వామ్యహక్కులు హరించడమే' వంటి స్టేటుమెంట్లు ఎవరైనా యిచ్చారా? జైలుకి వెళ్లడమనేది అదనుగా తీసుకుని విజయమ్మ జగన్‌ను సరిగ్గా పెంచలేదని తీర్మానాలు చేశారు. సుద్దులు నుడివారు. లగడపాటి లాటి వారు మరీ రెచ్చిపోయారు. అసలు జగన్ రాంగోపాల్ వర్మను బెదిరించాడని, అతనిది నేరప్రవృత్తి అనీ తెగ మాట్లాడారు. అది వాస్తవమే కావచ్చు, కానీ చెప్పాల్సిన తరుణం అది కాదన్న యింగితం కూడా లేకపోయింది.

అంతెందుకు ఎన్నికలకు ముందు రోజు జెడ్ కాటగిరీలో వున్న జగన్‌ను సాధారణ వ్యాన్‌లో ఎక్కిస్తే వీళ్లు ఖండించారా? దాన్ని జగన్ పొలిటిసైజ్ చేసుకుని బోల్డంత లాభం పొందుతూంటే వీళ్లు తెలివితక్కువగా 'ఏం యీయన దిగి వచ్చాడా? పెద్ద పెద్ద ఐయేయస్‌లనే ఆ వ్యాన్ ఎక్కించారు' అన్నారు. ఇప్పుడు 'సిబిఐవాళ్లు డొక్కు వ్యాన్ ఎక్కించి, మా ఓట్ల మీద దెబ్బ కొట్టారు' అని నన్నపనేని దగ్గర్నుండి గోల చేస్తున్నారు. ఎలక్షన్‌లో ఓట్లు పడకపోయేసరికి అది హఠాత్తుగా డొక్కు వ్యాన్ అయిపోయింది. చంద్రబాబుగారు ఓ యింటర్వ్యూలో ఆ వ్యాన్ వలన కూడా మాకు ఓట్లు పోయాయి అని చెప్పేసుకుంటున్నారు.

వీళ్లు గుర్తించనిది ఏమిటంటే ఓటర్లు ఎప్పుడో జగన్ పక్షాన ఫిక్సయ్యారు. అరెస్టు వలన సానుభూతి పెరుగుతుందా? అనే వ్యాసంలో నేను రాశాను – భౌతికంగా అరెస్టు కావడానికి ముందే మానసికంగా ప్రజలు ఎప్పుడో సిద్ధపడ్డారని. కాంగ్రెసు అతన్ని అరెస్టు చేయకమానదని సాధారణ పౌరుడికి కూడా తెలుసు. అయితే ఎన్నికల టైములో అరెస్టు చేయడం వలన ఓ 2 సీట్లు పెరిగి వుంటాయని నా అంచనా. 13 సీట్లు జగన్‌కు కట్టబెట్టడానికి జనం సిద్ధపడ్డారని గట్టిగా అనుకుంటే అలా ఎందుకు సిద్ధపడ్డారో తెలుసుకోవడానికి ప్రయత్నం చేస్తే మంచిది తప్ప సిబిఐకు శాపనార్థాలు పెట్టి ప్రయోజనం లేదు. **(సమాప్తం) – ఎమ్బీయస్ ప్రసాద్ (జూన్ 2012)**

**జూన్ 23**

## ఎమ్బీయస్‌: ఇది వైకాపా సెల్ఫ్ గోల్ !

ఉపయెన్నికల సమయంలో జగన్నామస్మరణ చేసి, చేసి సెల్ఫ్ గోల్ చేశామని కాంగ్రెస్, టిడిపి, మీడియా గొల్లుమంటున్న

సమయంలో ఫోన్ల వ్యవహారాన్ని అతిగా చూపించబోయి, వైకాపా సెల్ఫ్ గోల్ చేసుకుని వాళ్లకు మళ్లీ ఉత్సాహాన్ని తెచ్చిపెట్టింది. దొరికినది చారెడు బియ్యమైతే, దాన్ని కుంచెడు అతిశయోక్తుల ఎసరులో ఉడికించి, జగన్ ప్రాణహాని తాలింపు పెట్టి జనాలకు వడ్డించింది. అది వెగటు పుట్టిందనేసరికి యిప్పుడు ఆత్మరక్షణలో పడింది. వెనకడుగులు వేస్తోంది.

'నో మోర్ ఏ హీరో' రాసి మొన్ననే పంపించాక, నిన్న యిలాటి న్యూస్ బయటకు రావడం కాకతాళీయం. సిబిఐ మీడియాకు లీకులు యిస్తోందని అందరికీ తెలిసిన విషయమే. తక్కిన ఏ కేసులోనూ సిబిఐ యింత వింతగా ప్రవర్తించలేదు. ప్రవర్తించదు. వైయస్‌కు, జగన్‌కు సంబంధించిన కేసుల్లో మాత్రం అన్నీ ముందుగానే మీడియాకు ఉప్పందుతున్నాయి. విచారణ తర్వాత అన్నీ కళ్లతో చూసినట్టు రిపోర్టులు వచ్చేస్తున్నాయి. ఈనాడు, జ్యోతిలలో పొద్దున్న ఓ వార్త వస్తుంది. మధ్యాహ్నానికి టిడిపి ప్రెస్ మీట్ పెట్టి అవే విషయాలు చెపుతుంది, ఇంకో నాలుగు రోజుల్లో సిబిఐ వాటినే కేసులుగా మలిచి ఆ వాదనలనే సిబిఐ కోర్టులో వినిపించడం కూడా గమనించాం. కాంగ్రెస్‌వారు సిబిఐ శభాష్‌గా పనిచేస్తోంది, జగన్ జైలుకెళ్లడం ఖాయం అని స్టేటుమెంట్లు యిస్తారు. ఈ గొలుసుకట్టు చూస్తే వీరంతా కలిసికట్టుగా చేస్తున్నారని అనిపిస్తుంది. సిబిఐలో ఎవరో ఉన్నతాధికారి మీడియాతో కలిసి వ్యవహరిస్తున్నారని స్పష్టంగా తెలుస్తోంది.

ఇలాటి పరిస్థితుల్లో జగన్‌పై లక్షకోట్లు, రెండు లక్షల కోట్లు.. అంటూ ఆరోపణలు చేస్తే ఎవరూ పట్టించుకోకుండా ఓట్లేశారు. ఇలా ప్రచారం పొరబాటయిందని వాళ్లందరూ నాలిక కరుచుకుంటూ వుండగా వైకాపా చేతికి లక్ష్మీనారాయణగారి ఫోన్‌కాల్స్ లిస్టు వచ్చింది. మీడియాకు, ఆయనకు లింకు వుందనీ, మీడియా లీకులు యిస్తున్నది ఆయనేననీ ఆరోపించడానికి ఆ ఆధారాన్ని వుపయోగించుకుంటే సరిపోయేది. ప్రెస్‌కి ఏదైనా చెప్పాలంటే ప్రెస్ మీట్ పెట్టి అందరికీ చెప్పాలి కానీ, యిలా విడివిడిగా సమాచారం యివ్వడమేమిటి అని అభ్యంతర పెట్టవచ్చు. కానీ జగన్ వ్యతిరేకుల్లాగానే జగన్ అనుయాయులు కూడా 'ఓవర్‌కిల్' ప్లాను చేసి బోల్తా పడ్డారు. లక్ష్మీనారాయణ సెల్‌నుండి వెళ్లిన/వచ్చిన కాల్స్ సంఖ్య అంటూ ఓ లిస్టు యిచ్చారు. పీరియడ్ పేర్కొనలేదు. ఎన్ని వచ్చాయో, ఎన్ని చేశారో చెప్పలేదు. మీడియాలో కొన్ని పేపర్ల నెంబర్లు మాత్రం యిచ్చి వీళ్లంతా ఎల్లో మీడియా అనేశారు. వాటిల్లో ఇండియన్ ఎక్స్‌ప్రెస్, టైమ్స్ ఆఫ్ ఇండియా కూడా వున్నాయి. దీనిమీద నిలదీస్తే టీవీ చర్చల్లో వైకాపాకు చెందిన శ్రీకాంతరెడ్డి 'ఎల్లో మీడియా అంటే మా దృష్టిలో ఈనాడు, జ్యోతి, టివి9' అన్నారు. మరి ప్రెస్‌నోట్‌లో అలా వుందేం? అని అడిగితే సమాధానం లేదు.

ఇంకో విషయం ఏమిటంటే – వీళ్లు సంస్థల పేర్లు రాసి వూరుకోకుండా ఆ యా జర్నలిస్టుల పేర్లు, ఫోన్ నెంబర్లతో సహా యిచ్చేశారు. అది చాలా అనైతికం, బాధ్యతారాహిత్యం. ఎందుకంటే వీళ్లంతా కలిసి 'మహా'కుట్ర చేశారు (అదేమిటో "సాక్షి"కి అన్నీ మహాయే ! వైయస్ పేరు రాసినప్పుడల్లా ముందు మహానేత అని తగిలిస్తారు. ఇది కూడా మహా కుట్రే తప్ప మామూలు కుట్ర కాదుట) అని జగన్ వీరాభిమానులు ఫోన్ కొట్టి తిట్టే ప్రమాదం వుంది. నా బోటివాడికే హేట్ మెయిల్స్ వస్తూన్నపుడు మరి ప్రముఖ పత్రికల, ఛానెళ్ల జర్నలిస్టులకు బెదిరింపులు రావడంలో ఆశ్చర్యం ఏముంది? తిట్టేవాళ్లందరినీ వైకాపా అదుపు చేయగలదా?

ఎప్పుడైతే జర్నలిస్టుల పేర్లు బయటకు వచ్చాయో, అప్పుడు కౌంటర్ ఎటాక్ ప్రారంభమైంది. జర్నలిస్టులు తమ వృత్తిధర్మంగా చేసే ఫోన్‌కాల్స్ గురించి వైకాపా యాగీ చేస్తోందని మలుపు తిప్పారు. జ్యోతి వైకాపాదే 'మహాకుట్ర' అనేసింది. జర్నలిస్టులు నిరసన తెలిపారు. ఇక అక్కణ్నుంచి వైకాపావారు డిఫెన్సులో పడ్డారు. అబ్బెబ్బే, లక్ష్మీనారాయణ ఇన్‌కమింగ్ కాల్స్ గురించి మాకు పేచీ లేదు, ఔట్‌గోయింగ్ గురించే అని మొదలెట్టారు. అలాటప్పుడు ఇన్‌కమింగ్ కాల్స్ లిస్టు ఎందుకు రిలీజ్ చేసినట్టు? ఇదే ఓవరాక్షన్! ఇక ఎన్ని కాల్స్ చేస్తే నార్మల్, ఎన్ని చేస్తే ఎబ్‌నార్మల్ అన్నది చూడాలి. వైకాపా రిలీజ్ చేసిన లిస్టులో కాల్స్ సంఖ్య వందల్లో చూపించారు. ఎన్ని రోజుల్లో అన్ని వందలు అయ్యాయో చెప్పకుండా అతితెలివి ప్రదర్శించారు. ఎంతైనా సిబిఐ జెడి హోదాలో వున్న వ్యక్తికి అన్ని వందల కాల్స్ వచ్చాయన్నా, వెళ్లాయన్నా వింతే! ఇక పరిశోధన చేయడానికి ఆయనకు టైము ఎక్కడ దొరుకుతుందో మరి!

మధ్యలో చంద్రబాల అనే ఆవిడ పేరు లాక్కుని వచ్చారు. ఆవిడను ఓ మిస్టీరియస్‌గా ఉమన్‌గా చిత్రీకరించడానికి ప్రయత్నించారు. సాక్షి టీవీలో 'చంద్రబాల లైన్లో వుంది' అంటూ ఆవిడను అగౌరవపరిచేలా సెల్ఫ్–యాడ్ రూపొందించారు. సాక్షి వారు ఆవిణ్ని ఫోన్ చేసి నిజానిజాలు నిర్ధారించుకునే ప్రయత్నం చేసినట్టు చెప్పుకోలేదు. శుక్రవారం ఆవిడే ఎబియన్ ఆంధ్రజ్యోతి స్టూడియోకు వచ్చి తన కథ వినిపించారు. 'లీడ్ ఇండియా సంస్థ తరఫున మీతో 2 సార్లు మాట్లాడితే 10 సార్లు అని వేశారు' అని ఆవిడ రాధాకృష్ణతో అన్నారు. ఈ లెక్కన జెడి గారి ఫోన్‌కాల్స్ సంఖ్యను కూడా 5 చేత భాగించాలా? అన్న అనుమానం వచ్చింది. సిబిఐ విశ్వసనీయత మాట ఎలా వున్నా వైకాపా విశ్వసనీయతకే దెబ్బ తగిలింది యిప్పుడు.

తను సంపాదించిన సమాచారాన్ని ఇలా నానా కంగాళీ చేయడంతో బాటు దాన్ని జగన్‌పై హత్యాయత్నానికి ముడి పెట్టబోయింది వైకాపా. ఆ దిక్కుమాలిన వ్యాన్ గొడవ ఎన్నాళ్లకు వదులుతారో కానీ, దాన్లోనూ కుట్ర కనబడింది వీళ్లకు. చంచల్‌గుడా జైల్లో మొన్న రాత్రంతా కరంటు పోయిందట. అది కూడా జగన్‌ను చంపడానికే అని వీళ్లకు అనుమానంట. ఇక యిలా ప్రతీదానిలో నుండి రాజకీయప్రయోజనం పిండుకుందామని చూస్తూ వుంటే రేపు జగన్‌కి పెట్టిన అన్నం దగ్గర్నుంచి వివాదాస్పదం చేస్తారు వీళ్లు. ఛ, ఛ అంటే ఏం అప్పట్లో నాగర్‌వాలాను ఇందిరా గాంధీ జైల్లో చంపించలేదా? ఇవాళ ఆదర్శ్ స్కాం ఫైళ్లను మహారాష్ట్ర సెక్రెటేరియట్‌లో అగ్ని ప్రమాదం పేర కాల్చివేయలేదా? అని ప్రశ్నిస్తారు. నిజమే, రాజకీయాల్లో ఏదైనా సాధ్యమే కానీ మరీ అతిగా వెళ్లకూడదు. జనం ఏం చెప్పినా నమ్ముతారు అనుకునే జగన్ ప్రత్యర్థులు బోర్లా పడ్డారు. ఇప్పుడు వైకాపా వంతు అయింది. సిబిఐ జెడి ప్రెస్‌తో తరచుగా

మాట్లాడడం సబబా? కాదా? అన్న ఒక్క విషయం మీద ఫోకస్ చేస్తే చాలు. ఇన్ని ఒకేసారి కలగాపులగం చేయడంతో విషయం పలుచన అయిపోయింది. దాని ప్రభావం నీరుకారిపోయింది. కోలా కథ కూడా యింతే కాబోసు అనుకునేట్లా తయారైంది. – **ఎమ్బీయస్ ప్రసాద్ (జూన్ 2012)**

## జూన్ 23 ఎమ్బీయస్: అదంత వీజీయా, టీజీ ?

ఇల్లు కాలి ఒకడు ఏడుస్తూంటే, చూరులో దాచిన చుట్ట కాలిందని మరొకడు ఏడిచాడట. ఉపయెన్నికలలో పరాజయం గురించి కాంగ్రెస్ పార్టీ హై కమాండ్ నుండి చిరంజీవి దాకా అందరూ ఊహూ ఫీలైపోతూ వుంటే సందట్లో సడేమియాలా టీజీ వెంకటేష్ రాయలసీమ గురించి మొదలుపెట్టారు. ఎలాగైనా న్యూస్‌లో వుండాలని తెగ తాపత్రయం ఆయనకు. సాధారణంగా ఆయన, లగడపాటి ఏదైనా మాట్లాడితే తెలంగాణ ఉద్యమకారులు విరుచుకుపడతారు. పడాలనే వాళ్లు మాట్లాడతారు. లేకపోతే ఓ సాధారణ ఎమ్మెల్యేకి యింత కవరేజి ఎలా వస్తుంది? (మంత్రి అయినది యీ మధ్యేగా) అలాటిది ఆయన మొన్న యిచ్చిన స్టేటుమెంటును వీళ్లంతా స్వాగతించారు. ఎందుకంటే ఆయన 'విభజన తుది అంకానికి వచ్చేసింది' అని డిక్లేర్ చేసేశాడు కాబట్టి. దీనికి గాను ఆయన యిచ్చిన లాజిక్ మాత్రం మహా వింతగా వుంది.

వైకాపాకు ఓట్లేసి ఆంధ్రప్రాంతం ప్రజలు సమైక్యవాదాన్ని దెబ్బ తీశారట. అదెలాగో ఆయనకి తప్ప వేరెవరికీ తెలియదు. ఎన్నికలలో సమైక్యవాదం అంశం కానే కాదు. ఏ పార్టీ మ్యానిఫెస్టోలోను, ప్రచారంలోను దాని గురించి ప్రస్తావనే లేదు. తెలంగాణలో మాత్రమే విభజన అనేది అంశంగా మారి యిక్కడి రాజకీయాలను ప్రభావితం చేస్తోంది. కోస్తా, సీమలలో దీని గురించి ఆలోచించడం దండగ అనుకుంటున్నారు. రాష్ట్రం విడిపోదనీ, విడిపోయే పరిస్థితి వస్తే తమ ప్రాంతాలకు అన్యాయం జరగకుండా ఏదో ఒక ఫార్ములా వర్కవుట్ చేస్తారనీ ఒక రకమైన ధైర్యంతో వున్నట్టు కనబడుతోంది. పనిమాలా దాని గురించి చర్చించే బదులు, ఎవరి పని వాళ్లు చూసుకుంటున్నారు. మీడియా కూడా అది గ్రహించి తెలంగాణ గురించి –ఎన్నికల వేళ తప్ప– రాయడం మానేసింది. నాయకులు కూడా దాని గురించి మాట్లాడడం మానేశారు. ప్రధానపక్షాలైన కాంగ్రెస్, టిడిపి, వైకాపాలు మూడూ గోడమీద పిల్లుల్లాగానే వున్నాయి. టికాంగ్రెస్ నాయకులు, టిటిడిపి నాయకులు అప్పుడప్పుడు కాస్త మాట్లాడడం తప్ప ఉద్యమాలు, పాదయాత్రలు చేయడం లేదు.

ఇలాటి పరిస్థితుల్లో తమ ప్రాంతాల్లో సమైక్యం గురించి జనాలు ఊహూ సెంటిమెంటల్‌గా వున్నారని పొరబడి జగన్‌కు ఓట్లేస్తే రాష్ట్రం విడిపోతుంది అంటూ బూచి చూపించబోయారు – లగడపాటి, టిజి వెంకటేష్. జగన్‌కు వ్యతిరేకంగా రెచ్చగొడితే అలాగైనా తమకు ఓట్లు పడతాయనుకున్నారు. ఓటర్లు దాన్ని ఒక అంశంగా చూడలేదు అని ఫలితాల తర్వాతైనా ఒప్పుకుని వుంటే బాగుండేది. కానీ కాంగ్రెస్ ఓటమిని తమకు అనుకూలంగా మార్చుకుందామని చూస్తున్నారు టిజి. ఎందుకంటే ఆయనది ప్రత్యేక రాయలసీమ నినాదం. దాన్ని రాయలసీమలోనే పట్టించుకోవడం లేదు. కెసియార్‌లాగ దాన్ని పెద్ద ఉద్యమంగా మార్చే ఓపిక, తీరిక టిజికి లేవు. అందువలన ఏడ్చేదానికి మొగుడొస్తే నాకూ వస్తాడన్నట్లు, తెలంగాణ విడిపోతే పనిలో పనిగా మాకూ రాయలసీమ యిచ్చేయండి అందామని ఆయన తాపత్రయం. సమైక్యరాష్ట్రంలో ఆయన పెద్ద లీడరుగా ఎదగలేదు, ..లేడు. రాయలసీమ విడిపోతే అప్పుడైనా ముఖ్యమైన పదవి వస్తుందేమోనని ఆశ.

దానికోసం ఆయన రెండు పాయింట్లు చూపించదలచుకున్నాడు. ఆంధ్రప్రాంతంలో వైకాపా గెలుపు, తెలంగాణలో తెరాస గెలుపు. రెండూ విభజనవాద పక్షాలే అని ఆయన ఉద్దేశం. తెరాస విషయంలో తభావతు లేదు కానీ వైకాపా విభజన కోరుతోందో లేదో యిప్పటికీ చెప్పటం లేదు. పరకాలలో సభలో కూడా విజయమ్మ కేంద్రం ఏం చెపితే అదే అంటున్నారు తప్ప, మా ఉద్దేశం యిది అని చెప్పలేదు. అలాటప్పుడు వాళ్లని సమైక్యవాదులనో, విభజనవాదులనో ఎలా చెప్తాం? అవకాశవాదులు అని వూరుకుంటే చాలు. నిజానికి పరకాల ఉపయెన్నిక తర్వాత తెలంగాణవాదులైన మేధావులు చాలామంది జగన్ విభజనవాదానికి జై అనాలని కోరుకుంటున్నారిప్పుడు. పరకాలలో తెరాస, బిజెపి పోటాపోటీగా వుంటాయని మొదటినుండీ అనుకుంటూ వచ్చారు. గతంలో ఎన్నికైన సురేఖ ఏ మూడో స్థానంలో వుంటుందని అనుకున్నారు. అలాటిది ఆమె యించుమించు గెలిచినంత పని చేయడంతో వీళ్లు ఉలిక్కిపడ్డారు.

సురేఖను 40 వేల మెజారిటీతో ఓడిస్తామని తెరాస చెప్పుకుంది. చివరకు 1500 ఓట్లతో ఓడించింది. ఇప్పుడు 'సురేఖ మామూలు వ్యక్తి కాదు, నియోజకవర్గంలో పాతుకుపోయి వుంది. వాళ్లకు అంగబలం, అర్థబలం, రౌడీతనం అన్నీ వున్నాయి. అన్ని ఓట్లు రాకేం చేస్తాయ్?' అంటున్నారు. నిజానికి ఎన్నికల్లో బిజెపి చేసిన హంగామా చూసి వాళ్లే తమకు ప్రధాన ప్రత్యర్థి అనుకుని వాళ్లమీద దృష్టి పెట్టారు. పాలమూరు టైములో బిజెపి జాతీయనాయకులు పట్టించుకోలేదు. కానీ అది గెలవడంతో పరకాలపై ఆశ పుట్టింది. ఇదీ గెలిస్తే తెలంగాణలో మనం దున్నేయవచ్చనుకున్నారు. బోల్డుమంది వచ్చిపడ్డారు. కార్యకర్తలందరూ తక్కిన నియోజకవర్గాలను వదిలేసి దీనిమీదే దృష్టి పెట్టారు. కష్టపడ్డారు. ఇంత చేస్తే దక్కినది నాలుగో స్థానమా? అంటే అదే బిజెపి బలం అనుకోకూడదు. పోనుపోను వాళ్లు తెరాసను ఓడించలేమని గుర్తించాక తమ ఓట్లను సురేఖ వైపు మళ్లించారని సులభంగా ఊహించవచ్చు. తెలంగాణవాదం

నెత్తికెత్తుకున్న దాయాదులు తెరాస, బిజెపి. ఇద్దరూ పోట్లాడుకుని సురేఖకు రావలసినదాని కంటె ఎక్కువ ఓట్లు యిచ్చారు. అదే విధంగా వైకాపాను నెగ్గనిస్తే తమకు పరువు పోతుందనుకున్న కాంగ్రెస్‌వారు తెరాస వారికి తమ ఓటు బ్యాంకును మళ్లించారు.

ఈ క్రమంలో సురేఖ ఓట్లు పెరగడంతో అదంతా జగన్ బలమే అనుకుంటున్న ఉద్యమకారులు జగన్ తెలంగాణవాదాన్ని అందిపుచ్చుకుంటే డెడ్లీ కాంబినేషన్ అవుతుందని ఆశపడుతున్నారు. రెడ్డి ఫ్యాక్టరు కూడా దీనికి జోడిస్తే యిక చెప్పనే అక్కర్లేదని ఊహ. తెరాస వెలమల చేతిలో వుంది కాబట్టి ప్రత్యర్థులైన తెలంగాణ రెడ్లు వైకాపా వైపు మోహరిస్తే, వైకాపా తెలంగాణవాదానికి జై అంటే యిక ఎదురు వుండదని అంచనా. ఇక అప్పుడు బిజెపికి తావే వుండదు. అంతా బాగానే వుంది కానీ రాష్ట్రం మొత్తాన్ని ఏలదామనుకుంటున్న జగన్ కేవలం తెలంగాణతో సరిపుచ్చుకుంటారా? విభజన వాదానికి జై అంటే యిక్కడ ఓట్లు పడతాయి కానీ అక్కడ దెబ్బ తింటాడు కదా. ఏదీ తేల్చకుండా వుంటూనే మంచిదనుకోవచ్చు. పరకాలలో వైకాపాకు పడినన్ని ఓట్లు తక్కిన నియోజకవర్గాల్లో పడతాయన్న గ్యారంటీ ఏది? సురేఖ గట్టి కాండిడేట్, పైగా బిజెపి లోపాయికారీ సహాయం తోడైంది. అన్ని చోట్లా యిలాటి పరిస్థితే ఎందుకు వుంటుంది?

అయినా యివన్నీ సంక్లిష్టమైన విషయాలు. వీటి సమాధానాలు సింపుల్‌గా వుండవు. అనేక అంశాలు లెక్కలోకి తీసుకుని ప్రతీదానికి వెయిటేజి యిచ్చుకుంటూ రావాలి. మనవాళ్లకు అంత ఓపిక వుండదు. గబగబా తీర్మానించేస్తారు. ఉపయెన్నికల ఫలితాల్లో రామచంద్రపురం, నర్సాపురం ఫలితాలు చూసి కాంగ్రెసులో నుండి రెడ్లు వెళ్లిపోయారు కానీ కాపులు కాపు కాశారు అని రాసేశారు. మరి పోలవరంలో కాపులు వైకాపాకు ఓట్లు వేశారంటున్నారు. దానికేమంటారు? రాయలసీమలో అంతంత మెజారిటీలు వచ్చాయంటే కాపులు వైకాపాకు వేయకుండానే వున్నారా? వాన్‌పిక్ ప్రాజెక్టులో అవినీతి గురించి మంత్రి ఏరువాకలతో సహా అన్నీ చేసినా జనాలు దాన్ని పట్టించుకోలేదు. అక్కడ వైకాపా నెగ్గింది. రామచంద్రపురం, నర్సాపురంలో నెగ్గడానికి కారణం మా పార్టీ వాళ్లు అంటారు చిరంజీవి. కానీ వాళ్లు అంతకుముందు టిడిపివాళ్లు కదా. టిడిపినుండి ఓట్లు గుంజుకునే కదా వాళ్లు నెగ్గినది! కాంగ్రెస్–టిడిపిల మధ్య ఒప్పందం రాష్ట్రవ్యాప్తంగా ఉన్నట్లు తోచదు. స్థానికంగా ఎక్కడికక్కడ మేనేజ్ చేసినట్టున్నారు. కొన్ని చోట్ల ఓట్ల బదిలీ జరిగింది కానీ కొన్ని చోట్ల జరగలేదు. ఇలా ప్రతీ నియోజకవర్గాన్నీ లెక్కలోకి తీసుకుని స్టడీ చేయాలి.

ఇవేమీ చేయకుండా పరకాలలో తెరాస నెగ్గింది కాబట్టి తెలంగాణ యిచ్చి తీరాలని కొందరూ, ఉద్యమానికి కంచుకోట లాటి వరంగల్‌లోనే అంత తక్కువ మెజారిటీతో నెగ్గింది కాబట్టి వాదం వీగిపోయిందని తేలిందనీ, అందువలన యివ్వనక్కరలేదనీ కొందరు వాదిస్తున్నారు. పరకాల ఫలితం చూసి వాయలార్ రవి  తెలంగాణ వాదం ఎక్కడుంది స్వామీ, జనాలు తెలంగాణ కంటె జగన్నే ఎక్కువ కోరుకుంటున్నట్టు వుందే! అనేశారు. 2004లో పరకాలలో తెరాస గెలిచింది. 2009లో సురేఖ చేతిలో యిదే భిక్షపతి 12,800 ఓట్ల తేడాతో ఓడిపోయారు. డిసెంబరు 9 తర్వాత ఇప్పుడు తెరాస పరకాలను ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంది. మండలానికి నలుగురేసి ఎమ్మెల్యేలను  యిన్‌చార్జిలుగా పెట్టారు, దిగ్గజాలైన హరీశ్ రావు, రాజేందర్ నిరంతరం అక్కడే వుండి పని చేశారు. నాగం సాయపడ్డారు, సిపిఐ సహాయం తీసుకున్నారు. జాక్ మెదలు వంచి సాయం తీసుకున్నారు. ఇన్ని చేశాం కాబట్టి కనీసం 25 వేలు మెజారిటీ వస్తుందని అనుకుంటే చివరకు 1500లో తేలారు. అది కూడా కాంగ్రెస్‌వాళ్లు ఓట్లు బదిలీ చేస్తే...! ఆఖరి నిమిషంలో పార్టీ మారిన సమ్మారావుకి సీటు యిచ్చినందుకు గండ్రవర్గం ఎదురు తిరిగి తెరాసకు ఓట్లేశారని అందరూ అనుకుంటున్నదే!

డిసెంబరు 9 ప్రకటన తర్వాత తెలంగాణలో జరిగిన ఉపయెన్నికలలో యింత దారుణమైన ఫలితాలు తెరాస చవి చూడలేదు. ఇటువంటి పరిస్థితిలో 'ఇక తెలంగాణ యిచ్చేయక తప్పని పరిస్థితి వచ్చేసింది. తెలంగాణ నాయకులకు నచ్చచెప్పడం హై కమాండ్‌కు కొంత యిబ్బందే. విభజన తుది అంకానికి వచ్చేసింది' అని టీజీ చెప్పడం ఎంత హాస్యాస్పదం ! అందరికంటె వెనక్కాల ఐదు వేల ఓట్లతో ఐదో స్థానం వస్తే కాంగ్రెసు తెలంగాణ యిస్తుందని ఎలా అనుకుంటారు? కోస్తాలో రెండు సీట్లయినా గెల్చుకున్నారు. ఇక్కడ తెలంగాణ యిచ్చి అక్కడ అది కూడా క్షవరం చేసుకుంటారా? ఇక్కడ క్షవరం ఎలాగూ తప్పదు. తెలంగాణ వస్తే ఆ క్రెడిట్‌ను పంచుకోవడానికి కెసియార్ ఏ మాత్రం సిద్ధంగా లేరని బిజెపివాళ్ల అనుభవం నుండి అందరూ తెలుసుకోవచ్చు. తెరాస కాంగ్రెస్‌లో కలిస్తే తప్ప కాంగ్రెస్ తెలంగాణ గురించి ఆలోచించదు అని ఖచ్చితంగా చెప్పవచ్చు. 'కెసియార్ కాంగ్రెస్‌లో విలీనానికి ఓకే అని సంకేతాలు యిచ్చారు' అంటారు టీజీ. ఎక్కడిచ్చారో ఏమో మనకు తెలియదు.

విలీనం తర్వాత పీఆర్పీ గతి చూశాక కెసియార్ తన పార్టీని విలీనం చేస్తారా? ప్రస్తుత ఫలితాల తర్వాత చిరంజీవికి కేంద్రమంత్రి పదవి యిస్తారని ఎవరూ అనుకోవడం లేదు. రేపు తెరాస విలీనం అయిన తర్వాత, తెలంగాణలో వైకాపా కొన్ని సీట్లు గెలిస్తే కెసియార్ గతీ అంతే అవుతుంది. మొన్న ఓ తెరాస నాయకుడు టీవీలో మాట్లాడుతూ సకల జనుల సమ్మె కాలం నుండి కెసియార్ ఢిల్లీవారితో నిరంతరం 'టచ్'లో వున్నారని వెల్లడించారు. వాళ్ల కోరికమీదనే సమ్మె చల్లార్చారని కూడా చెప్పారు. ఇంకో మూడు నెలల్లో తెలంగాణ వస్తోందని కెసియార్ అంటున్నారంటే ఆయనకేదో సంకేతం వచ్చి వుంటుందని ఆశాభావం వెలిబుచ్చారు. ఏం మూడు నెలలో ఏమో ! ఉపయెన్నికకు ముందు కెసియార్ 'మూడు నెలల్లో తెలంగాణ వస్తుంద'న్నారు. ఎన్నిక అయిపోయాక 'మూడు నెలల్లో రాకపోతే ఉద్యమం ఉధృతం చేస్తామ'న్నారు. ఈ ఉధృతం మాట సంక్రాంతినుండి వింటూనే వున్నాం. విద్యార్థుల పరీక్షలు అయిన తర్వాత అన్నారు, ఉగాది అన్నారు, మరోటన్నారు. ఏమీ కావటం లేదు. ఇలాగే 2014 దాకా కెసియార్ దేకిస్తారని అందరికీ అర్థమై పోయింది.

కానీ టీజీకి మాత్రమే అర్థం కావటం లేదు పాపం. ఇప్పటికిప్పుడు విభజన జరిగిపోతుందని, అలా జరిగితే రాయలసీమ నష్టపోతుందని ఆయన మహా ఆందోళన పడిపోతున్నారు. 'తెలంగాణా యిచ్చేస్తారేమో. ఏం చేయబోయినా మాకు ముందే చెప్పాలని కోరాం. రాయలసీమ హక్కులను కాపాడుకునే అంశంపై ప్రజలతో మాట్లాడాలని హై కమాండ్‌కి చెప్పాం. డిసెంబరు 9 లా అర్ధరాత్రి ప్రకటనలు చేయవద్దని చెప్పాం. ఇప్పటికే రెండుసార్లు మోసపోయాం. కోస్తా వాళ్లతో వెళితే ఏమిస్తారు? తెలంగాణ వాళ్లతో వెళితే ఏమిస్తారు? అది మాకు చెప్పాలి. మా రాయలసీమ హక్కులపై వివరణ యివ్వాలి. రెండో రాజధాని ఏర్పాటు, కృష్ణా జలాల పంపిణీ వంటివి మా డిమాండ్లలో భాగంగా వుంటాయి.' అంటూ ప్రకటన చేశారు.

అసలు విభజన అంటూ జరిగితే ఎలా జరగాలి అన్నదానిపై కూడా ఎవరికి వారు ఏదేదో చెప్పేస్తున్నారు. మజ్లిస్ వారు రాయల తెలంగాణ అంటారు. రాయలసీమలోని కేవలం రెండు జిల్లాలు కలిపితే చాలని మరి కొందరు... అనంతపురం కర్ణాటకలో కలపాలని జెసి దివాకరరెడ్డి... గ్రేటర్ రాయలసీమ అంటూ నెల్లూరు, ఒంగోలు కూడా కలపాలని కొందరు. ఇవన్నీ నాయకుల పైత్యాలే. శ్రీకృష్ణ కమిటీ పర్యటించినపుడు అక్కడి ప్రజలు యివేమీ చెప్పలేదు. సమైక్యం, సమైక్యం అని ఐక్యగళంతో చెప్పారు. సమైక్యవాదం చచ్చుబడిపోయిందని టిజీ అనుకుంటే సరిపోదు. కాంగ్రెస్, టిడిపి, వైకాపా గోడమీద పిల్లులని మనం అనుకుంటాం కానీ తెలంగాణ ఉద్యమకారుల దృష్టిలో వాళ్లు సమైక్యవాదులే. మరి వారికి పరకాలలో మూడింట రెండు వంతుల ఓట్లు వచ్చాయే! సిపిఐ తెలంగాణలో తెరాసకు మద్దతిచ్చినా కోస్తా, సీమల్లో సమైక్యవాద టిడిపికి మద్దతిచ్చిందే ! ఇన్నాళ్లూ 'ఒక ఓటు, రెండు రాష్ట్రాలు' అనే కాకినాడ తీర్మానం గురించి చాటుకుంటూ వచ్చిన బిజెపి కూడా నాలిక మడతేసి 'అబ్బే అది మా స్థానిక తీర్మానమే తప్ప జాతీయస్థాయిలో అంగీకరించలేదు.' అని చెప్తోంది. ఎందుకంటే విభజనవాదాన్ని భుజాన వేసుకున్నా ఓట్లు రాలటం లేదని వాళ్లకు తెలిసివచ్చింది. పైగా వాళ్ల జాతీయ నాయకత్వం యిక్కడివాళ్లను అడుగుతుంది. 'పరకాలలో 4 వ స్థానం వచ్చింది. ఓట్లు నాలుగు అంకెలు దాటలేదు. తెలంగాణ యిస్తే తెరాసకే లాభం. మనం ఎందుకివ్వాలి?' అని ! వీళ్లేం సమాధానం చెప్తారు?

పరకాలలో తెలిసి వచ్చిన యింకో సంగతి – సమైక్యవాదులుగా ముద్ర పడిన టిడిపి పోరుగల్లులో కూడా బలంగానే వుంది. 30 వేలు ఓట్లంటే, 19.62% ఓట్లంటే తక్కువేమీ కాదు. స్థానిక అభ్యర్థి బలమైనవాడు అంటున్నారు. వైకాపాకు సానుభూతి ఓట్లలాగ తెలంగాణ సెంటిమెంటుకి ఏ 10% ఓట్లో తెరాసకు పడతాయి అనుకుని వాటిని పక్కకు పెట్టి చూస్తే అప్పుడు పార్టీల యథార్థ బలాబలాలు తేలతాయి. స్థానిక పరిస్థితులు, కాండిడేట్లు, వెన్నుపోట్లు, లోపాయికారీ మద్దతులు యివన్నీ లెక్కలోకి తీసుకుని అంచనాలు వేస్తూ పోతే తప్ప ఫలితాలు ఏకపక్షంగా వుండవని బాగా తెలిసివచ్చింది. ఇలాటి పరిస్థితిలో ఒక్క పరకాల ఉపయెన్నిక పట్టుకుని రాష్ట్రం విభజించేస్తారని టీజీ కలవరించడం వింతగా వుంది. కోస్తా, సీమల్లో జగన్ గెలుపుకి, సమైక్యవాదానికి ఎవ్వరూ ముడిపెట్టడం లేదు – ఆయనా, లగడపాటి తప్ప ! టిజికి ప్రత్యేక రాయలసీమ కావాలంటే తెరాసలా ఓ పార్టీ పెట్టుకుని ఫైట్ చేయాలి తప్ప అది ఉత్తుత్తినే వచ్చి ఒళ్లో పడదు. పార్టీ పెట్టినంత మాత్రాన రాయలసీమ వచ్చేస్తుందన్న గ్యారంటీ లేదు. పుష్కరం తర్వాత తెరాస పరిస్థితి ఎలా వుందో చూస్తున్నాంగా ! **(సమాప్తం) – ఎమ్బీయస్ ప్రసాద్ (జూన్ 2012)**

**జూన్ 25**

## ఎమ్బీయస్‌: మార్పంటూ వుంటే... ఎవరు మారాలి?

ఢిల్లీలో సోనియాగారు వరసపెట్టి విన్నపాలు వినేస్తున్నారట. పేరుకు నివేదికలు. ఎన్నికలలో మనం ఎందుకు ఓడిపోయామంటే...? అని తయారుచేసిన రిపోర్టులు. కానీ నిజానికి చేసుకునేవి అభ్యర్థనలు – వున్నవాళ్లని దింపేయండి, నన్ను ఎక్కించండి, నా సేవలు వినియోగించుకోండి అని. నాయకుడి పేరు చెప్పగానే వాళ్లు ఏ నివేదిక యిస్తారో మనం కళ్లు మూసుకుని చెప్పేయవచ్చు. వాళ్లందరిదీ ఒకటే దంపుళ్ల పాట. కాంగ్రెస్ ఓటమికి కారణం – అభ్యర్థుల ఎంపికలో లోపాలు, కలిసి పనిచేయకపోవడం, ప్రభుత్వ విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో వైఫల్యం, జగన్ అవినీతిపరుడని జనాలను ఒప్పించడంలో సఫలం కాలేకపోవడం.. యిలాగే చెప్తారు. ఇలా పాసివ్ వాయిస్‌లో చెప్పే బదులు, సూటిగా 'అభ్యర్థులను ఎంపిక చేసినది మీ ఢిల్లీ టీములోని ఫలానా ఫలానా. వారిది తప్పు'. కలిసి పనిచేయకపోవడానికి కారణం స్థానిక ఎన్నికలు వాయిదా వేయడం, నామినేటెడ్ పోస్టులు భర్తీ చేయకపోవడం ! దానికి కారణం మీరే! ప్రజలను కన్విన్స్ చేయకపోవడంలో వైఫల్యం మాలో ఫలానా నాయకుడి ప్రేలాపనలు, అవినీతి విషయంలో మేం చేసిన ఓవరాక్షన్.. ఇలా పేర్లు పెట్టి చెప్తారా? అబ్బే!

'తెలంగాణ సమస్యను నాన్చినది మీరే, వైయస్‌పై ఎటువంటి స్టాండ్ తీసుకోవాలో స్పష్టంగా చెప్పనిది మీరే ! ఎప్పుడు చూసినా మీ రాష్ట్రం చాలా ముఖ్యం అని మాకు చెప్తారు కానీ డిసెంబరు 9 తర్వాత రాష్ట్రంలో మీరు పర్యటించి క్యాడర్‌ను ఉత్సాహపరచరేం?' అని సోనియా ముఖం మీద చెప్పగలిగేవాళ్లు ఎవరైనా వుంటారా? అబ్బే ! స్ఫూర్తిదాయకమైన మీ నాయకత్వంలో, మీ అబ్బాయి నాయకత్వంలో మేం వైఫల్యం చెందాం అని లెంపలు వేసుకుని వస్తారు. టీము పనితీరు బాగా లేకపోతే టీములీడరుదే బాధ్యత కదా. ఇక్కడ మాత్రం అది వర్తించదు. ప్రతి చిన్న విషయం పైన నిర్ణయం తీసుకునేది ఢిల్లీవారు. అందర్నీ ఢిల్లీ రప్పించి, ఒప్పించి పంపుతారు. ఆ నిర్ణయం చీదేసిన తర్వాత వాళ్లేమీ మాట్లాడరు. నాలిక కరుచుకోరు. నివేదికలు యిమ్మంటారు. ఒకరిచ్చినదాన్ని పెట్టుకుని మరొకరిని తిడతారు. ఎందుకంటే ప్రతి రాష్ట్ర నాయకుడూ మరో రాష్ట్రనాయకుణ్ని తప్పుపడతాడు.

అందరూ ముక్తకంఠంతో చెప్పేదేమిటంటే – రాష్ట్రనాయకత్వంలో మార్పు రావాలి అని. అంటే కిరణ్, బొత్సలలో ఎవరో ఒకరిని, వీలైతే యిద్దర్నీ మార్చాలి అని. కిరణ్‌ను దింపేసి అతని స్థానంలో తెలంగాణ వ్యక్తిని సిఎం చేస్తారని, ఫలానాఫలానా వారికి ఛాన్సు వుందని జ్యోతి ఫ్రంట్ పేజీ కథనం కూడా వేసేసింది. తక్కినవారెటవరూ అలాటిది సూచనప్రాయంగా కూడా వేయలేదు. ముఖ్యమంత్రి కాబోయే వ్యక్తుల పేర్లలో జైపాల్ రెడ్డి పేరు ప్రముఖంగా యిచ్చారు. ఆయన ఎప్పణ్నుంచో వద్దు మొర్రో అంటున్నారు. కాంగ్రెసు బలంగా వున్నపుడే ఆయన ముందుకు రాలేదు. ఇప్పుడు బలహీనమై, కిందకు దొర్లిపోతున్నపుడు బాధ్యత వహించి గెలుపుబాట పట్టిస్తాను అని ఛాలెంజ్ చేసే లక్షణం కాదాయనది. ఇక డి శ్రీనివాస్ వగైరాల పేర్లు ఎప్పుడూ వింటున్నవే.

నిజానికి ఎన్నికలలో ఓటమి అనేది పార్టీ వైఫల్యం తప్ప ప్రభుత్వ వైఫల్యం కాదు. పార్టీ నాయకుడిగా బొత్సపై ఎక్కువ బాధ్యత వుంది. కానీ ఆయన్ని మారుస్తారని ఏ పత్రికా రాయటం లేదు అదేమిటో మరి! జగన్ అవినీతి గురించి ఎక్కువ మాట్లాడడం వలననే, జగన్ కుటుంబానికి వ్యతిరేకంగా చాలా మాట్లాడడం వలననే ఓటమి పాలయ్యాం అని కాంగ్రెస్, టిడిపి నాయకులు అంటున్నారు కదా. కాంగ్రెస్ నాయకుల్లో అలా మాట్లాడి జగన్ గెలుపుకి దోహదపడిన వారిలో అగ్రస్థానం – బొత్సదే. లిక్కర్ సిండికేటు వ్యవహారాల్లో అవినీతి ముద్ర పడిన బొత్సయే జగన్ అవినీతి గురించి తెగ మాట్లాడడంతో విశ్వసనీయత లేకుండా పోయింది. లిక్కర్ లాబీ గురించి లోతుగా పరిశోధిస్తున్న శ్రీనివాస రెడ్డి బదిలీ, భూపతిబాబుపై యింకో అధికారిని నియమించడం – యివన్నీ బొత్సను కాపాడడానికి ఢిల్లీ చేపట్టిన చర్యలే అని అందరూ అనుకునే బహిరంగరహస్యంలా అయిపోయాయి. ఢిల్లీ సాయంతో కిరణ్‌కు బొత్స ముకుతాడు వేయించారని, దానికి గాను ఢిల్లీతో ఏదో ఒప్పందానికి వచ్చారని అనుకోవడం జరిగింది.

అలాటి బొత్స విజయలక్ష్మి పెంపకం గురించి, జగన్ కోట్లాది ఆస్తుల గురించి మాట్లాడితే ఎవరు నమ్ముతారు? చివరకు శ్రుతి మించి వైయస్ హత్య వెనకాల ఆయన కుటుంబం వుందేమోనని శంకించేవరకూ వెళ్లాడాయన. అలా మాట్లాడి సానుభూతి పెంచి కాంగ్రెసు నాయకుల ఓటమికి కారకుడయ్యాడు. రాష్ట్రమంతటా ఎలాగూ ఓడారు, ఆయన ప్రాంతంలో కూడా కాంగ్రెసు అభ్యర్థులు ఓడిపోయారు. విజయమ్మ, షర్మిల యాత్రలకు విరగబడి జనం వచ్చినదీ ఆయన ప్రాంతంలోనే ! అందువలన ఓటమికి బాధ్యత వహించవలసినది ఆయన. కానీ ఆయన్ని అడిగితే సిబిఐ బాధ్యత వహించాలంటున్నాడు, తర్వాత ప్రభుత్వం (అనగా ముఖ్యమంత్రి) బాధ్యత వహించాలంటున్నాడు.

ఎంతమంది నివేదికలు యిచ్చినా సోనియా చివరకు నరసింహన్ నివేదికపైననే ఆధారపడతారు. ఎందుకంటే ఆయనకు రాజకీయలబ్ధి లేదు. మిత్రులూ లేరు, శత్రువులూ లేరు. ఆయన వున్నది వున్నట్టు చెప్పి వుంటారనే అనుకుందాం. ఏదో ఒక మార్పు చేయకపోతే ప్రజల్లో కాంగ్రెస్ యిమేజి బాగుపడదనుకుని సోనియా అనుకుంటే కిరణ్, బొత్సల్లో ఎవరో ఒకర్ని మార్చవచ్చు. కిరణ్‌ను మార్చేదాని కంటె బొత్సను మార్చడానికి ఎక్కువ అవకాశం వుందని నా భావన. ముఖ్యమంత్రి మార్పు దేశమంతటా కొట్టవచ్చినట్టు కనిపించే మార్పు. కాంగ్రెస్ తరచుగా ముఖ్యమంత్రులను మారుస్తుంది అనే మాట యిప్పటికే ప్రచారంలో వుంది. ఇప్పుడు మళ్లీ మార్చి ఆ చెడ్డపేరును ఖాయం చేసుకోవడం దేనికి? కిరణ్‌ను తీసేయడానికి గల బలమైన కారణం ఏం చూపిస్తారు? ఆయన ఏ స్కాండల్‌లోనూ యిరుక్కోలేదు. అసమర్థ పాలన అనేది ఎవరి గురించైనా అనవచ్చు. కాబినెట్‌లో మంత్రులు, సెక్రటేరియట్‌లో అధికారులు అందరూ జైలుకి వెళుతూనో, వెళ్లడానికి సూటుకేసు సర్దుకుంటూనో బిజీగా వున్నపుడు ఏ సిఎం మాత్రం ఏం చేయగలడు?

తనపై యిష్టం వచ్చినట్టు కారుకూతలు కూసేవాళ్లను కూడా కాబినెట్‌లోంచి సాగనంపే అధికారం లేకుండా చేసి ముఖ్యమంత్రి బలంగా లేడని ఢిల్లీ వాళ్లే అంటే హాస్యాస్పదంగా వుంటుంది. ఎన్నికల ఫలితాలు ఆశించినట్టుగా లేవు కాబట్టి తీసేస్తాం అంటే చాలామందిని తీసేయాల్సి వుంటుంది. ఎందుకంటే అది అరడజను మంది వంటవాళ్లు కలిసి వండిన వంటకం. ఎన్నికల ప్రచారం కిరణ్ చాలామటుకు సంయమనంతోనే నిర్వహించారు. ఆజాద్ వ్యాఖ్య ఎన్నికలను ప్రభావితం చేసింది అంటే ఉద్యోగం ఊడగొట్టాల్సింది ఆజాద్‌కు, కిరణ్‌కు కాదు. ఏవో కారణాలు చెప్పి ఎన్నికల ప్రచారంలో పాల్గొనకుండా ఎగ్గొట్టినవారిపై చర్య తీసుకునే అధికారం కిరణ్ చేతిలో లేదు కదా. ఎన్నికల ఫలితాల తర్వాత జగన్‌వైపు టపటపా ఫిరాయింపులు జరగకుండా వున్నాయంటే బుజ్జగింపు కార్యక్రమాల్లో కిరణ్ సఫలీకృతుడైనట్లే కదా. పైగా కిరణ్‌ను తీసేసి మరొకణ్ని పెడితే అతను మాత్రం ఏదో పొడిచేస్తాడన్న హామీ ఎవరు యిస్తారు?

బొత్స విషయానికి వస్తే – ఎన్నికల ఓటమికి పార్టీలో సమన్వయం లోపించడం కారణం అని అందరూ అంటూంటే దానికి బాధ్యత ఎవరిది చెప్పండి. పార్టీ నాయకుడిది కాదా? చిరంజీవితో బొత్స అతి సఖ్యంగా మెలగుతారు, కానీ పీఆర్పీ నుండి కాంగ్రెసులోకి వచ్చిన ఎమ్మెల్యేలు గాంధీభవన్‌కి రప్పించలేకపోతున్నారు. కాంగ్రెస్ గెలిచిన రెండు స్థానాలూ నా వల్లనే అని చిరంజీవి చెప్పుకుంటూ వుంటే "మీరు అక్కడకు ప్రచారానికి వెళ్లలేదు స్వామీ.." అని గుర్తు చేయడమే లేదు. ఇక మంత్రిగా ఆయన ఆర్టీసిని ఉద్ధరించేసింది ఏమీ కనబడటం లేదు. ఏకె ఖాన్ వచ్చాక ఆయన ఏదో సందడి చేస్తున్నట్టు తోస్తోంది తప్ప బొత్స యిలాటి పనులేవీ చేపట్టలేదు. ఉత్తరాంధ్రను విభజించాలని గతంలో కోరాడు కాబట్టి, ఆయన తెలంగాణవాదులకు ఆత్మీయుడని ఆయన నియామకం వేళ ప్రచారం జరిగింది. తెలంగాణ కాంగ్రెసువాదులు గతంలో ఎలా వున్నారో యిప్పుడూ అలాగే వున్నారు. ఈయన వచ్చి తెచ్చేసిన హృదయపరివర్తన ఏమీ లేదు. పాలమూరు తరహాలో – పార్టీలో బహిరంగంగా కుమ్ములాటలు జరుగుతూనే వున్నాయి. బయటకు పోయేవాళ్లు పోతూనే వున్నారు. ఈయన అనునయించి ఆపినది ఎవరినీ లేదు, జగన్ ఎమ్మెల్యేలను బాగా రెచ్చగొట్టి బయటకు పంపించాడు తప్ప

!

ఇక ఆయన చుట్టూ వున్న స్కాండల్స్ గురించి ఎంత తక్కువ చెప్పుకుంటే అంత మంచిది. ఆయన ప్రమేయం వుందో లేదో గాని లక్షింపేట మారణహోమం కూడా ఆయన మెడకే చుట్టుకుంటోంది. అందువలన పెర్ఫామెన్స్ కొలబద్దగా తీసుకుని ఎవరో ఒకరిని తీసేయాల్సి వస్తే బొత్సనే తీసేయాలి. ఆయన స్థానంలో ఎవరైనా తెలంగాణ వ్యక్తికి ఆ పదవి అప్పచెప్పాలి. కానీ యిలా జరుగుతుందో లేదో ఎవరూ చెప్పలేరు. ఎందుకంటే అందరు చెప్పినదీ వినేసి సోనియా దీర్ఘాలోచనలో మునిగిపోయి ఏమీ చేయకుండా వుండిపోవచ్చు. తెలంగాణ కానీయండి, జగన్ కానీయండి – ఏ సమస్యనైనా మురగబెట్టి పెద్దది చేసి రాష్ట్రాన్ని భ్రష్టు పట్టించడమే సోనియా చేస్తున్నది. అందువలన యథాతథస్థితి కొనసాగినా ఏమీ ఆశ్చర్యం లేదు. **– ఎమ్బీయస్ ప్రసాద్**

**జూన్ 28** **ఎమ్బీయస్: రాయల్ తెలంగాణ – ఓ వైరిసమాసం**

సమాసంలో రెండు పదాలుంటాయి కదా, రెండూ ఒకటే భాషవై వుండాలి. వృద్ధమాత అనే సమాసంలో వృద్ధ, మాత రెండూ సంస్కృతపదాలే, పూలచెట్టు అనే పదంలో రెండూ తెలుగుపదాలే. వృద్ధతల్లి, పుష్పచెట్టు అని ప్రయోగిస్తే వాటిని వైరిసమాసాలంటారు. పొసగని రెండు విషయాలను చుట్టచుట్టి ఒకేదాన్లో దూర్చేయడానికి వ్యాకరణం ఒప్పుకోదు. అలా ప్రయోగిస్తే అందరూ నవ్వుతారు కూడా. ఇవాళ 'రాయల్ తెలంగాణ' అనే ఒక వైరిసమాసం వీరవిహారం చేస్తూ నవ్వు పుట్టిస్తోంది. వాయలార్ రవి యింట్లో ఒక తెలంగాణ నాయకుడు, ఒక రాయలసీమ నాయకుడు కలిసి విందు చేశారని అనగానే 'ఇంకేముంది రాయల్ తెలంగాణపై హై కమాండ్ ఆలోచిస్తోంది' అనే హాట్ బెలూన్ వదిలింది మీడియా. ఇక పొద్దుణ్నుంచీ దానికి అనుకూలంగా, వ్యతిరేకంగా ప్రకటనల వర్షం కురుస్తోంది.

రాయలసీమ నాలుగు జిల్లాలతో ఒక ప్రత్యేకరాష్ట్రం అనే ఎండమావి చాలాకాలంగా కొందరినీ ఊరిస్తూ వచ్చింది. ఇటీవల కాలంలో కొందరు హఠాత్తుగా బల్బు వెలిగింది. అలా అయితే దానికి కోస్తా ప్రాంతం బొత్తిగా లేకుండా పోతుందని. పెట్రోలు ధరలు అగ్నిశిఖల్లా ఎగిరిపడే యీ రోజుల్లో రోడ్డు రవాణా చార్జిలు మరింత పెరిగి సముద్రం ద్వారా జరిగే చౌకరవాణాకే భవిష్యత్తు వుంటుంది. కాబట్టి తీరప్రాంతాలకే అభివృద్ధి వుంటుందని అర్థమై 'గ్రేటర్ రాయలసీమ' అనే ప్రతిపాదన ముందుకు తెచ్చారు. నెల్లూరు, ప్రకాశం జిల్లాలను వాళ్లల్లో కలిపేసుకుంటారట. అంతా వీళ్లిష్టమేనా? అటు నెల్లూరు, ప్రకాశం వాళ్లు ఏమంటున్నారో కనుక్కోరా? ఆ జిల్లాల వాళ్లు అసలు దీని గురించి ఆలోచించనే లేదు. ఆ తర్వాత కొన్నాళ్లకు కొందరు రాయలసీమ నాయకులు మా రాయలసీమను తెలంగాణలో కలపండి అని మొదలెట్టారు. అలా అయితే హైదరాబాదు వంటి రాజధాని చేజారకుండా వుంటుందని ఆశ. జెసి దివాకరరెడ్డి మాత్రం మా అనంతపురం జిల్లాకు నీటి ఎద్దడి రాకుండా కర్ణాటకలో కలపండి అంటున్నారు.

ఇవన్నీ రాయలసీమ నాయకుల ప్రేలాపనలే తప్ప రాయలసీమ ప్రజలను మనోభీష్టం ఏమిటో ఎవరూ అడగటం లేదు. అటు కర్ణాటక వాళ్లు కానీ, యిటు తెలంగాణ వాళ్లు కానీ 'మాతో రండి, కలిసివుందాం' అని అనడమే లేదు. ఒన్‌సైడ్ లవ్‌ను ప్రకటించడానికే చాలా ధైర్యం కావాలి. ప్రకటించాక అవతలివాళ్లు ప్రతిస్పందించకపోతే తట్టుకునేందుకు యింకా ధైర్యం కావాలి. రాయలసీమ నాయకులు నెల్లూరు, ప్రకాశం, కర్ణాటక, తెలంగాణ .. యిలా అందరికి ప్రేమ సందేశాలు పంపుతూ వుండడం, ఆ పావురాలన్నీ వెనక్కి వచ్చేస్తూ వుండడం చూస్తే యిలాటి ప్రతిపాదనలు చేస్తూన్నందుకు నాయకులపై రాయలసీమ ప్రజలకు ఒళ్లు మండిపోతూ వుంటుంది. కొన్ని పావురాలు వెనక్కి వచ్చేయడమే కాదు, మీద రెట్ట కూడా వేశాయి. తెలంగాణ ఉద్యమ నాయకులు కొందరు "ఛ, ఆ తెల్లలుంగీ గాళ్లతో కలిసి వుండడమా? అబ్సర్డ్! అసలు హైదరాబాదులో సగం స్థలాలు కబ్జా చేసిందే వాళ్లు!" అనేశారు. రాయలసీమవాసులకు యిది అవసరమా?

అసలీ 'రాయల్ తెలంగాణ' ఐడియాను ప్రచారంలోకి తెచ్చినది ఎవరు? మజ్లిస్ వారు ! రాయలసీమ కొంతకాలం ముస్లిం నవాబుల పాలనలో వుంది కాబట్టి కొన్ని ప్రాంతాల్లో ముస్లిం జనాభా ఎక్కువగా వుంది. ముస్లింలు వున్నచోట తాము బలపడేందుకు అవకాశం వుంటుంది కదాని మజ్లిస్‌వారు తెలంగాణతో బాటు రాయలసీమను కలిపి యివ్వండి అన్నారు. వాళ్లకేం పోయింది, వాళు ఏమైనా అడుగుతారు. 1947లో జిన్నా ముస్లింలు ఎక్కువగా ప్రాంతాలతో పాకిస్తాన్ ఏర్పాటు చేయండి అన్నపుడు "అలా ఎలా కుదురుతుంది? భారతదేశానికి తూర్పున బెంగాల్‌లో, పశ్చిమాన పంజాబ్, సింధులలో ముస్లింలు ఎక్కువగా వున్నారు. నువ్వడిగే దేశంలో రెండు ప్రాంతాల మధ్య కొన్ని వేలమైళ్ల దూరం వుంటే ఎలా కుదురుతుంది?" అని వాదించారు కాంగ్రెసు వారు. "అవునవును నిజమే. అందుకని ఏం చేస్తారంటే – తూర్పు, పశ్చిమ పాకిస్తాన్‌లను కలుపుతూ భారతదేశంలోని యుపి, బిహార్‌ల గుండా ఓ కారిడార్ పాకిస్తాన్‌కు ధారాదత్తం చేయండి." అన్నాడు జిన్నా. వీళ్లు దడుసుకుని తూర్పు, పశ్చిమ పాకిస్తాన్‌లు యిచ్చి దండం పెట్టారు. అలాగ రేపు మజ్లిస్ వాళ్లు యింకో డిమాండు పెట్టవచ్చు. వాళ్లు అనుకున్నట్టు రాయలసీమలోని ముస్లిం ప్రాంతాల్లో వాళ్లకు ఓట్లు పడలేదనుకోండి అప్పుడు "వీళ్లని ఆంధ్రాలో కలిపేసి, నెల్లూరులో ముస్లిము ప్రాంతాలను దీనికి కలపండి" అని అడగవచ్చు. దానికి –మరింత గంభీరంగా వుంటుందని– 'రాయల్ సింహ(పురి) తెలంగాణ' అని పేరు పెట్టమనవచ్చు.

ఇప్పుడు కొత్తగా యింకో ఆలోచన వచ్చింది. రాయలసీమలోని రెండు జిల్లాలు తెలంగాణలో, తక్కిన రెండు ఆంధ్రలో కలపాలట.

గ్రేటర్ రాయలసీమ నినాదం పోయి మైనర్ రాయలసీమ నినాదం వచ్చిందన్నమాట. ఆ రెండు జిల్లాలు ఏవో కూడా వాళ్లే చెప్పేశారు. కర్నూలు, అనంతపురం ! అనంతపురంలో నీటి ఎద్దడి ఎక్కువ, కరువుజిల్లా అని జెసియే చెప్తున్నారు. మరి అలాటి జిల్లాను ఏరికోరి కలుపుకోవడానికి ఎవరికి ఉత్సాహం వుంటుంది? దాని కంటె వెంకన్న నిధులన్నీ వస్తాయి కదాని చిత్తూరు కలుపుకుంటామంటే అనంతపురం మొహం చిన్నబోదూ? అసలు రాష్ట్రాన్ని సమైక్యంగా వుంచమని రాయలసీమ ప్రజలందరూ శ్రీకృష్ణ కమిటీకి మొరపెట్టుకుంటే రాయలసీమనే ముక్కలు చేయడానికి బయలుదేరారు యీ పెద్దలు!

తెలంగాణ జాక్‌వారు అప్పుడే స్టేటుమెంటు యిచ్చేశారు – 'రాయల్ తెలంగాణ అంటే ఒప్పుకోం' అని. తెలంగాణ ఉద్యమకారులు 'కోస్తా వాళ్లంటే మాకు పడదు కానీ రాయలసీమలో ఆ రెండు జిల్లాల వారంటే మాకు ముద్దు' అని ఎప్పుడూ చెప్పలేదు. వాళ్ల దృష్టిలో తెలంగాణేతరులు అందరూ ఒక్కటే దుష్టజాతి. ఇంత వైరం పూనుతున్నవారి మెడకు సగం రాయలసీమను కట్టేసి ఊరేగించాలని చూడడం యీ నాయకులకు తగునా? రాయల్ తెలంగాణ అనే వైరి సమాసాన్ని అమ్మజూపడం భావ్యమా? రాయలసీమను సగంగా చీల్చడానికి గాని, చీల్చిన సగాన్ని తెలంగాణకు అంటగట్టడానికి గాని వీళ్లకు ఎవరు హక్కు యిచ్చారు? ఆ రెండు జిల్లా ప్రజలు 'మాకు వేరే దిక్కులేదు, అవతలివాళ్లు తలుపు తెరవకపోయినా వాళ్ల గుమ్మం దగ్గరే పడి వుంటాం' అని వీళ్లకు చెప్పారా? తక్కిన రెండు జిల్లాల వాళ్లు 'మాకు వీళ్లతో పొసగదు, పట్టుకుపోండి' అని తెలంగాణ వాళ్లను ప్రాధేయపడ్డారా? ఇటీవలి ఉపయెన్నికలలో దీని గురించి చర్చ జరిగిందా? ప్రజాభిప్రాయం వెలువడిందా?

కొందరు నాయకులు తమ స్వార్థం కొద్దీ లేవనెత్తుతున్న 'రాయల్ తెలంగాణ' చర్చ ఎంత త్వరగా ఆపేస్తే అంత మంచిది. కొనసాగించిన కొద్దీ తెలంగాణ ప్రజలు రాయలసీమవాసులకు వ్యతిరేకంగా చీదరించుకుంటూ మాట్లాడడం, అది విని రాయలసీమవారు బాధపడి, తీవ్రంగా ప్రతిస్పందించడం జరుగుతుంది. అనవసరంగా రెండు ప్రాంతాల మధ్య చిచ్చు రగిలించినట్టు అవుతుంది. – **ఎమ్బీయస్ ప్రసాద్**